సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 320

శుక్రవారం 10-2-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'



సత్తా చాటారు ఐపీఎస్ అయ్యారు

-15లో



ఆస్ట్రేలియా 177 ఆలౌట్

తొలిటెస్టు మొదటిరోజే కుప్పకూలిన ఆసీస్. భారత్ 77/1.

-17లో



'చాట్'కు బార్డ్ పోటీ!

మైక్రోసాఫ్ట్ 'చాట్ జీపీటీ', గూగుల్ 'బార్డ్' చాట్‌బాట్‌లు అందించే సేవల మధ్య వ్యత్యాసాలు ఏమైనా ఉన్నాయా? ఏది ఉత్తమం?

వివరాలు 6లో ▸



పుతిన్‌తో దోవల్ భేటీ

రష్యా పర్యటనలో ఆ దేశ అధ్యక్షుడు పుతిన్‌తో ఎన్‌ఎస్‌ఏ అజిత్ దోవల్ భేటీ అయ్యారు. మాస్కోలో పలు అంశాలపై చర్చించారు.

వివరాలు 6లో ▸



వీసా ప్రక్రియలో పురోగతి

అమెరికా వీసాల కోసం నిరీక్షిస్తున్న భారతీయుల ఇబ్బందుల్ని తొలగించేందుకు దేశ హోం మంత్రిత్వ శాఖ కసరత్తు చేస్తోంది.

వివరాలు 6లో ▸



అట్టహాసంగా సైనిక పరేడ్

ఉత్తర కొరియా నియంత కిమ్ తన సైనిక బలాన్ని మరోసారి ప్రదర్శించారు. రాజధానిలో సైనిక పరేడ్ నిర్వహించారు.

వివరాలు 6లో ▸

పరులపాలు కానివ్వం

సిరుల సింగరేణిపై కేంద్ర ప్రభుత్వ కుట్రలను అడ్డుకుంటాం: మంత్రి కేటీఆర్

- ఈ సంస్థను కుట్రపూరితంగా ఖాయిలాపడేలా చేసి అనుయాయులకు కట్టబెట్టేందుకు కేంద్రం ప్రయత్నం
- కేంద్రం సహకరించకపోతే బయ్యారం ఫ్యాక్టరీని జిందాల్ లేదా మిత్తల్‌లతో పెట్టించేందుకు చర్చలు
- రహదారులకు అడ్డంగా ఉన్న ప్రార్థనాస్థలాల తొలగింపునకు చట్టం తెచ్చే యోచన
- దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరం ద్వారా రాష్ట్రానికి రూ.21,400 కోట్ల పెట్టుబడులను ఆకర్షించామని వెల్లడి



సాక్షి, హైదరాబాద్

సిరుల సింగరేణిని పరులపాలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకుంటామని, అవసరమైతే ప్రజలు, ఇతర పార్టీలతో కలిసి ఉద్యమిస్తామని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి కె.తారకరామారావు స్పష్టం చేశారు. కేంద్రం కుట్రపూరితంగా సింగరేణి బొగ్గుగనుల సంస్థను ఖాయిలా పడేట్టుగా చేసి దానిని తమ అనుయాయులకు కట్టబెట్టేందుకు యత్నిస్తోందని ఆరోపించారు. గుజరాత్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు అక్కడి గనులను నామినేషన్‌పై ఇచ్చిన విధంగా సింగరేణికి చెందిన నాలుగు గనులను కూడా తెలంగాణకే ఇవ్వాలని కోరితే కేంద్రం నుంచి స్పందన కరువైందన్నారు. వీటిని

మిగతా 8వ పేజీలో ▶

కూల్చిన చరిత్ర కాంగ్రెస్‌దే

90 సార్లు ప్రభుత్వాలను పడగొట్టేందుకు ఆర్టికల్ 356 వినియోగించింది

- 50సార్లు ఆర్టికల్ 356 వినియోగించిన నాటి ప్రధాని ఇందిర
- ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని కూలదోసే ప్రయత్నం చేసింది కాంగ్రెస్సే
- రాజ్‌భవన్‌లను కాంగ్రెస్ ఆఫీస్‌లుగా మార్చిన ఘనత కాంగ్రెస్‌దే
- రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చలో ప్రధాని మోదీ
- గంటన్నర పాటు మాట్లాడిన ప్రధాని
- ప్రధాని ప్రసంగాన్ని అడ్డుకున్న బీఆర్‌ఎస్..అదానీ వ్యవహారంపై జేపీసీకి డిమాండ్ చేస్తూ నినాదాలు
- ఉభయ సభల నుంచి వాకౌట్.. గాంధీ విగ్రహం ముందు నిరసన

- వివరాలు 6లో▶



"నేను చాలా ఏళ్లు సీఎంగా ఉన్నా. సమాఖ్య విధానమంటే బాగా తెలుసు. మేం పరస్పర సహకార, పోటీతత్వ ఫెడరలిజంను ప్రోత్సహిస్తున్నాం. ప్రాంతీయ ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకుని పథకాలను రూపొందిస్తున్నాం. 2047కల్లా దేశాన్ని అభివృద్ధి చెందిన భారత్‌గా మార్చేందుకు కృషిచేస్తున్నాం.

-రాజ్యసభలో ప్రధాని మోదీ

కోట్ల వసూళ్లకు పాల్పడుతున్నారు

రేవంత్‌రెడ్డిపై విరుచుకుపడ్డ మంత్రి కేటీఆర్

- కొందరు రిటైర్డ్ తహసీల్దార్లు, ప్రైవేటు వ్యక్తులతో కలసి ఓ దప్తర్‌నే తెరిచాడు
- సమాచార హక్కు చట్టాన్ని కూడా ఆదాయ మార్గంగా మార్చుకున్నాడు
- ప్రగతి భవన్‌ను కూల్చాలంటాడా? ఒక పార్టీ అధ్యక్షుడు మాట్లాడే భాషేనా అది?
- ఆయన అరాచకంగా, అడ్డగోలుగా మాట్లాడుతున్నాడని ధ్వజం
- సీఎం అధికారిక నివాసం పేల్చివేత, ధరణి రద్దే కాంగ్రెస్ విధానమా అంటూ నిలదీత

13 లో



ప్రహరీపై నుంచి దూకి పాఠశాలలోకి వెళ్తున్న రేవంత్‌రెడ్డి

నిషేధిత భూములూ కట్టబెట్టారు

"పోరాడి సాధించుకున్న తెలంగాణను కేసీఆర్ చేతిలో పెడితే, ఆయన ప్రభుత్వ భూములను తమ అనుచరులకు కట్టబెడుతూ భూ మాఫియా పాలన సాగిస్తున్నారు. రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో అనుకూలమైన కలెక్టర్లను పెట్టుకొని వేలాది ఎకరాలను కబ్జా చేశారు.

- కేసీఆర్, కేటీఆర్‌పై రేవంత్ ఆరోపణలు
- రాజధాని చుట్టుపక్కల వేల ఎకరాలు అనుచరులకు ధారాదత్తం చేశారు
- రాష్ట్రంలో భూ మాఫియా పాలన సాగిస్తున్నారు..
- కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ధరణి రద్దు చేస్తాం

- వివరాలు 13లో▶

రూ. వెయ్యి కోట్లతో మహీంద్రా ఈవీ ప్లాంట్

1,000 మందికి పైగా ఉపాధి అవకాశాలు

- 3, 4 చక్రాల విద్యుత్ వాహనాల తయారీ కేంద్రం ఏర్పాటుకు సంస్థ నిర్ణయం
- జహీరాబాద్‌లోని ప్రస్తుత ప్లాంట్ విస్తరణ
- రాష్ట్ర ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందం

సాక్షి, హైదరాబాద్: దేశీయ దిగ్గజ సంస్థ మహీంద్రా అండ్ మహీంద్రా లిమిటెడ్ తెలంగాణలో విద్యుత్ వాహనాల (ఈవీ) తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం జహీరాబాద్‌లో ఉన్న సంస్థ ప్లాంట్‌కు అనుబంధంగా ఈ నూతన తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు గురువారం మహీంద్రా అండ్ మహీంద్రా రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. లాస్ట్‌మైల్ మొబిలిటీ వ్యాపారంలో భాగంగా 3, 4 చక్రాల విద్యుత్ వాహనాలను తయారు చేయనున్నట్లు కంపెనీ తెలిపింది. తాజాగా తెలంగాణ ప్రభుత్వం చేసిన 'తెలంగాణ మొబిలిటీ వ్యాలీ' ప్రకటన తర్వాత జరిగిన చర్చల్లో భాగంగా మహీంద్రా అండ్ మహీంద్రా ఈ మేరకు

మిగతా 13వ పేజీలో ▶



- వివరాలు 8లో▶

రూ.40వేల కోట్లు ఆపేసింది

- 2022–23లోనే కేంద్రం నిలిపేసిన చెల్లింపుల మొత్తం అది
- ఇలా ఎన్ని ఇబ్బందులు పెట్టినా ఒక్క పథకాన్నీ మేం ఆపలేదు
- రైతుబంధు, ఆసరా లాంటి పథకాలను పక్కాగా అమలు చేశాం
- తాజా బడ్జెట్‌లో కొత్త ఉద్యోగాలకు వేతనాలు, ప్రస్తుత ఉద్యోగులకు రెండు డీఏలకు నిధులు
- ఏప్రిల్ 1 నుంచి కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ అమల్లోకి..
- మండలిలో మంత్రి టి.హరీశ్‌రావు



సైబర్ కమాండోలు వచ్చేస్తున్నారు

- ఆన్‌లైన్ మోసగాళ్ల ఆటకట్టించేలా త్వరలో రంగంలోకి
- సైబర్ సెక్యూరిటీ బ్యూరో విధివిధానాలు ఖరారు.. 3 డివిజన్లు, 14 విభాగాలుగా బ్యూరో విభజన
- రాష్ట్రంలోని ప్రతి కమిషనరేట్‌లో సైబర్ ఠాణా.. జిల్లా కేంద్రాల్లో సైబర్ కో–ఆర్డినేట్ సెల్స్ ఏర్పాటు
- సైబరాబాద్‌లో 140 మంది, జిల్లాల్లో 300 మంది వారియర్ల విధులు
- రెండు నెలల్లో బ్యూరో కార్యకలాపాలు ప్రారంభం

- వివరాలు 3లో▶

8 ఏళ్లు.. 17 లక్షల ఉద్యోగాలు



తెలంగాణ ఏర్పడ్డాక కీలక రంగాల్లో మెరుగైన ఉపాధి అవకాశాలు

- రియల్ ఎస్టేట్, నిర్మాణ, పారిశ్రామిక పార్కుల్లో ఉపాధి 12 లక్షలపైనే
- ఫార్మాలో 1.2 లక్షలకుపైగా కొలువులు, ఫుడ్ ప్రాసెసింగ్‌లో 75 వేలకుపైగా..
- టీఎస్–ఐపాస్ ద్వారా ఆయా రంగాల్లో రూ. 2.5 లక్షల కోట్ల పెట్టుబడులు
- సామాజిక, ఆర్థిక రంగాల సర్వే–2023లో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాలకు పెద్ద ఎత్తున నోటిఫికేషన్లు వస్తున్నాయి. ఇటీవలి కాలంలో గ్రూప్–1 మొదలు అన్ని రకాల ఉద్యోగాలకు ప్రభుత్వం భారీ ఎత్తున ప్రకటనలు జారీ చేస్తోంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఇటీవల దాదాపు 60 వేల ఉద్యోగాలకు ఆర్థిక శాఖ అనుమతి మంజూరు చేసింది. మరి ప్రైవేటు రంగంలో ఉపాధి కల్పన ఎలా ఉంది? తెలంగాణ ఏర్పాటయిన తర్వాత ఏ రంగంలో ఉపాధి అవకాశాలు మెరుగయ్యాయి? ఈ ప్రశ్నలకు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన సామాజిక ఆర్థిక సర్వే–2023 సమాధానం ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ అధికారిక లెక్కల ప్రకారం తెలంగాణ ఏర్పాటయిన ఏడాదిని మినహాయిస్తే 2015–16 ఆర్థిక

మిగతా 3వ పేజీలో ▶

చలి..ఆకలి

తుర్కియే, సిరియాల్లో శిథిలాల కింద బాధితుల వేదన

గడ్డ కట్టించే చలిలో సహాయ కార్యక్రమాలకు ఆటంకం

19 వేలు దాటేసిన మృతుల సంఖ్య - 6లో▶

దేశమే జరిగింది!

తుర్కియే (టర్కీ)లో సంభవించిన భూకంపం ధాటికి ఆ దేశం భౌగోళికంగా అయిదు నుంచి ఆరు మీటర్లు పక్కకి జరిగి ఉంటుందని భూగర్భ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. భూమి పొరల్లో ఉన్న టెక్టోనిక్ ప్లేట్స్ (ఫలకాలు) తీవ్రమైన రాపిడి కారణంగానే ఇది సంభవించినట్టు తెలిపారు.



థ్యాంక్ గాడ్: భూకంప శిథిలాల నుంచి చిన్నారిని సురక్షితంగా కాపాడిన ఆనందంలో సహాయక సిబ్బంది

న్యూస్‌రీల్

మార్చి 13 న ఎమ్మెల్సీ ఎన్నికలు



తెలంగాణ, ఏపీల్లోని 16 ఎమ్మెల్సీ స్థానాల్లో ఎన్నికలకు ఈసీ గురువారం షెడ్యూల్ విడుదల చేసింది. మార్చి 13న ఎన్నికలు జరుగనుండగా, మార్చి 16న ఫలితాలు వెల్లడించనున్నారు. తెలంగాణలో 1 టీచర్ ఎమ్మెల్సీ, 1 స్థానిక సంస్థల స్థానాల్లో ఎన్నికలు జరగనున్నాయి.

- వివరాలు 18లో▶

వర్సిటీల్లో విద్యార్థుల హెల్త్‌రికార్డ్



విశ్వ విద్యాలయాల్లోని విద్యార్థుల ఆరోగ్య రికార్డులను తయారు చేయాలని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అధికారులకు సూచించారు. 'యూనియన్ బడ్జెట్‌లో ప్రతిపాదించిన ఆరోగ్యరంగ కార్యక్రమాలు, కేటాయింపులు' అనే అంశంపై సమావేశం నిర్వహించారు.

- వివరాలు 3లో▶

నేటి నుంచి స్ట్రీట్‌కార్నర్ మీటింగ్‌లు



నేటి నుంచి రాష్ట్రంలో 11 వేల శక్తి కేంద్రాల్లో 'ప్రజా గోస– బీజేపీ భరోసా' పేరిట స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లకు బీజేపీ సిద్ధమైంది. ఈ నెల 25 వరకు అసెంబ్లీ నియోజకవర్గాల స్థానాల పరిధిలోని పోలింగ్‌బూత్‌లలో నిర్వహించనుంది.

- వివరాలు 3లో▶

ఇదండీ సంగతి



ఎవరేమోగానీ... మీరయితే ఈ మధ్యన అలానే తీర్పులిస్తున్నారు సార్!

AARTHI SCANS & LABS

MC-4887
ISO 9001:2015

36 సంవత్సరాల నమ్మకం

10 రాష్ట్రాలు & 250+ శాఖలు

వైద్యుల కుటుంబం ఆధ్వర్యంలో నడుస్తోంది

నిజాయితీ మరియు పారదర్శకమైన ధరలు

📞 76699 76699

aarthiscan.com



Fully Automatic Robotic Lab | Internal & External Quality Control | Reports Within 5 Hours

పూర్తి శరీర ఆరోగ్య పరీక్ష

Amount upto Rs.5000/- eligible for claim as deduction u/s 80 D of income tax act

హెల్త్ చెకప్ ప్లస్

85 Special Tests ~~₹4100~~ ₹1599

- Ultrasound scan for Abdomen
- ECG Test
- X-Ray Chest
- Thyroid Test - TSH
- Diabetic Tests - HbA1c, Sugar(F,PP)
- Lipid Profile
- Kidney Function Tests
- Liver Function Tests
- Complete Blood Count
- Complete Urine Analysis

ఆరోగ్య తనిఖీ బంగారం

94 Special Tests ~~₹12000~~ ₹4999

- Echo Test
- PFT Test
- ECG Test
- X-Ray Chest
- Ultrasound Scan for Abdomen
- Thyroid Tests - T3 T4 TSH
- HbA1c, Sugar(F,PP)
- Lipid Profile
- Kidney Function Tests
- Liver Function Tests
- Cancer Screening:
  - Male - Prostate - **PSA Total**
  - Female - Ovaries - **CA 125**
  - Colon, Liver, Pancreas - **CEA**
- Vitamin B12 (For Nerve)
- Vitamin D3 (For Bone)
- Complete Blood Count
- Complete Urine Analysis

సరసమైన బ్లడ్ టెస్టింగ్ & స్కాన్ ధరలు - ఏడాది పొడవునా

రక్త పరీక్షలు	Aarthi Price	Market Price
Sugar	₹40	~~₹70~~
HbA1c	₹400	~~₹500~~
Thyroid Tests (T3 T4 TSH)	₹290	~~₹550~~
Lipid Profile Tests	₹450	~~₹600~~
Kidney Function Tests	₹350	~~₹475~~
Liver Function Tests	₹500	~~₹700~~
Complete Blood Count	₹230	~~₹400~~
Vitamin D	₹950	~~₹1450~~
Vitamin B12	₹750	~~₹1200~~

	పగలు	రాత్రి
MRI స్కాన్ 1.5 Tesla Latest Siemens MRI Scanner మార్కెట్ ధరలు: ~~₹7500~~ MRI Brain / Each Spine	₹3500	₹2500 7pm to 12am
CT స్కాన్ Siemens 32 Slice High Resolution CT Scanner మార్కెట్ ధరలు: ~~₹3500~~ CT Brain / PNS	₹1500	₹1000 7pm to 12am

రక్త పరీక్షలు 50% వరకు తక్కువ

గృహ సేకరణ సౌకర్యం అందుబాటులో ఉంది

పంజాగుట్ట
సాయిబాబా టెంపుల్ లైన్, ద్వారకాపురికాలనీ

కూకట్ పల్లి
KPHB కాలనీ ఫేజ్ 2, పద్మజ హాస్పిటల్ దగ్గర

దిల్ షుక్ నగర్
మారుతి కాంప్లెక్స్, రెవెన్యూ బోర్డ్ కాలనీ ఎదురుగా

కార్ఖానా
కార్ఖాన నారాయణ మెడికల్ అకాడెమీ ఎదురుగా

టోలిచౌకి
ఆదిత్య నగర్ కాలనీ, థియేటర్ - గెలాక్సీ ఎదురుగా

Senior Citizen Offer 5% OFF
*For Individual Tests Only

FOR FRANCHISE ENQUIRY 📞 99400 80508

📞 76699 76699 aarthiscan.com

HYDERABAD | BENGALURU | CHENNAI | MUMBAI | NEW DELHI | KOLKATA | GURGAON | TRIVANDRUM | PONDICHERRY

క్లుప్తంగా...

ఎంసెట్ పరిధిలోకి నర్సింగ్ కోర్సులు



సాక్షి హైదరాబాద్: బీఎస్సీ నర్సింగ్ కోర్సు సీట్లను ఈ ఏడాది ఎంసెట్ బైపీసీ ర్యాంకులతో భర్తీ చేస్తారు. ఈ విషయాన్ని ఎంసెట్ నోటిఫికేషన్‌లో పొందుపరచనుండగా, నర్సింగ్ కోర్సుల్లో చేరే విద్యార్థులు ఎంసెట్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. బీఎస్సీ నర్సింగ్ సీట్లను ప్రవేశ పరీక్ష ద్వారా భర్తీచేయాలని 2021లో నర్సింగ్ కౌన్సిల్ ఆదేశాలిచ్చింది. దీనిని తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశాలిచ్చింది. అయితే ఆ ఆదేశాలు వచ్చేసరికే ప్రవేశాలు పూర్తికావడంతో ఆ ఒక్క ఏడాది మినహాయింపునిచ్చింది. 2022లో ఎంసెట్‌లో చేర్చినా.. సీట్లు నిండకపోవడంతో ఎంసెట్ ర్యాంకులతో నిమిత్తం లేకుండానే మెరిట్ ఆధారంగానే సీట్లను భర్తీచేశారు. తాజాగా ఎంసెట్ నోటిఫికేషన్ విడుదల చేయాల్సిన తరుణంలో కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం వీసీ కరుణాకర్‌రెడ్డి ఇటీవలే ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రికి లేఖ రాశారు. ఎంసెట్‌లో బీఎస్సీ నర్సింగ్ కోర్సును సైతం చేర్చాలని ఆ లేఖలో ప్రస్తావించారు. రాష్ట్రంలో 9 ప్రభుత్వ, 85 ప్రైవేట్ నర్సింగ్ కాలేజీలున్నాయి. ప్రభుత్వ కాలేజీల్లో 680, ప్రైవేట్ కాలేజీల్లో సుమారు 5వేల సీట్లున్నాయి. ఈ సీట్లను ఎంసెట్ బైపీసీ ర్యాంకులతో భర్తీ చేస్తారు.

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి: జాజుల



సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైదరాబాద్): టీఎస్ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా బండి స్వామి, ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్ గౌడ్‌లను నియమించారు. అనంతరం జాజుల మాట్లాడుతూ, రాష్ట్ర బడ్జెట్‌లో ఆర్టీసీకి నిధులు కేటాయించకుండా పూర్తిగా అన్యాయం చేశారని అన్నారు. ఆర్టీసీలో చాలాకాలంగా పనిచేస్తున్న కార్మికులకు ప్రమోషన్‌లు ఇవ్వాలని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్‌లలో రిజర్వేషన్ కల్పించాలని, బీసీలపై విధించిన క్రీమీలేయర్‌ను ఎత్తివేయాలని కోరారు. ప్రస్తుతం జరిగే పార్లమెంటు, అసెంబ్లీ సమావేశాల్లో బీసీ బిల్లుపై చర్చించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్, బీసీ యువజన సంఘం అధ్యక్షుడు కనకాల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చేస్తున్నారు.. సైబర్ కమాండోలు



ఆన్‌లైన్ మోసగాళ్ల ఆటకట్టించేలా త్వరలో రంగంలోకి..

సాక్షి, హైదరాబాద్: పోలీసు కమాండోలు అంటే మనకు తెలిసిందే. ప్రత్యేక ఆపరేషన్ల కోసం శిక్షణ పొంది రెప్పపాటులో శత్రు శ్రేణులపై దాడి చేస్తారు. అదే తరహాలో ఇప్పుడు రాష్ట్రంలో సైబర్ కమాండోలు రంగంలోకి దిగనున్నారు. రోజుకో సవాల్ విసురుతున్న సైబర్ నేరస్తుల ఆటకట్టించేందుకు ఇప్పటికే శిక్షణ పొందారు. సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర నేతృత్వంలో ఇటీవల రాష్ట్రం ప్రభుత్వం ప్రత్యేకంగా సైబర్ సెక్యూరిటీ బ్యూరోను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. మూడు డివిజన్లు, 14 విభాగాలుగా ఏర్పాటైన ఈ బ్యూరో మరో రెండు నెలల్లో కార్యకలాపాలు కొనసాగించేందుకు సిద్ధమైంది.

కమిషనరేట్‌లో ఠాణా, జిల్లాలో సైబర్ సెల్స్..
రాష్ట్రంలో సైబర్ నేరాలను నియంత్రించేందుకు చేపట్టాల్సిన చర్యలు, విధివిధానాలపై సైబర్ సెక్యూరిటీ బ్యూరో ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసింది. సైబర్ నేరాలను కూకటివేళ్లతో సహా పెకిలించేలా క్షేత్రస్థాయి నుంచే సైబర్ నేరాలను నివారించేందుకు ఈ బ్యూరో పనిచేయనుంది. ఈ బ్యూరోలో ప్రధానంగా మూడు డివిజన్లు, 14 విభాగాలుంటాయి. ప్రధాన కార్యాలయం సైబరాబాద్ కమిషనరేట్‌లో ఉంటుంది. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్లు సహా వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, సిద్దిపేట, రామగుండం కమిషనరేట్లలో ప్రత్యేకంగా సైబర్ పోలీసుస్టేషన్ ఉంటుంది. మిగిలిన జిల్లాలలో సైబర్ కో-ఆర్డినేట్ సెల్స్ ఉంటాయి. స్థానిక పోలీసుల సహకారంతో సైబర్ నేరాల నివారణకు సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు విధులు నిర్వర్తిస్తారు.

అధికారులకు విధుల కేటాయింపు..
ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు 454 మంది అధికారులను కేటాయించింది. ఆయా పోలీసులు హ్యాకింగ్, ఫిషింగ్, సైబర్ భద్రతపై శిక్షణ పూర్తి చేసుకొని సైబర్ కమాండోలుగా సిద్ధమయ్యారు. 140 మంది వారియర్లు సైబరాబాద్ కమిషనరేట్‌లోని ప్రధాన కార్యాలయంలో, మిగిలిన 314 మంది ఇతర కమిషనరేట్లు, జిల్లా కేంద్రాల్లో విధులు నిర్వర్తించనున్నారు.

అంతర్రాష్ట్ర నిందితుల ఆటకట్టు
రాజస్తాన్, బిహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ వంటి రాష్ట్రాలు సైబర్‌నేరాలకు అడ్డాలుగా మారాయి. కొన్ని సందర్భాల్లో అంతర్రాష్ట్ర నేరస్తులను పట్టుకొనేందుకు వెళ్లిన రాష్ట్ర పోలీసులకు అక్కడి పోలీసులు సహకరించకపోవడం, నేరస్తులు పోలీసులపై కాల్పులు, దాడులు జరపడం కూడా జరిగాయి. ఈ తరహా ఆటంకాలకు సైబర్ సెక్యూరిటీ బ్యూరో పరిష్కారమార్గాలను కనుగొంది. ఇతర రాష్ట్రాల పోలీసు విభాగాలు, కేంద్ర దర్యాప్తు సంస్థలు, ఇండియన్ సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) వంటి సంస్థల సమన్వయంతో ఈ బ్యూరో పనిచేయనుంది.

సైబర్ సెక్యూరిటీబ్యూరో ప్రధాన విధులివే..
- సైబర్ నేరాలకు పాల్పడేవారిని గుర్తించడం, ఆయా రాష్ట్రాల సహకారంతో పట్టుకోవడం
- బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, టెలికం ఆపరేటర్ల నోడల్ ఏజెన్సీలతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూ నేరగాళ్లు కొల్లగొట్టిన డబ్బును స్తంభింపజేయడం.
- నకిలీ బ్యాంకు ఖాతాలు, తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో ఉన్న ఫోన్ నంబర్లను గుర్తించి నియంత్రించడం.
- పలుమార్లు నేరాలకు పాల్పడే అంతర్రాష్ట్ర, అంతర్జాతీయ నిందితులను గుర్తించి పీడీ యాక్ట్‌లు నమోదు చేయడం.

వర్సిటీల్లో విద్యార్థుల హెల్త్‌రికార్డ్

- తయారు చేయాలని అధికారులకు గవర్నర్ సూచన
- వైద్యసంస్థల అధిపతులు, నిపుణులతో కేంద్రబడ్జెట్‌పై తమిళిసై భేటీ



వైద్యసంస్థల అధిపతులు, ఇతర నిపుణుల సమావేశంలో మాట్లాడుతున్న గవర్నర్

సాక్షి, హైదరాబాద్: విశ్వవిద్యాలయాల విద్యార్థుల ఆరోగ్య రికార్డులను తయారు చేయాలని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అధికారులకు సూచించారు. గవర్నర్ అధ్యక్షతన గురువారం రాజ్‌భవన్‌లో 'యూనియన్ బడ్జెట్ 2023-24లో ప్రతిపాదించిన ఆరోగ్యరంగ కార్యక్రమాలు, కేటాయింపులు'అనే అంశంపై వివిధ కేంద్ర వైద్యసంస్థలు, ఇతర సంస్థల అధిపతులు, ప్రతినిధులు, పలువురు డాక్టర్లతో సమావేశం నిర్వహించారు. గవర్నర్ మాట్లాడుతూ కేంద్రబడ్జెట్-2023లో ఆరోగ్యరంగానికి భారీ కేటాయింపులతో సుస్థిర ఆరోగ్య సంరక్షణ రంగాన్ని రూపొందించడానికి మార్గం ఏర్పడిందన్నారు. కేంద్రబడ్జెట్‌లో ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖకు రూ.89,155 కోట్లు కేటాయించడంవల్ల ఆరోగ్యరంగంలో మౌలిక సదుపాయాలు, సేవలను అద్భుతంగా మార్చడానికి వీలు కలుగుతుందన్నారు. వైద్య విద్య, పారా మెడికల్ రంగం, ఆయుష్మాన్ భారత్ కోసం బడ్జెట్లో కేటాయింపులు భారీగా పెరిగాయని, దీనివల్ల ఈ పథకం కింద మరో 40 కోట్ల మందిని ఆరోగ్య బీమా పరిధిలోకి తీసుకు రావాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని వేగవంతం చేస్తుందని పేర్కొన్నారు. వైద్య, ఆరోగ్య పరిశోధనలకు కేటాయింపులు పెరగడం ఆ రంగంలో నూతన ఆవిష్కరణలు పెరుగుతాయని, నాణ్యమైన పరిశోధనలకు దోహదపడుతుందని గవర్నర్ అన్నారు.

నర్సింగ్ విద్యకు అంతర్జాతీయ డిమాండ్
కొత్త మెడికల్ కాలేజీలు, జిల్లా ఆసుపత్రుల ఆధునికీకరణకు రూ.6,500 కోట్లు కేటాయించారని గవర్నర్ వివరించారు. కొత్తగా 157 నర్సింగ్ కాలేజీలు రాబోతున్నాయని, మనదేశంలో నర్సింగ్ విద్యకు అంతర్జాతీయంగా డిమాండ్ ఉందన్నారు. తెలంగాణలో ఫార్మాస్యూటికల్ రంగం మరింత వృద్ధి చెందిందన్నారు. బడ్జెట్‌సహా వివిధ అంశాలపై సమావేశానికి వచ్చిన ప్రముఖులు వ్యాసాలు రాసి పంపితే వాటిని పుస్తకరూపంలో ప్రచురిస్తామని గవర్నర్ తెలిపారు. బీబీనగర్ ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ వికాస్ భాటియా మాట్లాడుతూ ఈ దశాబ్దకాలంలో దేశంలో ఎంబీబీఎస్ సీట్లు 87 శాతం, పీజీ మెడికల్ సీట్లు 105 శాతం, మెడికల్ కాలేజీల సంఖ్య రెట్టింపు అయ్యాయన్నారు. సమావేశంలో సీసీఎంబీ డైరెక్టర్ వినయ్ నందుకుమార్, జాతీయ పోషకాహార సంస్థ డైరెక్టర్ డాక్టర్ హేమలత తదితరులు పాల్గొన్నారు.

'ప్రసాద్' పథకానికి రూ.13.76 కోట్లే విడుదల

సాక్షి, హైదరాబాద్: కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధి కోసం అమలు చేస్తున్న 'ప్రసాద్' పథకం కింద రాష్ట్రానికి ఇప్పటి వరకు అందిన నిధులు రూ.13.76 కోట్లు మాత్రమే. ఈ విషయం సమాచార హక్కు చట్టం కింద వెల్లడైంది. 2014 నుంచి ఇప్పటివరకు ఈ పథకం కింద ఎన్ని నిధులు మంజూరయ్యాయి?, ఎన్ని నిధులు విడుదలయ్యాయి? అనే వివరాలు తెలపాలని సమాచార హక్కు చట్టం కింద ఒక ఔత్సాహికుడు కేంద్ర పర్యాటక శాఖకు దరఖాస్తు చేశాడు. 2014 నుంచి ఇప్పటి వరకు ఆలంపూర్ జోగుళాంబ దేవాలయం అభివృద్ధికి 2020-21లో రూ.36.73 కోట్లు మంజూరు కాగా, ఇప్పటి వరకు రూ.13.76 కోట్లు విడుదల య్యాయని కేంద్ర పర్యాటక శాఖ పేర్కొంది. 2022-23లో భద్రాచలం ఆలయానికి రూ.41.38 కోట్లు, రామప్పకు రూ.62 కోట్లు మంజూరయ్యా యని, టెండర్ల ప్రక్రియ పూర్తయ్యాక నిధులు విడుదలవుతాయని వివరించింది.

పరేడ్ గ్రౌండ్ సభను సక్సెస్ చేసేలా..

- గ్రేటర్, పరిసర నియోజకవర్గాల నుంచి 10 వేల మంది చొప్పున సమీకరణ
- 13న గ్రేటర్ నియోజకవర్గాల్లో సన్నాహక భేటీలు
- అసెంబ్లీ కమిటీ హాల్‌లో పార్టీ నేతలతో కేటీఆర్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో మంత్రులు తలసాని, మహమూద్ అలీ

సాక్షి, హైదరాబాద్: సచివాలయం ప్రారంభోత్సవం సందర్భంగా ఈ నెల 17న సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు పిలుపునిచ్చారు. నూతన సచివాలయం ప్రారంభోత్సవం, సభ నిర్వహణకు సంబంధించి గురువారం శాసనసభ కమిటీ హాల్‌లో కేటీఆర్ సన్నాహక సమావేశం నిర్వహించారు. మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ, సబితా ఇంద్రారెడ్డి, మల్లారెడ్డితో పాటు గ్రేటర్ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పలువురు ప్రజా ప్రతినిధులు ఇందులో పాల్గొన్నారు. ఈనెల 12 వరకు అసెంబ్లీ వార్షిక బడ్జెట్ సమావేశాలు కొనసాగనున్న నేపథ్యంలో 13న గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించాల్సిందిగా కేటీఆర్ ఆదేశించారు. జన సమీకరణకు సంబంధించి 13న జరిగే సమావేశాల్లో ప్రణాళిక రూపొందించుకోవా లని సూచించారు. బహిరంగ సభను విజయవంతం చేసేందుకు అవసరమైన జన సమీకరణను పర్యవేక్షించేందుకు ఇతర జిల్లాలకు చెందిన సీనియర్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను గ్రేటర్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలోని నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలుగా నియమించాలని నిర్ణయించారు. ఇన్‌చార్జిలుగా నియమితులయ్యే నేతలు ఈ నెల 13 నుంచి 17 వరకు తమకు బాధ్యతలు అప్పగించిన నియోజకవర్గాల్లోనే ఉండి పర్యవేక్షిస్తారు. బహిరంగసభకు ఒక్కో నియోజకవర్గం నుంచి కనీసం 10 వేల మందితో జన సమీకరణ చేయాలని నిర్ణయించారు. కొత్త సచివాలయానికి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరు పెట్టిన నేపథ్యంలో అన్ని నియోజక వర్గాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని నేతలకు కేటీఆర్ సూచించారు.

13న విద్యుత్ కార్యాలయాల ముందు కాంగ్రెస్ ధర్నా

అసెంబ్లీలో చర్చకు అవకాశం ఇవ్వనందుకు నిరసన: టీపీసీసీ కిసాన్‌సెల్ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఈనెల 13న రాష్ట్రవ్యాప్తంగా కరెంటు ఆఫీసుల ముందు ధర్నాలు చేయాలని కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చింది. రైతులకు నిరంతర విద్యుత్‌ను ఇవ్వని ప్రభుత్వం, ఈ అంశంపై అసెంబ్లీలో చర్చించేందుకు కూడా అవకాశం ఇవ్వనందుకు నిరసనగా కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో 13న అన్ని జిల్లాల్లో ఆందోళనలు నిర్వహించాలని నిర్ణయించినట్లు టీపీసీసీ కిసాన్ సెల్ చైర్మన్ సుంకేట అన్వేశ్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు 24 గంటల పాటు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం ఆచరణలో విఫలమైందని, రైతులకు రోజుకు 10 గంటలు కూడా కరెంటు అందడంలేదని ఆయన విమర్శించారు. అసలు కరెంటు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో కూడా చెప్పలేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని నమ్ముకుని పంటలు వేసుకున్న రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు నెలరోజులుగా రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సమస్యలు ఏర్పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ప్రభుత్వం తీరు ఇలానే ఉంటే మంత్రులు, ఎమ్మెల్యేలను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు.

8 ఏళ్లు.. 17 లక్షల ఉద్యోగాలు

▶ మొదటి పేజీ తరువాయి
సంవత్సరం నుంచి 2022-23 వరకు అంటే 8 ఏళ్లలో ప్రైవేటు రంగంలో వచ్చిన ఉద్యోగాల సంఖ్య 17.2 లక్షలపైనే. టీఎస్-ఐపాస్ కింద రాష్ట్రంలో కార్యకలాపాలు ప్రారంభించేందుకు అనుమతులు పొందిన సంస్థలు, కంపెనీల్లో ఈ మేరకు ఉపాధి అవకాశాలు లభించాయి.

వరుసగా నాలుగేళ్లు...
గత 8 ఏళ్లలో ప్రైవేటు రంగంలో లభించిన ఉద్యోగావకాశాలను పరిశీలిస్తే రియల్ ఎస్టేట్, ఐటీ భవనాలు, పారిశ్రామిక పార్కుల్లోనే యువతకు ఎక్కువగా ఉపాధి లభించిందని గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో 9.5 లక్షలకుపైగా ఉద్యోగాలు లభించాయి. ఆ తర్వాత ఫార్మా, కెమికల్ రంగంలో, వరుసగా ఫుడ్ ప్రాసెసింగ్, ఇంజనీరింగ్, టెక్స్‌టైల్స్ రంగాల్లో ఎక్కువ ఉద్యోగాలు వచ్చాయి. ఈ ప్రధాన రంగాలు కాకుండా మిగిలిన రంగాల్లో కలిపి 3.5 లక్షల ఉద్యోగాల వరకు వచ్చాయని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో 75 వేలకుపైగా, ఫార్మాలో 1.2 లక్షలు, ఇంజనీరింగ్‌లో 60 వేల మంది వరకు ఉపాధి కలిగింది. సంవత్సరాలవారీగా పరిశీలిస్తే 2017-18, 2018-19, 2019-20లో 12 లక్షల మందికిపైగా ఉపాధి కల్పన జరిగింది. 2017-18లో 2,74,963, 2018-19లో 5,99,933, 2019-20లో 3,15,607 ఉద్యోగాలు లభించాయని, టీఎస్-ఐపాస్ ద్వారా ఈ ప్రధాన రంగాల్లో గత 8 ఏళ్లలో దాదాపు రూ. 2.5 లక్షల కోట్ల వరకు పెట్టుబడులు వచ్చినట్లు ఆర్థిక సర్వే గణాంకాలు వెల్లడించాయి.

గత ఎనిమిదేళ్లలో రాష్ట్రంలోని ప్రైవేటు సంస్థలు, కంపెనీల్లోకి పెట్టుబడులు

సంవత్సరం	పెట్టుబడులు (రూ. కోట్లలో)
2015-16	28,979
2016-17	34,236
2017-18	58,278
2018-19	34,508
2019-20	40,521
2020-21	16,094
2021-22	18,916
2022-23	20,237
మొత్తం	2,51,769

ప్రైవేటు రంగాల్లో గత ఎనిమిదేళ్లలో ఉపాధి

రంగం	2015-16	2016-17	2017-18	2018-19	2019-20	2020-21	2021-22	2022-23
రియల్ ఎస్టేట్, పారిశ్రామిక పార్కులు, ఐటీ భవనాలు	22,150	42,236	1,81,520	3,31,795	2,46,982	98,958	214	6,436
టెక్స్‌టైల్స్	631	1,786	2,051	1,89,594	3,634	3,963	2,418	1,217
ఫార్మా, కెమికల్స్	18,881	7,864	13,105	13,008	9,794	14,215	37,403	11,019
ఫుడ్ ప్రాసెసింగ్	12,947	5,381	9,660	12,548	8,735	10,376	11,435	7,567
ఇంజనీరింగ్	4,618	5,547	12,452	11,315	12,108	8,148	12,106	8,528
ఇతర రంగాలు	35,369	35,872	56,175	41,673	34,354	27,516	37,902	38,141
మొత్తం	94,396	98,666	2,74,963	5,99,933	3,15,607	1,63,176	1,01,478	72,908

ఇంటర్ బోర్డ్ బాధ్యతల్లో మిత్తల్ కొనసాగింపు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియట్ బోర్డ్ కార్యదర్శిగా నవీన్ మిత్తల్‌ను కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి మీడియాకు తెలిపారు. మిత్తల్‌ను ఇటీవల రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీగా ప్రభుత్వం బదిలీ చేసింది. అయితే ఇంటర్ బోర్డ్, సాంకేతిక విద్యకు కార్యదర్శిని ఇంకా నియమించలేదు. కొత్తవారిని నియమించేవరకు ఆయననే కొనసాగించాలని ఆదేశించినట్టు తెలిసింది. మిత్తల్ ఆన్‌లైన్ మూల్యాంకన ద్వారా ఇంటర్ పరీక్ష విధానంలో మార్పు నకు శ్రీకారం చుట్టారు. మూల్యాంకనలో ప్రైవేట్‌వారికి సహాక రిస్తున్న వ్యక్తులపై నిఘాపెట్టి నియంత్రించారు. ఈ దశలో మిత్తల్‌ను బోర్డ్ నుంచి తప్పిస్తే సమస్యలు వస్తాయనే ఆలోచన తోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టుగా తెలుస్తోంది.

నేటి నుంచి స్ట్రీట్‌కార్నర్ మీటింగ్‌లు

- 'ప్రజా గోస- బీజేపీ భరోసా' పేరిట సమావేశాలు
- ఓల్డ్‌బోయిన్‌పల్లిలో పాల్గొననున్న సంజయ్, సికింద్రాబాద్‌లో కిషన్‌రెడ్డి, సనత్‌నగర్‌లో డా.లక్ష్మణ్, పాలమూరులో అరుణ
- 25 వరకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో నిర్వహణ

సాక్షి, హైదరాబాద్: శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా 119 నియోజకవర్గాల్లోని 11 వేల శక్తి కేంద్రాల్లో (3,4 పోలింగ్ బూత్‌లు కలిపి ఓ కేంద్రం) 'ప్రజా గోస- బీజేపీ భరోసా' పేరిట వీధి చివరి సమావేశాలకు (స్ట్రీట్ కార్నర్) బీజేపీ సిద్ధమైంది. ఈ నెల 25 వరకు రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని పోలింగ్‌బూత్‌లలో వీటిని నిర్వహించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం 10 గంటలకు కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ఓల్డ్‌బోయిన్‌పల్లి చౌరస్తాలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ లాంఛనంగా ప్రారంభిస్తారు. సికింద్రాబాద్‌లో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, మహబూబ్‌నగర్‌లో పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, సనత్‌నగర్‌లో పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్, శేరిలింగంపల్లిలో మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి మురళీధర్‌రావు, వరంగల్ పశ్చిమలో పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్, ఉప్పల్‌లో ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు పాల్గొంటారు. సాయంత్రం సనత్‌నగర్ నియోజకవర్గంలోని బల్కంపేట అమ్మవారి ఆలయం వెనకవైపు నిర్వహించే కార్నర్ మీటింగ్‌కు పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి, రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సల్ ముఖ్యఅతిథిగా హాజరవుతారు.

కేసీఆర్‌ను గద్దె దింపాల్సిన సమయం వచ్చేసింది
ప్రజలు ఇబ్బందులు పడుతుంటే సీఎం కేసీఆర్ ఫక్తు రాజకీయాలు చేస్తూ మోసాలకు పాల్పడుతున్నారని ప్రజాగోస స్ట్రీట్‌కార్నర్ మీటింగ్స్ కోఆర్డినేటర్ డా.కాసం వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో విమర్శించారు. అన్ని రంగాల్లో విఫలమై ప్రజాసమస్యలను పరిష్కరించని కేసీఆర్ సర్కార్‌ను గద్దె దింపాల్సిన సమయం ఆసన్నమైనందున, బీజేపీ ఆధ్వర్యంలో ప్రజలకు భరోసా కల్పించేందుకు శుక్రవారం నుంచి వీధిచివర సమావేశాలకు శ్రీకారం చుట్టామని తెలిపారు.

దేవుడి ప్రాణుల యందు దయ కలిగిన మనిషి
తనతో తాను దయగా ఉన్నట్టే.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, ఫిబ్రవరి, 10

అంతర్జాలంలో 'కృత్రిమ' యుద్ధం

సాంకేతిక యుద్ధం ఇది. కృత్రిమ మేధ(ఏఐ)తో అంతర్జాలంలో టెక్ దిగ్గజాల మధ్య వచ్చిపడ్డ పోటీ ఇది. సరికొత్త ఏఐ ఛాట్‌బోట్ విపణిలో సంచలనాత్మక సంగతులివి. మైక్రోసాఫ్ట్ భారీగా పెట్టుబడి పెట్టిన 'ఓపెన్ ఏఐ' సంస్థ సృష్టి 'ఛాట్ జీపీటీ'దే నేటిదాకా హవా. ఇప్పుడు ఆ యాంత్రిక ఛాట్‌బోట్ సర్వీస్‌కు పోటీగా మరో దిగ్గజం గూగుల్ తనదైన ఛాట్‌బోట్ 'బార్డ్'ను తెస్తున్నట్టు ప్రకటించింది. దీంతో కథ మలుపు తిరిగింది. మరోపక్క ఈ ఛాట్‌బోట్ టెక్నాలజీతోనే మరింత పదును తేలిన సెర్చ్ ఇంజన్‌గా మునుపటి తమ 'బింగ్'ను ముందుకు తేనున్నట్టు మైక్రోసాఫ్ట్ తెలిపింది. వెంటనే గూగుల్ సైతం సెర్చ్ ఇంజన్‌గా తన ఆధిక్యాన్ని నిలబెట్టుకొనేందుకు ఏఐ ఫీచర్లతో సై అంటోంది. వెరసి, అంతర్జాలంలో కృత్రిమ మేధ ఆధారంగా కనివిని ఎరుగని పోటాపోటీ వాతావరణం నెలకొంది. కృత్రిమ మేధతో సాగే ఈ పనిముట్లతో మానవాళికి కలిగే మేలు, కీడులపై చర్చ ఊపందుకుంది.

సంక్లిష్ట అంశాల్ని అరటిపండు ఒలిచి నోట్లో పెట్టినట్టు చెప్పడానికి కృత్రిమమేధతో నడిచే ఈ ఛాట్‌బోట్స్ ఉపకరిస్తాయన్నది ప్రాథమిక ఆలోచన. గత ఏడాది నవంబర్‌లో వచ్చిన 'ఛాట్ జీపీటీ' అలా నూత్నపథగామి అయింది. 2 నెలల్లో 10 కోట్ల యూజర్లతో సంచలనమైంది. శాన్‌ఫ్రాన్సిస్కోలో 375 మంది ఉద్యోగుల చిన్న స్టార్టప్ 'ఓపెన్ ఏఐ' 30 బిలియన్ డాలర్ల విలువైనదైంది. దీంతో, పోటీగా 'బార్డ్'ను తేవడంలో గూగుల్ తొందరపడక తప్పలేదు. నిజానికి, గూగుల్ బృందపు ఆరేళ్ళ శ్రమ ఫలితం 'బార్డ్'. తద్వారా ప్రపంచ విజ్ఞానాన్ని సంభాషణల పద్ధతిలో జనానికి సులభంగా అందిస్తామన్నది గూగుల్ మాట. తీరా ప్రయోగదశలో 'బార్డ్'కు బాలారిష్టాలు తప్పలేదు.

గూగుల్ స్వీయ ప్రచార ప్రకటనలోనే 'బార్డ్' కొన్ని జవాబులు తప్పు చెప్పినట్టు 'రాయిటర్స్' వార్తాసంస్థ పట్టుకొనేసరికి గగ్గోలు మొదలైంది. ప్యారిస్‌లో ఆ సర్వీస్‌ను మార్కెట్‌లోకి ప్రవేశపెట్టే సంరంభానికి కొద్ది గంటల ముందే ఆ లోటుపాట్లు బయటపడ్డాయి. దీంతో ఒకపక్క మైక్రోసాఫ్ట్ షేర్ల ధరలు పెరిగితే, మరోపక్క గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్ షేర్లు ఒక్క బుధవారమే 7.8 శాతం పడిపోయాయి. 100 బిలియన్ డాలర్ల మేర నష్టం వాటిల్లింది. అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ జేమ్స్ వెబ్‌స్పేస్ టెలిస్కోప్ గురించి 'బార్డ్' తప్పు చెప్పడం ఒకరకంగా గూగుల్‌కు తలవంపులే. కాకపోతే, ఈ ఛాట్‌బోట్ సేవల్ని ఇంకా ప్రజా వినియోగానికి పెట్టలేదు గనక ఫరవాలేదు. అందుబాటులోకి తెచ్చే ముందు ప్రత్యేక పరీక్షకులతో క్షుణ్ణంగా పరీక్షలు జరిపిస్తామంటోంది గూగుల్.

నిజానికి ప్రపంచవ్యాప్తంగా ఆన్‌లైన్ సెర్చ్‌లో గూగుల్‌దే ఆధిపత్యం. ఏ సమాచారం కావాలన్నా 'గూగులమ్మను అడుగు' అనేది ఆధునిక జనశ్రుతి. ఈ ప్రాచుర్యంతో గూగుల్‌కు నిరుడు వాణిజ్య ప్రకటనల ద్వారా 100 బిలియన్ (10 వేల కోట్ల) డాలర్ల ఆదాయం వచ్చిపడింది. అయితే, 'ఏఐ'ను ఆసరాగా చేసుకొని విజృంభిస్తున్న ప్రత్యర్థి మైక్రోసాఫ్ట్‌తో గూగుల్ పీఠం కదులుతోంది. మైక్రోసాఫ్ట్ తమ సెర్చ్ ఇంజన్ 'బింగ్'ను సైతం సరికొత్త ఫీచర్స్‌తో తీర్చిదిద్ది, గూగుల్‌కు గట్టి పోటీ ఇవ్వనున్నట్టు ఈ వారమే యుద్ధభేరి మోగించింది. వెంటనే ఫిబ్రవరి 8న గూగుల్ సైతం జనరేటివ్ ఏఐ అనుసంధానిత ఫీచర్లతో తమ సెర్చ్ ఇంజన్ ఫలితాల్ని మెరుగుపరుస్తామని చెప్పాల్సి వచ్చింది. 'బార్డ్'ను తెచ్చిన రెండ్రోజులకే గూగుల్ ఈ రెండో ప్రకటన చేయాల్సిరావడం గమనార్హం. అంతర్జాలంలో పెరుగుతున్న పోటీకీ, టెక్ దిగ్గజాల పోరుకూ ఇది దర్పణం.

ఆధునిక ఏఐ సాంకేతికత ఆవిర్భావం, పోటాపోటీ ఒక రకంగా మంచిదైతే, మరోరకంగా చెడ్డది. అనేక ఇతర సాంకేతిక విప్లవాల లానే దీనివల్లా కొత్త ఉద్యోగాలొస్తాయి. కొన్ని పాతవి పోతాయి. ఏఐతో ప్రకృతి వైపరీత్యాలు, మహమ్మారులు సహా అనేక అంశాల్లో మానవ సామర్థ్యం పెరగవచ్చు. తరగతిలో వేర్వేరు అవగాహన స్థాయుల్లో పది మంది ఉంటే, ఒకే పాఠం ఎవరి స్థాయికి తగ్గట్టు వారికి అర్థమయ్యేలా అందించడం లాంటి మామూలు మేళ్ళు సరేసరి. అయితే, సంభాషణాత్మక ఛాట్‌బోట్ సర్వీస్‌లు సమస్యలకు సమాధానాలివ్వడంతో పాటు సొంతంగా కథలు, కవితలు అల్లగలగడం సృజనాత్మకతకూ సవాలే. ఇలా సమాజాన్నే మార్చేసే సవాలక్ష అంశాలతో తలెత్తే నైతిక, సామాజిక, తాత్త్విక ప్రశ్నలెన్నో. మానవజాతి మేలుకు వాడాల్సినదాన్ని దుర్వినియోగం చేస్తేనే ప్రమాదం. దీనిపై ప్రపంచ వ్యాప్త పర్యవేక్షణ ఎలా అన్నది చూడాలి. సాక్షాత్తూ 'ఛాట్ జీపీటీ' సృష్టికర్తలే ప్రభుత్వాల నియంత్రణ కోరుకుంటూ ఉండడం గమనార్హం.

వ్యాపార కార్యకలాపాలలో ఏఐ వ్యవస్థలను జొప్పించడానికీ, తద్వారా ఉద్యోగుల స్థానంలో అవే పనిచేయడానికీ చాలాకాలమే పట్టవచ్చు. ఈలోగా గ్రంథచౌర్యాలు, తప్పుడు పరిష్కారాలు తలెత్తే ప్రమాదమైతే ఉంది. అందుకే, అమెరికాలో కొన్ని స్కూళ్ళలో ఛాట్ జీపీటీని నిషేధించారు. అయితే, కాలప్రవాహంలో ఏ సాంకేతిక పురోగతినైనా స్వాగతించాల్సిందే. అడ్డుకోవాలని చూస్తే ఆగదు, అందువల్ల ప్రయోజనమూ లేదు. దశాబ్దాల క్రితం కంప్యూటర్ విషయంలో భయపడడం లాంటిదే ఇదీ. కానీ, జీవితంలో భాగమయ్యే కొత్త సాంకేతికత సక్రమంగా, బాధ్యతాయుతంగా వినియోగమయ్యేలా చూసుకోవాలి. విలువలకు తిలోదకాలివ్వకుండా అప్రమత్తం కావాలి. ఇప్పటికే సమాజంలో డిజిటల్ విభజనతో పెరిగిపోతున్న అసమానతలకు ఎలా అడ్డుకట్ట వేయాలో ఆలోచించాలి. యంత్రాన్ని సృష్టించిన మనిషికి, ఆ యాంత్రిక కృత్రిమ మేధే ప్రత్యామ్నాయం కావడం సమాజానికే సవాలన్నది నిజమే కానీ మనిషికి ఇవి మహత్తర క్షణాలు. టెక్నాలజీని మనిషి తీర్చిదిద్దితే, ఆ టెక్నాలజీయే మళ్ళీ మనిషిని తీర్చిదిద్దే కీలక ఘట్టం. వెల్కమ్ టు ది న్యూ ఏఐ వరల్డ్!

బడ్జెట్లు మనుషుల కోసం కాదా?


మల్లెపల్లి లక్ష్మయ్య

కేంద్ర బడ్జెట్‌లో పరిశ్రమలు, పనిముట్లు, యంత్రాలు, కార్లు, ఇతర ప్రాణంలేని వస్తువుల ప్రస్తావనే అత్యధికం. ఈ 'అమృత్ కాల్' బడ్జెట్‌లో అమృతం ఉంది. అది మనుషులను బతికించేందుకు కాదు. మనుషులను నిరుపయోగంగా మార్చేసే సాంకేతిక విప్లవానికీ, ఆధునికీకరణ యంత్రాలకూ. బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ఒకరోజు ముందు పార్లమెంటులో ఉంచే ఎకనామిక్ సర్వే ఉద్దేశ్యం మంచిదే. 2014–15 వరకు 'సోషల్ సెక్టార్' పేరుతో ఒక చాప్టర్ ఉండేది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళలు, పిల్లలు, వారి సమస్యలు... పాత విధానాల సమీక్ష, కొత్త పథకాల రూపకల్పన ఆలోచనలు సంక్షిప్తంగానైనా ఉండేవి. 2015–16 నుంచి ప్రకటిస్తున్న ఎకనామిక్ సర్వేలలో ఈ 'సోషల్ సెక్టార్' అధ్యాయం గల్లంతయ్యింది.

''గత సంవత్సరం వందేళ్ళ భారత్' పేరుతో ప్రవేశపెట్టిన బడ్జెట్ పునాదుల మీద ఆధారపడి ఈ ఏడాది బడ్జెట్ రూపొందింది. అభివృద్ధి ఫలాలను అన్ని ప్రాంతాలు, అందరు పౌరులకు ప్రత్యేకించి యువత, మహిళలు, రైతులు, వెనుకబడిన వర్గాలు, షెడ్యూల్డ్ కులాలు, తెగలకు అందిస్తూ సంపన్న సమ్మిళిత పురోగతిని సాధించాలన్నది ప్రభుత్వ లక్ష్యం.'' ఫిబ్రవరి ఒకటవ తేదీన పార్లమెంటులో బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ అన్న మాటలివి. ఇవి మాటలే.

బడ్జెట్ ప్రసంగం మొదటి పేరాలోని పలుకులివి. మిగతా ప్రసంగంలో ఎక్కడా ఆ మాటలకు సంబంధించిన ప్రస్తావనా లేదు; నిధుల కేటాయింపు అంతకన్నా లేదు. బడ్జెట్ ప్రసంగంలో ఎక్కువ భాగం పరిశ్రమలు, పనిముట్లు, యంత్రాలు, కార్లు, ఇతర ప్రాణంలేని వస్తువుల ప్రస్తావనే అత్యధికం. 'అమృత్ కాల్' బడ్జెట్ అని పేరుపెట్టుకున్న ఈ బడ్జెట్‌లో అమృతం చాలా ఉంది. అయితే అది మనుషులను బతికించేందుకు కాదు. మనుషులను నిరుపయోగంగా మార్చేసే సాంకేతిక విప్లవానికీ, ఆధునికీకరణ యంత్రాలకూ. అంటే ప్రాణంలేని వస్తువులకు నిరుపయోగ, నిష్ఫలామృతం.

ప్రభుత్వాలుగానీ, సంస్థలుగానీ, ఏదైనా బడ్జెట్ తయారు చేసుకునేటప్పుడు ఇప్పటి వరకూ ఉన్న పరిస్థితులను అంచనా వేసుకొని, భవిష్యత్ బాగుకోసం పథకాలు రాసుకుంటారు. మనవాళ్ళు కూడా గతంలో ఆ సాంప్రదాయాన్ని పాటించారు. దానికే 'ఎకనామిక్ సర్వే' అని పేరుపెట్టారు. బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ఒకరోజు ముందు దీనిని పార్లమెంటు ముందుంచుతారు. ఎకనామిక్ సర్వే ఉద్దేశ్యం మంచిదే. అయితే 2014 ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న సర్వే ఫార్మాట్ వేరు. ఆ తర్వాత దాని దారే వేరు. 2014–15 వరకు 'సోషల్ సెక్టార్' పేరుతో ఒక చాప్టర్ ఉండేది. అందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళలు, పిల్లలు, వారి సమస్యలు... ప్రగతి, పాత విధానాల సమీక్ష, కొత్త పథకాల రూపకల్పన ఆలోచనలు సంక్షిప్తంగానైనా ఉండేవి. ఆశ్చర్యమేమిటంటే, 2015–16 నుంచి భారత ప్రభుత్వం ప్రకటిస్తున్న ఎకనామిక్ సర్వేలలో ఈ 'సోషల్ సెక్టార్' అధ్యాయం గల్లంతయ్యింది.

దీనిని చాలా మంది ఆర్థిక వేత్తలు, బడ్జెట్ విశ్లేషకులు, ప్రతిపక్షాల పెద్దలతో సహా ఎవ్వరూ పట్టించుకున్నట్టు లేదు. అందరూ ఏదో లోకంలో ఉన్నారు. 'అమృత్ కాల్'లో తేలియాడుతున్నారు. ఇది కేవలం అధ్యాయం గల్లంతు కావడం కాదు, ఆలోచనా సరళిలో లోపం. అందుకే ఈ బడ్జెట్‌లో గానీ, 2022 ఎకనామిక్ సర్వేలో గానీ ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనారిటీలు, మహిళలు, పిల్లలు కూడా దూరమయ్యారు.

ప్రస్తుతం అధికారంలో ఉన్న కేంద్ర ప్రభుత్వానికి రాజ్యాంగం, సమాజ స్థితిగతులు పట్టినట్టు కనిపించదు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కేంద్ర ప్రభుత్వ దృష్టి కోణం భిన్నమైనది. సైద్ధాంతికంగానే వీళ్ళు ఈ దేశంలో కులమనే ఒక వ్యవస్థ ఉన్నట్టుగానీ, దానివల్ల ఏర్పడిన, కొనసాగుతున్న అసమానతలు, వివక్ష, అణచివేత ఉన్నట్టుగానీ భావించరు. అందరూ హిందువులే అనే భావన వారికి. అందుకే ఎస్సీ, బీసీల ఉనికి, వారి గురించిన ప్రత్యేక సామాజిక స్థితిగతులు వాళ్ల ఎన్నికల ప్రణాళికల్లో, బడ్జెట్‌లో అంతగా ప్రస్తావనకు రావు. గత ఎనిమిదేళ్లలో కేంద్ర ప్రభుత్వం ఈ వర్గాల కోసం ఒక ప్రత్యేక పథకాన్ని ప్రవేశపెట్టిన దాఖలా లేదు. ప్రస్తుతం ఉన్న పథకాలను చాలా వాటిని నిర్వీర్యపరిచే పనికి కూడా పూనుకున్నారు.

కొత్త కోణం



కేంద్రంలో ఎస్సీలు, బీసీలు, అనాథలు, దివ్యాంగుల కోసం కలిపి ఇప్పటికే ఒక మంత్రిత్వ శాఖ ఉన్నది. చాలామంది ప్రస్తుతం ఉన్న సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖను ఎస్సీల కోసమేననుకుంటున్నారు. అది నిజం కాదు. అది ఎస్సీ, బీసీలకు కూడా. ఈ రెండు వర్గాలు కలిస్తే దాదాపు 65 శాతానికిపైగా ఉన్న సంగతిని కూడా ప్రభుత్వాలు మరచిపోయాయి. ఎస్సీ, బీసీలు కూడా మరిచిపోయారు. ఎస్సీ, బీసీలు కలిసి ఉన్న కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ కోసం ఇప్పటి వరకు బడ్జెట్‌లో కేటాయించిన నిధులను చూస్తే ఆశ్చర్యం కలుగక మానదు. 2015–16లో మొత్తం బడ్జెట్ 16 లక్షల 63 వేల కోట్లు కాగా, అందులో ఈ మంత్రిత్వ శాఖకు కేటాయించింది కేవలం 5,380 కోట్లు. అంటే ఇది 0.32 శాతం మాత్రమే. అదేవిధంగా 2016–17లో 17 లక్షల 90 వేల కోట్ల మొత్తం బడ్జెట్‌లో కేటాయించింది 5,752 కోట్లు మాత్రమే. ఇది కూడా 0.32 శాతం దాటలేదు. అట్లా 2017–18లో 0.33 శాతం, 2018–19లో 0.31 శాతం. అదేవిధంగా 2020–21లో 35 లక్షల 90 వేల కోట్ల బడ్జెట్‌లో ఈ మంత్రిత్వ శాఖకు కేటాయించింది కేవలం 8,065 కోట్లు. ఇది 0.23 శాతం. ప్రతి సంవత్సరం పెరగాల్సింది. కానీ దారుణంగా పడిపోయింది. ప్రతి ఏడాది ఆ మంత్రిత్వ శాఖకు బడ్జెట్ కేటాయింపులు పెరుగుతున్నట్టు కనిపిస్తున్నది. కానీ దేశ బడ్జెట్ పెరుగుదలలో దానిశాతం పెరుగుతున్న దాఖలా లేదు.

రాజ్యాంగం అందించిన హక్కు ప్రకారం ప్రారంభించిన– ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేకంగా కేటాయించిన నిధుల వినియోగం కూడా దారుణంగా ఉంది. గతంలో దీనిని ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌గా పిలిచేవాళ్ళు. 2014లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్లానింగ్ కమిషన్‌ను తొలగించి, దాని స్థానంలో నీతి ఆయోగ్‌ను ఏర్పరిచారు. బడ్జెట్‌లో కూడా ప్లాన్, నాన్ ప్లాన్ పేర్లను తొలగించి రెవెన్యూ, క్యాపిటల్ అనే పదాలను మాత్రమే కొనసాగిస్తున్నారు. ప్లాన్, నాన్ ప్లాన్ లేనందువల్ల ఎస్సీ, ఎస్టీల కోసం ప్లాన్ నిధుల నుంచి కేటాయించాల్సిన వాటిని ఎస్సీ కాంపోనెంట్‌గా, ఎస్టీ కాంపోనెంట్‌గా పిలుస్తున్నారు. అయితే జనాభా దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి నిధులను కేటాయించాలి. వాటి వివరాలను చూస్తే కూడా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న దళిత, ఆదివాసీ వ్యతిరేకత అర్థం కాగలదు.

గత ఎనిమిదేళ్ళలో ఎస్సీ కాంపోనెంట్ కింది కేటాయించిన నిధులు సగానికి పైగా దారి మళ్ళినట్టు వారి లెక్కల్లోనే కనిపిస్తున్నది. ఇప్పటికే సమాజంలో ఉన్న ఆర్థిక అసమానతలు, సామాజిక వివక్షలు ఎక్కువగా ఎస్సీ, ఎస్టీలను బాధిస్తున్నాయి. పేదరికం, ఆరోగ్యం, విద్య విషయంలో మిగతా సమాజానికీ ఎస్సీ, ఎస్టీలకూ మధ్య అగాథం కొనసాగుతూనే ఉంది. రోజు రోజుకీ కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, యాంత్రీకరణ, ఆధునికీకరణ విధానాలు ఈ వర్గాలను మొత్తంగానే సమాజ ప్రగతి నుంచి దూరం నెడుతున్నాయి. ఈ బడ్జెట్‌లో కొత్తదేమీ లేదుకానీ, కోట్లాది మంది యువతకు నైపుణ్యాల శిక్షణ ఇస్తామని ప్రకటించారు. ఈ నైపుణ్యాల శిక్షణ గురించిన గత అనుభవాలు అంత మంచి ఫలితాలను ఇచ్చినట్టు లేవు. సాంకేతిక, వృత్తిపరమైన నైపుణ్యాలతో కూడిన విద్యలు ప్రైవేట్ రంగంలో ఉంటాయి. ఇందులోకి ఎస్సీ, ఎస్టీ యువత వెళ్ళలేరు. ఎందుకంటే, అందులో రిజర్వేషన్లు లేవు.

అందుకే బడ్జెట్‌లో భారత దేశ సమాజం కనిపించాలి. దేశంలో ఉన్న అసమానతలను తొలగించడానికి పూనుకోవాలి. కానీ ఆ ప్రయత్నాలను ప్రభుత్వం చేస్తున్నట్టు కనిపించడం లేదు. నా ఉద్దేశ్యంలో కేంద్ర ప్రభుత్వం చాలా స్పష్టంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల కోసం ప్రత్యేకమైన పథకాలను ప్రవేశపెట్టడానికి సిద్ధంగా లేదు. మొదట్లో చెప్పినట్లు దీనిని వాళ్లు అసలు సమస్యగానే చూడడం లేదు. ఇప్పుడు తమను తాము తరచి చూసుకోవాల్సింది ఆయా వర్గాలే. ప్రభుత్వాలు తమను పట్టించుకోకపోతే, ప్రజలు ఎందుకు ప్రభుత్వాలను పట్టించుకోవాలి? ఇదే ఇప్పుడు అందరూ ప్రశ్నించుకోవాల్సిన కీలకమైన సందర్భం.

వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు । మొబైల్: 81063 22077

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

కొత్త లింగ చరిత్ర



ట్రాన్స్ దంపతులు జియా పావల్, జహద్ ఫాజిల్ ఇప్పుడు బయోలాజికల్ తల్లిదండ్రులయ్యారని వినడం హృద్యంగా ఉంది. శిశువు జననం– తన కేవల ఉనికితోనే సిస్‌జెండర్ (పుట్టినప్పటి లింగం) కఠినత్వపు, చెల్లినితనపు ద్వంద్వాలను బద్దలుకొడుతుంది. మరింత కలుపుకొనిపోయే నవ లింగ చైతన్యపు ప్రపంచానికి తలుపులు తెరుస్తుంది. (జియా పావల్ పుట్టినప్పుడు మగ. జహద్ ఫాజిల్ పుట్టుకతో స్త్రీ. ఇద్దరూ తమ లింగ మార్పిడి కోసం హార్మోన్ థెరపీ తీసుకున్నారు. మగ రూపంలోని జహద్ ఇప్పుడు గర్భం దాల్చారు. సీ–సెక్షన్ ద్వారా డెలివరీ అయింది.)

– ఆర్. బిందు, కేరళ విద్యామంత్రి

పాశ్చాత్య అనుకరణ



కేరళలోని ట్రాన్స్ జెండర్ దంపతులు ఒక శిశువుకు జన్మనిచ్చారన్న వార్త సంచలనం అయ్యింది. దీన్ని చూశాక నాకు ఏం అనిపించిందంటే, పాశ్చాత్య ప్రపంచం ఒక సమాజంగా విఫలమైంది. ఆ పాశ్చాత్యులను అనుకరించేవాళ్లు ఎవరైనా కూడా విఫలం అవుతారు.

– షకీబ్ ఐ ఖాన్, కాస్మెటిక్ సర్జన్

తిమ్మిని బమ్మి...



అది ఏ విషయమైనా సరే, మళ్లీ మళ్లీ తరచుగా, గట్టిగా చెబితే మెజారిటీని నమ్మించగలం అన్న ఆలోచన చుట్టూనే మొత్తం వ్యవస్థ అంతా తిరుగుతుంది. అది పనిచేస్తుంది కూడా.

– ఎడ్వర్డ్ స్నోడెన్, యాక్టివిస్ట్

ఏం చేస్తున్నట్టు?



లోక్‌సభలో బడ్జెట్ మీద చర్చ కోరమ్ లేనందువల్ల నిలిచిపోయింది. అంటే దానర్థం కనీసం 55 మంది ఎంపీలు లేరని. మనం వాళ్లను ఎందుకు ఎన్నుకున్నట్టు? పార్లమెంటుకు హాజరు కాకుండా, అదీ సంధ్యా కాలంలో మన ఎంపీలు ఏం చేస్తున్నట్టు? 90 శాతం మంది ఎంపీలు పార్లమెంటుకు హాజరు కాకపోతే... దేవుడా మా ప్రజాస్వామ్యాన్ని రక్షించు.

– కె. నాగేశ్వర్, ప్రొఫెసర్, మాజీ ఎంఎల్‌సీ

ప్రజాసాహిత్యోద్యమ దీపధారి

'అరసం' అనే సంక్షిప్త నామంతో తెలుగు సమాజంతో మమేకమైన అభ్యుదయ రచయితల సంఘం 80వ వార్షికోత్సవ సందర్భమిది. ఎనభై ఏళ్లుగా సమాజ ఉన్నతీకరణకు సాహిత్యం ఎంత దోహదపడుతుందో ఆచరణతో, రచనలతో రుజువు చేసిన మహత్తర చరిత్ర అరసానిది. 1943 ఫిబ్రవరి 13, 14 తేదీల్లో ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం ప్రథమ మహాసభలు జరిగిన తెనాలిలోనే 2023 ఫిబ్రవరి 11, 12 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం 19వ రాష్ట్ర మహాసభలు జరుగుతుండటం విశేష సన్నివేశం.

తెలుగునాట సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమానికి మూలపురుషులైన కందుకూరి, గిడుగు, గురజాడల... సామాజిక, సాహిత్య, భాషా సంస్కరణలను; భూస్వామ్య సంస్కృతిపై వారు జరిపిన పోరాటాల వారసత్వాన్ని అరసం స్వీకరించింది. సమతవైపు ప్రపంచ గతిని మార్చిన మహత్తరమైన మార్క్సిజం సిద్ధాంతాన్ని అరసం తన తాత్విక భూమికగా మలచుకుంది.

భారత జాతీయ రచయిత ప్రేమ్‌చంద్ అధ్యక్షతన 1936 ఏప్రిల్ 9న లక్నోలో ఆవిర్భవించిన అరసం దేశంలోని అన్ని ప్రాంతాలకూ, భాషలకూ ప్రాతినిధ్యం వహిస్తూ, ఏర్పడిన తొలి సంస్థ. ఆ మహాసభల్లో ప్రేమ్‌చంద్ 'జీవితాన్ని విమర్శించేదే సాహిత్యం'గా స్పష్టం చేశారు.

ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం ప్రథమ మహాసభకు అధ్యక్షత వహించిన ఆంధ్ర విశారద తాపీ ధర్మారావు... దేవుడు, మతం, ప్రేమ, ప్రణయం, కర్మ అనే గాలి మాటలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపిచ్చారు. గుంటూరులో 1973లో జరిగిన ఆరవ రాష్ట్ర మహాసభల్లో ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం 'ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం'గా రూపొందింది. ఇప్పటివరకు అరసం ప్రపంచ, దేశ, రాష్ట్ర కాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఎప్పటికప్పుడు నిత్య నూతన ప్రణాళికలతో పురోగమిస్తోంది. 'తెలుగుతల్లి' నుంచి 'అభ్యుదయ' దాకా పత్రికలను నడిపింది. వేలాది పుస్తకాలను ప్రచురించింది. సభలు, సమావేశాలు, సదస్సుల నిర్వహణ లెక్కకుమించి.


తెలంగాణ సాయుధ పోరాట కాలంలో అభ్యుదయ రచయితలు పెన్నూ, గన్నూ పట్టి ప్రజాపక్షం వహించారు. అరసం అనేక నిర్బంధాలనూ, నిషేధాలనూ చూసింది. సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమాన్ని తెలుగునాట సోదర సంస్థ ప్రజానాట్య మండలితో కలిసి నిర్వహించటంలో అరసానిది నాయక పాత్ర. అరసం సుదీర్ఘ చరిత్రలో ఎందరో మహనీయులు తమ శక్తియుక్తులను ధారవోశారు. మార్గదర్శకులైనారు. ఆ దీపధారులకు జోహార్లు. అరసానిది విలువైన గతం, బలమైన వర్తమానం, ఆశావహమైన భవితవ్యం.

– పెనుగొండ లక్ష్మీనారాయణ, 'అరసం' జాతీయ కార్యదర్శి,
మొబైల్: 94402 48778

(తెనాలిలో ఫిబ్రవరి 11, 12 తేదీల్లో 'అరసం' రాష్ట్ర మహాసభలు)

గురువింద గింజ

అట్లుంటది


తెలిదేవర భానుమూర్తి

పొద్దు మీకింది. ఎప్పటి తీర్గనే ఆనంద్ బాగ్ చౌరస్త కాడ్కి బోయిన. గాడ రవి పాన్ డబ్బ ఉన్నది. పొద్దు మీకంగనే మా దోస్తులు గా పాన్ డబ్బ కాడ జమైతరు. నాత్రి తొమ్మిది గొట్టె దాంక ముచ్చట బెట్టినంక ఇండ్లల్లకు బోతరు. నేను బోక ముందు గాల్లు ఏం ముచ్చట బెట్టింర్రో నాకైతె ఎర్క లేదు. గని నేను బోయినంక ఇట్ల మాట్లాడుకుంర్రు.

''మన తెలంగానల తొవ్వలు అద్వాన్నంగున్నయి. బస్సుల తొవ్వ మీదికెల్లి బోతుంటె ఉయ్యాల ఊగినట్లుంటది. కడ్పుల ఏమన్నుంటె ఇవుతలకొస్తది'' అని సత్నారి అన్నడు.

''కాన్పు కష్టమైనోల్లను బస్సుల గిన కూసుండబెట్టి ఏ తొవ్వ మీదికెల్లి అయినా దీస్కబోతె కాన్పు అల్కగైతది'' అని ఇస్తారి అన్నడు.

''తొవ్వలు బాగ జేపియుంర్రని జెనం ఎంత మొత్తుకున్నా సర్కార్ సప్పుడు జెయ్యలేదు. తొవ్వలు గిన బాగ జేపిస్తె టక్కర్లు ఎక్వ అయితయని సర్కార్ అంటున్నది'' అని సత్నారి జెప్పిండు.

''తొవ్వలు బాగుంటె టక్కర్లు ఎక్వ అయితయా?'' అని ఇస్తారి అడిగిండు.

''తొవ్వలు బాగుంటె బస్సులు, మోటర్లు, లారీలను స్పీడ్గ నడ్పుతరు. దాంతోని టక్కర్లు అయితయి. గుంతల తోని తొవ్వలుంటె మెల్లగ నడ్పుతరు. దాంతోని ఎసువంటి టక్కర్లు గావు'' అని యాద్గిరి అన్నడు.

''కుటుంబ పాలన కుటుంబ పాలన అనుకుంట మొత్తుకుంటున్నరు. అవ్ మాది బరాబర్ కుటుంబ పాలనే. రాష్ట్రంల ఉన్న నాల్గు కోట్ల మంది మా కుటుంబ సభ్యులే. కేసీఆర్ మా కుటుంబ పెద్ద అని కేటీఆర్ అన్నడు.''

''రాష్ట్రంల ఉన్న జెనమంత కేసీఆర్ కుటుంబ సభ్యులే అయితె కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు, కవితల లెక్క అందర్కి ఇండ్లు ఎందుకు లేవు. మోటర్లెందుకు లెవ్వు?''

''గీ నడ్మ నాందేడ్ల బీఆర్ఎస్ పబ్లిక్ మీటింగ్ బెట్టింది. గులాబి జెండలు ఎగిరేసింర్రు. గులాబి తోర్నాలు గట్టింర్రు. కేసీఆర్ కటౌట్లు బెట్టింర్రు. కేసీఆర్ స్పీచ్ గొట్టుకుంట సంటర్ల మా బీఆర్ఎస్ సర్కార్ గినొస్తె దేసమంత దలిత బందు బెడ్తం. ఇర్వై నాల్గు గంటల రైతులకు ఫిరీగ కరెంటు ఇస్తం. అబ్ కీ బార్ కిసాన్ సర్కార్ అని అన్నడు.''

''ఇనెటోడుంటె చెప్పెటోడు శెవుల పూలు బెడ్తనే ఉంటడు. పోయిన యాడాదిల రాష్ట్రంల దలిత బందు పద్కం కింద ఒక్కల్లకు గుడ్క పది లచ్చల రూపాయలియ్యలేదు. రైతులకు ఇర్వై నాలుగు గంటలటుంచి మూడు గంటలు గుడ్క త్రీఫేజ్ కరెంటు ఇస్తలేరు. కూట్లె రాయి దియ్యనోడు ఏట్లె రాయి దీస్తడా? రాష్ట్రంల దలిత బందు అమలు జెయ్యనోడు దేసంల అమలు జేస్తడా?'' అని యాద్గిరి అడిగిండు.



''రాష్ట్ర బడ్జెట్ సంగతేంది?'' అని సత్నారి అడిగితె–

''కొత్త సీసల పాత సార లెక్క ఉన్నది. ఇంజన్ పాతదె గని మోటర్ కొత్తది. దలిత బందు, రీజినల్ రింగ్ రోడ్డు, బాకీ మాఫీ, మహిళా యూనివర్సిటీ, ఆర్టీసి, కేసీఆర్ కిట్, ఈహెచ్ఎస్, హైద్రాబాద్ మెట్రో, హరిత హారం అసువంటి పద్కాలకు పోయిన యాడాది బడ్జెట్ల ఎన్ని ఫండ్స్ కేటాయించింర్రో గీపారి బడ్జెట్ల గుడ్క సరింగ గన్నే ఫండ్స్ కేటాయించింర్రు. గాదానికి గిన్ని కోట్లు గీదాన్కి గిన్ని కోట్లనుకుంట కేటాయించుడే తప్పిడ్సి సర్కార్ ఒక్క పైస గూడ కర్సు జెయ్యదు'' అని ఇస్తారి అన్నడు.

''గీ నడ్మ భారత్ జోడో బూట్లు, హాత్ సే హాత్ జోడో సైండిల్లు, ప్రజా సంగ్రామ యాత్ర చెప్పులు, యువగళం స్లిప్పర్లు వొచ్చినయి. బూట్లను, సైండిల్లను కాంగ్రెసోల్లు గొంటున్నరు. చెప్పులను బిజెపోల్లు గొంటె స్లిప్పర్లను తెలుగు దేసమోల్లు గొంటున్నరు'' అని యాద్గిరి అన్నడు.

''కన్యాకుమారికెల్లి కశ్మీర్ దాంక నేను పాద యాత్ర జేసిన. యాడికి బోయినా నాకు అదానీ పేరే ఇనబడ్డది. గాయినకూ, మోదీకి ఏం సంబంధమున్నది. గిది మోదీ మన్ కీ బాత్ లేకుంటె ధన్ కీ బాతా? అని రాహుల్ గాంది అడిగిండు'' అని సత్నారి అన్నడు.

''బీఆర్ఎస్ నాందేడ్ మీటింగ్ల కేసీఆర్ మాట్లాడుకుంట... పశ్చిమ బెంగాల్ల మోదీ రవీంద్రనాత్ టాగూర్ లెక్క గడ్డం బెంచుకోని దిర్గుతడు. పంజాబ్ల సిక్కు యేసంల గండ్లబడ్తడు. తమిలనాడుల లుంగి గడ్తడు. తెలంగానల దోతి గట్టుకోని దిర్గుతడు. కశ్మీర్ల షేర్వాని గడ్తడు. గిట్ల రాష్ట్ర, రాష్ట్రంకు యేసాలు బద్లాయిస్తడని అన్నడు. గని కుద్దు గాయిన్నే నాందేడ్ల సిక్కు యేసంల గండ్లబడ్డడు. గురువింద ఇత్తుకు గాయినకు ఎసువంటి ఫరక్ లేదని చెప్పుకుంటనే చెప్పిండు. తెలంగానల రైతులకు ఇర్వై నాలుగు గంటలు కరెంటు ఇస్తున్నం. సంటర్ల బీఆర్ఎస్ సర్కారొస్తె దేసంల ఉన్న రైతులందర్కి ఇర్వై నాలుగు గంటలు ఫిరీగ కరెంటిస్తం. దేసమంత దలితబందు, గిరిజన బందు పద్కాలు బెడ్తమని కేసీఆర్ అన్నడు. మరీ గిన్ని అబద్దాలు జెప్తవా అని నాందేడ్ బీఆర్ఎస్ మీటింగ్‌కు యాభై కిలోమీటర్ల దూరంల బూమి కంపించింది'' అని ఇస్తారి అన్నడు.

నాత్రి తొమ్మిది గొట్టె దాంక ముచ్చట బెట్టినంక ఎవలింటికి గాల్లు పోయింర్రు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్ । 99591 50491

జపమాలా రహస్యం

మరియ మాతను ముందుంచి, దేవుని ఎదుట మోకరిల్లి, ఆ దేవుని దివ్య గాథలను తలంచటం; ఆ దేవునికి మన విన్నపాలు అందించి... 'మాకోసం వేడుకో అమ్మా' అని మరియ మాతను వేడుకోవటం 'జపమాల'లోని అంశాలు. ఇందులో 53 పూసలు ఉంటాయి. ప్రతి సంఘటనకూ పది పది పూసలతో జపించటం కనిపిస్తుంది. జప దండలో యాభై పూసలు దేవుని పరమైన సంఘటనలకు సంబంధించినవి. వీటిని రహస్యాలు అంటారు. ఇవి క్రైస్తవ విశ్వాసానికి సంబంధించినవి.

ప్రభువు జీవితంలో సంతోషదాయక సంఘటనలు... అంటే ప్రభువు పుట్టుకకు సంబంధించి గాబ్రియేలు అనే పేరు గల దూత వచ్చి, కన్య మరియను సమీపించి త్వరలో దైవ కృపవల్ల కుమారుడు జన్మిస్తాడని చెప్పటం, తల్లిదండ్రులు బాల యేసును గుడికి కానుకగా సమర్పించటం, తప్పిపోయిన చిన్నారి యేసును దేవాలయంలో శాస్త్రులతో తర్కించే సమయంలో కనుగొనటం వంటి సంఘటనలను 'దేవ రహస్యాలు' అని అంటారు. వీటిని యాభై పూసల్లో స్మరిస్తారు.

మరో రోజు చెప్పే యాభై పూసలు... ప్రభువు జీవితంలో బాధలకు సంబంధించిన గాథలు, సంఘటనలను స్మరించుకోవటానికి సంబంధించినవి. వీటిని 'దుఃఖ రహస్యాలు' అంటారు, అంటే – ధ్యాన సమయంలో యేసు ఏకంగా రక్తాన్నే చెమర్చటం, ఆయన శిరస్సుకు యూదులు ముండ్ల కిరీటం పెట్టి మేకులతో కొట్టటం, కలువరి గిరిపైకి బరువైన శిలువను మోసుకొని పోవటం వంటివి.

ఇంకో రోజు చెప్పే యాభై పూసలు ప్రభువు జీవితంలో మహిమాన్విత గాథలు, అద్భుతమైన సంఘటనలను స్మరించుకోవటానికి సంబంధించినవి. వీటిని 'మహిమ రహస్యాలు' అంటారు. యేసు మరణం నుండి పునరుత్థానుడు కావటం, యేసు మోక్షారోహణుడు కావటం, మరియ మాత ఆత్మ, శరీరాలతో మోక్షానికి కొనిపోబడటం వంటివి ఇందులో ఉంటాయి. ఇలా వారానికి రెండుసార్లు క్రైస్తవులు ఈ రహస్యాలను స్మరించుకుంటూ ఉంటారు. నమ్మకంతో కూడిన జపమాలా రహస్యం ఇది. వీటి మధ్య మధ్యలో పది పది పూసలకు కొన్ని దేవునికి సంబంధించి... మరియకు విన్నప జపాలు ఉంటాయి. ఈ జపమాలలో ఎక్కువగా మెడిటేషనే ఉంటుంది తప్ప మేరీపూజలు, స్తుతి కనిపించవు.

– డా॥ దేవదాసు బెర్నార్డ్ రాజు,
విశ్రాంత కళాశాల ప్రిన్సిపాల్, విజయవాడ

(ఫిబ్రవరి 9 నుండి 11 వరకు గుణదల మేరీమాత ఉత్సవాలు)

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** బ.పంచమి తె.5.48 వరకు (తెల్లవారితే శనివారం), తదుపరి షష్ఠి, **నక్షత్రం:** హస్త రా.9.44 వరకు, తదుపరి చిత్త, **వర్జ్యం** తె.5.59 నుండి 7.36 వరకు (తెల్లవారితే శనివారం). **దుర్ముహూర్తం:** ఉ.8.50 నుండి 9.34 వరకు, తదుపరి ప.12.35 నుండి 1.22 వరకు, **అమృతఘడియలు:** ప.3.23 నుండి 5.04 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 6.35, **సూర్యాస్తమయం:** 5.54



ఇదిగో సాగరతీరంలో నీరా కేఫ్

- ఈ నెలలోనే వినియోగదారులకు అందుబాటులోకి....
- రూ.10 కోట్లతో నెక్లెస్ రోడ్డులో నిర్మాణం
- నీరా పానీయంతో పాటు తెలంగాణ వంటకాలు కూడా..

సాక్షి, హైదరాబాద్: సాగరతీరం మరింతగా పర్యాటక హంగులను సంతరించుకుంటోంది. ప్రతిష్టాత్మకమైన ఫార్ములా–ఈ పోటీల నేపథ్యంలో నెక్లెస్ రోడ్డు, ట్యాంక్‌బండ్ పరిసరాలను అందంగా తీర్చిదిద్దారు. దేశ, విదేశాలకు చెందిన పర్యాటకులు, సందర్శకులను ఆకట్టుకొనేవిధంగా అనేక ఏర్పాట్లు చేపట్టారు. సాగర్ జలాలపై మ్యూజికల్ ఫౌంటెయిన్, లేజర్‌షోలతో పాటు ఈ నెలలోనే నీరా కేఫ్‌ను సైతం ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తాటి, ఈత చెట్ల నుంచి లభించే ప్రకృతిసిద్ధమైన నీరా పానీయాన్ని నగరవాసులకు అందుబాటులోకి తెచ్చేందుకు ఎక్సైజ్ శాఖ సుమారు రూ.10 కోట్లతో నెక్లెస్ రోడ్డు, పీపుల్స్‌ప్లాజా సమీపంలో ఈ కేఫ్‌ను నిర్మించింది.

- ఈ కేఫ్‌లో తెలంగాణ వంటకా లన్నీ లభిస్తాయి.
- ఒకేసారి సుమారు 3 వేల మంది సందర్శించవచ్చు.
- పర్యాటక ప్రియులు, నగరవాసులు సాగరతీరంలో సేదతీరుతూ నీరాను ఆస్వాదించవచ్చు.
- తాటి, ఈత చెట్ల నుంచి సేకరించే నీరా నుంచి తయారయ్యే బెల్లం, సిరప్‌లు కూడా కేఫ్‌లో విక్రయిస్తారు.

నీరాతో పాటు రెస్టారెంట్ సేవలు...

తాటి, ఈత చెట్ల నుంచి తెల్లవారు జామునే సేకరించే నీరా పానీయంలోని సహజమైన పోషక విలువలు ఏ మాత్రం చెడకుండా శీతలీకరణ పద్ధతిలో నిల్వ చేసి విక్రయిస్తారు. ఇందుకోసం రెండంతస్థుల నీరా భవనంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సురక్షితంగా నిల్వ చేసేందుకు అవసరమైన అన్ని రకాల శీతలీకరణ యంత్రాలను సిద్ధం చేశారు. భువనగిరి సమీపంలోని నందనం, కడ్తాల్ సమీపంలోని ముద్విన్‌లో ఏర్పాటు చేసిన తాటి వనం ప్రాజెక్టుల్లో నీరా కోసమే ప్రత్యేకంగా పెంచిన తాటి, ఈత చెట్ల నుంచి నీరాతో పాటు అనుబంధ ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. శరీరానికి అవసరమైన ప్రొటీన్, ఐరన్, పొటాషియం, కాల్షియం, విటమిన్‌లు, మినరల్స్ లభిస్తాయని వివరించారు. నీరాతో పాటే రెస్టారెంట్ సేవలు కూడా ఇక్కడ లభిస్తాయని చెప్పారు.



లోపల ఇలా..

వెక్కి వెక్కి ఏడుస్తూ సీఎంకు వేడుకోలు

- రోడ్డెక్కిన సెకెండ్ ఏఎన్‌ఎంలు, కన్నీటితో కేసీఆర్‌కు విజ్ఞప్తి
- చలో అసెంబ్లీ కోసం ప్రయత్నం.. అడ్డగించిన పోలీసులు



రోదిస్తున్న సెకెండ్ ఏఎన్‌ఎంలు

హిమాయత్‌నగర్: ''అయ్యా.. సీఎం సారూ.. మిమ్మల్ని గెలిపించినవారిలో మేం కూడా ఉన్నామయ్యా. మీరంటే మాకూ అభిమానం, మా కేసీఆర్ సారు తెలంగాణ సాధించినోడు, ఆయనను సీఎంగా గెలిపించుకోవాలనే ఆశతో మీకు మా ఇంటిల్లిపాదీ ఓట్లు వేసి గెలిపించుకున్నాం సారూ. అందరికీ అన్నీ చేస్తున్నావు సారూ.. మరి మాకెందుకు సారూ జీతాలు పెంచట్లేదు. ఉప్పు, పప్పు, కారం, నూనె.. ఇలా ఏది కొనాలన్నా కొనలేకపోతున్నాం. మాకిచ్చే ఆ రూ.25 వేల జీతాలు చాలక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాం. మాయందు దయ తలచి మమ్మల్ని రెగ్యులరైజ్ చేయండి సారూ' అంటూ సెకెండ్ ఏఎన్‌ఎంలు కన్నీటిపర్యంతమయ్యారు. ప్రతి ఒక్కరూ వెక్కి వెక్కి ఏడుస్తూ ముఖ్య మంత్రి కేసీఆర్‌ను అభ్యర్థిస్తున్న తీరు చూపరుల హృదయాలను ద్రవింపజేసింది. ఈ సన్నివేశం గురువారం హిమాయ త్‌నగర్ ప్రధాన రహదారిపై చోటు చేసుకుంది. వీరి కన్నీటిబాధను చూసిన వాహన దారులు సైతం సంఘీభావం తెలిపారు. చలో అసెంబ్లీ నిమిత్తం అన్ని జిల్లాల నుంచి వీరు హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ భవన్ వద్దకు తెల్లవారుజామునే చేరుకున్నారు. వీరిలో కొందరు తమ చంటిబిడ్డలను సైతం వెంట తీసు కొనివచ్చారు. పోలీసులకు, సెకెండ్ ఏఎన్‌ఎంలకు మధ్య పెద్దఎత్తున వాగ్వాదం చోటు చేసుకుంది. మగ పోలీసులు పలువురిని ఈడ్చి రోడ్డు పక్కన వేశారు. మహిళా పోలీసులు చాలాసేపు పక్కనే నిలబడి చోద్యం చూస్తూ నిలబడ్డారు. ఈ సందర్భంగా సెకెండ్ ఏఎన్‌ఎంల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మమత మాట్లాడుతూ 16 ఏళ్లుగా ప్రభుత్వాలు మాతో గొడ్డుచాకిరి చేయిస్తున్నా యన్నారు. కోవిడ్ సమయంలో నేరుగా కోవిడ్ పేషెంట్లకు ఇంజక్షన్లు చేసింది తామే నన్నారు. ప్రభుత్వం ఏ పనిమొదలు పెట్టినా ముందు ఉండి చేసేది తామేనన్నారు. తమను ఇప్పటికైనా ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని అభ్యర్థించారు.

సీబీఐ, ఈడీకి అప్పగించాల్సి రావొచ్చు

నిజాం భూముల వివాదంపై హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: సివిల్ సూట్ 13, సివిల్ సూట్ 14 బ్యాచ్ కేసులన్నింటినీ, ముఖ్యంగా నిజాం భూముల వివాదాలను సీబీఐ, ఈడీకి అప్పగించాల్సి వస్తోందేమో అని హైకోర్టు వ్యాఖ్యానించింది. దీర్ఘకాలికంగా ఈ కేసులను విచారణ జరపాల్సి వస్తోందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం పేర్కొంది. రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండలం కుంట్లూరు గ్రామంలోని 93 ఎకరాల భూ వివాదంపై దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా ఈ అభిప్రాయం వ్యక్తం చేసింది. చట్టపరమైన వారసులకు ఈ భూమిని పంచాలని, అప్పటివరకు మూడో పార్టీకి భూమి చెందకుండా స్టే విధించాలని పిటిషనర్లు కోరుతున్నారు. దీనిపై విచారించిన ధర్మాసనం..మొత్తం వ్యవహారంపై స్టే విధించింది. ఆ 93 ఎకరాల పరిధిలో రిజిస్ట్రేషన్లు చేపట్టవద్దని ఆదేశిస్తూ విచారణను మార్చి 2కు వాయిదా వేసింది.

హైదరాబాద్-బెంగళూరు సెక్షన్‌లో ఆప్టికల్ ఫైబర్ కేబుల్

సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్–బెంగళూరు సెక్షన్‌లో 512 కిలోమీటర్ల మేర ఆప్టికల్ ఫైబర్ కేబుల్ (ఓఎఫ్‌సీ) ఏర్పాటు పనులకు ఆమోదం తెలిపామని కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఈ ప్రాజెక్టు పనులను గతేడాది సెప్టెంబర్ 23న మంజూరు చేసినట్టు బీఆర్ఎస్ ఎంపీ బీబీ పాటిల్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి తెలిపారు. ఇప్పటికే ఢిల్లీ–ముంబయి ఎక్స్‌ప్రెస్‌వే, హైదరాబాద్–బెంగళూరు హైవే వెంట మొత్తం 1880 కిలోమీటర్ల పొడవునా ఆప్టికల్ ఫైబర్ కేబుల్ ఏర్పాటు చేసే రెండు పైలట్ ప్రాజెక్టులు చేపట్టామని వివరించారు. ఈ రెండు–పైలట్ ప్రాజెక్ట్‌ల అనుభవం, సాధ్యాసాధ్యాల అధ్యయనాల ఫలితాల ఆధారంగా, దేశంలోని జాతీయ రహదారి (గ్రీన్‌ఫీల్డ్, బ్రౌన్‌ఫీల్డ్ రెండూ) నెట్‌వర్క్ కోసం ఓఎఫ్‌సీ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభిస్తామని కేంద్రమంత్రి గడ్కరీ తెలిపారు.

మార్చి, ఏప్రిల్‌లో గొర్రెల పంపకం: తలసాని

సాక్షి, హైదరాబాద్ : వచ్చేనెల చివర్లో లేదా ఏప్రిల్ మొదటి వారంలో రెండో విడత గొర్రెల పంపకం పథకాన్ని ప్రారంభించి 4, 5 నెలల్లోనే దానిని పూర్తిచేస్తామని పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. మొదటివిడతలో మాదిరిగా పొరబాట్లు దొర్లకుండా ఈ కాబ్స్, వెహికిల్ ట్రాకింగ్ వంటి సాంకేతికతలు ఉపయోగించి ఎమ్మెల్యేల క్యాంప్ ఆఫీస్‌ల్లోనే గొర్రెల పంపిణీ జరిపేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. మిగిలిపోయిన గొల్ల, కురుమలకు ఇవి అందేలా చర్యలు చేపడతామని ఎమ్మెల్యేలు లబ్ధిదారుల నుంచి డీడీలు తీయించి పెట్టాలని సూచించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1.91 కోట్ల గొర్రెలున్నాయని తలసాని వివరించారు.

క్లుప్తంగా...

భారతీయుల అమెరికా వీసా ప్రక్రియలో పురోగతి

వాషింగ్టన్: అమెరికా వీసాల కోసం నెలల తరబడి నిరీక్షిస్తున్న భారతీయుల ఇబ్బందుల్ని తొలగించేందుకు అధ్యక్ష అడ్వైజరీ కమిషన్ చేసిన సిఫార్సులను ఆ దేశ హోం మంత్రిత్వ శాఖ ఆచరణలో పెడుతోంది. భారతీయుల వీసా దరఖాస్తులను విదేశాల్లోనూ త్వరగా తేల్చేలా అదనంగా దౌత్య కార్యాలయాలు, కౌంటర్లు తెరుస్తున్నారు. కోవిడ్ అనంతరం ప్రయాణ ఆంక్షలు తొలగించాక అమెరికా వీసాల కోసం భారత్ నుంచి దరఖాస్తులు వెల్లువలా వచ్చిపడటం తెల్సిందే. అమెరికాలో అభ్యసించనున్న విద్యార్థులు, పర్యటించే సందర్శకులు చాలాకాలంపాటు వేచి ఉండాల్సి రావడంతో ఇబ్బందులు పడుతున్నారని ప్రెసిడెన్షియల్ కమిషన్ సభ్యుడు అజయ్ జైన్ భుటోరియా వ్యాఖ్యానించారు. భారతీయ వీసా దరఖాస్తుదారులకు ప్రపంచంలో ఏ దేశంలో కుదిరితే ఆ దేశం నుంచే అక్కడి అమెరికా ఎంబసీ సిబ్బంది వర్చువల్‌గా ఇంటర్వ్యూలు చేసి వీసా జారీ/నిరాకరణ ప్రక్రియను పూర్తిచేయడంలో సాయపడతారు. విదేశాల్లోని అమెరికా ఎంబసీల్లో ఎక్కువ వీసా అపాయ్‌మెంట్ కౌంటర్లను తెరుస్తారు. సిబ్బంది సంఖ్యను పెంచుకుంటారు. ఎంబసీల్లో కొత్తగా సిబ్బందిని నియమించుకుంటారు. 400 రోజులకుపైబడిన వెయిటింగ్ సమయాన్ని 2–4 వారాలకు కుదించడమే వీరి లక్ష్యం.

'హెచ్-1బీ' గ్రేస్ పీరియడ్ 12 నెలలకు పెంచాలి

వాషింగ్టన్: అగ్రరాజ్యం అమెరికాలో సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో లే-ఆఫ్‌ల పర్వం కొనసాగుతోంది. మరోవైపు ఇతర రంగాల్లోనూ పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు ఊడిపోతున్నాయి. ఫలితంగా అమెరికాలో ఉంటున్న భారతీయులు నిరుద్యోగులుగా మారుతున్నారు. హెచ్-1బీ(నాన్-ఇమ్మిగ్రెంట్) వీసాపై ఉంటున్నవారు ఉద్యోగం పోయాక 60 రోజుల్లోగా(2 నెలలు) మరో కొలువు వెతుక్కోవాలి. లేకపోతే స్వదేశానికి వెళ్లిపోవాలి. ఈ గ్రేస్ పిరియడ్‌ను 60 రోజుల నుంచి 12 నెలలకు(ఒక సంవత్సరం) పెంచాలని కోరుతూ ఫౌండేషన్ ఫర్ ఇండియా, ఇండియన్ డయాస్పోరా స్టడీస్ అండ్ గ్లోబల్ టెక్నాలజీ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ అనే రెండు భారత-అమెరికన్ సంస్థలు పోరాటం ప్రారంభించాయి. భారత టెకీలకు మేలు చేసేలా నిర్ణయం తీసుకోవాలంటూ అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు ఆన్‌లైన్‌లో పిటిషన్లు సమర్పిస్తున్నాయి. అధ్యక్షుడితోపాటు డిపార్టుమెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ కార్యదర్శి, యూఎస్ సిటిజెన్‌షిప్, ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ డైరెక్టర్‌కు ఆన్‌లైన్‌లో పిటిషన్లను పంపిస్తున్నాయి.

'చాట్'కు బార్డ్ పోటీ!

- ఏఐ ఆధారిత చాట్‌జీపీటీతో మైక్రోసాఫ్ట్ సంచలనం
- పోటీగా సొంతంగా 'బార్డ్'ను తీసుకొచ్చిన గూగుల్
- రెండింటి సేవలు దాదాపు ఒకేలా ఉన్నాయంటున్న నిపుణులు
- రానున్న రోజుల్లో మరికొన్ని ఏఐ చాట్‌బాట్‌లు!



టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ తీసుకొచ్చిన 'చాట్‌జీపీటీ' ఇంటర్నెట్ ప్రపంచంలో ఇప్పటికే సంచలనాలు నమోదు చేస్తోంది. కృత్రిమ మేధ(ఏఐ) ఆధారంగా పనిచేసే ఈ చాట్‌బాట్‌పై ప్రపంచవ్యాప్తంగా విపరీతమైన ఆసక్తి కనిపిస్తోంది. అమెరికాలో 'ఓపెన్‌ఏఐ' అనే స్టార్టప్ కంపెనీ అభివృద్ధి చేసిన చాట్‌జీపీటీని మైక్రోసాఫ్ట్ కంపెనీ 2022 నవంబర్ 30న ప్రారంభించగా, అతి తక్కువ కాలంలోనే నెటిజన్ల ఆదరణ పొందింది. చాట్‌జీపీటీకి పోటీగా ప్రఖ్యాత గూగుల్ సంస్థ 'బార్డ్' పేరిట సొంత ఏఐ ఆధారిత చాట్‌బాట్‌ను తీసుకొస్తున్నట్లు ప్రకటించింది. ఈ నేపథ్యంలో మైక్రోసాఫ్ట్, గూగుల్ చాట్‌బాట్‌లు అందించే సేవల మధ్య వ్యత్యాసాలు ఏమైనా ఉన్నాయా? ఏది ఉత్తమం? అనేది తెలుసుకుందాం.

గూగుల్‌కు అదనపు బలం

గూగుల్ చాట్‌బాట్ 'బార్డ్'కి గూగుల్ సెర్చ్ ఇంజిన్ అదనపు బలమనే చెప్పాలి. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది గూగుల్ సెర్చ్ ఇంజిన్‌ను విస్తృతంగా ఉపయోగించుకుంటున్నారు. కావాల్సిన సమాచారాన్ని పొందుతున్నారు. ఈ సెర్చ్ ఇంజిన్‌ను గూగుల్ సంస్థ తన 'బార్డ్'తో అనుసంధానించనుంది. దీనివల్ల బార్డ్ ద్వారా మరింత మెరుగైన సేవలను యూజర్లకు అందించేందుకు వీలవుతుంది. మైక్రోసాఫ్ట్ కూడా తన సెర్చ్ ఇంజిన్ 'బింగ్'తో చాట్‌జీపీటీని అనుసంధానించింది. బింగ్ యూజర్ల సంఖ్య తక్కువగా ఉండటం, గూగుల్ కన్నా మెరుగైన సెర్చ్ ఇంజిన్ సేవలు అందించలేకపోవడం వంటివి చాట్‌జీపీటీకి ప్రతికూలాంశాలుగా మారాయి.

చాట్‌జీపీటీ

- మైక్రోసాఫ్ట్ చాట్‌జీపీటీ 3.5 వెర్షన్ కూడా దాదాపు గూగుల్ 'లామ్డా' లాంటిదే. యూజర్‌కు సులువుగా అర్థమయ్యేలా సమాచారాన్ని అందిస్తుంది.
- గూగుల్, మైక్రోసాఫ్ట్ చాట్‌బాట్‌లు అందించే సేవలు దాదాపు ఒకేలా ఉన్నాయి.
- చాట్‌జీపీటీని అత్యాధునికంగా తీర్చిదిద్దారు. సమస్యలు ఏవైనా తలెత్తితే వెంటనే పరిష్కరిస్తున్నారు.
- చాట్‌జీపీటీ మెరుగైన సేవలు అందిస్తోందని యూజర్లు అభిప్రాయపడుతున్నారు.

గూగుల్ బార్డ్

- 'బార్డ్' అనేది లాంగ్వేజ్ మోడల్ ఫర్ డైలాగ్ అప్లికేషన్స్(లామ్డా), వెబ్ కంటెంట్‌ను వాడి యూజర్లకు సేవలందిస్తుంది.
- యూజర్ల భాషలోనే వారు కోరుకున్న సమాచారాన్ని అందిస్తుంది.
- వీలైనన్ని ఎక్కువ భాషల్లో సేవలు అందించడమే లక్ష్యంగా బార్డ్‌ను రూపొందిస్తున్నారు.
- ఏ ప్రశ్న వేసినా బార్డ్ సమాధానం ఇస్తుంది. సంబంధిత అంశంపై తాజా సమాచారాన్ని చేరవేస్తుంది. సులభంగా అర్థమయ్యేలా సమాధానం చెబుతుంది.

ఏది బెటర్?

మైక్రోసాఫ్ట్ చాట్‌జీపీటీలో 2021 సంవత్సరం వరకు మాత్రమే నాలెడ్జ్ లాక్ చేశారు. అంటే 2021 తర్వాత జరిగిన సంఘటనలకు సంబంధించిన సమాచారం వివరంగా అందించలేదు. గూగుల్ బార్డ్‌లో ఈ సమస్య లేదు. ఎప్పటికప్పుడు తాజా సమాచారం తెలుసుకోవచ్చు. బార్డ్ ఇంకా పూర్తిస్థాయిలో సిద్ధం కాలేదు. ప్రస్తుతం నమ్మకమైన కొందరు యూజర్లకు మాత్రమే ఈ సేవలు అందుతున్నాయి. త్వరలో అందరికీ అందుబాటులోకి రానున్నట్లు తెలుస్తోంది. గూగుల్ ఉపయోగిస్తున్న 'లామ్డా' సమర్థతపై అనుమానాలు ఉండగా, మైక్రోసాఫ్ట్ చాట్‌జీపీటీపై ఇప్పటిదాకా ఎలాంటి ఆరోపణలు రాలేదు. చాట్‌జీపీటీ, బార్డ్‌ల మధ్య ఏది బెటర్ అంటే ఇప్పుడే చెప్పలేమని టెక్నాలజీ నిపుణులు పేర్కొంటున్నారు. 'బార్డ్' కూడా అందరికీ అందుబాటులోకి వచ్చాకే రెండింటిలో ఏది ఉత్తమం అనేది నిర్ధారించగలమని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. కొన్ని స్టార్టప్ కంపెనీలు చాట్‌సోనిక్, జాస్పర్ ఏఐ, ఓపెన్ అసిస్టెంట్, వర్డ్‌ట్యూన్ పేరిట ఏఐ చాట్‌బాట్‌లను తీసుకొచ్చే పనిలో నిమగ్నమయ్యాయి. చైనా సెర్చ్ ఇంజిన్ 'బైదూ' కూడా ఎర్నీబాట్ పేరుతో సొంత ఏఐ అప్లికేషన్‌ను తీసుకురావాలని నిర్ణయించింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

చాట్‌బాట్ అంటే?

మెషీన్ లెర్నింగ్ మోడల్‌లోని డేటాను ఉపయోగించుకొని కృత్రిమ మేధ సాయంతో యూజర్ల ప్రశ్నలకు సంభాషణల రూపంలో సమాధానం ఇవ్వడాన్ని చాట్‌బాట్ అంటారు. ప్రశ్న అడగ్గానే సమాధానాలు స్వయంచాలితంగా(ఆటోమేటిక్)గా జనరేట్ అవుతాయి. ఏఐ చాట్‌బాట్‌లు మనిషి స్పందించినట్లుగానే స్పందిస్తాయి. వ్యాపారం, విద్య, వైద్యంతోపాటు దాదాపు అన్ని రంగాలకు సంబంధించిన వివరాలు పొందవచ్చు. వ్యక్తిగత సమస్యలకు పరిష్కార మార్గాలు తెలుసుకోవచ్చు. కథలు, కవితలు, సినిమా స్క్రిప్టులు కూడా ఏఐ చాట్‌బాట్ రాసి ఇస్తుంది. పరీక్షల్లో రాయడానికి వ్యాసాలను సైతం విద్యార్థులు పొందవచ్చు. దీనిపై ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యాసాలు సొంతంగా బుర్రకు పదునుపెట్టి రాయాలని, చాట్‌బాట్ నుంచి తీసుకుంటే విద్యార్థుల్లో ఆలోచనాశక్తి నశించిపోతుందని అంటున్నారు. చాట్‌బాట్‌లోనూ లోపాలు ఉన్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కచ్చితత్వం లేని, తప్పుల తడకలుగా ఉన్న డేటా వనరుల నుంచి కూడా సమాచారం వస్తుందని, యూజర్లు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

అట్టహాసంగా ఉత్తర కొరియా సైనిక పరేడ్



కార్యక్రమానికి కుమార్తెతో హాజరైన కిమ్

కిమ్ జోంగ్ ఉన్‌తోపాటు పాల్గొన్న కుమార్తె కిమ్ జు అయే

సియోల్: ఉత్తర కొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్ తన సైనిక బలాన్ని మరోసారి ప్రదర్శించారు. రాజధాని పాంగ్‌యాంగ్‌లో బుధవారం రాత్రి సైనిక పరేడ్ అట్టహాసంగా నిర్వహించారు. అమ్ముల పొదిలోని కీలక ఆయుధాలతోపాటు అత్యాధునిక, భారీ అణు క్షిపణులకు సైతం ఈ పరేడ్‌లో చోటుకల్పించారు. కిమ్ జోంగ్ ఉన్‌తోపాటు ఆయన కుమార్తె కిమ్ జు అయే ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పది సంవత్సరాల వయసున్న కిమ్ జు అయే భవిష్యత్తులో ఉత్తర కొరియా పాలనా పగ్గాలు చేపట్టడం ఖాయమన్న చర్చ పెద్ద ఎత్తున సాగుతోంది. కిమ్ జోంగ్ ఉన్ తన కుమార్తెను ఆ దిశగా సన్నద్ధం చేస్తున్నారన్న వార్తలు వినిపిస్తున్నాయి. కిమ్ జు అయే బహిరంగంగా ప్రజలకు కనిపించడం ఇది ఐదోసారి. ఆమె కిమ్‌కు రెండో సంతానమని తెలుస్తోంది. మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆమె తండ్రితోపాటు కనిపించారు. మరిన్ని అణ్వాయుధాలను సొంతం చేసుకోవడానికి కిమ్ తీవ్రంగా శ్రమిస్తున్నారని పరిశీలకులు చెబుతున్నారు. రాబోయే రోజుల్లో నూతన ఘన-ఇంధన ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని ఉత్తర కొరియా పరీక్షించబోతున్నట్లు అంచనా వేస్తున్నారు. తాజా సైనిక పరేడ్‌లో డజనుకుపైగా ఖండాంతర బాలిస్టిక్ మిస్సైళ్లను ప్రదర్శించారు. పొరుగు దేశమైన దక్షిణ కొరియాతోపాటు అగ్రరాజ్యం అమెరికాతో ఉత్తర కొరియా కయ్యానికి కాలు దువ్వుతోంది. పశ్చిమ దేశాల ఆంక్షల వల్ల వనరులు పరిమితంగా ఉన్నప్పటికీ అత్యాధునిక అణ్వాయుధాల తయారీపై కిమ్ దృష్టి పెట్టడం ఆసక్తికరంగా మారింది.

న్యాయవ్యవస్థలో రిజర్వేషన్లకు అవకాశం లేదు

న్యూఢిల్లీ: ప్రస్తుతమున్న విధానం, నిబంధనల ప్రకారం భారత న్యాయవ్యవస్థలో రిజర్వేషన్లకు అవకాశం లేదని కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరెన్ రిజిజు చెప్పారు. కానీ, జడ్జీల నియామక ప్రతిపాదనల సమయంలో సరైన ప్రాతినిధ్యం లేని మహిళలు, బీసీలు, ఇతర వర్గాలకు చెందిన వారి విషయం దృష్టిలో ఉంచుకోవాలని జడ్జీలు, ముఖ్యంగా కొలీజియం సభ్యులకు తెలిపినట్లు ఆయన వెల్లడించారు. రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో డీఎంకే నేత తిరుచి శివ అడిగిన ఒక ప్రశ్నకు ఈ సమాధానమిచ్చారు. ఫిబ్రవరి ఒకటో తేదీ నాటికి దేశంలోని 25 హైకోర్టుల్లో సుమారు 60 లక్షల కేసులు, సుప్రీంకోర్టులో 69 వేల కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు మరో ప్రశ్నకు సమాధానంగా మంత్రి వెల్లడించారు. ఇందులో, అలహాబాద్ హైకోర్టులో అత్యధికంగా 10.30 లక్షల కేసులు, సిక్కిం హైకోర్టులో అత్యల్పంగా 171 కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

గతంలో నాలుగుసార్లు చైనా బెలూన్లు కనిపించాయి

అమెరికా రక్షణ శాఖ వెల్లడి

వాషింగ్టన్: చైనా ప్రయోగించిన నిఘా బెలూన్లు గతంలో నాలుగు పర్యాయాలు తమ దేశ భూభాగాలపై ఎగిరాయని అమెరికా రక్షణ శాఖ కార్యాలయం పెంటగాన్ తెలిపింది. నిఘా ప్రయోజనాల కోసం చైనా గత కొద్ది సంవత్సరాలుగా బెలూన్లను వాడుతున్నట్లు భావిస్తున్నామని పేర్కొంది. వీటిల్లో కొన్నిటిని తాము గుర్తించలేదని వివరించింది. గత వారం జరిగిన ఘటనతో పోల్చి విశ్లేషించగా అవి చైనాకు చెందిన నిఘా బెలూన్లే అని రూఢీ అయినట్లు వెల్లడించింది. గత శనివారం అమెరికా ఫైటర్ జెట్ విమానం సౌత్ కరోలినా సమీపంలోని అట్లాంటిక్ సముద్ర జలాల్లో కూల్చివేసిన చైనా నిఘా బెలూన్ తాలూకూ పరికరాల వెలికితీత కొనసాగుతోందని పేర్కొంది.

2 లక్షల మంది పౌరసత్వాన్ని వదులుకున్నారు

న్యూఢిల్లీ: 2011 నుంచి ఇప్పటి వరకు మొత్తం 16 లక్షల మందికి పైగా భారతీయులు భారతీయ పౌరసత్వాన్ని వదులుకున్నారని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. వీరిలో ఒక్క 2022 సంవత్సరంలోనే అత్యధికంగా 2.25 లక్షల మంది దేశ పౌరసత్వాన్ని వదిలిపెట్టారని వివరించింది. విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ రాజ్యసభలో ఒక ప్రశ్నకు ఈ మేరకు సమాధానమిచ్చారు. అమెరికా కంపెనీలు ఇటీవలి కాలంలో ఉద్యోగ నిపుణులను తొలగిస్తున్న విషయాన్ని తాము పరిశీలిస్తున్నట్లు విదేశాంగ శాఖ సహాయ మంత్రి మురళీధరన్ చెప్పారు. వీరిలో హెచ్-1బీ, ఎల్1 వీసాలు కలిగిన భారతీయులు కూడా ఉన్నారని వివరించారు.

ప్రభుత్వాలను కూల్చిన చరిత్ర కాంగ్రెస్‌దే

- 90 సార్లు ప్రభుత్వాలను పడగొట్టేందుకు ఆర్టికల్ 356 వినియోగం
- రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చలో కాంగ్రెస్‌పై మోదీ నిప్పులు

సాక్షి, న్యూఢిల్లీ: ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలను కూలిచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనంటూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రధాని ప్రతిపక్షంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు ఆర్టికల్ 356ను అధికంగా దుర్వినియోగం చేసి ప్రభుత్వాలను పడగొట్టిందంటూ కాంగ్రెస్‌పై మాటల దాడి చేశారు. 'కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు పెద్ద ఎత్తున ఆర్టికల్ 356ను దుర్వినియోగం చేశారు. 90సార్లు ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలను కూలదోశారు. ప్రధానిగా ఇందిరాగాంధీ ఒక్కరే 50సార్లు ఆర్టికల్ 356ను వాడారు. కాంగ్రెస్ ఇప్పటిదాకా నెహ్రూ-గాంధీ కుటుంబం పేరును 600 కేంద్ర పథకాలకు పెట్టింది. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నిజంగా మహోన్నతమైన నేత అయితే ఆయన ఇంటిపేరైన నెహ్రూ ఎందుకు వారసత్వంగా రాలేదు?' అని ప్రధాని నిలదీశారు. రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానానికి ప్రధాని గురువారం సమాధానమిచ్చారు. గంటన్నర పాటు మాట్లాడిన ప్రధాని కాంగ్రెస్ గత పాలనను ఎండగట్టారు.

ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని కూల్చే ప్రయత్నాలు

రాష్ట్ర ప్రభుత్వాలను పడగొట్టడంలో కాంగ్రెస్ చేసిన కుట్రలపై మాట్లాడిన ప్రధాని ఎన్టీఆర్ ప్రభుత్వ అంశాన్ని ప్రస్తావించారు. 'ప్రతి ప్రాంతీయ నేతను కాంగ్రెస్ ఇబ్బందులకు గురిచేసింది. ఎన్టీఆర్‌కు ఏం చేసిందో అందరికీ తెలుసు. (ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ సహా ఇతర విపక్ష ఎంపీలను చూపిస్తూ) కొందరు నేతలు ఇక్కడ వేషం మార్చి ఉండవచ్చు..పేర్లు మార్చుకొని ఉండొచ్చు.. జ్యోతిష్యులు చెప్పారని పేర్లు మార్చుకొని ఉండొచ్చు...కానీ అప్పుడు వారంతా ఎన్టీఆర్‌తో పాటే ఉన్నవారే. అనారోగ్యం కారణంగా అమెరికా వెళితే..ఆయన చికిత్స కోసం అమెరికా వెళితే ఆ ప్రభుత్వాన్ని కూలదోసే ప్రయత్నం చేశారు' అంటూ విమర్శించారు. కేరళలో వామపక్ష ప్రభుత్వాన్ని, తమిళనాడులో ఎంజీఆర్, కరుణానిధి ప్రభుత్వాలను ఆర్టికల్ 356 ఉపయోగించి కాంగ్రెస్ ప్రభుత్వం కూలిచ్చివేసిందని చెప్పారు. తమ ప్రభుత్వాలను కూల్చిన కాంగ్రెస్‌తోనే ఇప్పుడు వామపక్షాలు, డీఎంకే వంటి పార్టీలు కలిసి నిరసన తెలుపుతున్నాయని, వీరి ధోరణిని ఎంజీఆర్ ఆత్మ చూస్తుంటుందని చురకలంటించారు. ఇదేరీతిన 1980లో శరద్ పవార్ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ కూలదోసిందని గుర్తు చేశారు.

పార్టీ కార్యాలయాలుగా మార్చేసింది

'కాంగ్రెస్ పాలకులు రాజ్‌భవన్‌లను పూర్తిగా పార్టీ ప్రధాన కార్యాలయాలుగా మార్చారు. 2005లో జార్ఖండ్‌లో ఎన్డీఏ ప్రభుత్వానికి అత్యధిక సీట్లున్నా, గవర్నర్ యూపీఏ ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించారు. 1982లో హరియాణాలో ఎన్నికలకు ముందే బీజేపీ-దేవీలాల్‌ల మధ్య ఒప్పందం ఉన్నా, గవర్నర్ కాంగ్రెస్‌ను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించారు' అని అన్నారు.

ఎంతగా బురదజల్లితే అంతగా కమల వికాసం

విపక్షాల విమర్శలపై కవి మాణిక్ వర్మ కవితను ఉదహరించారు. ' బురద వాళ్ల దగ్గరుంది. నా దగ్గర రంగులున్నాయి. వాళ్లదగ్గర ఏముందో అదే వాళ్లు చల్లుతారు' అని అన్నారు. విమర్శలపై.. 'ఎంతగా బురదను చల్లుతారో అంత పెద్దగా కమలం వికసిస్తుంది' అని ఉద్ఘాటించారు. 'దేశం కోసం జీవిస్తున్నా. మాతృభూమి కోసం కొంతైనా చేస్తా' అంటూ గుండెలపై చేయి వేసి ప్రకటించారు. 'ఆరోపణలు(బురద) ఎంతగా వేస్తున్నారో దేశం చూస్తోంది. విపక్షాల అందరి ఆరోపణల(బురద) బరువు నా ఒక్కడిపైనా పడుతోంది' అని అన్నారు. విపక్షాల నినాదాలతో పలుమార్లు వాయిదాపడిన రాజ్యసభ సాయంత్రం ఐదుగంటలకు తిరిగి ప్రారంభమైంది. సభ సజావుగా సాగాలంటే సభ్యులు సంయమనం పాటించాలని, ఇందుకు అన్ని పార్టీల పక్ష నేతలు సమావేశంకావాలని చైర్మన్ ధన్‌ఖడ్ సూచించారు. దీంతో కాంగ్రెస్ సభ్యుడు శక్తిసిన్హా గోహిల్ మాట్లాడుతుండగా ప్రధానికి విపక్షాలు క్షమాపణలు చెప్పాలని బీజేపీ సభ్యులు మోదీమోదీ అంటూ నినాదాలు మొదలుపెట్టారు. దీంతో సభను వాయిదావేస్తున్నట్లు ధన్‌ఖడ్ ప్రకటించారు.



మాకు మరిన్ని ఆయుధాలు కావాలి

ఈయూ పార్లమెంట్‌లో ప్రసంగించిన జెలెన్‌స్కీ



మేక్రాన్‌తో జెలెన్‌స్కీ

బ్రస్సెల్స్: రష్యాను ఎదుర్కొనేందుకు తమకు మరింత సైనిక సాయం కావాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొమిదిర్ జెలెన్‌స్కీ కోరారు. ఉక్రెయిన్, యూరోపియన్ యూనియన్ (ఈయూ) కలిసి యూరప్ బద్ధవ్యతిరేకి అయిన రష్యాతో తలపడుతున్నాయని చెప్పారు. గురువారం ఆయన బెల్జియం రాజధాని బ్రస్సెల్స్‌లోని ఈయూ పార్లమెంట్‌నుద్దేశించి ప్రసంగించారు. 'మనం కలిసి ఉన్నంత కాలం, మన యూరప్‌ను కాపాడుకున్నంత కాలం, మన యూరప్ జీవన విధానాన్ని పరిరక్షించుకున్నంత కాలం యూరప్ యూరప్‌గానే నిలిచి ఉంటుంది'అని జెలెన్‌స్కీ చెప్పారు. యూరప్ జీవన విధానాన్ని నాశనం చేయాలని రష్యా కోరుకుంటోంది. కానీ, మనం అలా జరగనివ్వరాదు'అని చెప్పారు. అంతకుముందు ఈయూ ప్రతినిధులు ఆయనకు పార్లమెంట్ భవనంలోకి ఘనంగా స్వాగతం పలికారు. ప్రసంగం పూర్తయిన అనంతరం, ప్రొటోకాల్ ప్రకారం ఉక్రెయిన్ జాతీయ గీతం, యూరోపియన్ గీతం వినిపించారు. ఆ సమయంలో జెలెన్‌స్కీ ఈయూ జెండాను చేబూనారు. అనంతరం యూరోపియన్ పార్లమెంట్ అధ్యక్షుడు రొబెర్టా మెట్సోలా మాట్లాడుతూ.. లాంగ్ రేంజ్ క్షిపణి వ్యవస్థలను, యుద్ధవిమానాలను సాధ్యమైనంత త్వరగా ఉక్రెయిన్‌కు అందించే విషయం పరిశీలించాలని సభ్య దేశాలను కోరారు. ఉక్రెయిన్‌కు రష్యాతో ఉన్న ముప్పునకు తగ్గట్లే చర్యలుండాలని సూచించారు. ఇది ఉక్రెయిన్ అస్తిత్వానికి సంబంధించిన విషయమన్నారు. ఈనెల 24వ తేదీతో ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రారంభించి ఏడాదవుతోంది. ఈ సందర్భంగా దాడులను మరో విడత తీవ్రతరం చేసేందుకు రష్యా ప్రయత్నిస్తోందని పరిశీలకులు అంటున్నారు. ఈ నేపథ్యంలోనే అదనపు సైనిక సాయం కోసం జెలెన్‌స్కీ మిత్ర దేశాల్లో పర్యటనలు చేస్తున్నారు. అంతకుముందు ఫ్రాన్సు పర్యటనలో ఆ దేశాధ్యక్షుడు మేక్రాన్ ఆయన్ను లీజియన్ ఆఫ్ హానర్‌తో సన్మానించారు. బ్రస్సెల్స్‌లో ఈయూకు చెందిన 27 దేశాల నేతలతో జెలెన్‌స్కీ సమావేశమయ్యారు.

ఢిల్లీ మద్యం కేసులో ఈడీ మరో అరెస్ట్

న్యూఢిల్లీ: ఢిల్లీలో మద్యం విధానంలో అక్రమాలు జరిగాయంటూ అరెస్టుల పర్వానికి తెరలేపిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గురువారం మరొకరిని అరెస్ట్‌చేసింది. 2022లో గోవా అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రచార బాధ్యతలు నెరవేర్చిన ఒక అడ్వర్‌టైజ్‌మెంట్ సంస్థ డైరెక్టర్‌ను అరెస్ట్‌చేసింది. మద్యం కేసులో మనీ లాండరింగ్‌తో చారియట్ ప్రొడక్షన్స్ మీడియా డైరెక్టర్ రాజేశ్ జోషీకి ప్రమేయముందని ఈడీ ఆరోపిస్తోంది. జోషిని కోర్టు 13 వరకు ఈడీ కస్టడీకి అనుమతించింది. కేసులో ఐదుగురు నిందితుల బెయిల్ పిటిషన్లపై తీర్పును రౌజ్ అవెన్యూ కోర్టు రిజర్వు చేసింది. బెయిల్‌పై వాదనలు ముగిశాయని, 16న నిర్ణయం వెలువరుస్తామని జడ్జి పేర్కొన్నారు.

పుతిన్‌తో దోవల్ భేటీ

న్యూఢిల్లీ: రష్యా పర్యటనలో ఉన్న భారత జాతీయ భద్రతా సలహాదారు ఆ దేశ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో భేటీ అయ్యారు. గురువారం మాస్కోలో ఈ భేటీ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ఇకమీదటా ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు మాస్కోలోని భారత రాయబార కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. అఫ్గానిస్తాన్ అంశంపై పలు దేశాల అత్యున్నత స్థాయి ప్రతినిధులతో పుతిన్ భేటీ అవుతున్నారు. అందులోభాగంగా గురువారం ఐదవ జాతీయ భద్రతా మండలి/సలహాదారుల సమావేశంలో దోవల్, పుతిన్ మాట్లాడుకున్నారని రష్యా అధ్యక్ష భవనం క్రెమ్లిన్ తెలిపింది. 'అఫ్గానిస్తాన్‌లో అనిశ్చితిని అవకాశంగా తీసుకుని కొన్ని ప్రాంతీయేతర శక్తులు అక్కడ మరింతగా విస్తరించేందుకు కుట్ర పన్నుతున్నాయి. అక్కడ పరిస్థితి ఏమంత బాగోలేదు. మానవతాసాయం మరింతగా తగ్గిపోతోంది' అని పుతిన్ అన్నారు. ' అఫ్గాన్ గడ్డ నుంచి ఉగ్రవాదాన్ని మరింతగా ఎగదోసే చర్యలను భారత్ ఏమాత్రం ఉపేక్షించదు. అఫ్గాన్ ప్రజలను కష్టాల్లో వదిలేయబోము' అని దోవల్ అన్నారు.

చలి.. ఆకలి

- శిథిలాల కింద బాధితుల వేదన
- 19 వేలు దాటేసిన మృతుల సంఖ్య
- గడ్డ కట్టించే చలితో సహాయ కార్యక్రమాలకు ఆటంకం



రెహన్లిలో చనిపోయిన కుమార్తెను ముద్దాడుతున్న తల్లి



శిథిలాల్లో చిక్కుకుపోయిన అబ్దుల్

అంటాక్యా/జందారిస్: ఆశలు అడుగంటుతున్నాయి. శిథిలాల కింద సహాయం కోసం ఆర్తనాదాలు చేస్తున్న వారిని కాపాడగలమన్న నమ్మకం తగ్గిపోతోంది. ఉష్ణోగ్రతలు మైనస్ అయిదు డిగ్రీలకు చేరుకోవడంతో సహాయ చర్యలకి తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇప్పటివరకు తుర్కియే, సిరియాల్లో 19 వేల మందికి పైగా మరణించారని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఇంకా శిథిలాల కింద లక్షలాది మంది ఉండవచ్చునని అంచనా వేస్తున్నారు. సహాయ చర్యల్లో లోపాలున్నాయని తుర్కియే అధ్యక్షుడు తయిపీ ఎర్డోగన్ స్వయంగా అంగీకరించారు. ఈ స్థాయిలో ప్రళయం సంభవిస్తే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అసాధ్యమని వ్యాఖ్యానించారు. భూకంపం వచ్చిన ప్రాంతం దేశంలో ఒక మారుమూల ఉండడంతో సహాయ బృందాలను పంపించడంలో ఆలస్యమైందని అన్నారు. మరోవైపు భూకంపానికి ఇళ్లు కోల్పోయిన వారు వీధుల్లోనే కాలం గడుపుతున్నారు. చలి తట్టుకోలేక వారంతా తీవ్రంగా అవస్థలు పడుతున్నారు. చాలా మంది రాత్రి వేళల్లో రోడ్లపై పార్క్ చేసి ఉంచిన కార్లలో ఉంటున్నారు.

ఆ 72 గంటలు ముగిశాయ్..!

భూకంపం వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు మొదటి మూడు రోజులే అత్యంత కీలకం. ఈ 72 గంటల్లో ఎంతమందిని కాపాడారన్నదే ముఖ్యం. ఆ తర్వాత శిథిలాలు తొలగించినా ప్రాణాలతో బయటపడేవారి సంఖ్య చాలా తక్కువ. గురువారం ఉదయానికి 72 గంటలు గడిచిపోవడంతో ఇంకెన్ని మరణాలు సంభవిస్తాయోనన్న ఆందోళన అందరిలోనూ నెలకొంది. భూకంపాల సమయంలో మొదటి మూడు రోజుల్లో సర్వ సాధారణంగా 90శాతం మందిని బాధితుల్ని రక్షిస్తారు. మూడు రోజులు దాటితే శిథిలాల కింద ఉన్న వారికి మంచినీళ్లు, ఆహారం అందించాలి. అవి అందక మిగిలిన వారు ప్రాణాలతో బయటపడడం కష్టంగా మారుతుంది.

ఆరేళ్ల బాలికను కాపాడిన ఎన్డీఆర్ఎఫ్ బృందం

తుర్కియేలో సహాయ కార్యక్రమాల్లో పాల్గొంటున్న భారత నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్డీఆర్ఎఫ్) శిథిలాల కింద నలిగిపోతున్న ఆరేళ్ల బాలికను కాపాడాయి. మన దేశం నుంచి వెళ్లిన మూడు బృందాలు అలుపెరుగకుండా సహాయ కార్యక్రమాలు అందిస్తున్నాయని కేంద్ర హోం శాఖ ట్వీట్ చేసింది. ''భారత్‌కు చెందిన సహాయ బృందం నర్దగి ప్రాంతంలో ఆరేళ్ల బాలికను కాపాడింది. ఎన్డీఆర్ఎఫ్ చేస్తున్న సహాయానికి గర్వపడుతున్నాం'' అని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ట్వీట్ చేశారు. ఆ బాలికను కాపాడిన వీడియోను కూడా షేర్ చేశారు.

హైపోథెర్మియా ముప్పు

తుర్కియేలో భూకంపం తీవ్రత ఎక్కువగా ఉన్న అడియమాన్ ప్రావిన్స్‌లో బాధితులు దారుణమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. భూకంపం వచ్చి నాలుగు రోజులైనా సహాయ సిబ్బంది ఎవరూ రాలేదని రెసాట్ గొజ్లు అనే బాధితుడు తన గోడు వెళ్లబోసుకున్నాడు. శిథిలాల కింద ఉన్న వారిలో చాలా మంది హైపోథెర్మియా పరిస్థితులతో మరణించారని తెలిపారు. శరీరంలో ఉష్ణం పుట్టే వేగం కంటే, ఉష్ణం కోల్పోయే వేగం ఎక్కువగా ఉంటే దానిని హైపోథెర్మియా అని అంటారు. గట్టకట్టించే చలిలో బాధితుల శరీర ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గిపోయి మరణిస్తారు.

దేశమే జరిగింది...!

తుర్కియే (టర్కీ)లో సంభవించిన భూకంపం ధాటికి ఆ దేశం భౌగోళికంగా అయిదు నుంచి ఆరు మీటర్లు పక్కకి జరిగి ఉంటుందని భూగర్భ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. భూమి పొరల్లో ఉన్న టెక్టోనిక్ ప్లేట్స్ (ఫలకాలు) తీవ్రమైన రాపిడి కారణంగానే ఇది సంభవించినట్టు తెలిపారు. సిరియాతో పోల్చి చూస్తే తుర్కియేలో రెండు ఫలకాల మధ్య ఏర్పడిన ఒత్తిడి వల్ల రిక్టర్ స్కేలుపై 7.8 తీవ్రతతో భూకంపం కుదిపేసిందని, ఫలితంగా దేశమే కాస్త జరిగిందని ఇటలీకి చెందిన సెసిమాలజిస్ట్ ప్రొఫెసర్ కార్లో డొగ్లోని చెప్పారు. భూ పొరల్లో ఉన్న అనతోలియా ప్లేట్ వాయవ్య దిశగా ఉన్న అరేబికా ప్లేట్ వైపు జరగడంతో ఇలా దేశమే భౌగోళికంగా కదిలే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఒక టెక్టోనిక్ ప్లేట్ పశ్చిమ వైపు, మరో ప్లేట్ తూర్పు వైపు కదలడంతో భారీ భూకంపం సంభవించిందని ఆయన వివరించారు. వాలీబాల్ ఆట కోసం అడియామాన్‌కు వచ్చిన కాలేజీ అమ్మాయిలు, అబ్బాయిలు 39 మంది ప్రాణాలు కోల్పోయినట్టుగా భావిస్తున్నారు. ఫమగుస్తా కాలేజీకి చెందిన ఈ బృందం ఏడంతస్తులున్న ఒక హోటల్‌లో బస చేశారు.

కాపాడడమూ కష్టమే..!

భూకంపం శిథిలాల కింద ఉన్నవారిని గుర్తించి వారిని కాపాడడం అంత తేలికైన విషయం కాదు. సహాయ సిబ్బందితో పాటు బాధితులు కూడా సహకరించాలి. అందుకు ఈ ఫొటో నిదర్శనం. తుర్కియేలోని తీవ్ర విధ్వంసం జరిగిన హతేలో ఇంటి పైకప్పు మొత్తం మీద పడిపోవడంతో కాళ్లు కదల్చలేని స్థితిలో అబ్దుల్‌అలీమ్ అనే వ్యక్తి ఉన్నాడు. అంత పెద్ద శ్లాబుని తొలగించి అతనిని బయటకు తీసుకురావడం సహాయ సిబ్బందికి కష్టమైంది. అబ్దుల్‌ను కాపాడినా అతని భార్య, పిల్లలు ప్రాణాలు కోల్పోవడం విషాదం. శిథిలాల్లో చిక్కుకున్న వారిలో ఒక ప్రాణాన్ని కాపాడడానికి 10 లక్షల డాలర్లు ఖర్చు అవుతుందని తుర్కియే ప్రభుత్వం అంచనా వేస్తోంది.

సిరియాలో సహాయానికి అంతర్యుద్ధమే అడ్డు

అంతర్యుద్ధంతో అతలాకుతలమవుతున్న సిరియాలో సంభవించిన భూకంపంలో సహాయ కార్యక్రమాలు సరిగా కనిపించడం లేదు. దేశంలోకి వెళ్లడానికి కేవలం రెబెల్స్ అధీనంలో ఒకే ఒక మార్గం తీసి ఉంది. సాయం అందించడం కోసం వచ్చిన అంతర్జాతీయ సంస్థలు సిరియాలో ఒక్కో ప్రాంతం ఒక్కొక్కరి అధీనంలో ఉండడంతో ముందుకు వెళ్లడానికి సవాలక్ష అనుమతులు తీసుకోవాల్సి వస్తోంది. కుర్దులు, సిరియన్ తిరుగుబాటుదారులు, జిహాదీ శక్తులు, తుర్కియే మిలటరీ మద్దతున్న రెబెల్స్, సిరియా ప్రభుత్వం ఇలా దేశం మొత్తం పలువురి అధీనంలో ఉండడం సహాయ కార్యక్రమాలకు ఆటంకంగా మారింది.



మకర తోరణం తరలింపుతో
ముగిసిన పెద్దగట్టు జాతర

సూర్యాపేట: సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం దురాజ్‌పల్లిలో కొలువైన శ్రీలింగమంతుల స్వామి (పెద్దగట్టు) జాతర ముగిసింది. గురువారం రాత్రి మకర తోరణాన్ని సూర్యాపేటలోని గొల్ల బజారుకు చెందిన వల్లపు, కోడి వంశస్తులు తీసుకువెళ్లడంతో జాతర ముగిసినట్లు పూజారులు ప్రకటించారు. ఐదు రోజులపాటు జరిగిన ఈ జాతరకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. చివరి రోజు కూడా భక్తులు భారీగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. సూర్యాపేట జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు, ఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా చర్యలు చేపట్టారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన 28 హుండీల ద్వారా రూ. 25.71 లక్షల ఆదాయం వచ్చింది. అదే విధంగా 550 గ్రాముల వెండి, రెండు గ్రాముల బంగారం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.


పెద్దగట్టు నుంచి మకర తోరణాన్ని సూర్యాపేట పట్టణంలోని గొల్ల బజారుకు తరలిస్తున్న వల్లపు, కోడి వంశస్తులు, యాదవులు

సీఎం ఇలాకాలో అవిశ్వాసం లొల్లి

- గజ్వేల్ – ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం ప్రవేశపెట్టిన కౌన్సిలర్లు

గజ్వేల్: సీఎం కేసీఆర్ సొంత నియోజకవర్గంలోని గజ్వేల్ – ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో అవిశ్వాసం లొల్లి మొదలైంది. ఒంటెత్తు పోకడలను ప్రదర్శిస్తున్నాడని ఆరోపిస్తూ అధికార పార్టీకి చెందిన 20 మంది కౌన్సిలర్లలో 14మంది మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళిపై తిరుగుబాటు జెండాను ఎగరేశారు. ఈ క్రమంలోనే వారంతా స్వయంగా సంతకాలు చేసిన అవిశ్వాస తీర్మానాన్ని గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్‌కు అందజేశారు. అనంతరం కౌన్సిలర్లు సంయుక్తంగా విడుదల చేసిన ఓ ప్రకటనలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ పాలనకు మచ్చ తెస్తున్నాడని ఆరోపించారు.

రైతు పొలంలో రోడ్డు

- మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం


ఆస్పత్రిలో రోదిస్తున్న రైతు తిరపయ్య

నేలకొండపల్లి: పట్టా భూమిలో కాంట్రాక్టర్ రోడ్డు వేస్తుండడంతో ఉన్న కాస్త భూమి కూడా పోతుందనే బెంగతో ఓ రైతు ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం పైనంపల్లిలో నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద రైతు యడవల్లి తిరపయ్యకి ఎకరం పొలం ఉంది. బ్రిడ్జి నిర్మాణ సమయంలో అందులో నుంచి ఐదు గుంటల భూమి సేకరించారు. అప్పుడు ఆందోళన చేసినా అధికారులు పట్టించుకోలేదు. ప్రస్తుతం బ్రిడ్జికి అనుకుని నిర్మించే రహదారి కూడా తిరపయ్య భూమిలో నుంచి వేస్తుండడంతో మరో 10 కుంటల భూమి కోల్పోవాల్సి వస్తోంది. దీంతో రైతు కుటుంబ సభ్యులు బుధవారం పని చేస్తున్న ప్రదేశానికి వెళ్లి అడ్డుకున్నారు. దీంతో వెనక్కి తగ్గినట్లు కనిపించినా, అర్ధరాత్రి దాటాక రైతు పొలంలో రహదారి నిర్మాణానికి మట్టి చేరవేశారు. ఈ విషయాన్ని గురువారం ఉదయం గుర్తించిన రైతు కుటుంబీకులు ఇదేమిటని ప్రశ్నించారు. ఇందుకు అధికారులు, కాంట్రాక్టర్ దూషించారని ఆరోపిస్తూ అందరూ చూస్తుండగానే తిరుపయ్య పురుగుల మందు తాగాడు. దీంతో కుటుంబసభ్యులు వెంటనే ఆయన్ను నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, రైతును డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి తదితరులు పరామర్శించారు.

పెళ్లి మొక్కు తీర్చుకోవడానికి వెళ్లి...

- ప్రమాదవశాత్తూ గోదావరిలో మునిగి యువతి మృతి
- రెండ్రోజుల్లో వివాహం.. అంతలోనే విషాదం

ధర్మపురి: ఆ యువతికి మరో రెండ్రోజుల్లో వివాహం జరగాల్సి ఉంది. తన మొక్కు చెల్లించుకోవాల్సి ఉండటంతో అక్క కొడుకును వెంటబెట్టుకుని దైవదర్శనం కోసం వెళ్లిన ఆ యువతి గోదావరి నదిలో పడి దుర్మరణం చెందింది. ఈ సంఘటన జగిత్యాల జిల్లా ధర్మపురి సమీపంలోని గోదావరి నదిలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. జిల్లాలోని మెట్‌పల్లి మండలం వెల్లుల గ్రామానికి చెందిన తంగళ్లపల్లి నర్సయ్య – రాధ దంపతులకు ఇద్దరు కూతుళ్లు. పెద్దకూతురుకు వివాహం అయ్యింది. చిన్నకూతురు స్వరూపరాణి (24)కి ఇటీవల వివాహం నిశ్చయమైంది. తనకు వివాహం నిశ్చయమైతే మొక్కులు చెల్లించుకుంటానని స్వరూప దేవుళ్లకు ముడుపులు కట్టుకుంది. ఈనెల 12న వివాహం జరగాల్సి ఉండటంతో తల్లిదండ్రులు, బంధువులు ఆ ఏర్పాట్లలో ఉన్నారు. దీంతో తన మొక్కు చెల్లించుకునేందుకు స్వరూప తన అక్క కుమారుడిని వెంట తీసుకుని గురువారం ఉదయం తొలుత వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామివారికి మొక్కులు చెల్లించుకుంది. సాయంత్రం ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి పుణ్యక్షేత్రానికి చేరుకుంది. పుణ్యస్నానం ఆచరించేందుకు గోదావరి నది మంగళిగడ్డ వద్దకు వచ్చింది. హర్ష ఒడ్డుపై ఉండగా ఆ యువతి నీటిలోకి దిగింది. అక్కడి పాకుడుతో జారి వేగంగా నీటిలో మునిగింది. ఈ హఠాత్పరిణామంతో భయకంపితుడైన హర్ష గట్టిగా కేకలు వేశాడు. సమీపంలోని భక్తులు వచ్చి చూసినా యువతి ఆచూకీ లభించలేదు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సీఐ కోటేశ్వర్, ఎస్సై కిరణ్‌కుమార్ వెంటనే అక్కడికి చేరుకున్నారు. జాలర్ల సాయంతో గాలించగా యువతి మృతి చెంది కనిపించింది. ఎంతోసంతోషంతో పెళ్లి ఏర్పాట్లలో ఉన్న తల్లిదండ్రులు, బంధువులను ఆమె మరణవార్త నిశ్చేష్టులను చేసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

88 మంది హెచ్‌ఎంలకు షోకాజ్ నోటీసులు

ఆదిలాబాద్ టౌన్: విధుల్లో నిర్లక్ష్యం వహించడంతో పాటు ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతర్ చేసిన ప్రధానోపాధ్యాయులపై డీఈవో ప్రణీత కొరడా ఝులిపించారు. ఈనెల 4న అడిషనల్ కలెక్టర్ రిజ్వాన్ బాషా పదో తరగతి పరీక్షల నిర్వహణ, టెన్త్ విద్యార్థుల ప్రత్యేక తరగతులపై జూమ్ మీటింగ్ నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేశారు. విద్యాశాఖ అధికారులు సంబంధిత ప్రధానోపాధ్యాయులకు సమాచారం అందించారు. అయితే జిల్లాలో 88 మంది ప్రధానోపాధ్యాయులు ఈ మీటింగ్‌కు గైర్హాజరయ్యారు. అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈవో గురువారం షోకాజ్ నోటీసులు జారీ చేసి వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఇందులో జిల్లా పరిషత్ ఉపాధ్యాయులు, మోడల్ స్కూల్, కేజీబీవీ, ప్రభుత్వ యాజమాన్యం స్కూళ్ల హెచ్‌ఎంలు ఉన్నారు. 3 రోజుల్లో వివరణ ఇవ్వాలని, లేకపోతే చర్యలు చేపడతామని నోటీసులో పేర్కొన్నారు. అయితే అధికారులు ముందుగా సమాచారం ఇవ్వకపోవడంతోనే హెచ్‌ఎంలు జూమ్‌కు హాజరుకాలేదని టీచర్ల సంఘాల నేతలు పేర్కొంటున్నారు.



‘హోమ్’ డెలివరీ!

కంటైనర్ హోమ్స్‌కు పెరిగిన డిమాండ్

ఫ్యాక్టరీలో తయారీ, లారీలో తరలించి బిగింపు..

బయటి వాతావరణం కంటే 6–7 డిగ్రీల తక్కువ ఉష్ణోగ్రత

వారాంతాల్లో సేద తీరుతున్న కుటుంబాలు

ప్రకృతి ఒడిలో నివాసానికి ప్రజల మొగ్గు

- అయితే ఫామ్‌ప్లాట్లలో భవన నిర్మాణాలకు అనుమతి నో
- దీంతో ప్రత్యామ్నాయంగా కంటైనర్ హోమ్స్ ఏర్పాటు

సాక్షి, హైదరాబాద్: కరోనా తర్వాత ఆరోగ్యకరమైన జీవితంపై అందరికీ శ్రద్ధ పెరిగింది. తినే తిండి నుంచి ఉండే ఇల్లు వరకూ ఎక్కడా రిస్క్ తీసుకోవట్లేదు. సేంద్రియ ఆహార ఉత్పత్తులు తింటూ పచ్చని ప్రకృతి ఒడిలో నివాసం ఉండాలని భావిస్తున్నారు. కనీసం ఇంటి చుట్టూ నాలుగు చెట్లయినా ఉండాలనుకుంటున్నారు. ఫలితంగా ఫామ్‌హౌస్‌లకు, ఫామ్ ప్లాట్లకు డిమాండ్ పెరిగింది. ఫామ్‌హౌస్‌లు కొనుగోలు చేయలేనివారు ఫామ్ ప్లాట్ల వైపు మొగ్గుచూపుతున్నారు. అయితే ఫామ్ ప్లాట్లలో నివాస భవనాలకు నిర్మాణ అనుమతులు రావు. దీంతో కొనుగోలుదారులు ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టారు. ఈ నేపథ్యంలోనే కంటైనర్ హోమ్స్ (మాడ్యులర్ హోమ్స్)కు గిరాకీ పెరిగింది. ఇల్లులా ఏర్పాటు చేయడానికి అవసరమైనవన్నీ ఫ్యాక్టరీలో తయారు చేసి, లారీలో తీసికొచ్చి బిగించేస్తున్నారు. శామీర్‌పేట, కొంపల్లి, కందుకూరు, చేవెళ్ల, భువనగిరి, సదాశివపేట, ఆదిభట్ల, మేడ్చల్ వంటి శివారు ప్రాంతాల్లోని ఫామ్‌హౌస్‌లు, రిసార్ట్‌లలో కంటైనర్ హోమ్స్ ఎక్కువగా ఏర్పాటు చేస్తున్నారు. విదేశాల్లో మాదిరిగా ఇప్పుడిప్పుడే ఆఫీసులు, హోటళ్లు, వసతి గృహాలు, ఆధ్యాత్మిక ప్రాంతాలలో ఈ తరహావి ఏర్పాటు చేసేందుకు యజమానులు ముందుకొస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో కూడా చాలామంది ఫామ్ ప్లాట్లలో కంటైనర్ హోమ్స్‌ను ఏర్పాటు చేసుకుంటున్నారు. వారాంతంలో కుటుంబంతో కలిసి పచ్చని వాతావరణంలో సరదాగా గడుపుతున్నారు.

ఏమిటీ కంటైనర్ హోమ్?

- కంటైనర్ హోమ్స్‌ను గ్యాల్వనైజింగ్ స్టీల్ షీట్లతో తయారు చేస్తారు. కింద భాగంలో గ్రిడ్ వేసి సిమెంట్, కలప మిశ్రమంతో తయారైన బైసన్ బోర్డ్ వేస్తారు. దానిపైన పాలీ వినైల్ ఫ్లోర్ (పీవీసీ) ఉంటుంది. పీవీసీ వద్దనుకుంటే బైసన్ బోర్డ్ మీద టైల్స్ కూడా వేసుకోవచ్చు.
- ఇంటి బీమ్‌లు, ఫౌండేషన్ స్ట్రక్చర్‌లను ఉక్కుతో నిర్మిస్తారు. గాల్వనైజ్ పూత ఉంటుంది. ప్రధాన స్ట్రక్చరల్ ఫ్రేమ్, ఫ్లోర్, బాహ్య, అంతర్గత గోడలు, సీలింగ్ ప్యానల్స్‌లను ప్రీ ఫ్యాబ్రికేటెడ్ ప్రీ ఫినిష్డ్ వ్యాల్యుమెట్రిక్ కన్‌స్ట్రక్షన్ (పీపీవీసీ)లతో రూపొందిస్తారు.
- తలుపులు, కిటికీలు ఇంపాక్ట్ రెసిస్టెంట్ గ్లాస్‌లతో ఏర్పాటు చేస్తారు. గాలి, తేమలను నిరోధించేలా నాన్ వుడ్ కాంపోజిట్, సిమెంట్ బోర్డ్‌లతో బహుళ పొరలను ఏర్పాటు చేస్తారు. థర్మల్ ఇన్సులేషన్‌తో వాల్ ప్యానెల్ క్లాడింగ్‌లను ఏర్పాటు చేస్తారు. దీనివల్ల వేడి ఇంటి లోపలికి రాదు. బయటి వాతావరణం కంటే 6–7 డిగ్రీల తక్కువ ఉష్ణోగత ఉంటుంది.
- నిర్మాణ సామగ్రి తయారీలో బహుళ జాతి కంపెనీలైన సెయింట్ గోబైన్, గ్రైప్రోక్‌ల నైపుణ్య కార్మికులు ఈ కంటైనర్ హోమ్స్‌ను తయారు చేయడంలో సిద్ధహస్తులు. స్ట్రక్చరల్ ఇంజనీర్, ఆర్కిటెక్ట్‌ల సమక్షంలో వీటిని తయారు చేస్తారు. విస్తీర్ణాన్ని బట్టి కంటైనర్ హోమ్స్ ధరలు ఉంటాయి. మన అభిరుచుల మేరకు హాల్, కిచెన్, బెడ్‌రూమ్, జిమ్, స్విమ్మింగ్ పూల్ వంటి ఏ వసతులనైనా ఏర్పాటు చేసుకోవచ్చు.

నచ్చిన ప్రదేశానికి తీసుకెళ్లొచ్చు..

ఈ కంటైనర్ హోమ్స్‌కు స్ట్రక్చరల్ వారంటీ 50–60 ఏళ్లు ఉంటుంది. ఇంటి తయారీలో వినియోగించిన అంతిమ ఉత్పత్తి డ్యూరబుల్ వారంటీ 25 ఏళ్లు ఉంటుంది. ఈ కంటైనర్ హోమ్స్‌ను ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి తరలించవచ్చు. వీటిని మెటల్‌తోనే తయారు చేస్తారు కాబట్టి డబ్బులు తిరిగొస్తాయి. ఎక్కువ నష్టం ఉండదు.



కరోనా టైంలో కట్టించా..



నా పేరు కిశోర్, డిజైనర్‌గా ఉద్యోగం చేస్తున్నా. కరోనా రెండో దశలో మా కుటుంబ సభ్యులకు వైరస్ వచ్చింది. ఆ సమయంలో చుట్టుపక్కల వాళ్లతో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. జనావాసాలకు దూరంగా ఇల్లు ఉంటే బెటర్ అనిపించింది. దీంతో విశాఖపట్నంలోని కోడూరులో ఉన్న ఫామ్‌ప్లాట్‌లో రెడీమేడ్ ఇల్లు కట్టించుకోవాలనుకున్నా. తక్కువ ఖర్చుతో, త్వరగా పూర్తయ్యే ఇల్లయితే బాగుంటుందని పరిశోధన చేసిన తర్వాత 1,200 చ.అ. 2 బీహెచ్‌కే మాడ్యులర్ హోమ్ కట్టించుకున్నా. 4 నెలల్లో నిర్మాణం పూర్తయింది. రూ.20 లక్షలు ఖర్చు వచ్చింది. ఇప్పుడు కరోనా బెడద తొలగడంతో సొంతింటికి వచ్చేశాం. కానీ ప్రతి వీకెండ్‌కు అందరం అక్కడికి వెళ్లి పచ్చని వాతావరణంలో గడిపి వస్తున్నాం.

హోటల్ రూమ్‌కు బదులు చిన్న ఇంట్లో..



నా పేరు చైతన్య. విజయవాడలో వ్యాపారిని. నాకు పటాన్‌చెరులోని ముత్తంగిలో 1,600 గజాల స్థలం ఉంది. పని మీద హైదరాబాద్‌కు వచ్చినప్పుడు ఒక్రెండు రోజులో సిటీలో ఉండాల్సి వస్తుంది. లాడ్జిలో లేదా తెలిసిన వాళ్ల ఇళ్లల్లో ఉండే బదులు నా సొంత స్థలంలో చిన్నపాటి ఇల్లు కట్టించుకుంటే అయిపోతుంది కదా అనిపించింది. అలా 1,100 చ.అ మాడ్యులర్ హోమ్ కట్టించుకున్నా. చ.అ.కు రూ. 1,300 చొప్పున రూ.14.30 లక్షలు అయింది. ఇంటీరియర్, ఇతరత్రా వ్యయాలు కలిపి మొత్తం రూ.16 లక్షలు ఖర్చయింది. సిటీకి వచ్చినప్పుడల్లా ఇందులోనే ఉంటున్నా. స్థలాన్ని ఎవరైనా కబ్జా చేస్తారేమోనన్న భయం కూడా పోయింది.

ఫామ్‌హౌస్‌లలో డిమాండ్ ఉంది




కరోనా తర్వాతి నుంచి కంటైనర్ హోమ్స్‌కు డిమాండ్ ఏర్పడింది. చాలా మంది ఫామ్ ప్లాట్లను కొనుగోలు చేశారు. వాటిల్లో ఈ హోమ్స్‌ను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఫ్యామిలీకి అవసరమైన వసతులన్నీ ఈ కంటైనర్ హోమ్స్‌లో ఉంటుండటంతో వీకెండ్‌లో ఫ్యామిలీతో వచ్చి ఆహ్లాదకరమైన వాతావరణంలో గడుపుతున్నారు.

– భరత్ తేజ్, ఎండీ, అర్బన్ శాస్త్ర స్మార్ట్ బిల్డ్

- వీరశైవ లింగాయత్ కులాన్ని కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలని బీఆర్ఎస్ ఎంపీ బీబీ పాటిల్ డిమాండ్ చేశారు. జాతీయ స్థాయిలో గత 20 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యను పరిష్కరించాలని జాతీయ బీసీ కమిషన్(ఎన్సీబీసీ) చైర్మన్ హన్స్‌రాజ్ గంగారాం అహిర్‌ను కోరారు. గురువారం ఢిల్లీలో బీబీ పాటిల్ నేతృత్వంలో రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్, తెలంగాణ రాష్ట్ర వీరశైవ లింగాయత్ సమాజం ప్రతినిధులు ఎన్సీబీసీ కార్యాలయంలో హన్స్‌రాజ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. దీనిపై హన్స్‌రాజ్ సానుకూలంగా స్పందించారని పాటిల్ తెలిపారు.

అష్టావధాని అష్టకాల అస్తమయం


నరసింహరామ శర్మ

చిన్నకోడూరు (సిద్దిపేట): అవధాన సరస్వతి, విఖ్యాత సంస్కృతాంధ్ర పండితులు, అష్టావ ధాని, సరస్వతీ క్షేత్ర నిర్మాత, కవి, రచయిత అష్టకాల నరసింహరామశర్మ (80) బుధవారం రాత్రి గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. ఆధ్యాత్మిక గురువును కోల్పోవడం బాధాకరమంటూ ఆయన అకాల మరణం పట్ల సీఎం కేసీఆర్ ట్విట్టర్‌లో సంతాపం ప్రకటించారు. సాహితీవేత్తగా ఆయా రంగాల్లో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. అష్టకాల మృతిపట్ల మంత్రి హరీశ్‌రావు సంతాపం తెలిపారు. అష్టకాల ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా, అష్టావధానిగా, వాస్తు, జ్యోతిష్య పండితుడిగా సిద్దిపేట ప్రాంతంలో ప్రసిద్ధి చెందారు. సీఎం కేసీఆర్‌కు, మంత్రి హరీశ్‌రావుకు ఆయన అత్యంత ఆత్మీయులు. అవధానాలు చేస్తూ వచ్చిన డబ్బు, దాతల సహకారంతో సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం అనంతసాగర్ శివారులోని దట్టమైన అటవీ ప్రాంతంలో పదేళ్లపాటు శ్రమించి ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఆయన రోజు మాదిరిగానే బుధవారం ద్విచక్రవాహనంపై సరస్వతీ క్షేత్రానికి వెళ్లి వచ్చారు. రాత్రి 11 గంటల సమయంలో గుండె నొప్పిరావడంతో కుటుంబీకులు ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో మరోసారి గుండెపోటు రావడంతో అక్కడే కన్నుమూశారు. అష్టకాలకు భార్య రత్నాబాయి, నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. నేడు అనంతసాగర్ సరస్వతీ క్షేత్రం సమీపంలో అష్టకాల అంత్యక్రియలు జరుగుతాయి.

ఎన్నికలు ఉంటేనే సీఎం బయటికొస్తారు..



స్టేషన్‌ఘన్‌పూర్/రఘునాథపల్లి: సీఎం కేసీఆర్ దొర ఎన్నికలు వస్తేనే బయటకు వస్తారని, లేకుంటే ఫామ్ హౌస్‌కే పరిమితం అవుతారని వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. ఆమె చేపట్టిన ప్రజా ప్రస్థానం పాదయాత్ర గురువారం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్, రఘునాథపల్లి మండలాల్లో సాగింది. ఈ సందర్భంగా ఆయా చోట్ల ఆమె మాట్లాడుతూ ఈ ఏడాదిలో ఎన్నికలు వస్తాయని, కేసీఆర్ వచ్చి మళ్లీ పిట్టకథలు చెబుతారని అన్నారు. ఇప్పుడు దళితబంధు అని మోసం చేస్తున్నారని, ఈసారి బీసీ బంధు, ఎస్టీ బంధు అంటారని ఆరోపించారు. మళ్లీ కేసీఆర్ మాటలు నమ్మితే మిమ్మల్ని మీ బిడ్డలే క్షమించరని, ఈసారి కేసీఆర్ వస్తే కర్రు కాల్చి వాత పెట్టాలని ప్రజలను కోరారు. వైఎస్సార్‌టీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి సంతకం ఉద్యోగాల కల్పనపైనే ఉంటుందని, ఇళ్లు లేని ప్రతి పేద కుటుంబానికి మహిళ పేరిట పక్కా ఇళ్లు కట్టించి ఇస్తామన్నారు. ఇంట్లో ఎంతమంది వృద్ధులు ఉంటే అందరికీ రూ.3వేలు పెన్షన్‌ను అందిస్తామని అన్నారు.

తల్లి తలను నరికి.. ఆ తలతో అటూ ఇటూ తిరిగి..

ఓ కొడుకు రాక్షసత్వం

- ఆస్తి కోసం అమ్మను చంపి...
- చికెన్ కొట్టే కత్తితో తలను వేరు చేసి ఘాతుకం
- చెల్లికి భూమి రాసివ్వడమే కారణం
- పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన నిందితుడు
- పాల కోసం వెళ్లడంతో ప్రాణం దక్కించుకున్న సోదరి


రమణమ్మ (ఫైల్)


కన్నప్ప (ఫైల్)

జనగామ రూరల్: చెల్లికి భూమి రాసి ఇచ్చి.. తనకు మాత్రం భూమి ఇవ్వడం లేదన్న కక్షతో కన్నతల్లిని ఓ కొడుకు అత్యంత కర్కశంగా చంపేశాడు. చికెన్‌కొట్టే కత్తితో తల్లి మెడ నరికి తలను వేరు చేశాడు. అనంతరం నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. ఈ దారుణ ఘటన జనగామ జిల్లా జనగామ మండలం మరిగడి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం .. మరిగడి గ్రామానికి చెందిన కూరాకుల రాజయ్య, రమణమ్మలకు కుమారుడు కన్నప్ప, కూతురు లావణ్య ఉన్నారు. వీరికి పది ఎకరాల భూమి ఉంది. పదేళ్ల క్రితం రాజయ్య పక్షవాతంతో చనిపోయాడు. గతంలో చికెన్ దుకాణం నడిపిన కన్నప్ప రెండు నెలలుగా స్థానికంగా సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. కుమార్తె తన భర్తతో గొడవపడి మూడు నెలలనుంచి తల్లి వద్దే ఉంటోంది. ఈక్రమంలో కుమార్తెకు ఎలాంటి ఆధారం లేనందున ఉన్న భూమిలో కొంత ఇవ్వాలని తల్లి రమణమ్మ కొద్ది కాలంగా కుమారుడితో పట్టుబడుతోంది. ఇందుకు అతను సుముఖంగా లేకపోవడంతో పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడుకున్నారు. ఈ నేపథ్యంలో కన్నప్పకు తెలియకుండా గత నెల 30న కుమార్తెకు 4ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేసింది. విషయం తెలుసుకున్న కుమారుడు మిగిలిన భూమిని తనకు ఇవ్వాలని తల్లిని కోరాడు. ఇందుకు ఆమె ససేమిరా అంది. తాను బతికి ఉండగా ఆస్తిని ఇవ్వనని.. కుమారుడికి తెగేసి చెప్పడంతో కక్ష పెంచుకున్నాడు. నాలుగు రోజుల క్రితం ఇరువురూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోగా కుమారుడిపై కేసు కూడా నమోదైంది. ఈ క్రమంలో గురువారం ఉదయం చెల్లి లావణ్య పాల కోసం బయటకు వెళ్లింది. బైక్‌పై వచ్చిన కన్నప్ప వెంట తెచ్చుకున్న చికెన్ కొట్టే కత్తితో ఇంటిగడప వద్ద ఉన్న తల్లి రమణమ్మ (60) మెడపై నరికాడు. దీంతో ఆమె కుప్పకూలిపోయింది. ఆ తరువాత తలను వేరు చేసి దానిని పట్టుకుని ఇంటిముందు అటూ ఇటూ కాసేపు తిరిగాడు. అనంతరం బైక్‌పై వెళ్లి పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. జనగామ డీసీపీ సీతారాం, ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సీఐ, ఎస్సైలు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు.

క్లుప్తంగా...

ధరణిని ప్రక్షాళన చేయండి
రఘునందన్ రావు



సాక్షి, హైదరాబాద్: అనేక సమస్యలు సృష్టిస్తున్న ధరణిలో మార్పులు తీసుకురావాలని బీజేపీ శాసనసభ్యుడు రఘునందన్‌రావు ప్రభుత్వానికి సూచించారు. ఆయన గురువారం శాసనసభలో మాట్లాడుతూ పాత అసైన్డ్ భూములు, సాదా బైనామా ద్వారా కొన్న భూములు ధరణిలో నమోదు కావడం లేదని వివరించారు. వాటిని హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో నిషేధిత భూములుగా ధరణి చూపిస్తోందని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పద్దులపై ఆయన మాట్లాడుతూ, లక్షల్లో పెరిగిన అనాథ పిల్లల కోసం బడ్జెట్‌లో నిధి ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా కొన్ని పాఠశాలల ప్రస్తావన తెచ్చిన రఘునందన్.. అవి తమ పార్టీ చేపట్టినవిగా పేర్కొనడం సభలో వివాదం రేపింది. ఇది అప్రస్తుత ప్రసంగమంటూ మండిపడ్డ అధికార పక్ష సభ్యులు, పేరున్న పాఠశాలలకూ మతం రంగు పులమడం సరికాదని సూచించారు.

అప్పట్లో ఈ సౌకర్యం ఉంటే ఆరడుగుల ఎత్తు ఉండేవాడినేమో!: రసమయి



సాక్షి, హైదరాబాద్: అంబేడ్కర్ ఆశించిన తరహాలో దళితుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయని బీఆర్ఎస్ సభ్యుడు రసమయి బాలకిషన్ ప్రశంసించారు. శాసనసభలో గురువారం పద్దులపై జరిగిన చర్చలో సాంఘిక సంక్షేమంపై ఆయన మాట్లాడారు. ప్రస్తుతం దళితవాడల్లోని గర్భిణులకు పోషకాహారం అందుతోందని.. తాను తల్లి కడుపులో ఉన్నప్పుడు కూడా ఇలాంటి సౌకర్యం ఉంటే ప్రస్తుతం ఆరడుగుల ఎత్తు ఉండేవాడినేమోనని బాలకిషన్ వ్యాఖ్యానించారు. అప్పట్లో ఆమెకు తినేందుకే తిండిలేని పరిస్థితి.. ఇప్పుడు ఎవరైనా తనను 'ఏంది గింతంత ఉన్నవు'.. అంటే ఇదే అనిపిస్తుందని గుర్తుచేసుకున్నారు.

నాలుగు ఉమ్మడి జిల్లాల్లో బైకు యాత్ర చేస్తా
భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నల్లగొండ/ఇబ్రహీంపట్నం: దక్షిణ తెలంగాణలోని నాలుగు ఉమ్మడి జిల్లాల్లో తాను బైకు యాత్ర నిర్వహిస్తానని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. ఈ నెల 13న పార్లమెంట్ సమావేశాలు ముగుస్తాయని, ఆ తరువాత యాత్ర ప్రారంభిస్తానని వెల్లడించారు. బైకు యాత్ర అయితే ఎక్కువ గ్రామాలు తిరిగేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. గురువారం ఆయన నల్లగొండలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాల్లో యాత్ర ఉంటుందని, ఈ విషయం అధిష్టానానికి కూడా చెప్పానని వివరించారు. ధరణి పోర్టల్‌తో ఎంతో మంది ఇబ్బందులు పడుతున్నారని, రోజూ తహసీల్దార్, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని చెప్పారు. ప్రగతి భవన్‌పై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కోమటిరెడ్డి స్పందిస్తూ.. ప్రగతి భవన్ ప్రజల సొత్తని, అది కేసీఆర్‌ది కాదని అన్నారు. గతంలో వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రజా దర్బారు పెట్టి రోజూ సామాన్య ప్రజలను కలిసి వారి సమస్యలను పరిష్కరించారని చెప్పారు. ఆనాడు వైఎస్ రాజశేఖరరెడ్డి పేదల కోసం ఆరోగ్యశ్రీ, 104, 108 వంటి పథకాలను పెడితే తెలంగాణ ప్రభుత్వం వాటిని నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. 108, 104లో పనిచేసే ఉద్యోగులకు కూడా నెలల తరబడి వేతనాలు ఇవ్వడం లేదన్నారు. కాగా, హైదరాబాద్– విజయవాడ హైవే విస్తరణకు ప్రధాన మంత్రిని కలిసి ఓకే చేయించానని వెంకట్‌రెడ్డి చెప్పారు. దీని కోసం రూ.1,600 కోట్లు మంజూరు చేయడానికి ఆయన అంగీకరించారని, త్వరలో పనులు ప్రారంభం అవుతాయని చెప్పారు.

'రైతులు క్వింటాలుకు 8 కిలోలు నష్టపోతున్నారు'



సాక్షి, హైదరాబాద్: కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం విక్రయిస్తున్నప్పటికీ, మిల్లర్ల పెత్తనంతో క్వింటాలుకు 7–8 కిలోల ధాన్యాన్ని నష్టపోతున్నారని మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆందోళన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతు ధాన్యం విక్రయించగానే వాహనాలకు ట్రిప్ షీట్ ఇవ్వకపోవడంతో మిల్లర్లు రైతులను పిలిపించి సాకులు చూపుతూ క్వింటాలుపై 8 కిలోల వరకు ధాన్యాన్ని అదనంగా తీసుకుంటున్నారన్నారు. అసెంబ్లీలో గురువారం పద్దులపై చర్చ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పౌరసరఫరాల సంస్థ నుంచి తీసుకునే బియ్యానికి డబ్బులు చెల్లించకపోవడంతో రూ. 20వేల కోట్లు బకాయిలుగా పేరుకుపోయాయని, వాటిని వెంటనే చెల్లించాలన్నారు. రేషన్ కార్డుల జారీని ఎన్నికలకే పరిమితం చేయకుండా అర్హులకు కుటుంబాలకు అందజేయాలని కోరారు. ఎక్సైజ్ ఆదాయం కోసం బెల్టు షాపులను ప్రోత్సహిస్తున్నారని, వెంటనే వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

రూ.40 వేల కోట్లు నిలిపేసింది


కేవలం 2022-23 వార్షికంలోనే కేంద్రం నిలిపేసిన చెల్లింపుల మొత్తం అది..
- ఇలా ఎన్ని ఇబ్బందులు పెట్టినా ఒక్క పథకాన్నీ మేం ఆపలేదు...
- బడ్జెట్‌పై మండలిలో సాధారణ చర్చ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి టి.హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే అగ్రభాగాన ఉన్న తెలంగాణను దెబ్బ తీసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని రాష్ట్ర ఆర్థిక, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి టి. హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. 2022–23 వార్షిక సంవత్సరంలో వివిధ పద్దుల కింద రాష్ట్రానికి రావాల్సిన వాటాను కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నిలిపివేసి చోద్యం చూస్తోందని విమర్శించారు. ప్రస్తుత వార్షికంలో ఇప్పటివరకు దాదాపు రూ.40వేల కోట్లు నిలిపివేసి ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ఎన్ని అవాంతరాలు సృష్టించినా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఏ ఒక్క సంక్షేమ పథకాన్నీ ఆపలేదని స్పష్టం చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా గురువారం శాసనమండలిలో బడ్జెట్‌పై సాధారణ చర్చలో సభ్యులు లేవనెత్తిన అంశాలకు హరీశ్ సమాధానమిచ్చారు. రైతుబంధు, ఆసరా పథకాలను సమర్థవంతంగా అమలు చేశామని చెప్పారు. ప్రాధాన్యత క్రమంలో కొన్ని పథకాలకు నిధుల విడుదలలో ఆలస్యం జరిగిన మాట వాస్తవమేనన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగియడానికి మరో రెండు నెలల సమయం ఉన్నందున ఆలోపు అన్ని రకాల బకాయిలను క్లియర్ చేస్తామన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు సంబంధించి రూ.150 కోట్ల చెల్లింపులను అతి త్వరలో పూర్తి చేస్తామని, తాజా బడ్జెట్‌లోనూ ఈ పద్దులకు కేటాయింపులు పెంచినట్లు వెల్లడించారు.



రూ. 4.7 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ...

కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తోందని, దీంతో ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తోందని మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అణగారిన వర్గాల కోసం రాజ్యాంగం రిజర్వేషన్ల ద్వారా హక్కులు కల్పించిందని, ఇప్పుడు ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణతో ఆయా రిజర్వేషన్లు దక్కవన్నారు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు రూ.4.7లక్షల కోట్ల విలువైన ప్రభుత్వరంగ సంస్థలను కేంద్రం ప్రైవేటుపరం చేసిందన్నారు. రాష్ట్రంలోని సంస్థలను ప్రైవేటీకరిస్తే ప్రోత్సాహక నిధులు ఇస్తామని కేంద్రం ఒత్తిడి చేస్తోందని, సీఎం కేసీఆర్ ఈ ప్రైవేటీకరణకు పూర్తి వ్యతిరేకి అని స్పష్టం చేశారు. సంపద సృష్టించాలన్న నినాదంతో కేసీఆర్ అభివృద్ధి ఉద్యమం చేస్తుంటే మోదీ మాత్రం ఆస్తుల అమ్మకంతో దేశాన్ని తిరోగమన దిశలోకి నెట్టేస్తున్నారని విమర్శించారు. ప్రతి జిల్లాకు ఒక నవోదయ స్కూల్ ఇవ్వాలని సీఎం కేసీఆర్ ఢిల్లీలో మంత్రులకు విన్నవిస్తే ఇప్పటికీ గతి లేదన్నారు. ఇక విభజన చట్టం కింద రావాల్సిన బయ్యారం ఉక్కు కర్మాగారం ఊసే లేదని, గిరిజన వర్సిటీని పట్టించుకోవడం లేదని హరీశ్‌రావు మండిపడ్డారు.



ఉద్యోగుల రెండు డీఏలకు నిధులు కేటాయించాం...

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇటీవల ఒక డీఏను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, మరో రెండు డీఏలకు సంబంధించి తాజా బడ్జెట్లో నిధులు కేటాయించామని హరీశ్‌రావు వివరించారు. ముఖ్యమంత్రి సమీక్షించి అమలు తేదీలను ప్రకటిస్తారని తెలిపారు. కొత్త నియామకాలకు సంబంధించి ఉద్యోగులు విధుల్లో చేరితే వారికి అవసరమైన వేతనాల కోసం బడ్జెట్లో రూ.వెయ్యి కోట్లు కేటాయించామన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ సైతం ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అమలు చేస్తామని... ఈమేరకు నిధులు కూడా బడ్జెట్‌లో కేటాయించినట్లు మంత్రి వివరించారు. దళితబంధు లబ్ధిదారుల ఎంపికకు అతి త్వరలో మార్గదర్శకాలు జారీ చేస్తామన్నారు. కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు త్వరలోనే పదోన్నతులు, బదిలీలు చేపడతామని, ప్రభుత్వ టీచర్ల బదిలీల తర్వాత ఈ ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. గల్ఫ్ కార్మికుల కోసం ప్రత్యేక పథకాన్ని ఏర్పాటు చేసి రూ.100 కోట్లు కేటాయించాలని సభ్యుడు జీవన్‌రెడ్డి ప్రస్తావించారు. పాడి రైతుకు ప్రోత్సాహక నిధులను విడుదల చేయాలని కోరగా అతిత్వరలో చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు.

అసైన్డ్ భూములను లాక్కోవడం లేదు: హరీశ్

సాక్షి, హైదరాబాద్: ల్యాండ్ పూలింగ్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం బలవంతంగా అసైన్డ్ భూములను లాక్కోవట్లేదని మంత్రి టి.హరీశ్‌రావు స్పష్టం చేశారు. బడ్జెట్ పద్దులపై గురువారం అసెంబ్లీలో చర్చ సందర్భంగా ఈ అంశంపై ఈ మేరకు విపక్షాలు ఆరోపించగా వాటిలో వాస్తవం లేదని మంత్రి తోసిపుచ్చారు. అసైన్డ్ భూములకు ప్రభుత్వం రూ.70 లక్షల నుంచి రూ.కోటి పరిహారాన్ని రైతులకు ఇచ్చిందని, స్వచ్ఛందంగా ముందుకొచ్చి భూములిస్తేనే తీసుకుంటున్నామని చెప్పారు. సాగుకు యోగ్యంకాని అసైన్డ్ భూములనే తీసుకుంటున్నామన్నారు. కాగా, ఎస్టీల జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని ఓ బీజేపీ ఎంపీ ఇటీవల ప్రధాని మోదీని కలిశారని, ఇది ఆ పార్టీ విధానామా? లేక ఆ ఎంపీ వ్యక్తిగత అభిప్రాయమో చెప్పాలని గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ డిమాండ్ చేశారు. బీజేపీ ఎంపీ సోయం బాపురావు పేరును నేరుగా ప్రస్తావించకుండా పరోక్షంగా ఆయన తీరును తప్పుబట్టారు. ఒకవేళ ఈ చర్య ఆ ఎంపీ వ్యక్తిగత అభిప్రాయమైతే ఆయనను బీజేపీ నుంచి సస్పెండ్ చేయాలని, లేకుంటే బీజేపీ క్షమాపణ చెప్పాలని కోరారు.

పంటలకు సకాలంలో | కరెంట్ ఇవ్వాలి

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు భట్టి, శ్రీధర్‌బాబు, సీతక్క, జగ్గారెడ్డి డిమాండ్

సాక్షి, హైదరాబాద్: పంటలు కాపాడుకోవడానికి రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం గొప్పలు చెప్పకుండా సకాలంలో పంటలకు కరెంట్ ఇవ్వాలని టీపీసీసీ నేతలు డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగానికి విద్యుత్ సరఫరా అంశంపై అసెంబ్లీలో చర్చించాలన్న తమ విజ్ఞప్తిని స్పీకర్ మన్నించనందుకు నిరసనగా గురువారం కాంగ్రెస్ ఎమ్మెల్యేలు భట్టి విక్రమార్క, డి.శ్రీధర్‌బాబు, సీతక్క, జగ్గారెడ్డి సభ నుంచి వాకౌట్ చేశారు. అనంతరం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద నిరసన తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ కోతలతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఉచితంగా 24 గంటలు కరెంట్ ఇస్తున్నామని ప్రభుత్వం డాంబికాలు చెబుతున్నా.. కనీసం 4–5 గంటలు కూడా కరెంట్ ఇవ్వట్లేదని ధ్వజమెత్తారు. ఆ కరెంట్ కూడా ఎప్పుడు ఏ సమయానికి ఇస్తున్నారో చెప్పలేని పరిస్థితి రాష్ట్రవ్యాప్తంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల ఇబ్బందుల గురించి మాట్లాడటానికి సమయం ఇవ్వాలని సభలో పదేపదే కోరినా పట్టించుకోలేదన్నారు. తమ వైపు స్పీకర్ కనీసం చూడకుండా వాయిదా తీర్మానాన్ని తిరస్కరించినందుకు బయటకు వచ్చామన్నారు. వ్యవసాయానికి 24 గంటల పాటు నిరవధికంగా ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని, విద్యుత్ కోతలపై సభలో చర్చ జరగాలన్నారు.



అసెంబ్లీ ఆవరణలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న భట్టి, జగ్గారెడ్డి, సీతక్క

పరులపాలు కానివ్వం

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్రానికి కేటాయించాలంటూ సీఎం కేసీఆర్ పలుమార్లు ప్రధానికి, కేంద్రానికి లేఖలు రాశారని తెలిపారు. ఈ నాలుగు గనులను వేలానికి పెడతామని, అందులో రాష్ట్రప్రభుత్వం కూడా పాల్గొనాలని కేంద్రం సూచించడం విడ్డూరంగా ఉందన్నారు. గురువారం అసెంబ్లీలో గనుల రాబడిలో పెరుగుదలపై సభ్యులు బాల్క సుమన్, కోరుకంటి చందర్, రోహిత్‌రెడ్డి వేసిన ప్రశ్నకు కేటీఆర్ సమాధానమిచ్చారు. బయ్యారం స్టీల్‌ఫ్యాక్టరీ ఏర్పాటు విషయమై కేంద్రాన్ని ఎన్నిసార్లు సంప్రదించినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా ద్వారా కేంద్రం ఉక్కు పరిశ్రమ పెట్టేందుకు ముందుకు రాకపోవడంతో రాష్ట్రమే ప్రత్యామ్నాయ మార్గాల గురించి ఆలోచిస్తోందని కేటీఆర్ చెప్పారు. ఇటీవల దావోస్‌లో దీనిపై జిందాల్, మిత్తల్ సంస్థల ప్రతినిధులతో ప్రాథమికంగా చర్చించామన్నారు. పదేళ్ల కాంగ్రెస్ హయాంలో ఇసుక ద్వారా రూ.39.40 కోట్ల ఆదాయమొస్తే, తెలంగాణ ఏర్పడ్డాక రూపొందించిన ఇసుక పాలసీ వల్ల ఏడాదికే రూ.800 కోట్ల ఆదాయం సమకూరిందన్నారు.

రహదారులపై ప్రార్థనాస్థలాల తొలగింపునకు చట్టం

హైదరాబాద్‌లో రోడ్లకు అడ్డంగా ఉన్న ప్రార్థనాస్థలాల తొలగింపునకు రాష్ట్ర ప్రభుత్వం చట్టం తెచ్చే యోచనలో ఉందని కేటీఆర్ వెల్లడించారు. ఏ దేవుడూ లేదా భక్తులూ దుమ్ము, ధూళిలో ఉండాలని అనుకోరని అన్నారు. నరేంద్రమోదీ సీఎంగా ఉండగా గుజరాత్‌లో రోడ్లకు అడ్డంగా ఉన్న మతపరమైన కట్టడాలను తొలగించేందుకు చట్టం తీసుకువచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. బుధవారం అసెంబ్లీలో నగరంలో వ్యూహాత్మక రోడ్ల అభివృద్ధి కార్యక్రమం(ఎస్ఆర్‌డీపీ)పై నగర ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, అరెకపూడి గాంధీ వేసిన ప్రశ్నల సందర్భంగా డి.సుధీర్‌రెడ్డి ఈ అంశాన్ని ప్రస్తావించారు. ఈ ప్రస్తావనపై కేటీఆర్ పైవిధంగా స్పందించారు.

రక్షణ భూములపై కేంద్రం తీరు సిగ్గుచేటు

నగరంలోని కొన్నిచోట్ల రోడ్ల విస్తరణ, అభివృద్ధి కోసం రక్షణ శాఖ భూములు కేటాయించాలని ఎనిమిదిన్నరేళ్లుగా కోరుతున్నా కేంద్రం సహకరించకపోవడం సిగ్గుచేటని కేటీఆర్ అన్నారు. సాంకేతికంగా చూస్తే ఈ రక్షణ భూములను ఆ శాఖకు కేటాయించలేదని, రాష్ట్రం అనుకుంటే వీటి విషయంలో న్యాయపరమైన చిచ్చుపెట్టే అవకాశమున్నా దేశ రక్షణ దృష్ట్యా తమకు అలాంటి ఆలోచన లేదని స్పష్టం చేశారు. జూబ్లీ బస్‌స్టాండ్ వైపు, ఇతర చోట్ల రక్షణ శాఖ భూముల కారణంగా రోడ్ల విస్తరణ సాధ్యం కావడం లేదని, కేంద్రం ఈ భూములు ఇవ్వకపోతే డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్లు కట్టాలనే ఆలోచన ప్రభుత్వానికి ఉందన్నారు.

త్వరలో రెండోదశ ఎస్ఆర్‌డీపీ

నగరంలో త్వరలోనే రెండోదశ ఎస్ఆర్‌డీపీ కింద రూ.4,305 కోట్ల వ్యయంతో 36 రోడ్ల పనులు చేపడుతున్నట్టు కేటీఆర్ తెలిపారు. మొదటిదశలో ఇప్పటికే 48 పనులకుగాను 11 మినహా మిగతా పూర్తయ్యాయని చెప్పారు. నగర ప్రజల ట్రాఫిక్ కష్టాలు తీర్చేందుకు ప్రభుత్వం అన్నిరకాల చర్యలు తీసుకుంటోందని మంత్రి వివరించారు.

దావోస్ పర్యటనతో రూ. 21,400 కోట్ల పెట్టుబడులు

తెలంగాణ ప్రగతిశీల నిర్ణయాలకు సంకేతంగా దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సులో ఈ ఏడాది రూ. 21,400 కోట్ల మేర పెట్టుబడులను ఆకర్షించినట్లు కేటీఆర్ చెప్పారు. రాష్ట్రంలో డేటా సెంటర్లు, లైఫ్‌సైన్సెస్, బ్యాటరీ తయారీ, ఎఫ్ఎంసీజీ, జీసీసీ వంటి వివిధ రంగాల్లో ఈ పెట్టుబడులను రాబట్టినట్లు తెలిపారు. మొత్తం ఐదు పర్యాయాల దావోస్ పర్యటనలు కలిపి దాదాపు 47 బిలియన్ డాలర్ల మేర రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చాయన్నారు. వివిధ విదేశీ కంపెనీల పెట్టుబడులకు అదనంగా నాలుగవ పారిశ్రామిక విప్లవంలో భాగంగా హైదరాబాద్‌లో ఆరోగ్య సంరక్షణ, లైఫ్ సైన్సెస్‌పై దృష్టి సారిస్తూ ప్రపంచ ఆర్థిక వేదిక ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేయబోతోందన్నారు.

సీఎం కేసీఆర్‌తో | కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి భేటీ

- అసెంబ్లీలో కలసి సమస్యలపై వినతిపత్రం ఇచ్చిన సంగారెడ్డి ఎమ్మెల్యే
- నేను దొంగచాటుగా కలవలేదు.. నియోజకవర్గ సమస్యల కోసమే కలిశా: జగ్గారెడ్డి

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్‌తో సంగారెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి భేటీ అయ్యారు. గురువారం అసెంబ్లీ హాల్‌లో సీఎంను కలసి మాట్లాడిన ఆయన.. ఆ తర్వాత లాబీల్లోని సీఎం చాంబర్‌లోనూ కలిశారు. కాగా, ఈ భేటీ రాజకీయ చర్చకు దారితీసింది. సీఎంను కలసిన అనంతరం ఆయన మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ తాను దొంగచాటుగా ముఖ్యమంత్రిని కలవలేదని పేర్కొన్నారు. తాను సీఎం కేసీఆర్‌ను అసెంబ్లీ హాల్‌లోనే కలిశానని, ఆ తర్వాత ఆయన చాంబర్‌లో టైం ఇవ్వడంతో అక్కడకు వెళ్లి నియోజకవర్గ సమస్యల గురించి మాట్లాడానని జగ్గారెడ్డి చెప్పారు. ప్రధానమంత్రిని కాంగ్రెస్ ఎంపీలు కలుస్తారని, అలాగే ఎమ్మెల్యేగా తాను కూడా సీఎంను కలిశానని అన్నారు. మియాపూర్ నుంచి సంగారెడ్డి, సదాశివపేట వరకు మెట్రో రైలు మంజూరు చేయాలని వినతిపత్రం ఇచ్చానని, దళితబంధు పథకం కోసం తన నియోజకవర్గంలోని 550 మంది అర్హుల జాబితా ఇచ్చానని, మహబూబ్ సాగర్ చెరువును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని, ఇందుకోసం రూ.200 కోట్లు కేటాయించాలని అడిగానని చెప్పారు. అలాగే సిద్ధాపూర్‌లో 5వేల మందికి, కొండాపూర్ ఆలియాబాద్‌లో 4వేల మందికి ఇళ్లను అప్పగించాలని కూడా సీఎంను కోరినట్టు చెప్పారు. ఇవే వినతిపత్రాలను మంత్రి కేటీఆర్‌కు కూడా ఇచ్చానని తెలిపారు. తన వినతులపై సీఎం కేసీఆర్ సానుకూలంగా స్పందించారని చెప్పిన జగ్గారెడ్డి, నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించేందుకు మరోమారు టైం ఇవ్వాలని సీఎంను కోరానని, ప్రగతిభవన్‌లో సమయం ఇస్తే వచ్చి కలుస్తానని చెప్పానని వెల్లడించారు.

రైతులకు మేలు చేసేందుకే ధరణి

- శాసనసభలో మంత్రి వేముల
- 13 లక్షల ఫిర్యాదులొస్తే 12 లక్షలు పరిష్కారం
- రెండేళ్లలో 24 లక్షల లావాదేవీలు



సాక్షి, హైదరాబాద్: వివాదాల్లేకుండా, భూ రికార్డులను భద్రపర్చి రైతులకు మేలు చేసేందుకే ధరణి పోర్టల్ తీసుకొచ్చామని శాసనసభా వ్యవహారాల మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ధరణిలో భూమి నమోదు కాలేదని ఇప్పటివరకూ 13 లక్షల ఫిర్యాదులొస్తే 12 లక్షలు పరిష్కరించినట్టు చెప్పారు. రైతుకు తన భూమిపై పూర్తి హక్కు కల్పించే ధరణిని విపక్షాలు అడ్డుకోవడం విడ్డూరమన్నారు. గురువారం శాసనసభలో పలు పద్దులపై చర్చకు మంత్రి సమాధానమిచ్చారు.

పైరవీకారుల రాజ్యాన్ని తెచ్చేందుకే..

రైతులను పీడించే పైరవీకారుల రాజ్యాన్ని మళ్లీ తెచ్చేందుకే కాంగ్రెస్ పార్టీ ధరణిని వ్యతిరేకిస్తోందని ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. సాదా బైనామా ద్వారా భూమి రికార్డుల్లోకి ఎక్కించేందుకు 2016లోనే కాకుండా 2020లోనూ అవకాశం కల్పించామని, ఈ దశలోనే కోర్టు కేసు వల్ల ఇది ఆగిపోయిందన్నారు. ఈ రెండేళ్లలో ధరణి ద్వారా 24 లక్షల లావాదేవీలు జరిగాయని, కేవలం 15 నిమిషాల్లోనే లావాదేవీ పూర్తవుతోందని తెలిపారు. ధరణిలో 33 మాడ్యూల్స్ ఇవ్వడం వల్ల, ప్రతి గ్రామంలోనూ సమస్య పరిష్కారం దిశగా కృషి చేయడం వల్ల సమస్యలు తగ్గుతున్నాయని చెప్పారు.

58, 92 జీవోల ద్వారా క్రమబద్ధీకరణ

125 గజాలున్న 1.25 లక్షల మంది పేదలకు 58 జీవో ద్వారా ఇళ్ళ జాగాలను క్రమబద్ధీకరించామని, ఇళ్ళు కట్టుకున్న 36 వేల మంది పేదలకు 59 జీవో ద్వారా క్రమబద్ధీకరణ చేశామని ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ ఎల్‌బీ నగర్‌లో భవంతులు ఉన్న 44 కాలనీల్లో రెగ్యులైజేషన్ చేపట్టి, యజమానుల్లో ఆందోళన తగ్గించామని చెప్పారు. 2.92 లక్షల మందికి డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలన్నది ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో 1.38 లక్షలు పూర్తి చేశామని, మరో 45 వేలు 90 శాతం పూర్తయ్యాయని, 35 వేలు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. ఈ పథకానికి రూ. 11,639 కోట్లు ఖర్చవుతుంటే కేంద్రం ఇచ్చింది కేవలం రూ.1,311 కోట్లు మాత్రమేనన్నారు.

వక్ఫ్ భూములు పరిరక్షిస్తాం

ఆదాయంలో రిజిస్ట్రేషన్ల శాఖ 3వ స్థానంలో ఉందని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. వక్ఫ్ భూముల పరిరక్షణకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఇందుకు సంబంధించిన న్యాయపరమైన చర్యలు చేపట్టిందని చెప్పారు. ప్రతి గ్రామంలోనూ రోడ్ల మరమ్మతు పనులు చేస్తున్నామని, గ్రామం నుంచి మండలానికి బీటీ రోడ్డు, మండలం నుంచి జిల్లాకు డబుల్ రోడ్డు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన చెప్పారు.

'మండలి' డిప్యూటీ చైర్మన్‌గా బండా ప్రకాశ్!

- ఏడాదిన్నర తర్వాత శాసన మండలికి డిప్యూటీ చైర్మన్
- నేడు నోటిఫికేషన్, 11న నామినేషన్, 12న ఎన్నిక
- అదే రోజు కొత్త డిప్యూటీ చైర్మన్ బాధ్యతల స్వీకరణ
- త్వరలో మండలి చీఫ్ విప్, విప్‌ల నియామకం?



సాక్షి, హైదరాబాద్: సుమారు ఏడాదిన్నరగా ఖాళీగా ఉన్న శాసన మండలి డిప్యూటీ చైర్మన్ ఎన్నికకు రంగం సిద్ధమైంది. ఈ ఎన్నికకు సంబంధించి శుక్రవారం నోటిఫికేషన్ వెలువడనుండగా, 11వ తేదీన నామినేషన్ల స్వీకరణ, పరిశీలన తదితరాలు పూర్తి చేస్తారు. 12న ఉదయం 10 గంటలకు శాసన మండలి ప్రారంభమైన అనంతరం డిప్యూటీ చైర్మన్ ఎన్నిక ప్రక్రియను పూర్తి చేసి బాధ్యతలు అప్పగిస్తారు. కాగా శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌గా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ బండా ప్రకాశ్ ముదిరాజ్ ఎన్నిక దాదాపు ఖాయమైంది. ఆయన పేరును బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఖరారు చేశారు. దీంతో ఈ నెల 11న శాసన మండలి డిప్యూటీ చైర్మన్ ఎన్నికకు సంబంధించి నామినేషన్ పత్రాలు దాఖలు చేసేందుకు బండా ప్రకాశ్ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం నుంచి శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌గా వ్యవహరించిన నేతి విద్యాసాగర్ 2021 జూన్ 3న ఎమ్మెల్సీగా తన పదవీ కాలం పూర్తి చేసుకున్నారు. అప్పటి నుంచి శాసన మండలి డిప్యూటీ చైర్మన్ పదవికి ఎన్నిక జరగకపోవడంతో సుమారు ఏడాదిన్నరగా ఖాళీగా ఉంది. ఇదిలా ఉంటే 2018 మార్చిలో బీఆర్ఎస్ తరఫున రాజ్యసభకు ఎన్నికైన బండా ప్రకాశ్ ఎంపీగా ఆరేళ్ల పదవీ కాలం పూర్తి చేయకుండానే 2021 నవంబర్‌లో ఎమ్మెల్యే కోటాలో శాసన మండలికి ఎన్నికయ్యారు. అనంతరం 2021 డిసెంబర్ మొదటి వారంలో బండా ప్రకాశ్ తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఇదిలా ఉంటే ప్రస్తుతం శాసన మండలిలో డిప్యూటీ చైర్మన్‌తో పాటు ప్రభుత్వ చీఫ్‌విప్, మరో రెండు విప్ పదవులు కూడా ఖాళీగా ఉన్నాయి. స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్ ఒక్కరే ప్రస్తుతం మండలిలో ప్రభుత్వ విప్‌గా వ్యవహరిస్తున్నారు. డిప్యూటీ చైర్మన్ ఎన్నిక ముగిశాక మండలి చీఫ్ విప్, విప్ పదవుల భర్తీ జరుగుతుందని బీఆర్ఎస్ వర్గాలు చెప్తున్నాయి.

వక్ఫ్‌భూములు ఎవరి జాగీర్లు కావు

- భూ చట్టాల పేరిట ముస్లింలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలి
- బీసీలకు కేటాయించిన బడ్జెట్ ఖర్చు చేయడంలో అన్యాయం
- ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వక్ఫ్ భూములు ఎవరివో తెలియని పరిస్థితి నెలకొందని ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ ఆందోళన వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పటి నుంచి భూ చట్టాల పేరిట ముస్లింలు భూములు కోల్పోయారని, ఇనాం భూములు, జాగీర్ భూములు పోయి పేదలుగా మారారని, వారికి జరిగిన అన్యాయాన్ని సవరించాలని కోరారు. వక్ఫ్ భూముల పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అసెంబ్లీలో బడ్జెట్ పద్దులపై జరిగిన చర్చ సందర్భంగా అక్బరుద్దీన్ మాట్లాడుతూ వక్ఫ్ భూములెవరి జాగీర్లు కావని, దేవుడి ఆస్తి అని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని వక్ఫ్‌భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టారని ఆరోపించారు. ప్రస్తుతం వక్ఫ్‌భూముల్లో రూ.100, రూ 200తో అద్దెలకు ఉంటున్న వారు ఆ అద్దెలను కూడా చెల్లించడం లేదని, సంవత్సరాలుగా తిష్టవేశారన్నారు. వక్ఫ్, దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న కొన్ని భూముల పత్రాలు పర్షియన్ భాషలోఉన్నాయని, వాటిని ట్రాన్స్‌లేట్ చేయించాలని కోరారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్, ఉన్నత విద్యా కమిటీలలో ముస్లింలకు ప్రాతినిధ్యం కల్పించాలని అక్బరుద్దీన్ కోరారు. బీసీల సంక్షేమం విషయంలో ప్రభుత్వం పట్ల అసంతృప్తి నెలకొందని, గత ఏడాది బడ్జెట్‌లో రూ.6వేల కోట్లు కేటాయిస్తే కేవలం రూ.417 కోట్లు మాత్రమే ఖర్చు చేశారన్నారు. 2014 నుంచి 2023 వరకు బీసీల సంక్షేమానికి అయిన ఖర్చు అసంతృప్తిని మిగిల్చిందని, ఈసారి బీసీలకు బడ్జెట్ కేటాయింపులకు అనుగుణంగా నిధులు విడుదల చేయాలని కోరారు. దళితబంధు తరహాలో బీసీబంధు చేపట్టాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో సంక్షేమ పథకాలు భేష్

రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో చేసిన కేటాయింపుల పట్ల పూర్తి సంతృప్తి వ్యక్తం చేసిన అక్బరుద్దీన్ ఒవైసీ... రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమ పథకాలను కొనియాడారు. ఏ రాష్ట్రంలో లేనివిధంగా ముస్లిం మైనారిటీల సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఉర్దూను రెండో అధికారిక భాషగా ప్రకటించిన రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. ముస్లింలకు ప్రతినిధిగా వ్యవహరిస్తున్నప్పటికీ తాను హిందూ, క్రిస్టియన్, సిక్కులు తదితర అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం పనిచేస్తున్నట్లు అక్బరుద్దీన్ చెప్పారు.

50 సీట్లలో పోటీపై | సరైన సమయంలో నిర్ణయం

- ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ
- అసెంబ్లీలో కేటీఆర్‌తో భేటీ
- తాజ్‌మహల్ కంటే అందంగా తెలంగాణ సెక్రటేరియట్ ఉందంటూ ప్రశంస



సాక్షి, హైదరాబాద్: వచ్చే శాసనసభ ఎన్నికల్లో తెలంగాణలో 50 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసే అంశంపై సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటామని ఏఐఎంఐఎం అధినేత, లోక్‌సభ సభ్యులు అసదుద్దీన్ ఒవైసీ వెల్లడించారు. ఎన్నికలకు చాలా సమయం ఉందని అంటూనే అక్టోబర్ నాటికి నిర్ణయం తీసుకుంటామనే అభిప్రాయం వ్యక్తం చేశారు. రాష్ట్ర అసెంబ్లీ వార్షిక బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో అసదుద్దీన్ ఒవైసీ గురువారం రాత్రి అసెంబ్లీకి వచ్చారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావుతో భేటీ అనంతరం మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ చేశారు. కేసీఆర్ జాతీయ రాజకీయాల్లోకి రావడం మంచి పరిణామమని పేర్కొంటూ, తెలంగాణలో బీఆర్ఎస్ పాలన బాగుందని కితాబునిచ్చారు. బీఆర్ఎస్ దేశవ్యాప్తంగా విస్తరించి జాతీయ రాజకీయాల్లోకి రావడం మంచిదేనని అసదుద్దీన్ అన్నారు. ఎంఐఎం పార్టీ బీజేపీకి బీ టీమ్ అంటూ కాంగ్రెస్ నేతలు ప్రచారం చేస్తున్నారని, తాము ఎవరికీ బీ టీమ్ కాదన్నారు. బీజేపీని ఓడించాల్సిన అవసరముందన్నారు. అదానీ అంశంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలనే డిమాండ్‌కు ప్రధాని మోదీ ఒప్పుకోవడం లేదని చెప్పారు. తాజ్‌మహల్ కంటే అందంగా తెలంగాణ కొత్త సచివాలయాన్ని కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిందని ప్రశంసించారు. ఈ నెల 17న జరిగే సచివాలయం ప్రారంభోత్సవం అధికారిక కార్యక్రమం అయినందున తాము కూడా వెళ్తామన్నారు. అయితే సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జరిగే బహిరంగ సభతో తమ పార్టీకి సంబంధం లేదన్నారు. పరేడ్ మైదానంలో జరిగే బహిరంగ సభకు ఇతర పార్టీలను ఆహ్వానించడం బీఆర్ఎస్‌కు సంబంధించిన విషయమని ఎంపీ అసదుద్దీన్ వ్యాఖ్యానించారు. మండలి స్థానిక సంస్థల కోటా ఎన్నికలో తమ పార్టీ అభ్యర్థికి బీఆర్ఎస్ మద్దతు కోరేందుకు సమయముందని, కేటీఆర్‌తో భేటీలో ఈ అంశం ప్రస్తావనకు రాలేదని చెప్పారు.

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ షెడ్యూల్‌పై చర్చ

మండలి స్థానిక సంస్థల కోటాలో హైదరాబాద్ నుంచి ఎన్నికైన ఎంఐఎం ఎమ్మెల్సీ సయ్యద్ అమీనుల్ హసన్ జాఫ్రీ పదవీకాలం మేలో ముగియనుంది. ఖాళీగా ఉన్న స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ స్థానం ఎన్నికకు షెడ్యూల్ ప్రకటన నేపథ్యంలో మంత్రి కేటీఆర్‌తో అసద్ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రస్తుతం మండలిలో ఎంఐఎంకు ఇద్దరు సభ్యులుండగా, రెండు స్థానాలూ గతంలో బీఆర్ఎస్ మద్దతుతోనే సాధించింది. ప్రస్తుతం జీహెచ్ఎంసీలో బీఆర్ఎస్ సంఖ్యాపరంగా అతిపెద్ద పార్టీ కావడంతో మళ్లీ ఈ స్థానాన్ని తమకు కేటాయించాలని కోరేందుకు ఆయన అసెంబ్లీకి వచ్చినట్లు సమాచారం. కాగా స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ స్థానంలో ఎంఐఎంకు మద్దతుకు సంబంధించి బీఆర్ఎస్ ఒకట్రెండు రోజుల్లో వైఖరి వెల్లడించే అవకాశమున్నట్లు తెలిసింది.

సాక్షి హైదరాబాద్

శుక్రవారం ၊ 10 ၊ ఫిబ్రవరి ၊ 2023



అడ్డదారి తొక్కిన విద్యార్థులు వందల్లో

యూనివర్సిటీల్లో ప్రవేశానికి తొలి మెట్టుగా భావించే టోఫెల్, జీఆర్ఈ ఆన్‌లైన్ పరీక్షల్ని అడ్డ దారిలో క్లియర్ చేసుకున్న విద్యార్థుల సంఖ్య వందల్లోనే ఉందని పోలీసులు గుర్తించారు.

-10లో



జాగ్వర్ వాహన నమూనా ప్రదర్శన

బంజారాహిల్స్: జాగ్వర్ ఎలక్ట్రికల్ ఫార్ములా ఈ రేస్ వాహన నమూనాను బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణ హోటల్‌లో ప్రదర్శించారు. రేసర్లు సాంబర్డ్, మిచ్ ఎవాన్స్ పాల్గొన్నారు.

నేడు పలు ఎంఎంటీఎస్ రైళ్లు రద్దు

సాక్షి, సిటీబ్యూరో: నిర్వహణపరమైన కారణాల దృష్ట్యా నగరంలోని పలు రూట్‌లలో శుక్రవారం 19 ఎంఎంటీస్ సర్వీసులను రద్దు చేయనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు లింగంపల్లి-నాంపల్లి, ఫలక్‌నుమా-లింగంపల్లి, నాంపల్లి-లింగంపల్లి, ఫలక్‌నుమా-రామచంద్రాపురం, ఫలక్‌నుమా-నాంపల్లి, రూట్లలో రాకపోకలు సాగించే రైళ్లు రద్దు కానున్నాయి.

న్యూస్‌రీల్

పిల్లల సమాచారం కోసం ట్రాక్ చైల్డ్ 3.0

సాక్షి, సిటీబ్యూరో: ఆర్పీఎఫ్ ద్వారా రక్షించిన పిల్లల సమాచారం కోసం ట్రాక్ చైల్డ్ 3.0 పోర్టల్‌ను ప్రారంభించినట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే ప్రాంగణంలో ఆపదలో ఉన్న పిల్లల సంరక్షణ, భద్రత, కోసం రైల్వే, మహిళా,శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖలు సంయుక్తంగా ఈ ట్రాక్ చైల్డ్ పోర్టల్ 3.0 కార్యక్రమాన్ని చేపట్టాయి. తప్పిపోయిన పిల్లల వివరాలతో పాటు, ఆర్పీఎఫ్ కాపాడిన పిల్లల వివరాలు కూడా ఈ పోర్టల్‌లో లభిస్తాయి. అలాగే భారతీయ రైల్వే అధికారిక వెబ్‌సైట్‌లో ట్రాక్ చైల్డ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. కుటుంబ సభ్యులు పోర్టల్ ద్వారా వివరాలు తెలుసుకోవచ్చు. రైళ్లు, రైల్వే స్టేషన్‌లు, రైల్వే ప్రాంగణాల్లో తప్పిపోయిన పిల్లలను రక్షించే ప్రక్రియలో భాగంగా ఆర్పీఎఫ్ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

ట్రాఫిక్ సిబ్బంది ఎక్కడ?

హిమాయత్‌నగర్: నగరం నడిబొడ్డున ఉన్న హిమాయత్‌నగర్ ధర్నాలు, నిరసనలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. నిత్యం పలు యూనియన్ నాయకులు ధర్నాలు నిర్వహించడం, రాస్తారోకో, రోడ్డుపై నిరసనలు, దిష్టిబొమ్మలు దహనం చేయడం వంటివి ఇక్కడ పరిపాటిగా మారాయి. ఓ పక్క ఆందోళనకారుల్ని అదుపు చేయడం.. మరోపక్క బారులు తీరిన ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయడం ఈ రెండు పనుల్ని నారాయణగూడ శాంతిభద్రతల పోలీసులే చేస్తుండటం గమనార్హం. హిమాయత్‌నగర్ లిబర్టీ సర్కిల్ నుంచి రోడ్డుకు ఇరువైపులా నల్లకుంట, అంబర్‌పేట, చే నంబర్ వరకు ట్రాఫిక్ జాం అవుతోంది. అయినా ఇక్కడి నారాయణగూడ ట్రాఫిక్ పోలీసులు మాత్రం పట్టించుకోవడంలేదని, చలాన్ల బిజీలోనే వీరు నిమగ్నమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం సెకండ్ ఏఎన్ఎంలు చేసిన నిరసనతో భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడింది. నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి మార్గంలో ఓ అంబులెన్స్ చిక్కుకుంది. ఇప్పటికైనా ట్రాఫిక్ సిబ్బంది ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

గన్ కలిగి ఉన్న వ్యక్తి అరెస్టు

శామీర్‌పేట్: గన్ (తుపాకీ, తపంచా) వాడుతున్న వ్యక్తిని శామీర్‌పేట పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పేట్‌బషీరాబాద్ ఏసీపీ రామలింగరాజు వివరాలు వెల్లడించారు. సిద్దిపేట జిల్లా కర్కపట్లకు చెందిన శ్రీకాంత్ (25)కు జేసీబీ ఉంది. ఉద్దమర్రి వైన్స్ షాపు ఘటనలో ఎ-3 నిందితుడైన నమూస్ మహ్మద్ ఏడాది కాలంగా ఇతని వద్ద జేసీబీ ఆపరేటర్ (డ్రైవర్)గా పని చేస్తున్నాడు. జేసీబీతో పని చేయించుకున్న కొందరు వ్యక్తులు డబ్బులు చెల్లించడంలో ఇబ్బందులు పెడుతున్నారని, వారి వద్ద నుంచి ఎలాగైన డబ్బులు వసూలు చేయాలని భావించిన శ్రీకాంత్ గన్ కొనుగోలు చేయాలనుకున్నాడు. ఈ క్రమంలో జేసీబీ ఆపరేటర్‌గా పని చేస్తున్న రాజస్థాన్‌కు చెందిన నమూస్ ఖాన్ సహాయంతో రాజస్థాన్ నుంచి ఈ ఏడాది జనవరి రెండో వారంలో రూ.25 వేలకు గన్, 4 రౌండ్ల తూటాలను కొనుగోలు చేశాడు. గన్ పని చేస్తుందో లేదో అని తనిఖీ చేసేందుకు శ్రీకాంత్ అటవీ ప్రాంతానికి వెళ్లి మూడు రౌండ్లు కాల్చాడు. గత నెల 23న జరిగిన ఉద్దమర్రిలోని వైన్ షాపు ఘటనలో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ జరిపారు. ఎ- 3 నిందితుడైన సమూస్ మహ్మద్ రాజస్థాన్‌లో ఉండే తన స్నేహితుడైన నజీర్ నుంచి గన్ (తపంచా)ను కొనుగోలు చేసినట్లు వెల్లడైంది. గురువారం నిందితుడిని అరెస్ట్ చేసి, గన్‌తో పాటు బుల్లెట్‌ను స్వాధీనం చేసుకున్నారు. సీఐ సుధీర్‌కుమార్, డీఐ లక్ష్మీనారాయణరెడ్డి, ఎస్సైలు రవికుమార్, వీరశేఖర్ పేర్కొన్నారు.



అలలెత్తిన సంగీత ఝురి

హుస్సేన్‌సాగర్‌లో ఏర్పాటు చేసిన మ్యూజికల్ ఫౌంటెన్‌ను గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ, మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే దానం నాగేందర్, హెచ్ఎండీఏ కమిషనర్ అర్వింద్ కుమార్, హెచ్‌జీసీఎల్ ఎండీ సంతోష్, హెచ్ఎండీఏ చీఫ్ ఇంజనీర్ బీఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. దాదాపు రూ.17.02 కోట్లతో దేశంలోనే అతి పెద్దదైన మ్యూజికల్ ఫౌంటెన్‌ను హెచ్ఎండీఏ ఏర్పాటు చేసింది. ఖైరతాబాద్ నుంచి ఎన్టీఆర్ మార్గ్‌లో వెళ్లే వాహనదారులు, పర్యాటకులు, సందర్శకులు సాగర్ అలలపై పోటెత్తే ఫౌంటెన్ సంగీత ఝురిని ఆస్వాదించవచ్చు. మిరుమిట్లుగొలిపే లేజర్‌షో సైతం సందర్శకులకు కనువిందు చేయనుంది. 10 మీటర్ల వెడల్పు, 90 మీటర్ల ఎత్తు, 180 మీటర్ల పొడవుతో ఎగిసిపడే ఈ ఫౌంటెన్ కళ్ల ముందు అద్భుతమైన దృశ్యంగా ఆవిష్కృతమవుతుంది. వివిధ రకాల థీమ్‌లతో 3 సెట్‌ల లేజర్ షోలను ఈ ఫౌంటెన్ ప్రదర్శిస్తుంది. ఒక్కొక్కటి 20 నిమిషాల చొప్పున ప్రతిరోజు 3 ప్రదర్శనలు ఉంటాయి. సాయంత్రం 7 నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రదర్శన కొనసాగుతుంది. శని, ఆదివారాలు, ఇతర సెలవు రోజుల్లో 4 ప్రదర్శనలను ఏర్పాటు చేస్తారు.

– సాక్షి, సిటీబ్యూరో





ఏదీ ప్రయోజనం?

బల్దియా పాలకవర్గానికి నేటితో రెండేళ్లు పూర్తి

- తీరని పారిశుద్ధ్య సమస్యలు
- ప్రజలకు తప్పని వెతలు
- ఖజానాకు పెరిగిన ఖర్చులు
- నగరానికి ఒరిగిందేమీ లేదు



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ ప్రస్తుత పాలక మండలి కొలువుదీరి శుక్రవారంతో రెండేళ్లు పూర్తి కానున్నాయి. ఈ రెండేళ్లలో చెప్పుకోదగ్గ పనులైమైనా చేశారా? అంటే ఒక్కటి కూడా కనిపించడం లేదు. కనీసం మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన విధి అయిన చెత్త సమస్యలు సైతం పరిష్కరించలేక పోయారు. పాలకమండలి నిండు సభలో చెత్త సమస్యలు తనకు సైతం తలవంపులుగా ఉన్నాయని స్వయానా ప్రకటించిన మేయర్.. ఆ తర్వాతైనా సమస్య పరిష్కారానికి కృషి చేశారా అంటే లేదు. పారిశుద్ధ్యం మెరుగు పరుస్తామనే పేరిట లెక్కకు మించిన అధికారులను నియమించడంతో వారి జీతాలు, వాహనాలు, ఇతరత్రా ఖర్చుల భారం పెరిగిందే తప్ప చెత్త సమస్యలు తీరలేదు. అసలు జీహెచ్ఎంసీలో పనులు లేకుండా ఖళీగా ఉంటున్నవాళ్లు, ఇతర విభాగాల నుంచి డిప్యుటేషన్లపై వచ్చి ఏళ్లకు ఏళ్లుగా పాతుకుపోయిన వాళ్లు, రిటైరయ్యాక సైతం ఇక్కడే తిష్టవేసి కదలకుండా ఉన్న వాళ్ల వల్ల జీహెచ్ఎంసీ నిధులు ఖర్చవుతున్నాయే తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండటం లేదు. అసలు ఈ పాలకమండలికి పాలనా వ్యవహారలపై ఇప్పటి వరకూ పట్టే లేదనే ప్రచారం జరుగుతోంది. అధికారులు ఎవరి ఇష్టానుసారం వారు వ్యవహరిస్తున్నా, కొన్ని జోన్లలో అవినీతి ఆకాశాన్నంటుతున్నా ఎవరికీ పట్టింపు లేకుండా పోయింది. ప్రజల సమస్యలు గాలికొదిలేశారు. ప్రజలు కనీసం తమ కష్టాలు చెప్పుకునేందుకు ప్రజావాణి లేకుండా చేశారు. మేయర్‌తో ముఖాముఖి, ఫోన్ ఇన్ వంటివి సైతం లేవు. ఒక్క సంవత్సరంలోనే ఎన్నో అగ్నిప్రమాదాలు జరిగి మరణాలు చోటు చేసుకున్నా పకడ్బందీ చర్యలు తీసుకోలేకపోయారు. ఎంతటి ప్రమాదాలు జరిగినా మేయర్, కమిషనర్ ఘటనాస్థలానికి వెళ్లకపోవడం చూసి ప్రజలు విస్తుపోతున్నారు. ప్రతిరోజూ మేయర్, డిప్యూటీ మేయర్‌లతోపాటు కార్పొరేటర్లంతా ఉదయాన్నే క్షేత్రస్థాయిలో ఉండాలని మునిసిపల్ మంత్రి కేటీఆర్ తమ పార్టీ వారికి ఉద్బోధించినా ఆచరించిన వారులేరు. పాలకమండలి చర్యలలేమితో చాలామంది అధికారులు సైతం క్షేత్రస్థాయి విధులు విస్మరించారు.

చెప్పుకొనేందుకు ఒక్కటైనా లేదు..

గత పాలకమండళ్లలో మేయర్లుగా పని చేసిన వారు ప్లాస్టిక్ నిషేధం వంటి వాటిపై దృష్టి సారించి వారి చేతనైన మేరకు అమలు చేశారు. ఈ పాలకమండలిలో చెప్పుకునేందుకైనా ఒక్క కార్యక్రమం కూడా లేదు. వైద్యశాఖ నిర్వహించే కంటి వెలుగు, కోవిడ్ వ్యాక్సినేషన్ వంటివి తమ ఖాతాలో వేసుకోవడం తప్ప కార్పొరేషన్ చేసిన పనులంటూ లేవు. స్వచ్ఛ హైదరాబాద్ కార్యక్రమాలు సైతం ఇప్పుడు అమలు కావడం లేదు. పీపుల్స్ పర్‌సెప్షన్ సర్వేలో కనీసం ప్రజలు పాల్గొనేలా చేయలేకపోయారు. స్వచ్ఛ ర్యాంకింగ్‌లలో నగరం పరిస్థితి దారుణంగా దిగజారింది. దోమల నివారణ వంటివి ప్రచార పటాటోపాలకే పరిమితమయ్యాయి. బర్త్ సర్టిఫికెట్లు తదితరాల్లో అక్రమాలకు పాల్పడ్డ వారిపై చర్యల్లేవు. పాలకమండలి సభ్యుల్లో మెజార్టీ సభ్యులకు సొంతలాభంపై యావ తప్ప ప్రజలను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆగని దుబారా..

- జీహెచ్ఎంసీ అప్పులు పెరుగుతున్నా దుబారా ఖర్చుల్ని నిలువరించలేకపోతున్నారు. కౌన్సిల్ హాల్ సదుపాయాలు, స్టాండింగ్ కమిటీ సభ్యులు గుట్టుచప్పుడు కాకుండా నగరాలు చుట్టిరావడం, కార్పొరేటర్ల కుటుంబ సభ్యులతో సహా మెడికల్ ఇన్సూరెన్స్‌ల కోసం కోట్లు ఖర్చు పెట్టారు. మేయర్ పేషీలో ఎందరున్నారో, ఏంచేస్తున్నారో తెలియదు. జీహెచ్ఎంసీ తరపున ఒకటీ అరా మంచి కార్యక్రమాలు చేసినప్పుడైనా చెప్పుకోలేని దౌర్భాగ్యం. కాల్‌సెంటర్ పేరిట జరుగుతున్న తంతుకు అంతూపొంతూ లేదు. పారిశుద్ధ్యం- ఆరోగ్యంతో సహా ఏ ఒక్క విభాగాన్నీ ప్రక్షాళన చేసింది లేదు. చాంబర్లు, ఆధునికీకరణల పేరిట నిధులు ఖర్చవుతూనే ఉన్నాయి.
- మేయర్, డిప్యూటీ మేయర్‌తో పాటు జోనల్ కమిషనర్లు అడిషనల్ కమిషనర్లు మహిళలే ఎక్కువగా ఉన్నా వివిధ విభాగాలతోపాటు మహిళా కార్మికులపై వేధింపులు తగ్గలేదు. లిఖితపూర్వకంగా ఫిర్యాదులు చేస్తే తప్ప పట్టించుకునే దిక్కులేదు. అసెంబ్లీ తరహాలో జీహెచ్ఎంసీ సమావేశాల సందర్భంగా మార్షల్స్ నియమించారు. రెండో ఏడాది జరిగిన మూడు సమావేశాలు రసాభాసలతోనే ముగిశాయి. గొడవలు జరగకుండా నిలువరించేందుకు గతంలో పార్టీల వారీగా ఫ్లోర్ లీడర్లుండేవారు. అధిక సంఖ్యలో సభ్యులున్న పార్టీలకు ప్రస్తుతం ఫ్లోర్ లీడర్లు లేరు. రెండేళ్లు గడిచినా ఇప్పటి వరకు వార్డు కమిటీలే ఏర్పడలేదు. స్టాండింగ్ కమిటీ ఎన్నికల సైతం సక్రమంగా జరగలేదనే ఆరోపణలున్నాయి. చెబుతూ పోతే లోపాలే తప్ప గట్టిగా ఒక్క మంచి కార్యక్రమమైనా కనిపించడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

హైదరాబాద్ కలెక్టరేట్ @ లక్డీకాపూల్

సాక్షి, సిటీబ్యూరో: ఎట్టకేలకు హైదరాబాద్ కలెక్టరేట్ లక్డీకాపూల్‌లోని పాత రంగారెడ్డి కలెక్టరేట్ భవన సముదాయంలోకి తరలనుంది. వచ్చే మార్చి మొదటి వారంలో తరలింపునకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. నగర శివారులోని కొంగరకలాన్‌లో నిర్మించిన సమీకృత భవన సముదాయంలోకి రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ మారడంతో హైదరాబాద్ కలెక్టరేట్ తరలింపునకు ప్రభుత్వ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆరునెలల క్రితమే రంగారెడ్డి కలెక్టరేట్ తరలిపోగా ఆ భవన సముదాయంలోకి హైదరాబాద్ కలెక్టరేట్ తరలింపుపై అడ్డంకులతో పాటు అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి, తాజాగా అవి తొలగిపోవడంతో లక్డీకాపూల్‌లోని భవన సముదాయానికి తుది మెరుగులు దిద్దుతున్నారు. ఈ భవన సముదాయంలోకి కొత్తగా ప్రారంభించే పోలీసు సౌత్ వెస్ట్ జోన్ ఆఫీస్ ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

పదహారేళ్ల క్రితం..

- పదహారేళ్ల క్రితం నగరంలోని మాసాబ్ ట్యాంక్ వద్ద మహావీర్ హాస్పిటల్ సమీపంలోని ఒక ఎకరం ప్రభుత్వ స్థలంలో నూతన కలెక్టరేట్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రతిపాదించారు. నాంపల్లి-అబిడ్స్ రోడ్డులోని కలెక్టరేట్‌లోని పాత భవన సముదాయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో 1990లో నాలుగు అంతస్తులతో నిర్మించిన కొత్త భవనంలో కలెక్టరేట్ విభాగాలు కొనసాగుతున్నాయి. వివిధ శాఖల కార్యాలయాలు వేర్వేరుగా దూరంగా ఉన్నాయి. మొత్తం 32 శాఖలు నిర్వహించడానికి స్థలం సరిపోకపోవడంతో ఇతర ప్రాంతంలో నిర్మాణం చేపటాలని అప్పట్లో భావించారు.
- ఒకే ప్రాంగణంలో అన్ని ఆఫీసులతో పాటు ప్రజలకు అన్ని అన్ని సేవలను అందించేందుకు కొత్త భవన సముదాయం ప్రతిపాదనలకు అంకుర్పాణ జరిగింది. అప్పట్లో ప్రభుత్వం ప్రతిపాదనలను అంగీకరించి కొత్త కాంప్లెక్స్ కోసం 2007 ఏప్రిల్‌లో రూ. 10 కోట్లు మంజూరు చేసింది. సుమారు 10 అంతస్తులతో కాంప్లెక్స్‌కు ఆర్అండ్‌బీ శాఖ ప్రైవేట్ కన్సల్టెంట్‌తో కలిసి డిజైన్లు సిద్ధం చేసింది. కాంప్లెక్స్ అంచనా వ్యయం రూ.46 కోట్లు కాగా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు ఏ మూలకు సరిపోని పరిస్థితి. అంతలోనే మార్చి 2008లో బడ్జెట్ గడువు ముగియడంతో ప్రతిపాదన పెండింగ్‌లో పడిపోయాయి. బడ్జెట్ పరిమితుల కారణంగా కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టలేదు.
- ఆ తర్వాత కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన నవీన్‌మిట్టల్ మరో ఆర్కిటెక్ట్ ద్వారా ఆరు అంతస్తులకు తగ్గించి రూ.22 కోట్ల అంచనా వ్యయంతో 1.80.000 చదరపు అడుగుల బిల్ట్-అప్ ఏరియాతో సవరించి డిజైన్ చేశారు. సవరించిన ప్రణాళికలు, అంచనాలను తిరిగి ప్రభుత్వానికి ఆమోదం కోసం పంపించారు. కాగా.. కలెక్టరేట్ కాంప్లెక్స్ భూమిని వేలం వేసి వచ్చిన మొత్తాన్ని ప్రతిపాదిత కొత్త కాంప్లెక్స్ కోసం ఉపయోగించాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించడంతో నిర్మాణ అంశం పెండింగ్‌లో పడిపోయాయి. తాజాగా రంగారెడ్డి జిల్లా పాత కలెక్టరేట్ భవన సముదాయంలోకి తరలుతోంది.

పాత రంగారెడ్డి కలెక్టర్‌రేట్‌లోకి త్వరలో తరలింపు

- భవన సముదాయానికి మెరుగులు



కొత్త నిర్మాణానికి అవకాశం లేక..

హైదరాబాద్ కలెక్టరేట్ శిథిలావస్థకు చేరడంతో పాతభవనాలు కూల్చి సమీకృత భవన సముదాయ నిర్మాణం చేపడితే బాగుంటుందని అధికార యంత్రాంగం భావించింది. మరోవైపు కొత్తగా నిర్మిస్తున్న రాష్ట్ర సచివాలయంలో అన్ని విభాగాల హెచ్‌ఓడీ ఉండాలన్న సీఎం కేసీఆర్ ఆలోచనతో కలెక్టరేట్ పక్కన ఉన్న సీసీఎల్ఏ ఖాళీ అయితే ఆ స్థలం కూడా కలెక్టరేట్‌కు కలిసి వస్తుందని భావించినా.. హైదరాబాద్‌కు కొత్త భవన నిర్మాణానికి అవకాశం లభించలేదు. గతంలో కొత్త కలెక్టరేట్ నిర్మాణానికి అవకాశం లభించినా... పలు ఆటంకాలు తలెత్తాయి. భవన నిర్మాణానికి విడుదలైన నిధులు సైతం వెనక్కి వెళ్లిపోయాయి. ఒకసారి నిధులు మంజూరై వెనక్కి మళ్లిపోగా, మరోసారి ఏ కారణం లేకుండానే సర్కారు విడుదల చేసిన నిధులను ప్రభుత్వం వెనక్కి తీసుకోవడం గమనార్హం.

ఈ-కార్ వారెవ్వా!

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని హైటెక్స్ వేదికగా కొనసాగుతున్న అధునాతన ఎలక్ట్రిక్ వాహనాల '17వ ఈవీ-ఎక్స్‌పో' రెండో రోజూ విశేషంగా ఆకట్టుకుంది. ఈ- మొబిలిటీ వీక్‌లో భాగంగా ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన ఈ- కార్ ఆటో మొబిలి 'పినిన్ ఫరినా బాటిస్టా'ను యూరప్ బిజినెస్, మహీంద్రా అండ్ మహీంద్రా సీఈఓ గురుప్రతాప్ బొపరాయ్, ఆటోమొబిలి పినిన్‌ఫరీనా సీఈఓ పాలో డెల్లాచా సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్స్ అండ్ అడ్వాన్స్‌డ్ కెమిస్ట్రీ సెల్ డైరెక్టర్ సుజై కరంపురి ఆవిష్కరించారు. ఫార్ములా ఈ- గ్రాండ్ ప్రిక్స్ కోసం నగరం సిద్ధమవుతున్న వేళ ఇటలీలో తయారు చేసిన, అధికారికంగా ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన ఎలక్ట్రిక్ హైపర్ జీటీ 'బాటిస్టా' కారును హైటెక్స్‌లో ఆవిష్కరించడం ప్రత్యేకతను సంతరించుకుంది.



'పినిన్ ఫరినా బాటిస్టా' కార్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఆకట్టుకుంటున్న ఈవీ- ఎక్స్‌పో

మోడల్స్.. అదుర్స్..

పర్యావరణ అనుకూలమైన ఎలక్ట్రిక్ వెహికల్ టెక్నాలజీ ఎక్స్‌పోలో ఈ-కార్లు, ఈ-బైక్‌లు, ఈ-స్కూటర్లు, ఈ-సైకిళ్లు, ఈ-లోడర్‌లు వంటి అధునాతన మోడల్స్ ఆకట్టుకుంటున్నాయి. ఈ ప్రదర్శనలో సోనీ ఈ వాహనాలు, ది ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, హవెక్ ఈవీ, ఎమ్‌జీ ఈవీ, ఆల్గియస్ ఈవీ తదితర వాహనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

ఇకపై అంతా రీట్రోఫిట్..

ఈ ఎక్స్‌పోలో పాత వాహనాలను రీట్రోఫిట్ (తిరిగి అమర్చడం) విధానంలో ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చుకునే సాంకేతిక ప్రత్యేకంగా నిలిచింది. హవెక్ ఈవీ ఆధ్వర్యంలో ఈ రిట్రోఫిట్ పద్ధతిలో ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చిన లగ్జరీ కార్లను ప్రదర్శించారు.



ఈ- సైకిల్.. రీ సైక్లింగ్..

ఈ- సైకిళ్ల ప్రదర్శనలో ఆకట్టుకున్నాయి. వీటిలో ఓవర్ చార్జింగ్‌తో లిథియం బ్యాటరీకి ఎలాంటి ప్రమాదం రాకుండా అల్యూమినియం ఫేసింగ్‌ను అమర్చామని గేర్‌హెడ్ మోటార్స్ యాజమాన్యం తెలిపింది. బ్యాటరీ సెగ్మెంట్ వాహనాల్లో అతిపెద్దదైన ఎమ్‌జీ జెడ్ఎస్‌వీ ప్రదర్శిస్తున్నారు. కారులో వైర్‌లెస్ ఛార్జింగ్, వాయిస్ కమాండ్, ఫన్ మోడ్, ఉచిత ఇంటర్నెట్ వంటి అంశాలు వినూత్నంగా ఉన్నాయి. ఎలిజియం ఆటోమొబైల్స్ ఆధ్వర్యంలో తయారు చేసిన యాంటిక్ కలెక్షన్ కాస్మోజార్ ఈ వాహనాలు నగర వాసులను ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి. పాడైపోయిన పాత బ్యాటరీల నుంచి సేకరించిన వ్యర్థ పదార్థాలతో రీసైక్లింగ్ పద్ధతిలో తిరిగి ఈ వాహనాలకు ఉపయోగించే బ్యాటరీలను తయారు చేస్తున్న సైల్ లీ సైకిల్ ప్రదర్శన ఔత్సాహికులకు మరింత చేరువైంది.

సమరానికి సై

ఫార్ములా-ఈ పోటీలకు రేసర్లు రెడీ

గెలిచి తీరుతామంటూ ధీమా

సాక్షి, సిటీబ్యూరో: ఫార్ములా- ఈ ప్రిక్స్‌కు వేళయింది. దేశంలోనే తొలిసారిగా నగరం వేదికగా జరగనున్న అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు రేసర్లు సమరోత్సాహంతో సన్నద్ధమవుతున్నారు. వీరంతా ఇప్పటికే నగరానికి చేరుకున్నారు. వివిధ దేశాల్లో నిర్వహించిన ఫార్ములా పోటీల్లో అద్భుతమైన ప్రతిభను, నైపుణ్యాన్ని ప్రదర్శించిన 22 మంది రేసర్లు పాల్గొంటారు. గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు రేసర్లు గతంలో నిర్వహించిన పోటీలపై రూపొందించిన వీడియోను ప్రదర్శించారు. ఈ సందర్భంగా రేసింగ్ డ్రైవర్లు జీన్ ఎరిక్ వర్జిన్, ఆండ్రే లాట్టర్‌లు తమ అనుభవాలను వివరించారు. పోటీల్లో పాల్గొనడం ఎంతో ఆసక్తికరంగా ఉందన్నారు. పోటీల్లో పాల్గొనడానికి ముందు ఒత్తిడిని తగ్గించుకొనేందుకు తాను మైకేల్ జాక్సన్ పాటలు వింటానని ఆండ్రే చెప్పారు. రేసింగ్ డ్రైవర్‌లపై తప్పనిసరిగా మానసిక ఒత్తిడి ఉంటుందని, దానిని అధిగమించేందుకు వివిధ రకాల పద్ధతులను పాటిస్తామన్నారు. వీలైనంత వరకు చుట్టూ ఉండే వాతావరణాన్ని ఆహ్లాదభరితంగా ఉంచుకొనున్నట్లు చెప్పారు. మరోవైపు మానసిక ఒత్తిడి, ఆందోళన వంటి ఇబ్బందులను అధిగమించేందుకు సైకాలజిస్టులను కూడా సంప్రదిస్తామని చెప్పారు. కాగా.. ఫార్ములా- ఈ పోటీల కోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. నెక్లెస్‌రోడ్డులోని 2.8 కి.మీ ట్రాక్‌ను సిద్ధం చేశారు. 20 వేల మందికి పైగా సందర్శకులు వీక్షించేందుకు అనుగుణంగా గ్యాలరీలను ఏర్పాటు చేశారు. పలు ప్రాంతాల్లో భారీ స్క్రీన్‌లను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. 11 ఆటోమొబైల్ దిగ్గజ సంస్థలకు చెందిన సింగిల్ సీటర్ ఎలక్ట్రిక్ కార్లు, 22 మంది రేసింగ్ డ్రైవర్లు పోటీల్లో పాల్గొనున్న సంగతి తెలిసిందే.



అడ్డదారి తొక్కిన విద్యార్థులు వందల్లో

సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయ యూనివర్సిటీల్లో ప్రవేశానికి తొలి మెట్టుగా భావించే టోఫెల్, జీఆర్ఈ తదితర ఆన్‌లైన్ పరీక్షల్ని అడ్డ దారిలో క్లియర్ చేసుకున్న విద్యార్థుల సంఖ్య వందల్లోనే ఉందని పోలీసులు గుర్తించారు. గుణ శేఖర్, శ్రావణ్ సహా నగరంలో ఉన్న ఇలాంటి ముఠాల సహకారంతో మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన దాదాపు 500 మంది ఇప్పటికే దేశం దాటేశారని అంచనా వేస్తున్నారు. వీరిని వెనక్కు రప్పించడంతో పాటు అమెరికాలో ఉన్న కీలక సూత్రధారి గుణ శేఖర్‌ను పట్టుకోవడానికి సన్నాహాలు చేస్తున్నారు. మంగళవారం అరెస్టు అయిన నిందితులను కోర్టు అనుమతితో తమ కస్టడీలోకి తీసుకుని విచారణ చేయాలని నిర్ణయించారు. దీని కోసం వారిని తమ కస్టడీకి అప్పగించాల్సిందిగా కోరుతూ న్యాయస్థానంలో గురువారం పిటిషన్ దాఖలు చేశారు.

ఈటీఎస్ వద్దే కీలక సమాచారం..

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 11,500 యూనివర్సిటీలు, విద్యా సంస్థల్లో ప్రవేశాలకు ఈ ఆన్‌లైన్ పరీక్షలు కీలక భూమిక పోషిస్తాయి. వీటిలో అభ్యర్థి సాధించిన స్కోర్ ఆధారంగానే సీటు, స్కాలర్‌షిప్, ఉద్యోగావకాశాలు తదితరాల ఆధారపడి ఉంటాయి. మన దేశానికి సంబంధించి వివిధ కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించే బాధ్యతల్ని ఎడ్యుకేషనల్ టెస్టింగ్ సర్వీస్ (ఈటీఎస్) ఇండియా సంస్థ నిర్వర్తిస్తుంటుంది. ఈ కారణంగానే దీని వద్ద ప్రతి ఏడాది ఏఏ ప్రాంతాలకు చెందిన ఎందరు పరీక్ష రాశారు? వీరిలో ఎంపికైనా వాళ్లు ఎందరు? ఏ స్థాయిలో స్కోరు సాధించారు? తదితర కీలక వివరాలన్నీ ఈటీఎస్ వద్ద ఉంటాయి. ఆన్‌లైన్ పరీక్షల్లో జరుగుతున్న ఈ గోల్‌మాల్‌కు సంబంధించి అదే సంస్థ స్టింగ్ ఆపరేషన్ నిర్వహించి, ఆధారాలతో సహా హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీని ఆధారంగా కేసు నమోదు చేసుకున్న అధికారులు అరెస్టులు ప్రారంభించారు.


స్వాధీనమైన వాటిని పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)

ఆ రెండు జాబితాలు సరిపోలిస్తే...

మాల్ ప్రాక్టీస్ ద్వారా ఈ పరీక్షలు గట్టెక్కిన వారిని గుర్తించడానికి సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు వ్యూహాత్మకంగా ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. ఈటీఎస్ నుంచి తీసుకున్న అభ్యర్థుల వివరాలు, మాస్ కాపీయింగ్ ముఠాల సహకారం తీసుకున్న వారి వివరాలతో సరిపోల్చనున్నారు. ఇలా మాల్ ప్రాక్టీస్ ద్వారా స్కోరు పొందిన వారెవరన్నది తేలుస్తారు. మంగళవారం అరెస్టు అయిన నిందితుల వద్ద లభించిన డేటా ఆధారంగా ఇప్పటికే దాదాపు 100 మంది మాల్ ప్రాక్టీస్ విద్యార్థులను గుర్తించారు. వీరి స్కోర్‌ను రద్దు చేయాల్సిందిగా కోరుతూ సంబంధిత ఏజెన్సీకి లేఖ రాయడంతో పాటు వాళ్లు విద్యనభ్యసిస్తున్న యూనివర్శిటీలకు సమాచారం ఇవ్వనున్నారు. ఇలా చేస్తే అడ్డదారిలో విదేశీ విద్య కోసం వెళ్లిన వాళ్లు వెనక్కు రావాల్సి వస్తుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన పేర్ల ఆధారంగా ఆయా వర్శిటీలకు జాబితాలు పంపాలని సైబర్ క్రైమ్ పోలీసులు నిర్ణయించారు.

గుణ శేఖర్‌పై రెడ్ కార్నర్ నోటీసు..?

ఈ హైటెక్ మాల్ ప్రాక్టీస్‌లో కీలక సూత్రధారిగా ఉండి, గతేడాది డిసెంబర్‌లో అమెరికా వెళ్లిపోయిన గుణ శేఖర్‌ను భారత్‌కు రప్పించడానికి మార్గాలను అన్వేషిస్తున్నారు. విదేశాల్లో ఉన్న వాంటెడ్ వ్యక్తులను పట్టుకోవడానికి, అరెస్టు చేయడానికి పోలీసులు ఇంటర్‌పోల్ సహాయం కోరుతారు. వీటిలో రెడ్ కార్నర్ నోటీసు ప్రధానమైంది. మాల్ ప్రాక్టీస్ కేసును పోలీసులు ఐపీసీలోని 419, 420లతో పాటు ఐటీ యాక్ట్‌లోని 66–డి సెక్షన్ల కింద నమోదు చేశారు. మాల్ ప్రాక్టీస్ ద్వారా అనర్హులు విదేశాల్లో చదువుతున్నారనే వివరాలను ఇంటర్‌పోల్‌కు అందించడం ద్వారా గుణ శేఖర్‌పై రెడ్ కార్నర్ నోటీసుల జారీ చేయించాలని అధికారులు భావిస్తున్నారు. ఈ కేసులో సూత్రధారులు, నిర్వాహకులు, సహాయకులు, సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్స్‌తో పాటు అడ్డదారి తొక్కిన విద్యార్థులు కూడా నిందితులేనని పోలీసులు స్పష్టం చేస్తున్నారు.

- మాస్ కాపీయింగ్ ద్వారానే టోఫెల్, జీఆర్ఈ స్కోర్లు
- ఎడ్యుకేషనల్ టెస్టింగ్ సర్వీస్ నుంచి వివరాల సేకరణ
- ఆయా వర్సిటీలకు లేఖలు రాయడం ద్వారా వాళ్లు వెనక్కు
- వీరితో పాటు సహకరించిన సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్స్ సైతం నిందితులే
- ఇప్పటికే అరెస్టైన నిందితుల కస్టడీ కోరుతూ పిటిషన్ దాఖలు
- దర్యాప్తు ముమ్మరం చేసిన హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు

జీఆర్‌టీ జ్యువెలరీస్‌కు ప్రతిష్టాత్మక అవార్డు



లక్డీకాపూల్: ఆభరణాల రంగంలో తమదైన శైలితో ప్రత్యేకతను నిలుపుకొంటున్న జీఆర్‌టీ జ్యువెలరీస్‌కు ప్రతిష్టాత్మక ఐజే అవార్డు లభించింది. ఐజే అవార్డుల 12వ ఎడిషన్‌లో ఉత్తమ బ్రాస్లెట్ డిజైన్‌ల విజేతగా జీఆర్‌టీ నిలిచింది. దేశ వ్యాప్తంగా 21 పట్టణాల నుంచి వెయ్యికిపైగా డిజైన్ ఎంట్రీలు అవార్డు కోసం పోటీపడ్డాయి. ఈ సందర్భంగా జీఆర్‌టీ మేనేజింగ్ డైరెక్టర్ అనంతపద్మనాభన్ (ఆనంద్) మాట్లాడుతూ ప్రారంభం నుంచి జీఆర్‌టీ ఎప్పుడూ శ్రేష్ఠమైన పనితనం, సాటిలేని మేటి డిజైన్ ఆలోచనలని అన్వేషిస్తూనే ఉందన్నారు. ఆ నిరంతర కృషి ఫలితమే బెస్ట్ బ్రేస్లెట్ డిజైన్‌కి దక్కిన ఐజే అవార్డు అని అన్నారు. మరో ఎండీ జి.ఆర్.రాధాకృష్ణన్ మాట్లాడుతూ జీఆర్‌టీలో పని చేస్తున్న ప్రతి ఒక్క ఉద్యోగికీ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ.. ఈ మైలురాయిని సాధించినందుకు వారిని అభినందించారు.


భవాని కాలేజ్ జట్టు


ఎమ్ఎల్ఆర్ ఇనిస్టిట్యూట్ జట్టు

హోరాహోరీగా 'సాక్షి' ప్రీమియర్ లీగ్ పోటీలు

నేటి ఉదయం సెమీ ఫైనల్..మధ్యాహ్నం ఫైనల్స్



పోచారం: ఘట్‌కేసర్ మండలం ప్రతాపసింగారంలోని బాబురావు సాగర్ క్రికెట్ మైదానంలో సాక్షి యాజమాన్యం నిర్వహిస్తున్న సాక్షి ప్రీమియర్ లీగ్–4 మ్యాచ్‌లు గురువారం హోరాహోరీగా కొనసాగాయి. ఇందులో గ్రేటర్ హైదరాబాద్ నుండి 65 జట్లు పాల్గొంటున్నాయి.

విజేతలు వీరే..

బాబూరావు సాగర్ క్రికెట్ మైదానం – 1

- మొదటి మ్యాచ్‌లో వేద డిగ్రీ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 107 పరుగులు చేసింది. అనంతరం లయోలా డిగ్రీ కాలేజ్ జట్టు 9.2 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 74 పరుగులే చేసి ఓడిపోయింది.
- రెండో మ్యాచ్‌లో శ్రీ ఇందు ఇంజినీరింగ్ కళాశాల ఏ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 89 పరుగులు చేసింది. అనంతరం భవన్స్ వివేకానంద డిగ్రీ కళాశాల జట్టు 7 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 90 పరుగులు తీసి శ్రీఇందుపై విజయం సాధించింది. భవన్స్ బ్యాట్స్‌మెన్ నితీష్ 15 బంతుల్లో 30 పరుగులు తీసి ప్రతిభ చాటుకున్నాడు.
- మూడో మ్యాచ్‌లో జేఎన్‌టీయూ సుల్తాన్‌పూర్ జట్టు 10 ఓవర్లలో 57 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఈ జట్టుపై భవన్స్ ఏ జట్టు 2 వికెట్లు కోల్పోయి 6 ఓవర్లలో 58 పరుగులు చేసి సెమీ ఫైనల్‌కు చేరింది.

బాబూరావు సాగర్ క్రికెట్ మైదానం–2

- మొదటి మ్యాచ్‌లో జేఎన్‌టీయూ సుల్తాన్‌పూర్ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 69 పరుగులు చేసింది. ఈ జట్టుతో తలపడిన విజ్ఞాన భారతి ఇంజినీరింగ్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 51 పరుగులు మాత్రమే చేసి ఓటమి నమోదు చేసింది.
- రెండో మ్యాచ్‌లో ఎమ్ఎల్ఆర్ఐటీ దుండిగల్ జట్టు 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 122 పరుగులు చేసింది. ఇందులో బ్యాట్స్‌మ్యాన్ నితిన్ 35 బంతుల్లో 99 పరుగులు తీసి సత్తా చాటారు. దీనిపై ఎమ్ఆర్ఈసీ ఏ జట్టు ఆడి 10 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 97 పరుగులు చేసి ఓటమి పాలైంది.

నేటి మ్యాచ్‌లు..

- శుక్రవారం సీనియర్ విభాగంలో ఎమ్ఎల్ఆర్ ఐటీ వర్సెస్ వేద డిగ్రీ కాలేజ్, ఎస్‌పీ కాలేజ్ వర్సెస్ భవన్స్ వివేకానంద డిగ్రీ కాలేజ్ జట్ల మధ్య సెమీ ఫైనల్స్ జరుగుతాయి. జూనియర్ విభాగంలో భవన్స్ శ్రీ అరబిందో జూనియర్ కళాశాల వర్సెస్ గౌతమ్ జూనియర్ కాలేజ్ ఈసీఐఎల్ జట్లు ఫైనల్స్‌లో తలపడుతాయి.

రేడియాలజీతో నాది ప్రత్యేక అనుబంధం

గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

మాదాపూర్: ఇంటర్వెన్షనల్ రేడియాలజీ అనేది వైద్య రంగంలో అభివృద్ధి చెందుతున్న విభాగమని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తెలిపారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో గురువారం ఇండియన్ సొసైటీ ఆఫ్ వాస్క్యులర్ అండ్ ఇంటర్వెన్షనల్ రేడియాలజీ 23వ వార్షిక సదస్సును ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడుతూ ఇంటర్వెన్షనల్ సోనాలజీని అభ్యసిస్తున్నందున తనకు రేడియాలజీతో ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. గైనకాలజిస్టను అయినప్పటికీ సోనాలజీలో శిక్షణ పొందినట్టు తెలిపారు. రామచంద్ర మెడికల్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉన్న సమయంలో కార్డోసెంటెసిస్, అమ్నియోసెంటెసిస్ తదితర ఇంటర్వెన్షనల్ విధానాలు చేశానన్నారు. డాక్టర్ బాలాజీ పటేల్ కోలా మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీ వరకు నాలుగురోజుల పాటు నిర్వహించనున్న ఈ సదస్సులో దేశవిదేశాల నుంచి వెయ్యి మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు. రేడియాలజీ విభాగంలో వస్తున్న మార్పులు, అభివృద్ధి, సాంకేతికపై ఇక్కడ చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖవైద్య నిపుణులు డాక్టర్ రాంమూర్తి, ఏఐజీకి చెందిన డాక్టర్ జగదీశ్ రాంపాల్, డాక్టర్ సుయాస్ కులకర్ణి, డాక్టర్ కె.అజిత్ కె.యాదవ్, డాక్టర్ భవేశ్ తదితరులు పాల్గొన్నారు.


సదస్సును ప్రారంభిస్తున్న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

ఎమ్మెల్యే రాజాసింగ్‌కు తప్పిన పెను ప్రమాదం

మరోసారి మొరాయించిన బుల్లెట్ ప్రూఫ్ కారు

అబిడ్స్: గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ బుల్లెట్‌ప్రూఫ్ వాహనం మరోసారి మొరాయించింది. అసెంబ్లీ నుంచి గురువారం బుల్లెట్‌ప్రూఫ్ వాహనంలో ఇంటికి వెళ్తుండగా ముందుభాగం టైరు ఊడిపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ధూల్‌పేట ప్రాంతంలో వాహనం నుంచి భారీ శబ్దం వచ్చి ముందువైపు టైరు బయటకు రావడంతో డ్రైవర్ చాకచక్యంగా కారును నిలిపాడు. దీంతో రాజాసింగ్ ప్రాణాపాయం నుంచి బయట పడ్డారు. వాహనం నెమ్మదిగా వెళ్లడం వల్ల ప్రమాదం తప్పింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజాసింగ్ మాట్లాడుతూ ఈ ఘటన చూసైనా హోంమంత్రి మహమూద్ అలీ, పోలీసు ఉన్నతాధికారులు సిగ్గుపడాలన్నారు. వెంటనే తనకు వాహనం మార్చాలని డిమాండ్ చేశారు.


ఎమ్మెల్యే బుల్లెట్‌ప్రూఫ్ వాహనం టైరు బయటకు వచ్చిన దృశ్యం

ఎస్సార్‌డీపీ మొదటి దశ పనులు ఏడాదిలో పూర్తి

రూ.4305 కోట్లతో రెండో దశ పనులు

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ పరిధిలో వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పథకం(ఎస్సార్‌డీపీ) మొదటి దశలో భాగంగా రూ.8052.92 కోట్లతో 48 పనులు చేపట్టారు. వీటిలో 34 పనులు పూర్తిచేశారు. 31 పనులు జీహెచ్ఎంసీ చేయగా రెండింటిని ఆర్అండ్‌బీ, ఒకటి హెచ్ఎండీఏ చేసింది. మిగతా 14 పనులు ఏడాది కాలంలో పూర్తిచేయనున్నట్లు మునిసిపల్ మంత్రి కె.తారక రామారావు తెలిపారు. వీటిల్లో జీహెచ్ఎంసీవి 11, నేషనల్‌హైవే అథారిటీవి 3 పనులున్నాయి. అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సార్‌డీపీ పనులపై నగరానికి చెందిన ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, ఆరెకపూడి గాంధీ, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అడిగిన ప్రశ్నలకు బదులిస్తూ మంత్రి ఈ వివరాలు అందజేశారు. ఎస్సార్‌డీపీ రెండో దశలో భాగంగా రూ.4305 కోట్లతో 36 పనులు త్వరలో చేపట్టనున్నట్లు కేటీఆర్ పేర్కొన్నారు.

హెచ్-న్యూ సిబ్బందికి సీపీ అభినందనలు



సాక్షి, సిటీబ్యూరో: 'నషా ముక్త్ షహరే లక్ష్యం'గా ఏర్పాటైన హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్-న్యూ) ఏడాది పూర్తి చేసుకుంది. ఏడాదిలో ఎన్నో విజయాలను నమోదు చేసుకున్న ఈ వింగ్‌ను గురువారం సీపీ సీవీ ఆనంద్ ప్రత్యేకంగా అభినందించారు. హెచ్-న్యూ సాధించిన విజయాలను గుర్తించిన కొత్వాల్ సీవీ ఆనంద్ వార్షికోత్సవంలో భాగంగా అధికారులు, సిబ్బందికి నగదు రివార్డులు అందించారు. డీసీపీలు చక్రవర్తి గుమ్మి, సునీత రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు పి.రాజేష్, పి.రమేష్ రెడ్డి, ఎస్సైలు జీఎస్ డానియేల్ సి.వెంకట రాములు సహా మొత్తం సిబ్బందికి వీటిని అందించారు. ఐసీసీసీలో జరిగిన ఈ కార్యక్రమంలో మాట్లాడిన కొత్వాల్ ఆనంద్ భవిష్యత్తులోనూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. హెచ్-న్యూకు అనుబంధంగా 24 గంటలూ పని చేసే కాల్ సెంటర్ ఏర్పాటు చేశారు.

మియాపూర్‌లో యువకుడి దారుణ హత్య


ప్రవీణ్ (ఫైల్)

మియాపూర్: ఓ యువకుడు దారుణ హత్యకు గురైన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సిఐ తిరుపతిరావు తెలిపిన వివరాల ప్రకారం..మియాపూర్‌లోని జాతీయ రహదారి పక్కన మియాపూర్ పాత బస్‌స్టాప్ వెనుక మూత్రశాలల ముందు ఓ యువకుడు రక్తపు మడుగులో పడి ఉన్నాడని స్థానికులు గురువారం ఉదయం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్లూస్‌టీం సహాయంతో పరిశీలించారు. ఆ యువకుడి తలకు తీవ్ర గాయాలై రక్తపు మడుగులో పడి ఉండి, పక్కన ఓ బండ రాయిని పోలీసులు గమనించారు. మృతిచెందిన యువకుడి వద్ద ఎలాంటి సమాచారం లభించలేదు. దీంతో పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. స్థానికంగా చుట్టుపక్కల ఆ యువకుడి గురించి ఆరా తీయగా పటాన్‌చెరు పరిధిలోని లక్డారం గ్రామానికి చెందిన ఎర్రోళ్ల శ్యామయ్య, లక్ష్మీ దంపతుల చిన్న కుమారుడు ఎర్రోళ్ల ప్రవీణ్ (26)గా గుర్తించారు. ప్రవీణ్ కూకట్‌పల్లి ఎల్లమ్మ బండలో ఉంటూ చెత్త ఏరుకుని జీవనం కొనసాస్తున్నాడు. బుధవారం రాత్రి ప్రవీణ్ మరో గుర్తుతెలియని వ్యక్తితో కలిసి బస్టాప్ సమీపంలోఉన్న వైన్స్ వద్ద మద్యం గొనుగోలుచేసి ఇద్దరు తాగారు. ఈ సమయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగి హత్యకు దారితీసి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఘటన స్థలంలో పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నారు. గురువారం సాయంత్రం నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్న విశ్వసనీయ సమాచారం. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'జలకన్య కన్ను' పేరుతో బురిడీ

- రంగురాయి తీసుకొచ్చి రూ.2 కోట్లకు విక్రయించేందుకు బేరం
- ఇద్దరు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: జలకన్య కన్నుకు అతీంద్రియ శక్తులు ఉంటాయని, దీంతో మీకు అంతా శుభం జరుగుతుందని, కోరుకున్న పని ఇట్టే జరిగిపోతుందని కళ్లబొల్లి మాటలు చెప్పి అందినకాడికి దండుకోవాలని భావించిన నిందితుల ఆటకట్టించారు మల్కాజ్‌గిరి ఎస్‌ఓటీ పోలీసులు.

● వరంగల్‌కు చెందిన చందు, యాప్రాల్‌కు చెందిన సాంబశివ ఇద్దరు స్నేహితులు. తీర్థయాత్రల నిమిత్తం షిరిడీకి వెళ్లిన ఇరువురు.. తిరుగు ప్రయాణంలో స్థానికంగా దొరికే రంగు రాయిని కొనుగోలు చేశారు. హైదరాబాద్‌కు తిరిగొచ్చాక ఆ రంగురాయిలో బ్యాటరీ సహాయంతో చిన్నపాటి లైట్‌ను అమర్చారు.

● లైట్ అమర్చిన రంగురాయికి నీళ్ల తాకగానే దాని కాంతి రెట్టింపు అవుతుంది. దీన్ని గమనించిన చందు, శివలకు దుర్బుద్ధి పుట్టింది. రంగురాయికి శక్తులు ఉన్నాయని నమ్మించి అమాయకులకు విక్రయించాలని నిర్ణయించుకున్నారు. దీంతో కాప్రాలో పలువురు వ్యాపారులు, స్థానికులకు చూపించి..ఈ రంగురాయి సాగరకన్య నోటిలో నుంచి తీసిన జలకాంతం అని మాయమాటలు చెప్పారు. దీన్ని ఇంట్లో పెట్టుకుంటే శుభం జరుగుతుందని నమ్మించారు. రూ.2 కోట్లకు విక్రయించేందుకు ప్రయత్నాలు చేశారు. ఈ మల్కాజ్‌గిరి ఎస్ఓటీ పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. వెంటనే రంగంలోకి దిగిన ఇన్‌స్పెక్టర్ రాములు బృందం ఇద్దరు నిందితులు చందు, సాంబశివలను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

సమాచారం

నేడు అంబేడ్కర్ వర్సిటీలో వాక్-ఇన్-ఇంటర్వ్యూలు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం ప్రాంగణంలో మహీంద్ర అండ్ మహీంద్ర ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ నెల 10న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. వర్సిటీలోని మినీ ఆడిటోరియంలో ఉదయం 10 గంటల నుంచి సేల్స్ ఎగ్జిక్యూటివ్, కలెక్షన్ ఎగ్జిక్యూటివ్, క్యాషియర్ ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. ఏదైనా డిగ్రీ అర్హత గల అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరు కావాలని, క్యాషియర్ పోస్టుకు బీకాం అర్హత గలవారు మాత్రమే హాజరు కావాలన్నారు. వివరాలకు నం.9912271327 ను సంప్రదించవచ్చన్నారు.

గుర్తుతెలియని వాహనాల వేలం

● నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్

హిమాయత్‌నగర్: నగర వ్యాప్తంగా గుర్తుతెలియని, వదిలేసిన వాహనాలకు వేలం నిర్వహిస్తున్నట్లు నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ గురువారం తెలిపారు. 2014 నుంచి 2023 మధ్య కాలంలో హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో వదిలేసిన, గుర్తు తెలియని 1696 వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటిలో కండీషన్ ఉన్న వాహనాలను వేలం వేస్తుండగా..పూర్తిగా పాడైన వాటిని స్క్రాప్ చేస్తున్నట్లు చెప్పారు. ఈ వాహనాలకు ఎవరైనా యజమానులు ఉన్నట్లైతే వారి వాహనాల కోసం బంజారాహిల్స్‌లోని ఐసీసీసీ టవర్స్‌లో దరఖాస్తు అందజేయాలన్నారు. లేదా www.hyderabadpolice.gov.in వెబ్‌సైట్‌లో కూడా చేయొచ్చన్నారు. వాహనాల పరిశీలన కోసం గోశామహాల్‌లోని శివకుమార్‌లాల్ పోలీసు స్టేడియంలో సంప్రదించాలన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

పంజగుట్ట: నవ్యశ్రీ సామాజిక సేవా సమితి ఆధ్వర్యంలో, గ్లోబల్ ఆసుపత్రి సౌజన్యంతో ఆనంద్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో ఈ నెల 11న ఉచిత మెగా హెల్త్‌క్యాంపు నిర్వహిస్తున్నట్లు నవ్యశ్రీ సామాజిక సేవా సమితి వ్యవస్థాపకుడు నాగేశ్వర్ రావు తెలిపారు. హెల్త్‌క్యాంపులో జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, కార్డియాలజీ, మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ, ఈఎన్‌టీ వైద్యులు వచ్చి వైద్యపరీక్షలు చేస్తారని ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వైద్య శిబిరం కొనసాగుతుందని, స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బాబాకు విశేష పూజలు



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నం. 12లోని భవానీనగర్ విశ్వసాయి మందిరంలో కొలువుదీరిన సాయిబాబా మాఘ మాస మహోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. వేడుకల్లో భాగంగా స్వామివారిని మాదీ ఫలరసంతో అభిషేకం చేశారు. ఉదయం బాబా ఉత్సవమూర్తికి ఏకవారాభిషేకం, సహస్రనామ పుష్పార్చన, నక్షత్ర హారతి, సాయంత్రం ప్రదోషకాలంలో విశేష అభిషేక, సహస్రనామ పుష్పార్చన నిర్వహించారు. ఉదయం కాగడ హారతి, అర్చన, మధ్యాహ్న హారతి, ధూప సేవ, రాత్రి షేజ్ హారతి, ఊంజల్ సేవా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి.

అంబేడ్కర్ విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయాలి

లిబర్టీ: భారత రాజ్యాంగ నిర్మాణ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని పంజగుట్టలో కూల్చివేసిన చోటే తిరిగి ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటన చేయాలని తెలంగాణ దళిత సంఘాల జేఏసీ చైర్మన్ రాజువస్తాద్ ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లకు విజ్ఞప్తి చేశారు. గురువారం జేఏసీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గతంలో పంజగుట్ట సర్కిల్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే మున్సిపల్ అధికారులు తొలగించి ఇతర ప్రాంతాలకు తరలించి అంబేడ్కర్‌ను అవమానించారన్నారు. దళితుల సంక్షేమం ఆర్థిక ప్రగతి కోసం పాటుపడుతున్నామని చెప్పున్న తెలంగాణ ప్రభుత్వం అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంలో ఎందుకు వెనుకడుగు వేస్తుందని ఆయన ప్రశ్నించారు. వెంటనే విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయాలని కోరారు.

ఇన్వెస్ట్‌మెంట్ అంటూ రూ.9 లక్షలు టోకరా

హిమాయత్‌నగర్: ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో నగరవాసికి సైబర్ నేరగాడు భారీగా టోకరా వేశాడు. దీంతో బాధితుడు గురువారం సిటీ సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ముర్గి చౌక్‌లో నివాసం ఉండే యువకుడికి ఇటీవల ఓ వ్యక్తి వాట్సాప్ ద్వారా పరిచయమయ్యాడు. తాను ఇన్వెస్టర్‌నని పరిచయం పెంచుకున్నాడు. టెలిగ్రామ్‌లో గ్రూప్‌లో యాడ్ చేసి పెట్టుబడి పెట్టాలని కోరాడు. 'కుకోనైట్ డాట్ బిజ్' అనే యాప్‌లో ఇన్వెస్ట్ చేయించాడు. తొలుత లాభాలు ఇవ్వడంతో నమ్మకంతో పలు దఫాలుగా రూ.9లక్షలు చెల్లించాడు. ఆ తర్వాత దీనికి ఒక్క రూపాయి కూడా లాభం ఇవ్వలేదు. మరిన్ని డబ్బులు పెట్టుబడి పెట్టాలని వేధించడంతో బాధితుడు సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కొత్త ఠాణాలకు భవనాలేవి?

● ఏసీపీ కార్యాలయాల పరిస్థితి కూడా ఇంతే? ● అధికారులు ఎక్కడ కూర్చోవాలో తెలియని దుస్థితి



బంజారాహిల్స్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్

బంజారాహిల్స్: కొత్త ఠాణాలకు కార్యాలయాలు లేవు.. సిబ్బంది లేరు... మౌలిక సదుపాయాలు అసలే లేవు.. అయితే అధికారులను నియమిస్తూ పోస్టింగ్‌లు మాత్రం ఇచ్చేశారు. ఇప్పుడు వీరంతా ఎక్కడ కూర్చోవాలి. ఏం చేయాలి అనేదానిపై స్పష్టత కరువైంది.

- వెస్ట్, సెంట్రల్ జోన్ల పరిధిలోని పోలీస్ స్టేషన్ల విభజనలో భాగంగా బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, ఎస్‌ఆర్‌నగర్, సైఫాబాద్ పోలీస్ స్టేషన్ల నుంచి సగ భాగాన్ని విడగొడుతూ కొత్త పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తూ జీఓ జారీ చేశారు. కొత్త స్టేషన్లు కలుపుకొని డివిజన్లకు ఏసీపీలను కూడా నియమించారు.
- సౌత్‌వెస్ట్‌జోన్ పేరుతో బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ నుంచి కొంత భాగాన్ని తొలగించి టోలిచౌకి పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేసి డీసీపీని నియమించారు. అయితే కొత్తగా వచ్చే అధికారులకు కార్యాలయాలు ఎక్కడ అన్నది ఇంత వరకు తేలలేదు.
- స్థానిక పోలీసులు ప్రభుత్వ కార్యాలయాల కోసం లేచింది మొదలు రాత్రిదాకా జల్లెడ పడుతున్నారు. అయినా, అనుకూలమైన కార్యాలయం మాత్రం ఎక్కడా అందుబాటులో లేదు. వెస్ట్‌జోన్ డీసీపీ కార్యాలయాన్ని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని తలపెట్టారు. అయితే ఒక్క చోట కూడా కార్యాలయాలు దొరకడం లేదు.
- యూసుఫ్‌గూడ పోలీస్‌లైన్స్‌లో ఏదైనా క్వార్టర్ దొరుకుతుందేమోనని చూస్తే అన్ని శిథిలావస్థకు చేరాయి. కొత్త పోలీస్ స్టేషన్ల సర్కారు భవనాల కోసం నెల రోజులుగా పోలీసులు గాలిస్తున్నా... ఇంత వరకూ ఒక్క స్టేషన్‌కు కూడా భవనం దొరకలేదు. అరకొర సౌకర్యాల మధ్య ఠాణాలు ఏర్పాటు చేయడానికి ఉన్నతాధికారులు ఆసక్తి చూపడం లేదు.

కొత్త పోలీస్ స్టేషన్లు ఇవే...

- బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ నుంచి రోడ్ నం .12లోని ఖాజానగర్, భోలానగర్, ఫస్టులాన్సర్, సయ్యద్‌నగర్ ప్రాంతాలను కలుపుకొని మాసబ్ ట్యాంక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేశారు. ఈ స్టేషన్‌ను ఎక్కడ ఏర్పాటు చేయాలి, కార్యాలయం ఏది అనేది ఇంకా స్పష్టత లేదు.
- జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ నుంచి కొంత భాగాన్ని తొలగించి కొత్తగా ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేశారు. ఈ స్టేషన్‌కు ఇప్పటి వరకు కార్యాలయమే లేదు.
- కొత్తగా ఏసీపీ పోస్టును క్రియేట్ చేసి నియామక ఉత్తర్వులు కూడా అందజేశారు.
- పంజగుట్ట పోలీస్ స్టేషన్ నుంచి కొంత భాగాన్ని తప్పించి కొత్తగా రహ్మత్‌నగర్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేశారు. ఈ స్టేషన్‌కు ఇప్పటి వరకు కార్యాలయం దొరకలేదు.
- రహ్మత్‌నగర్ పరిధిలోకి కొంత ఎస్‌ఆర్‌నగర్ ప్రాంతం, మరికొంత జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ ప్రాంతాన్ని తీసుకొచ్చారు.
- సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌ను రెండుగా విడగొట్టి కొత్తగా ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేశా రు. ఈ కొత్త స్టేషన్‌కు కూడా కార్యాలయం లేదు.
- ఎస్‌ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ నుంచి కొత్తగా బోరబండ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఉన్న అవుట్‌పోస్టునే బోరబండ స్టేషన్‌గా మార్చే అవకాశాలపై స్పష్టత రాలేదు.
- జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ నుంచి కొంత భాగం, ఎస్‌ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ నుంచి మరికొంత భాగాన్ని తీసుకొని బోరబండ పీఎస్‌ను ఏర్పాటు చేశారు.

సుబ్బయ్య సారుకు సీటెక్కడ?

ఇంకా ఏర్పాటు కాని జూబ్లీహిల్స్ ఏసీపీ ఆఫీస్



ఠాణాల విభజనలో భాగంగా వెస్ట్ జోన్ పరిధిలో కొత్తగా పోలీస్ స్టేషన్లతో పాటు ఏసీపీ డివిజన్లను కూడా ఏర్పాటు చేశారు. బంజారాహిల్స్ ఠాణా పరిధిలోని కొంత భాగాన్ని విడదీసి ఫిలింనగర్ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. కొత్తగా ఏర్పాటైన ఈ స్టేషన్‌తో పాటు ఇప్పుడున్న జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌ను కలిపి కొత్తగా జూబ్లీహిల్స్ పోలీస్ డివిజన్ ఏర్పాటు చేసి ఏసీపీగా సుబ్బయ్యను నియమించారు. తీరా చూస్తే..ఏసీపీ సుబ్బయ్య కూర్చోవడానికి కుర్చీ కాదు కదా.. కార్యాలయం కూడా లేకుండా పోయింది. జూబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయం ఎక్కడ అన్నది ఇంత వరకు తెలియదు. ఏసీపీ కార్యాలయం కోసం గత పది రోజుల నుంచి జల్లెడపడుతున్నా.. ఎక్కడా అనుకూలమైన ప్రభుత్వ కార్యాలయం దొరకలేదు. మరి సార్ ఎక్కడ కూర్చుంటారో చూడాల్సి ఉంది.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కొన్నేళ్లుగా హోంగార్డుగా పనిచేస్తున్న దీపక్ సింగ్ మూడ్రోజుల క్రితం అనారోగ్యంతో అపస్మారక స్థితికి జారుకొని కోమాలోకి వెళ్లాడు. కుటుంబ సభ్యులు అతడిని జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్చారు. రెక్కాడితే కానీ.. డొక్కాడని ఈ హోంగార్డు కుటుంబం వద్ద ఆస్పత్రి ఖర్చులకు పైసా కూడా లేకపోవడంతో బంజారాహిల్స్ పోలీసులు అంతా తామై చికిత్సకు కావాల్సిన వైద్య ఖర్చులను భరించేందుకు ముందుకు వచ్చారు. ఇందులో భాగంగా గురువారం బంజారాహిల్స్ ఏసీపీ సుదర్శన్, సీఐ నరేందర్, అడ్మిన్ ఎస్ఐ బాలరాజు తదితరులు అపోలో ఆస్పత్రికి వెళ్లి దీపక్ సింగ్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని ఆయన కుటుంబానికి ' 2 లక్షల ఆర్థిక సాయం అందించారు. స్టేషన్‌లో పని చేస్తున్న



ఆర్థిక సాయం అందజేస్తున్న ఏసీపీ సుదర్శన్, సీఐ నరేందర్

ఎస్ఐలు, ఇతర సిబ్బంది ఈ మొత్తాన్ని వసూలు చేసి తోటి ఉద్యోగిపై తమ మానవత్వాన్ని చాటుకున్నారు. బ్రెయిన్ స్ట్రోక్‌తో దీపక్‌సింగ్ ఆస్పత్రిలో చేరినట్లు పోలీసులు తెలిపారు.

ఇవేం రేట్లు బాబోయ్ !

బంజారా భవన్ అద్దె చూసి జనం గగ్గోలు

బంజారాహిల్స్: సామాన్య, మధ్య తరగతి ప్రజల సమావేశాలు, శుభకార్యాలకు ఒక వేదికగా అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో బంజారాహిల్స్ రోడ్ నం.10లో ఇటీవల సేవాలాల్ బంజారా భవన్ నిర్మించారు. పార్కింగ్ చదుపాయంతో విశాలమైన భవనంలో వివాహాలు, ఇతర సమావేశాలు నిర్వహించుకోవచ్చని స్థానికులు ప్రారంభోత్సవం రోజున ఆనందం వ్యక్తం చేశారు. తీరా చూస్తే ఈ భవనంలో ఏదైనా కార్యక్రమం చేసుకోవాలంటే అద్దె రేట్లు దడ పుట్టిస్తున్నాయి. ప్రారంభంలో ఆరుగంటల వ్యవధికి రూ. 85 వేలుకే ఈ హాల్‌ను ఇచ్చేవారు. ఇదేదో బాగుందని స్థానికులు సంతోషం వ్యక్తం చేసిన కొద్ది రోజులకే రేట్లు అమాంతం పెంచేశారు. ఈ నెల 6న ప్రభుత్వం కొత్తగా జీఓ జారీ చేసింది. దీని ప్రకారం ఆరు గంటల వ్యవధికి ఈ హాల్ బుక్ చేసుకోవాలంటే లక్ష రూపాయలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. అలాగే ఆరు గంటల వ్యవధికి ఈ హాల్‌కు చెల్లించాల్సిన రేటు రూ. 3 లక్షల 66 వేలుగా నిర్ణయించారు. దీంతో జనం హడలెత్తిపోతున్నారు. ఇంత డబ్బులు కట్టినా టెంట్‌హౌస్ సామగ్రి మాత్రం బయటి నుంచే తెచ్చుకోవాలి. రూ. 3.66 లక్షలు రేటు



సేవాలాల్ బంజారా భవన్

ఎందుకు నిర్ణయించారో అంతుబట్టకుండా ఉంది. చెల్లించిన రూ. లక్ష డిపాజిట్ మాత్రం కా ర్యక్రమం పూర్తయిన తర్వాత తిరిగి చెల్లిస్తారు. భగ్గుమంటున్న రేట్లపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణం రేట్లు తగ్గించాలని డిమాండ్ చే స్తున్నారు. సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ఈ రే ట్లు అందుబాటులో లేవని ఆందోళన వ్యక్తం చేస్తున్నా రు. సర్కారు భవనానికి, ప్రైవేట్ భవనానికి రేటు వి షయంలో ఏ మాత్రం తేడా లేదని స్థానికులు అంటున్నారు. సమీపంలో ఉన్న కొమరం భీమ్ కల్చరల్ సెంటర్‌లో కూడా ఈ స్థాయిలో రేట్లు లేవని దుమ్మెత్తిపోస్తున్నారు.

ఇందిర విగ్రహానికి స్క్రీన్ అడ్డుపెట్టారని కాంగ్రెస్ ధర్నా



ఐమాక్స్ రోటరీ చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఖైరతాబాద్: ఫార్ములా ఈ రేసింగ్ నేపథ్యంలో రోటరీ చౌరస్తాలోని ఇందిరాగాంధీ విగ్రహం ముందు భారీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. ఇందిరాగాంధీ విగ్రహం కనిపించకుండా స్క్రీన్ ఏర్పాటు చేయడంపై కాంగ్రెస్ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. విజయారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, అనుచరులు ఆందోళన చేస్తుండగా పోలీసులు వారిని అరెస్ట్ చేసేందుకు ప్రయత్నించారు. దీంతో విజయారెడ్డి కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి విషయం తెలియజేయడంతో వెంటనే అక్కడికి విచ్చేసిన రాములు నాయక్, అంజనీ కుమార్ తదితరులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. వెంటనే అక్కడికి చేరుకున్న ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్ కుమార్ ఇందిరాగాంధీ విగ్రహానికి అడ్డుగా ఏర్పాటు చేసిన స్క్రీన్‌ను తొలగిస్తామని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

13న బీఆర్‌ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం

రహమత్‌నగర్: సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ నెల 17న సీఎం కేసీఆర్ అధ్యక్షతన జరిగే బహిరంగ సభకు ప్రతి డివిజన్ నుంచి 500 మంది నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని హైదరాబాద్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పార్టీ శ్రేణులను కోరారు. ముఖ్యమంత్రి సభ, పార్టీ శ్రేణుల సమీకరణ తదితర అంశాలపై చర్చించేందుకు ఈ నెల 13న ఎస్పీఆర్‌హిల్స్ ప్లే గ్రౌండ్‌లో జూబ్లీహిల్స్ నియోజక వర్గం బీఆర్‌ఎస్ నాయకుల విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేశామన్నారు. గురువారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా సెక్రటేరియట్ ప్రారంభం, బహిరంగ సభలకు జూబ్లీహిల్స్ నియోజక వర్గం నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు పాల్గొనాలని పిలుపు నిచ్చారు.

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

లిబర్టీ: రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికుల ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని, తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నాయకుడు మార్టిన్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శ్రమను నమ్ముకొని పని చేస్తున్న కార్మికులు కనీస వేతనానికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణలోని 142 మున్సిపాలిటీల్లో పదికి పైగా కార్పొరేషన్లలో వేలాది మంది కార్మికులు, ఉద్యోగులు అనేకేళ్లుగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే వారిని పర్మినెంట్ చేసి కనీస వేతనం 25 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంటి వెలుగు కేంద్రాల మార్పునకు ఏర్పాట్లు

● ఆ కేంద్రాల్లో సోమవారం నుంచి వైద్యసేవలు మొదలు

రహమత్‌నగర్ : ప్రజలందరి సౌలభ్యం కోసం కంటి వెలుగు కేంద్రాలను మార్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలోనే కార్మికనగర్ కమ్యూనిటీ హాల్లో కొనసాగుతున్న కంటి వెలుగు కేంద్రాన్ని రహమత్‌నగర్ గ్రంథాలయంలోకి మార్చాలని నిర్ణయించారు. అదనంగా మరో కేంద్రాన్ని హబీబ్ ఫాతిమానగర్ ఫేజ్-1 కమ్యూనిటీ హాల్లో, బోరబండ సైట్- 2 సర్వాయి పాపన్న కమ్యూనిటీహాల్లో ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. ఆయా కేంద్రాలను సర్కిల్ 19 డీఎంసీ రమేశ్, ఏఎంహెచ్‌ఓ డాక్టర్ బిందు భార్గవి, ఈఈ రాజ్‌కుమార్, శానిటరీ సూపర్‌వైజర్ విజయ్ కుమార్, ఏఈ జమీల్ తదితరులు గురువారం సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. మౌళిక వసతులపై చర్చించారు. మూత్రశాలలు లేని చోట ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కాగా సోమవారం నుంచి ఆయా ప్రాంతాల్లో కంటి వెలుగు కేంద్రాలు పని చేస్తాయని అధికారులు తెలిపారు.

ఆకృతి లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్



ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆకృతి లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్ నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంటోంది. గురువారం తాజ్ కృష్ణా హోటల్‌లో ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్‌ను సంస్థ డైరెక్టర్ శశినాథ ప్రారంభించారు. ఈ నెల 11వ తేదీ వరకు ఈ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

–లక్ష్మీకాపూల్

'చలో అసెంబ్లీ' నిర్వహించి తీరుతాం

రాష్ట్ర ఆటో డ్రైవర్స్ సంఘాల జేఏసీ



జేఏసీ సమావేశంలో అభివాదం చేస్తున్న నేతలు

హిమాయత్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు ఎన్ని నిర్బంధాలు విధించినా 'చలో అసెంబ్లీ' కార్యక్రమాన్ని నిర్వహించి తీరుతామని తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ సంఘాల జేఏసీ నేతలు బి. వెంకటేశం , ఆర్. మల్లేష్ (ఏఐటీయూసీ), అమానుల్లా ఖాన్ (తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్) తెలిపారు. గురువారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ..ఆటో డ్రైవర్లు అందరూ బడుగు బలహీన వర్గాలకు చెందిన వారని, అనిశ్చిత ఆదాయం కారణంగా ఆటో డ్రైవర్ల జీవన స్థితిగతులు సంతృప్తికరంగా లేవన్నారు. గత 9 ఏళ్లుగా పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు 100 శాతం పెరిగాయని, కానీ ప్రభుత్వం స్పందించి ఒక్కసారి కూడా ఆటో మీటర్ చార్జీలను పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో మాదిరిగా తెలంగాణలో కూడా ప్రతి ఆటో డ్రైవర్‌కు పది వేలు, వాహన ఆటో ఇన్సూరెన్సు చార్జీలు, ఇతర ఖర్చుల కోసం ఆటో బంధు ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ భవన్ వద్ద ఉదయం 11 గంటలకు జేఏసీ ఆధ్వర్యంలో 'చలో అసెంబ్లీ' ప్రదర్శన ప్రారంభిస్తామని ప్రకటించారు. సమావేశంలో వి.కిరణ్ (ఐఎఫ్‌టీయూ), వి. మారయ్య (బీఆర్‌ఎస్ కేవీ), ఎ. సత్తిరెడ్డి (ఆటో యూనియన్) జి. మల్లేష్ (ఐఎన్‌టీయూసీ) ఎంఎ సలీం (తాడ్వా) పాల్గొన్నారు.

నిర్బంధం, అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

లిబర్టీ: నిర్బంధం.. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి సీహెచ్ జంగయ్య అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం లేదని పోలీసు రాజ్యం నడుస్తోందన్నారు. గురువారం యూనియన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 10వ తేదీన ఛలో అసెంబ్లీకి పిలుపు ఇచ్చిన నేపథ్యంలో పోలీసులు ముందస్తుగా బుధవారం రాత్రి గురువారం రోజులోనే ఆటో డ్రైవర్లను, నాయకులను అరెస్టులు చేస్తు భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీలు పెంచాలని ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఇన్సూరెన్స్ ఫీజు తగ్గించాలని ప్రమాదంలో మృతి చెందిన ఆటో డ్రైవర్ కుటుంబానికి 5 లక్షల రూపాయలు చెల్లించాలని తదితర డిమాండ్లతో ఈ నెల 10వ తేదీన ఆటో జేఏసీ ఆధ్వర్యంలో ఛలో అసెంబ్లీకి పిలుపు ఇచ్చామన్నారు. అరెస్టులతో ఉద్యమాన్ని అణచివేయాలని ప్రభుత్వం చూస్తుందన్నారు. తాము ముందస్తుగా ప్రకటించిన విధంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

టీవీనగర్ సాధనే లక్ష్యం

శ్రీనగర్‌కాలనీ: టీవీ నగర్ సాధనే లక్ష్యంగా టీవీ కళాకారులంతా ఐక్యతతో ముందుకు సాగుదామని తెలుగు టెలివిజన్ రచయితల సంఘం ఫౌండర్ ప్రెసిడెంట్ నాగబాల సురేష్‌కుమార్ అన్నారు. గురువారం తెలంగాణ రాష్ట ఫిల్మ్, టీవీ నాటక రంగాభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ కుర్మాచలంను టీవీ ఫెడరేషన్, డిజిటల్ మీడియా టెక్నీషియన్స్ అండ్ వర్కర్స్ ప్రతినిధులు కలిసి సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా టీవీ ఫెడరేషన్ నిర్వహిస్తున్న, అన్నదాన, రక్తదాన, పలు సేవా కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రెసిడెంట్ రాకేష్, కార్యదర్శి విజయ్‌కుమార్, కోశాధికారి నరేందర్‌రెడ్డి, మురళీ, గ్రాఫిక్ అసోషియేషన్ అధ్యక్షుడు మోహన్‌రాజు, మ్యూజిక్ డైరెక్టర్ ప్రెసిడెంట్ ఖుద్దూస్, డాన్స్ డైరెక్టర్స్ అధ్యక్షులు రమేష్, ఆర్‌సీఎం రాజు, సత్య, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



అనిల్ కుర్మాచలంకు వినతి పత్రం అందిస్తున్న టీవీ ఫెడరేషన్ ప్రతినిధులు

రూ.1.90 కోట్లతో హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి

వెంకటేశ్వరకాలనీ: పంజగుట్ట హిందూ శ్మశాన వాటికలో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం స్థానిక కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రజనీకాంత్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.1.90 కోట్లతో శ్మశాన వాటిక అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఆమె తెలిపారు. సకల సౌకర్యాలు ఏర్పాటు చేసే విధంగా ప్రత్యేక డిజైన్లు రూపొందించి పనులు చేపడుతున్నామని కార్పొరేటర్ చెప్పారు.



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కవితారెడ్డి

నిఘా సంస్థలను కేంద్రం దుర్వినియోగం చేస్తోంది: ఆప్



జీవీకే వన్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు

బంజారాహిల్స్: కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ నియంతలా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ ఆమ్ ఆద్మీ (ఆప్) పార్టీ నేతలు గురువారం బంజారాహిల్స్‌లోని జీవీకే చౌరస్తాలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆమ్ ఆద్మీ ఖైరతాబాద్ కన్వీనర్ మహ్మద్ మాజిద్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు అంబేడ్కర్ విగ్రహం వద్ద కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాజ్యాంగంలో పొందుపర్చిన ఫెడరల్ స్ఫూర్తికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని, ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలపై కేంద్ర నిఘా సంస్థలను దుర్వినియోగించడం అభ్యంతరకరమన్నారు. ఎలాంటి ఆధారాలు లేకున్నా ఢిల్లీ లిక్కర్ స్కాంలో ముఖ్యమంత్రి కేజ్రీవాల్ పేరును చేర్చడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు.

సేవాలాల్ జయంతి రోజున సెలవు ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ రవీందర్ నాయక్

ఆలిండియా బంజారా సేవా సంఘ్ డిమాండ్

పంజగుట్ట: సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి అయిన ఫిబ్రవరి 15వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని పలు గిరిజన సంఘాల, రాజకీయ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆలిండియా బంజారా సేవా సంఘ్ సమావేశం నిర్వహించారు. సంఘ్ అధ్యక్షుడు రాజు నాయక్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సేవాలాల్ మహరాజ్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గిరిజనులకు జరిగిన అన్యాయంపైన చర్చించారు. సమావేశంలో మాజీ మంత్రి రవీంద్ర నాయక్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ తదితరులు మాట్లాడారు. మీర్‌పేట కార్పొరేటర్ లీలానాయక్, జెడ్పీటీసీ చారులత, వివిధ గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రసాభాసగా ముగిసిన సమావేశం..

సమావేశం చివరలో గిరిజన లంబాడీల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్ మాట్లాడుతూ, తమ సంఘం ఆధ్వర్యంలో సేవాలాల్ జయంతి వేడుకలు ఈనెల 12న బంజారాహిల్స్‌లోని బంజారాభవన్‌లో నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో అక్కడే ఉన్న ఇతర సంఘాల నాయకులు మనం ఫిబ్రవరి 15వ తేదీన సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తుంటే ముందే జయంతి వేడుకలు ఎలా చేస్తారని ప్రశ్నించారు. దీంతో వారి మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగి స్వల్ప ఘర్షణ చోటు చేసుకుంది.

ఓబీసీల్లో వీరశైవ లింగాయత్ సహా 24 ఉప కులాలు

చేర్చాలని బీజేపీ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ వినతి

సాక్షి, న్యూఢిల్లీ:తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రల్లోని వీరశైవ లింగాయత్ కులంతో పాటు 24 ఉపకులాలను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ కోరారు. వీరశైవ లింగాయత్, 24 ఉపకులాల ప్రతినిధులతో కలిసి గురువారం జాతీయ బీసీ కమిషన్ (ఎన్సీబీసీ) చైర్మన్ హన్స్‌రాజ్ గంగారాం అహిర్‌ను ఢిల్లీలో కలిసి వినతిపత్రం సమర్పించారు. వీర శైవ లింగాయత్ కులం, సంచారజాతులైన బుక్క అయ్యవారాస్, గోత్రాల, బొద్దిలి, ఆరె మరాఠి మరాఠ సహా మొత్తం 24 ఉప కులాలను ఓబీసీల్లోకి చేర్చాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఆలె భాస్కర్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

దొంగతనం చేశాడన్న అనుమానంతో..

- వ్యక్తిని చితకబాదిన పోలీసులు..
- అన్యాయంగా కొట్టారని భార్య ఆరోపణ
- కిడ్నీలు దెబ్బతిన్నాయన్న వైద్యులు
- మెదక్‌లో వెలుగు చూసిన ఘటన


పోలీసుల దెబ్బలకు గాయపడిన ఖదీర్‌ఖాన్

మెదక్‌జోన్: మెదక్ జిల్లా కేంద్రంలో పోలీసులు ఓ వ్యక్తిని దొంగతనం చేశాడన్న అనుమానంతో ఐదు రోజులపాటు చితకబాదారు. గురువారం ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. బాధితుడి భార్య సిద్దేశ్వరి కథనం ప్రకారం.. మెదక్ పట్టణంలోని అరబ్‌గల్లిలో జనవరి 29వ తేదీన గుర్తు తెలియని వ్యక్తి ఓ మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు చోరీ చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా హైదరాబాద్‌లో పని చేసుకునే పిట్లంబేస్ వీధికి చెందిన మహ్మద్ ఖదీర్ అనే యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ పేరుతో ఐదు రోజులపాటు కొట్టారు. అతడి నుంచి ఎలాంటి సమాచారం రాకపోవడంతో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసి ఈనెల 2న వదిలిపెట్టారు. ఇంటికి వెళ్లిన బాధితుడు పోలీసులు కొట్టిన దెబ్బలకు మంచం పట్టాడు. ఈనెల 6వ తేదీన కుటుంబీకుల సహాయంతో కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. ఆ తర్వాత చికిత్స నిమిత్తం అతడిని కుటుంబ సభ్యులు మెదక్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. పోలీసులు తీవ్రంగా కొట్టడంతో కిడ్నీలు దెబ్బతిన్నాయని, చేతులు పనిచేయడం లేదని గురువారం బాధితుడి భార్య తెలిపింది. హైదరాబాద్‌లో లేబర్ పనిచేసుకునే తన భర్త ఖదీర్‌ను పోలీసులు అకారణంగా చితకబాదారని ఆరోపించింది. తన భర్త పరిస్థితి విషమంగా ఉందని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయంలో పోలీసు ఉన్నతాధికారులు విచారణ చేపట్టి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేసింది.

బాధితుడి కిడ్నీలు దెబ్బతిన్నాయి

మహ్మద్ ఖదీర్‌కు దెబ్బలు బలంగా తగలడంతో రెండు కిడ్నీలు దెబ్బతిని చేతులు వాపు వచ్చాయి. ఇక్కడ వైద్యం చేసినా ఫలితం లేకపోవడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి రెఫర్ చేశాం. –డాక్టర్ సంతోశ్, మెదక్ ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు

ఏడుగురిని బలిగొన్న విష వాయువులు

పెద్దాపురంలోని జి.రాగంపేట వద్ద ఆయిల్ మిల్లులో విషాదం

సాక్షి ప్రతినిధి, కాకినాడ/సాక్షి, పాడేరు/పెదబయలు: ఆంధ్రప్రదేశ్ కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం జి రాగంపేటలోని అంబటి సుబ్బన్న ఆయిల్స్ ఫ్యాక్టరీలో విష వాయువులు ఏడు నిండు ప్రాణాలను బలిగొన్నాయి. ఫ్యాక్టరీ ఆవరణలోని 24 అడుగుల లోతున్న ఐదో నంబర్ ట్యాంక్‌ను గురువారం శుభ్రం చేసేందుకు(అడుగున ఉండే వంట నూనె మడ్డిని తొలగించేందుకు) ఎనిమిది మంది కార్మికులను ప్లాంట్ సూపర్‌వైజర్ పురమాయించారు. ఈ క్రమంలో ఒక్కొక్కరూ ట్యాంక్‌లోకి దిగారు. తొలుత ట్యాంక్‌లోకి దిగాక, కళ్లు తిరిగి ఊపిరాడక పోవడంతో వెచ్చంగి కిరణ్ అనే కార్మికుడు బయటకు వచ్చేశాడు. ఇతను ఒక్కడే ప్రాణాలతో బయట పడ్డాడు. మిగిలిన ఏడుగురు కార్మికులు దుర్గాప్రసాద్, జగదీష్, వెచ్చంగి కృష్ణారావు, వెచ్చంగి నరసింగరావు, కొర్రా రామారావు, కుర్తాడి బొంజుబాబు, వెచ్చంగి సాగర్ ఒకరి తర్వాత ఒకరుగా అరగంట వ్యవధిలో మృతి చెందారు. మృతులలో ఐదుగురు అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా పాడేరు డివిజన్‌లోని పెదబయలు మండలానికి చెందిన వారు కాగా, ఇద్దరు కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం పులిమేరు వాసులు. మృతులంతా రోజు వారి కూలీలే. అంతా 35 ఏళ్ల లోపు వారే. గురువారం ఉదయం 7 – 7.30 గంటల మధ్య ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ట్యాంక్‌లో ఆక్సిజన్ 20 శాతం లోపు ఉండటంతోనే కార్బన్ డయాక్సైడ్, మోనాక్సైడ్‌తో కూడిన విష వాయువులు కమ్మేసి ఊపిరాడక ప్రాణాలు కోల్పోయారని సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాధాకృష్ణ చెప్పారు. మృతదేహాలను బయటకు తీసుకువచ్చేందుకు ట్యాంకర్‌ను కట్ చేయాల్సి వచ్చింది. ఫ్యాక్టరీని సీజ్ చేసి, కార్యకలాపాలను నిలిపివేశారు. యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. మృతుల కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉండాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ప్రభుత్వం తరఫున ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం ప్రకటించారు.

లండన్ కేంద్రంగా ఫార్ములా-ఈ ప్రత్యక్ష ప్రసారం

- ప్రత్యక్ష ప్రసారం చేయనున్న ఛానెల్ 4, యూరోస్పోర్ట్

సాక్షి, హైదరాబాద్: నగరం వేదికగా ప్రతిష్టాత్మకంగా శనివారం జరగనున్న ఫార్ములా-ఈ వరల్డ్ చాంపియన్‌షిప్‌ను లండన్‌లోని చానెల్ 4, యూరోస్పోర్ట్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. భారత్‌లో మొదటిసారి నిర్వహిస్తున్న ఫార్ములా-ఈ రేసింగ్ అంతర్జాతీయంగా 150కిపైగా దేశాల్లో నలభైకి పైగా ప్రసార సంస్థలు ప్రత్యక్ష ప్రసారం చేయనున్నాయి. లండన్‌లోని గ్రావిటీ మీడియా ప్రొడక్షన్ సెంటర్ కేంద్రంగా అంతర్జాతీయ ఫార్ములా-ఈ రేసింగ్‌ను ఉదయం 9 గంటల గ్రీన్‌విచ్ మీన్ టైంలో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నామని గ్రావిటీ మీడియా మేనేజింగ్ డైరెక్టర్ ఎడ్ టిస్సర్ తెలిపారు. వైట్ సిటీలోని పాత బీబీసీ టెలివిజన్ సెంటర్‌లో అధునాతన సాంకేతికతతో అభివృద్ధి చేసిన న్యూస్టేట్-ఆఫ్-ది-ఆర్ట్ ప్రొడక్షన్ సదుపాయంతో అంతర్జాతీయంగా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు పేర్కొన్నారు.

జాతీయ లోక్ అదాలత్ 11న


సాక్షి, హైదరాబాద్: జాతీయ లోక్ అదాలత్ ఈ నెల 11న నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యకార్యదర్శి ఎస్.గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. జాతీయ లీగల్ సర్వీసెస్ అథారిటీ సూచనల మేరకు రాష్ట్రంలో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. కక్షిదారులు ఇందులో పాల్గొని దీర్ఘకాలికంగా కొనసాగుతున్న కేసులను పరిష్కరించుకోవచ్చని సూచించారు.

యూటీఎస్ యాప్ వాడకంలో ద.మ.రైల్వే టాప్

సాక్షి, హైదరాబాద్: అన్‌రిజర్వ్‌డ్ టికెట్ సిస్టమ్ (యూటీఎస్), ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ మెషీన్స్ (ఏటీవీఎం) వినియోగంలో దక్షిణమధ్య రైల్వే దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది జనవరి వరకు 37 శాతం సాధారణ టికెట్‌లను ప్రయాణికులు యూటీఎస్ యాప్, ఏటీవీఎంల ద్వారా కొనుగోలు చేసినట్లు అధికారులు తెలిపారు. యూటీఎస్ ద్వారా డిజిటల్ చెల్లింపులకు అవకాశం ఉండటం వల్ల జనరల్ టికెట్‌లను కొనుగోలు చేసే ప్రయాణికులు చాలా వరకు దీనినే వినియోగిస్తున్నారు. రైల్వేస్టేషన్‌లలో గంటల తరబడి టికెట్ కౌంటర్‌ల వద్ద పడిగాపులు కాయాల్సిన అవసరం లేకుండా క్షణాల్లో టికెట్ తీసుకొనే సదుపాయం ఉండటంతో ఈ యాప్‌నకు ప్రాధాన్యత పెరిగింది. దేశవ్యాప్తంగా నిత్యం సుమారు 5 లక్షల మంది ఈ యాప్ ద్వారా, ఏటీవీఎంల ద్వారా సాధారణ టికెట్‌లను కొంటుండగా వారిలో 1.85 లక్షల మంది (37 శాతం) దక్షిణమధ్య రైల్వే పరిధిలోనే కావడం విశేషం. రైలు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాన్ని అందించేందుకు డిజిటల్ పద్ధతులను ప్రోత్సహిస్తున్నట్లు దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ చెప్పారు. యూటీఎస్, ఏటీవీఎంల ద్వారా ప్లాట్‌ఫాం టికెట్‌లను కూడా కొనుగోలు చేయవచ్చన్నారు.

బీసీ అట్రాసిటీ చట్టం చేయండి

కేంద్రానికి ఎంపీ కృష్ణయ్య వినతి



సాక్షి, న్యూఢిల్లీ: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం తరహాలో దేశంలో బీసీలకు సామాజిక రక్షణ, భద్రత కల్పించడానికి బీసీ అట్రాసిటీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వీలైనంత త్వరగా తీసుకురావాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం బీసీల సంక్షేమానికి రూ.రెండు లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించి ఆర్థిక విద్య, ఉద్యోగ, శిక్షణ, అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీ ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు గుజ్జ కృష్ణ, భూపేష్ సాగర్, వేముల రామకృష్ణ, నందగోపాల్, ఎస్.మారేష్, బాషయ్య, రాకేశ్ కుమార్ గురువారం కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పురీని కలిశారు. ఈ సందర్భంగా 15 అంశాలతో కూడిన బీసీల డిమాండ్లపై కేంద్రమంత్రితో చర్చించారు. పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, కేంద్ర ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే జనగణనలో బీసీ కులగణన చేపట్టాలని కోరారు. జాతీయ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ రుణాలపై విధించిన షరతులను ఎత్తివేయాలని, బీసీ కార్పొరేషన్ బడ్జెట్‌లో ఏటా రూ.50 వేల కోట్లు కేటాయించాలని, ప్రతి కుటుంబానికి రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు 80 శాతం రాయితీ రుణాలు మంజూరు చేయాలని ఎంపీ కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు.

కోట్ల వసూళ్లకు పాల్పడుతున్నాడు

రేవంత్‌రెడ్డిపై మంత్రి కేటీఆర్ ధ్వజం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై పురపాలక, పరిశ్రమల శాఖ మంత్రి కె. తారక రామారావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గురువారం అసెంబ్లీలో పద్దుల గురించి చర్చ సందర్భంగా కాంగ్రెస్ సభ్యులు ధరణికి సంబంధించి లేవనెత్తిన అంశాలపై మంత్రి కేటీఆర్ జోక్యం చేసుకుంటూ రేవంత్‌తో సహవాసంతో సభలోని కాంగ్రెస్ సభ్యులు కూడా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ అరాచకంగా, అడ్డగోలుగా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. ''ఆయన ఏం భాష మాట్లాడుతున్నాడు? ఒక పార్టీ అధ్యక్షుడు మాట్లాడే భాషేనా అది? ముఖ్యమంత్రి ఎవరు అయితే వారు ప్రగతి భవన్‌లో ఉంటారు. అది అధికార నివాసం. అలాంటి ప్రగతి భవన్‌ను బాంబులతో పేల్చేస్తానని ఎలా మాట్లాడతాడు? కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి సహచర్యంతో శ్రీధర్‌బాబు సైతం తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. నిజానికి శ్రీధర్‌బాబు, భట్టి మంచివారే. కానీ పార్టీలో సహవాస దోషంతో ఇలా తయారయ్యారు. వాళ్ల అధ్యక్షుడు అడ్డగోలుగా మాట్లాడే అలవాటుతో వీళ్లు కూడా ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారు. వాళ్ల అధ్యక్షుడు బ్లాక్‌మెయిల్ చేసి రూ. కోట్లకు కోట్లు వసూళ్లు చేస్తున్నాడు. ఇందుకోసం కొందరు విశ్రాంత తహసీల్దార్లు, ప్రైవేటు వ్యక్తులతో ఓ దఫ్తర్ (కార్యాలయం)నే తెరిచాడు. చివరకు సమాచార హక్కు చట్టాన్ని కూడా ఆదాయ మార్గంగా మార్చుకున్నాడు. అట్లాంటి వాళ్లకు ధరణితో ఇబ్బందులు అనిపిస్తాయి... సాధారణ ప్రజలకు కాదు. ధరణి రద్దు, ప్రగతి భవన్ పేల్చివేతే మీ విధానామా? ధరణిని రద్దు చేసి లంచాల కోసం రైతులను పీడించిన కాంగ్రెస్ హయాంలోని పద్ధతినే తేవాలనుకుంటున్నారా? ఏ విషయం చెప్పండి'' అని కేటీఆర్ ప్రశ్నించారు. ధరణిని రద్దు చేయాలంటూ భట్టి, శ్రీధర్‌బాబు చేసిన డిమాండ్‌పై మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి జోక్యం చేసుకుని, ''మరి మీ అధ్యక్షుడు ప్రగతి భవన్‌ను బాంబులతో పేల్చేస్తానంటున్నాడు. దానిపై సీఎల్పీ వైఖరి ఏమిటో కూడా చెబితే బాగుంటుంది'' అని పేర్కొన్నారు.

లోపాలపుట్ట ధరణి..

దాన్ని రద్దు చేయాలి: భట్టి, శ్రీధర్‌బాబు

పేదలను ముప్పుతిప్పలు పెడుతున్న ధరణి పోర్టల్‌ను రద్దు చేయాలని కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత మల్లు భట్టి విక్రమార్క, ఆ పార్టీ సభ్యుడు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు డిమాండ్ చేశారు. పద్దులపై చర్చలో భాగంగా వారు ఈ అంశాన్ని ప్రస్తావించారు. భూముల పట్టాకు సంబంధించి గతంలో ఉన్న చాలా కాలమ్స్‌ను తొలగించి ధరణిని తీసుకొచ్చారని, ఇది పేదల తీవ్ర ఇబ్బందిగా మారిందని వారు పేర్కొన్నారు. పట్టా రికార్డుల్లో దశాబ్దాలుగా పేరు ఉన్నప్పటికీ ధరణిలో కాస్తు కాలమ్‌ను తొలగించడంతో చాలా మంది భూమి హక్కులు కోల్పోవాల్సి వచ్చిందన్నారు. ఆ భూములు బడా బాబుల పరమయ్యాయని భట్టి, శ్రీధర్‌బాబు ఆరోపించారు. కొంత భూభాగానికి సంబంధించి ఏదైనా సమస్య ఏర్పడితే మొత్తం సర్వే నంబర్‌నే నిషేధిత జాబితాలో ఉంచుతున్నారని విమర్శించారు. గతంలో అసైన్ చేసిన భూములను కూడా ఇప్పుడు వెనక్కు తీసుకొని వేలం ద్వారా బడాబాబులకు కేటాయిస్తున్నారని శ్రీధర్‌బాబు ఆరోపించారు. ఫార్మాసిటీ కోసం పేదల భూములను ఎకరా రూ. 8 లక్షలకు తీసుకొని రూ. 1.30 కోట్లకు ఎకరం చొప్పున బడా బాబులకు కట్టబెట్టారని ఆరోపించారు.

ధరణితో ప్రజల్లో సంతోషం: మంత్రి ప్రశాంత్‌రెడ్డి

ధరణి పోర్టల్‌పై కాంగ్రెస్ సభ్యుల ఆరోపణలను మంత్రి ప్రశాంత్‌రెడ్డి తోసిపుచ్చారు. సాధారణ ప్రజలు ధరణితో పూర్తి సంతోషంగా ఉన్నారని, అది అందుబాటులోకి వచ్చిన తర్వాత 24 లక్షల లావాదేవీలు జరిగాయని చెప్పారు. ధరణిని రద్దు చేసి మళ్లీ లంచాల బాగోతం, ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులను ఎందుకు కోరుతున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ తీరుపై ప్రజలే నిర్ణయం తీసుకుంటారన్నారు. అయితే ధరణి బాధలు ఏమిటో క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలిస్తే తెలుస్తాయని, ఓ తహసీల్దార్‌ను హత్య చేసే వరకు సమస్య ఏర్పడిందంటే సమస్య తీవ్రత తెలియడం లేదా? అని భట్టి ప్రశ్నించారు.

నిరూపించకుంటే శ్రీధర్‌బాబు క్షమాపణ చెప్పాలి..

శ్రీధర్‌బాబు చేసిన ఆరోపణలను మంత్రి కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. అలా ఎకరం కాదుకదా.. కనీసం ఒక్క గజం ఇచ్చినట్లు నిరూపించాలని, లేనిపక్షంలో శ్రీధర్‌బాబు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వెంటనే ఆ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని స్పీకర్‌ను కోరారు. ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకోని శ్రీధర్‌బాబు... ధర విషయంలో తాను చెప్పింది తప్పయితే ఎంతకు ఇచ్చారో బయటపెట్టాలని డిమాండ్ చేశారు. దీంతో ఆయన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు. భూసంబంధిత సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైతే వేరే వ్యవస్థలు పుట్టుకొస్తాయని, ఇది మంచి పరిణామం కాబోదని భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు.

నిషేధిత భూములూ కట్టబెట్టారు

- కేసీఆర్, కేటీఆర్‌పై రేవంత్ ఆరోపణలు

సాక్షి, మహబూబాబాద్: రాష్ట్రాన్ని పాలిస్తున్న కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, ఆయన కుమారుడు ద్రామారావు (కేటీఆర్‌ను ఉద్దేశించి)లు పెద్ద భూ కబ్జాదారులని టీపీసీసీ అధ్యక్షుడు, ఎంపీ ఎ.రేవంత్‌రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ భూములను వారి అనుచరులకు ధారాదత్తం చేసి, అందులో వాటాలు తీసుకున్న మాఫియా అని, నిషేధిత భూములూ కట్టబెట్టారని ధ్వజమెత్తారు. పార్టీ హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా గురువారం మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గంలోని నర్సింహులపేట, మరిపెడ మండలాల్లో ఆయన పర్యటించారు. మధ్యాహ్నం విలేకరుల సమావేశంలో, తర్వాత మరిపెడలో ఏర్పాటు చేసిన సభలో రేవంత్ ప్రసంగించారు.

ఆ కలెక్టర్లు కటకటాల పాలే..

'పోరాడి సాధించుకున్న తెలంగాణను కేసీఆర్ చేతిలో పెడితే, ఆయన ప్రభుత్వ భూములను తమ అనుచరులకు కట్టబెడుతూ భూ మాఫియా పాలన సాగిస్తున్నారు. రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో అనుకూలమైన కలెక్టర్లను పెట్టుకొని వేలాది ఎకరాలను కబ్జా చేశారు. తెల్లాపూర్‌లో ప్రతిభ శ్రీనివాస్ పేరు మీద 100 ఎకరాల భూమిని అమెరికా కంపెనీ కొనుక్కుంటే..రూ.4 వేల కోట్ల విలువైన ఆ భూమిని రూ.260 కోట్లకు ప్రభుత్వం బెదిరించి బదలాయించుకుంది. ఈ రోజు అందులో వేలాది కోట్ల వ్యాపారం చేస్తున్నారు. ఇందులో కేటీఆర్‌కు భాగస్వామ్యముంది..' అని రేవంత్ రెడ్డి ఆరోపించారు. 'కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు 2004లో ప్రభుత్వ భూములను గుర్తించి నిషేధిత జాబితాలో చేర్చింది. కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత కలెక్టర్లు ఆయన చెప్పింది విని అక్రమ భూ దందాకు పాల్పడ్డారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములూ ధారాదత్తం చేశారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కలెక్టర్లకు తగిన శాస్తి జరుగుతుంది. 2024లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఈ అవినీతి కలెక్టర్లు కటకటాల పాలు అవుతారు..' అని అన్నారు.



మరిపెడలో జరిగిన సభలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమేనా.. ?

'నేను భూ కుంభకోణంలో ఉన్నట్లు ఆరోపణలు చేస్తున్నారు. దీనిని స్వీకరిస్తా. నాపై ఏ విచారణ చేసినా స్వాగతిస్తా. హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపినా నేను సిద్ధమే.. అదేవిధంగా ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుమారుడు రామారావులు, ఇతర నాయకులపై వస్తున్న ఆరోపణలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపేందుకు సిద్ధమేనా..?' అని రేవంత్ సవాల్ విసిరారు.

భూములు కాజేస్తున్నారు..

'ప్రభుత్వం భూరికార్డుల ప్రక్షాళన పేరుతో ప్రవేశపెట్టిన ధరణి వెబ్‌సైట్ వచ్చిన తర్వాతే భూ సమస్యలు ఎక్కువయ్యాయి. దీని పేరుతో సమస్యలు సృష్టించి ప్రభుత్వ భూములు, నిజాం భూములను కాజేస్తున్నారు. ఈ ధరణిని ఐఎల్అండ్ఎఫ్ఎస్ సంస్థకు అప్పగించారు. ఇది ప్రైవేట్ సంస్థ. ప్రజల భూముల వివరాలు ప్రైవేట్ వ్యక్తులకు తెలిపి వాటిని కబ్జా చేసేందుకు ఇది వేదిగా ఉపయోగపడుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ధరణిని రద్దు చేస్తాం. ప్రజలు, ప్రభుత్వ భూములకు రక్షణ కలిస్తాం..' అని హామీ ఇచ్చారు.

అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్‌గా..

'ప్రజల కష్టంతో చెల్లించిన పన్నుల ద్వారా రూ.2వేల కోట్లు పెట్టి నిర్మించిన ప్రగతి భవన్.. దొరగారు, అయన బానిస రాజులకు అడ్డాగా మారింది. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఈ భవన్‌కు అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్‌గా పేరు మార్చి శాస్త్రవేత్తలు, మేధావులను తయారు చేసే కేంద్రంగా మారుస్తాం..' అని రేవంత్ అన్నారు. తనకు భూ కబ్జాలతో సంబంధం లేదని చెబుతున్న మహబూబాబాద్ ఎంపీ కవిత కబ్జాల వివరాలు కాంగ్రెస్ నాయకులు బెల్లయ్య నాయక్, బలరాం నాయక్‌లు పత్రాలతో సహా చూపించారని చెప్పారు. 'రాష్ట్రాన్ని దోచుకుంటూ ప్రజలను హీనంగా చూస్తున్న కేసీఆర్ కాలభైరవ పాలన పోవాలి.. కాంగ్రెస్ పాలన రావాలి..' అని పిలుపునిచ్చారు.

గోడ దూకి గురుకులంలోకి..

పాదయాత్రలో భాగంగా మరిపెడ శివారులోని సాంఘిక సంక్షేమ పాఠశాలకు రేవంత్‌రెడ్డి వస్తున్నారు అనే విషయం తెలియడంతో సిబ్బంది గేట్లు వేశారు. దీంతో ప్రహరీ గోడదూకిన రేవంత్ గురుకులంలోకి ప్రవేశించి విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు.

కృష్ణానదిలో మునిగి ముగ్గురు మృతి

- స్నానానికి దిగి నీటి ఉధృతికి కొట్టుకుపోయి...
- నాగార్జునసాగర్ పుష్కరఘాట్ వద్ద విషాద ఘటన
- రాత్రికి లభ్యమైన ముగ్గురి మృతదేహాలు

నాగార్జునసాగర్: కృష్ణానదిలో స్నానానికి దిగి నీటిఉధృతికి కొట్టుకుపోయి ముగ్గురు యువకులు మృతి చెందిన విషాద ఘటన సాగర్ ప్రాజెక్టు దిగువన శివాలయం పుష్కరఘాట్ వద్ద చోటుచేసుకుంది. వివరాలిలా... నాగార్జునసాగర్ లోని హైలాన్ కాలనీకి చెందిన కేశవపంతుల వెంకటేశ్వరశర్మ పెద్దకుమారుడు చతుర్వేది ఉపనయనం గురువారం సాగర్ కృష్ణానది తీరంలోని శివాలయంలో జరిగింది. ఇది ముగిసిన అనంతరం సాయంత్రం వెంకటేశ్వరశర్మ చిన్న కుమారుడు వాచస్పతి(20), బంధువు ఉప్పల దత్తు కుమారుడు చంద్రకాంత్(28), వెంకటేశ్వరశర్మ బావమరిది నాగరాజు(39) స్నానం చేసేందుకు సాగర్ ప్రాజెక్టు దిగువన కృష్ణానదిలోకి వెళ్లారు. అదే సమయంలో ప్రాజెక్టు జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి నీరు విడుదలైంది. నీటి ఉధృతికి వాచస్పతి, చంద్రకాంత్, నాగరాజు ఒక్కొక్కరుగా కొట్టుకుపోయారు. దూరం నుంచి గమనించిన బంధువులు హాహాకారాలు చేస్తూ నది వద్దకు పరుగెత్తారు. అప్పటికే ముగ్గురూ నీటిలో మునిగిపోయారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు, మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది వచ్చి గాలింపు చేపట్టారు. రాత్రి వరకు గాలింపు చేపట్టగా.. కొంతదూరంలో ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. వాచస్పతి గ్వాలియర్‌లోని ట్రిబుల్ ఐటీలో ఇంజనీరింగ్ చదువుతున్నాడు. చంద్రకాంత్ సాగర్‌లోని నాట్కోలో ఉద్యోగం చేసి ప్రస్తుతం ఖాళీగా ఉన్నాడు. నాగరాజు హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. కాగా, ఇదే శివాలయంలో శుక్రవారం నాగరాజు కుమారుడి ఉపనయం జరగాల్సి ఉంది. ఇంతలోనే ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. సాగర్ ప్రాజెక్టు జల విద్యుత్ కేంద్రంలోని 8 యూనిట్లు రన్ అవుతుండడం వల్ల నీటి విడుదల అధికంగా జరిగిందని, నీటి ఉధృతికి ముగ్గురూ కొట్టుకుపోయారని మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి చెప్పారు.

వెయ్యి కోట్లతో మహీంద్రా ఈవీ ప్లాంట్

▶ మొదటి పేజీ తరువాయి

తన నిర్ణయాన్ని ప్రకటించింది. ప్రస్తుతం జహీరాబాద్‌లో ఉన్న తయారీ ప్లాంట్ విస్తరణకు ఈ ఎంవోయూ ఉపకరించనుంది. సుమారు రూ. 1,000 కోట్లతో చేపట్టనున్న ఈ విస్తరణ ద్వారా 1,000 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని కంపెనీ ప్రకటించింది. భవిష్యత్తులో ఎలక్ట్రిక్ వెహికల్, ఎనర్జీ స్టోరేజ్ సిస్టం తయారీ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు సైతం సిద్ధంగా ఉన్నట్లు తెలిపింది.

సస్టెయినబుల్ మొబిలిటీ రంగం అభివృద్ధికి కృషి: కేటీఆర్

దేశంలో సస్టైనబుల్ మొబిలిటీ రంగాన్ని మరింతగా వృద్ధి పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ మొబిలిటీ వ్యాలీ (టీఎంవీ) కృషి చేస్తుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కె. తారక రామారావు చెప్పారు. టీఎంవీ లక్ష్యాలకు అనుగుణంగా మహీంద్రా అండ్ మహీంద్రాతో తెలంగాణ ప్రభుత్వం ఎంవోయూ కుదుర్చుకుందన్నారు. తెలంగాణ మొబిలిటీ వ్యాలీ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న నాలుగు మెగా ఈవీ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్లలో జహీరాబాద్ ఒకటని తెలిపారు. మహీంద్రా అండ్ మహీంద్రా అత్యున్నత ప్రమాణాలతో కూడిన తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులు ఇక్కడ ఉన్నాయని అన్నారు. తెలంగాణ ప్రభుత్వంతో ఎంవోయూపై మహీంద్రా అండ్ మహీంద్రా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేష్ జేజురికర్ హర్షం వ్యక్తం చేశారు. జహీరాబాద్‌లోని తయారీ ప్లాంట్ విస్తరణ ద్వారా త్రీ వీలర్ కేటగిరీలో మరిన్ని వాహనాలను ఇక్కడి నుంచి ఉత్పత్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ పాల్గొన్నారు.



మంత్రి కేటీఆర్ సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న దృశ్యం

మాజీ ఐఏఎస్, కవి జె.బాపురెడ్డి కన్నుమూత

నేడు హైదరాబాద్‌లో అంత్యక్రియలు

సిరిసిల్ల కల్చరల్: రాజన్నసిరిసిల్ల జిల్లాకు చెందిన మాజీ ఐఏఎస్ అధికారి జె.బాపురెడ్డి(86) బుధవారం హైదరాబాద్‌లో కన్నుమూశారు. శుక్రవారం ఉదయం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. బాపురెడ్డి భార్య పదేళ్ల క్రితం కాలం చేశారు.బాపురెడ్డి ఇల్లంతకుంట మండలం సిరికొండకు చెందిన జంకె కృష్ణారెడ్డి, రామలక్ష్మి దంపతులకు 1936, జూలై 21న జన్మించారు. సినారె స్ఫూర్తితో 8వ ఏట నుంచి రచనలు చేశారు. పద్యం, గేయం, వచనం, విమర్శ, అనువాదం వంటి సాహితీ విభాగాల్లో రాణించారు. 36 పుస్తకాలు రచించారు. చైతన్యరేఖలు, రాకెట్ రాయబారం వంటి గేయసంపుటాలు, 'మనసులో మాట'వ్యాససంపుటి, ప్రణవప్రణయం, రంగురంగుల చీకట్లు వంటి పుస్తకాలను వెలువరించారు. తెలుగు, ఆంగ్లంతోపాటు పలు భారతీయ భాషల్లోకి సైతం ఆయన పుస్తకాలు అనువాదమయ్యాయి. ప్రపంచ కళాసంస్కృతుల అకాడమీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. 'మన చేతుల్లోనే ఉంది'గ్రంథానికి తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ వచన కవితా పురస్కారం అందుకున్నారు. 2016లో రాష్ట్ర ప్రభుత్వం దాశరథి పురస్కారంతో సత్కరించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఆర్థికశాస్త్రంలో స్నాతకోత్తర పట్టభద్రుడయ్యారు. ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్‌లో చేరి మెదక్, వరంగల్ జిల్లాల కలెక్టర్‌గా విధులు నిర్వహించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎం స్పెషల్ అసిస్టెంట్‌గా, భారత పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా, పరిశ్రమల అభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా, ఏపీపీఎస్సీ సభ్యుడిగా విధులు నిర్వహించారు. పరిశ్రమల శాఖలో ఎన్నో సంస్కరణలకు ఆద్యుడిగా పేరుగాంచారు. ప్రపంచ పర్యాటకుడిగా గుర్తింపు పొందిన ఆయన 37 దేశాల్లో పర్యటించారు. బాపురెడ్డి మరణంపై సాహితీవేత్తలు దిగ్భ్రాంతి చెందారు. సాహితీవేత్తలు బీఎస్ రాములు, డాక్టర్ పత్తిపాక మోహన్, జూకంటి జగన్నాథం తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.



మాజీ ఐఏఎస్ జె. బాపురెడ్డి

రేపు ఐపీఎస్‌ల దీక్షాంత్ పరేడ్

సాక్షి, హైదరాబాద్: ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్) శిక్షణలో భాగంగా 191 మంది యువ ఐపీఎస్‌లు బేసిక్ కోర్సును విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. 74వ రెగ్యులర్ రిక్రూట్స్ బ్యాచ్‌కు చెందిన వారంతా శనివారం సర్దార్ వల్లభ్‌భాయ్ జాతీయ పోలీసు అకాడమీలో నిర్వహించనున్న దీక్షాంత్ పరేడ్‌లో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా ముఖ్యఅతిథిగా హాజరు కానున్నట్లు అకాడమీ డైరెక్టర్ ఏఎస్ రాజన్ తెలిపారు. ఈ బ్యాచ్‌లో 166 మంది ఐపీఎస్ ట్రైనీ అధికారులతోపాటు 29 విదేశీ ట్రైనీ అధికారులతో కలిపి మొత్తం 195 మంది తొలిదశలో శిక్షణ పూర్తి చేసుకున్నారని తెలిపారు. 166 మంది ఐపీఎస్ ప్రొబేషనర్లలో 129 మంది పురుషులు, 37 మంది మహిళలు ఉన్నారన్నారు. దీక్షాంత్ పరేడ్ కమాండర్‌గా కేరళ కేడర్‌కు చెందిన ప్రొబేషనరీ ఐపీఎస్ కేఎస్ షెహన్ షా వ్యవహరిస్తారని రాజన్ చెప్పారు. తెలంగాణ కేడర్‌కు అవినాశ్‌కుమార్, శేషాద్రినిరెడ్డి, అంకిత్ శంక్వార్, మహేశ్‌బాబా సాహెబ్, శివం ఉపాధ్యా యలను కేటాయించగా ఏపీ కేడర్‌కు పంకజ్ కుమార్ మీనా, అంకితా సురానాలను కేటాయించింది.

అకడమిక్ గ్రాండ్ చాలెంజ్ ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: వాతావరణ మార్పులతో ఎదురవుతున్న ప్రమాదాలను అరికట్టే లక్ష్యంతో తెలంగాణ ఏఐ మిషన్ (టీ ఎయిమ్), క్యాప్ జెమిని సంయుక్త భాగస్వామ్యంతో అకడమిక్ గ్రాండ్ చాలెంజ్‌ను ప్రారంభించాయి. ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో వడగాడ్పుల సంభావ్యత, వాయు నాణ్యత సూచీపై దేశవ్యాప్తంగా విద్యార్థులు చాలెంజ్‌లో పాల్గొని పరిష్కారాలు కనుగొనే అవకాశం ఉంటుంది. ఈ గ్రాండ్ చాలెంజ్‌లో అగ్రస్థానంలో నిలిచే 10 విద్యార్థి బృందాలకు ఉమ్మడిగా రూ.10 లక్షల సీడ్ ఫండింగ్‌తోపాటు సంబంధిత రంగాల నిపుణులతో మార్గదర్శకత్వం కూడా లభిస్తుంది. ఆసక్తి ఉన్న విద్యార్థులు తమ ఆలోచనలను మూడు వారాల్లోపు పంపాల్సి ఉంటుంది. వాటిని మదింపు చేసి మార్చి మూడో వారంలో విజేతలను ప్రకటిస్తారు.

లోకేశ్ పాదయాత్రలో కానిస్టేబుల్ మృతి


హెడ్‌కానిస్టేబుల్ రమేష్ (ఫైల్)

సాక్షి, చిత్తూరు/గంగాధర నెల్లూరు/పాలసముద్రం: మొన్న చంద్రబాబు సభలు పలువురు ప్రజలను బలి తీసుకోగా, నేడు ఆయన కుమారుడు లోకేశ్ సభ ఓ హెడ్ కానిస్టేబుల్ ప్రాణాలు తీసుకుంది. గురువారం గంగాధర నెల్లూరు మండలం సంశిరెడ్డిపల్లెలో నిర్వహించిన పాదయాత్రలో ఈ విషాద ఘటన జరిగింది. సంశిరెడ్డిపల్లెలో లోకేశ్ అనుమతుల్లేకుండానే, జాగ్రత్తలు తీసుకోకుండానే మాట్లాడటం ప్రారంభించారు. దీంతో పోలీసులు అడ్డు చెప్పారు. ఈ సందర్భంగా పోలీసులు, టీడీపీ కార్యకర్తల మధ్య తీవ్ర స్థాయిలో తోపులాట జరిగింది. టీడీపీ కార్యకర్తలు పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ తీవ్ర అలజడి సృష్టించారు. ఈ సమయంలో అక్కడే బందోబస్తు విధుల్లో ఉన్న చిత్తూరు జిల్లా ఐరాల పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఎ.రమేష్ (54) తీవ్ర అస్వస్థతతో గుండెపోటుకు గురయ్యారు. పోలీసులు వెంటనే ఆయన్ని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే హెడ్‌కానిస్టేబుల్ మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. ఎండీ మంగళం సమీపంలోని ఆలయం వద్ద లోకేశ్ మరో సభ నిర్వహించారు. ఇదీ నిబంధనలకు విరుద్ధంగానే జరిగింది. ఇక్కడ ఆలయం వద్ద ఉన్న శూలం గుచ్చుకుని మండలంలోని టీడీపీ కార్యకర్తకు గాయాలయ్యాయి.

అమరావతే రాజధాని అని కేంద్రం ఎక్కడ చెప్పింది?

ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మండిపాటు

- సుప్రీంకోర్టులో కేంద్రం అఫిడవిట్‌ను వక్రీకరిస్తూ ఎల్లో మీడియా రాద్ధాంతం


సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని నిబంధనల మేరకే 2015లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం అమరావతిని రాజధానిగా ప్రకటించిందని సుప్రీంకోర్టులో కేంద్ర హోంశాఖ దాఖలు చేసిన అఫిడవిట్‌లో ఎక్కడ ఉందో చూపాలని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, ఎల్లో మీడియాను ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు), వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి నిలదీశారు. కేంద్రం అఫిడవిట్‌లో ఎక్కడా చెప్పకపోయినా.. అమరావతే ఏకైక రాజధానిగా తేల్చి చెప్పినట్లు ఈనాడు, ఈటీవీ, టీవీ–5, ఇతరత్రా ఎల్లో మీడియా వక్రీకరించి రాద్ధాంతం చేస్తే.. దాన్ని పట్టుకుని చంద్రబాబు సీఎం వైఎస్ జగన్‌పై స్థాయిని మరచి నోరు పారేసుకున్నారని మండిపడ్డారు. గురువారం ఆయన వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రాజధాని నిర్ణయం రాష్ట్రానిదే అని కేంద్రం ఎప్పుడో చెప్పిందన్నారు. ఇక్కడ హైకోర్టులో కూడా కేంద్రం ఇదే కేసులో అదే విషయం చెబుతూ అఫిడవిట్ వేసిందని తెలిపారు. అప్పటి ప్రభుత్వం సీఆర్‌డీఏ చట్టం చేసినప్పుడు తమను సంప్రదించలేదని.. సీఆర్‌డీఏ చట్టాన్ని రద్దు చేసి, దాని స్థానంలో మూడు రాజధానుల చట్టాన్ని ప్రస్తుత ప్రభుత్వం చేసినప్పుడు, దాన్ని రద్దు చేసినప్పుడు తమను సంప్రదించలేదని అఫిడవిట్‌లో కేంద్రం పేర్కొందన్నారు. అంటే రాజధాని నిర్మాణంతో తమకు సంబంధం లేదనే స్పష్టత కేంద్రానికి ఉందని చెప్పారు.



చంద్రబాబు గ్రాఫిక్స్‌తో రూపొందించిన అమరావతి ఒట్టి భ్రమేనని, మూడు ప్రాంతాల ప్రజల ఆకాంక్షల మేరకు.. రాష్ట్ర సమగ్రాభివృద్ధే లక్ష్యంగా మూడు రాజధానుల ఏర్పాటు చేయాలన్నదే సీఎం వైఎస్ జగన్ విధానమని తేల్చి చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా మూడు రాజధానులను ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సజ్జల ఇంకా ఏమన్నారంటే..

కేంద్రాన్ని సంప్రదించే రాజధాని ప్రకటించారా?

- విభజన చట్టంలో సెక్షన్ 5, 6కు అనుగుణంగా రాజధాని ప్రత్యామ్నాయాల అధ్యయనానికి కేంద్రం నియమించిన శివరామకృష్ణన్ కమిటీ 2014 ఆగస్టు 27న నివేదిక ఇచ్చింది. దీని కంటే ముందే 2014 జూలై 20న నాటి మంత్రి నారాయణ నేతృత్వంలో రాజధాని ఎంపిక కోసం అప్పటి టీడీపీ సర్కార్ కమిటీ వేసింది. గుంటూరు–విజయవాడ మధ్య రాజధానిని ఏర్పాటు చేస్తున్నట్లు నారాయణ కమిటీ ప్రకటించింది. ఆ తర్వాత 2014 సెప్టెంబర్ 3న శాసనసభలో రాజధానిపై తీర్మానం చేశారు. కేంద్రాన్ని సంప్రదించకుండానే.. శివరామకృష్ణన్ కమిటీ నివేదికను తుంగలో తొక్కి రాజధానిగా అమరావతిని చంద్రబాబు ప్రకటించారు.


IN THE HON'BLE SUPREME COURT OF INDIA
CIVIL APPELLATE JURISDICTION
SPECIAL LEAVE PETITION (CIVIL) No. 21922/2022

IN THE MATTER OF:

M/s Amaravati Parirakshana Samiti ... Petitioner

Versus

Union of India & Ors. ... Respondents

COUNTER AFFIDAVIT ON BEHALF OF THE RESPONDENT NO.1, UNION OF INDIA

5. Accordingly, in terms of Section 6 of the Andhra Pradesh Reorganisation Act, 2014, the Central Government constituted an Expert Committee on 28.03.2014 under the chairmanship of Shri K. C. Sivaramakrishnan, IAS Retd. to study alternatives for a new capital for the State of Andhra Pradesh. The said Committee submitted its report on 30.08.2014, laying down broad guidelines which would require to be considered while selecting a new capital. The said report was sent to Government of Andhra Pradesh for necessary action. A True Copy of the relevant extracts of the Shri K C Sivaramakrishnan is annexed hereto and marked as **Annexure R-2** at page 8 to 11.

6. Subsequently, Government of Andhra Pradesh vide Government Order dated 23.04.2015 notified that the Capital city be named as "Amaravati". A True Copy of the Andhra Pradesh Government Order dated 23.04.2015 is annexed hereto and marked as **Annexure R-3** at page 12 to 13.

7. That the Under Section 94 of the Act of 2014, the Central Government shall provide special financial support for the creation of essential facilities in the new capital of the successor state of Andhra Pradesh including the Raj Bhawan, High Court, Government Secretariat, Legislative Assembly, Legislative Council and such other essential infrastructure.

అఫిడవిట్లో కేంద్రం ఏం చెప్పిందంటే...

వాస్తవానికి అఫిడవిట్లో కేంద్రం ఎక్కడా 'ఈనాడు' రాసినట్లుగా విభజన చట్టం నిబంధనల మేరకే అమరావతిని రాజధానిగా నిర్ణయించినట్టు పేర్కొనలేదు. 'ఈనాడు' రాతలు పచ్చి అబద్ధాలని తేల్చే కేంద్రం అఫిడవిట్ కాపీ ఇది. దీన్లో 5, 6 ,7 పాయింట్ల కింద ఏం చెప్పారంటే...

5 ఆంధ్రప్రదేశ్ పునర్ విభజన చట్టంలో సెక్షన్ 6 ప్రకారం కొత్త రాజధాని కోసం ప్రత్యామ్నాయాలను అధ్యయనం చేయటానికి మేం శివరామకృష్ణన్ నేతృత్వంలో 2014, మార్చి 28న నిపుణుల కమిటీని నియమించాం. ఆ కమిటీ 2014, ఆగస్టు 30న నివేదికను ఇచ్చింది. ఆ నివేదికను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి పంపించాం.

6 ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2015, ఏప్రిల్ 23న అమరావతి పేరుతో కొత్త రాజధానిని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

7 విభజన చట్టంలో సెక్షన్ 94 ప్రకారం కొత్త రాజధానిలో రాజ్ భవన్, శాసనసభ, శాసన మండలి, సచివాలయం, హైకోర్టు భవనాల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్రం ఆర్థిక సహకారం అందించాలి. ఆ మేరకు రూ.2,500 కోట్లను రాష్ట్ర ప్రభుత్వానికి విడుదల చేశాం.

.... అఫిడవిట్లో ఉన్నది ఇదే. దీనికి వక్రభాష్యం చెబుతూ 'ఈనాడు' పునర్విభజన చట్ట నిబంధనల మేరకే అమరావతిని నిర్ణయించినట్లుగా రాసిపారేసింది. వాస్తవానికి అమరావతి భూములన్నీ కృష్ణా డెల్టా పరిధిలోకి వస్తాయి. సమృద్ధిగా పంటలు పండే డెల్టా భూముల్ని, దేశానికి అన్నంపెట్టే భూముల్ని తీసుకుని రాజధానిని నిర్మించటం ఎంతమాత్రం శ్రేయస్కరం కాదని శివరామకృష్ణన్ కమిటీ స్పష్టంగా నివేదికలో పేర్కొంది. మరి చంద్రబాబు చేసింది ఆ నివేదికను ఉల్లంఘించటమే కదా? దాన్ని ఆమోదించినట్లు ఎలా అవుతుంది రామోజీరావు గారూ?!

- అమరావతి ప్రాంతంలోని నేల స్వభావం వల్ల భవన నిర్మాణ వ్యయం అధికమవుతుందని శివరామకృష్ణన్ కమిటీ తేల్చి చెప్పింది. కానీ.. తాను, తన కోటరీ భూములు కాజేసిన ప్రాంతాన్నే చంద్రబాబు రాజధానిగా ప్రకటించారు. తాను, తన కోటరీ ఇన్‌సైడర్ ట్రేడింగ్ ద్వారా కాజేసిన భూములు.. పేదలను బెదిరించి దక్కించుకున్న అసైన్డు, లంక భూముల ధరలను పెంచుకోవడం కోసం అప్పట్లో చంద్రబాబు రియల్ ఎస్టేట్ వ్యాపారిలా, బ్రోకర్‌లా వ్యవహరించారు.

రాజధానికి రోడ్డు కూడా వేయలేదే..

- తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో రూ.600 కోట్లతో అద్భుతమైన రీతిలో రాజప్రసాదం వంటి సచివాలయాన్ని నిర్మిస్తే.. టీడీపీ సర్కార్ రూ.ఐదు వేల కోట్లు ఖర్చు పెట్టి.. తాత్కాలిక నిర్మాణాలు, అరకొర పనులు చేసి దోచుకుంది. చిన్న పాటి వర్షం వస్తే కారిపోయే రీతిలో తాత్కాలిక సచివాలయాన్ని నిర్మించింది.
- రాజధానికి కనీసం రోడ్డును కూడా చంద్రబాబు నిర్మించలేదు. నీ బతుక్కు విజయవాడలో కనకదుర్గమ్మ ఫ్లై ఓవర్, బెంజ్ సర్కిల్‌లో ఫ్లై ఓవర్‌ను కూడా పూర్తి చేయలేదు. సీఎం వైఎస్ జగన్ కోవిడ్ వంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ ఆ రెండు ఫ్లై ఓవర్‌లతో పాటు బెంజ్ సర్కిల్‌లో మరో ఫ్లై ఓవర్ కూడా పూర్తి చేశారు. కరకట్ట రోడ్డు విస్తరించి, అమరావతికి రహదారి సౌకర్యాన్ని ఏర్పాటు చేయడం, రింగ్ రోడ్డు నిర్మాణం, ఖాజా నుంచి పెద అవుట్‌పల్లి వరకూ కృష్ణా నది మీదుగా బైపాస్ రహదారి నిర్మిస్తూ అమరావతితోపాటు గుంటూరు, విజయవాడను అభివృద్ధి చేస్తున్నారు.

జనం లేరు.. షాక్‌లో సార్!


- లోకేశ్ పాదయాత్రలో జనం లేకుంటే సీరియస్ యాక్షన్ ఉంటుంది
- చిత్తూరులో చూసి నేను, సార్ చాలా బాధపడ్డాం
- టీడీపీ నేతలతో అచ్చెన్నాయుడు ఫోన్ కాల్ ఆడియో బహిర్గతం

సాక్షి, తిరుపతి: నారా లోకేశ్ పాదయాత్ర సందర్భంగా జన సమీకరణకు టీడీపీ నేతలు పడుతున్న తిప్పలు, సీనియర్ నాయకుల హెచ్చరికలు సాక్ష్యాధారాలతో బహిర్గతమయ్యాయి. కుప్పంలో మొదలైన లోకేశ్ పాదయాత్ర గురువారం గంగాధర నెల్లూరు నియోజకవర్గానికి చేరుకుంది. జన సమీకరణపై బుధవారం రాత్రి టీడీపీ నేతలతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడిన రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు హెచ్చరికలు చేశారు. ఈ ఆడియో లీక్ కావడంతో కలకలం రేగింది.

సంభాషణ సాగిందిలా...

చిట్టిబాబు నాయుడు (టీడీపీ గంగాధర నెల్లూరు ఇన్‌చార్జి): అన్నా డీఎస్పీ ఆఫీస్‌లో పర్మిషన్ తీసుకుంటున్నా. మీరు చెప్పినట్లుగా ఉదయాన్నే వెయ్యి మంది వచ్చేందుకు వాహనాలు అరేంజ్ చేశా. రోజూ పాదయాత్ర స్టార్ట్ అయ్యేలోపు ఆరు మండలాల్లోనూ 50 వాహనాలు ఏర్పాటు చేశా. 300 వాహనాలకు డబ్బులు కూడా ఇచ్చేశా. నాలుగు రోజులకు బుక్ చేశా. రోజూ 3 వేల మంది పాదయాత్రకు రావాలని చెప్పాం అన్నా.

- **అచ్చెన్నాయుడు:** మొన్న చూశారు కదా..! చిత్తూరులో చూసి నేను, సార్ (చంద్రబాబు) చాలా బాధపడ్డాం.
- **చిట్టిబాబు నాయుడు:** అన్నన్నా.. అలా జరగదన్నా. మా నియోజకవర్గంలో అలా జరగదన్నా. నేను చేస్తా. చిత్తూరులో ఏమైందో నాకు తెలియదు.
- **అచ్చెన్నాయుడు:** ఏంటంటే.. ఉదయం నుంచి సాయంత్రం వరకు పాదయాత్రలో జనం ఉండడం లేదు. పలుచగా ఉంటున్నారు. సాయంత్రం మాత్రం ఓ మోస్తరుగా వస్తున్నారు. జనం పలుచబడడం అనేది ఉండకూడదు. ఒక గ్రామం నుంచి వచ్చిన వారు మరో గ్రామం వరకు వచ్చేలా జాగ్రత్తగా ప్లాన్ చేసుకో.
- **చిట్టిబాబు నాయుడు:** అలాగే అన్నా. ప్రతి కిలోమీటర్‌కు వెల్‌కమ్ పాయింట్లు ఏర్పాటు చేశా. అలా 10 ఏర్పాటు చేశానన్నా. వెల్‌కమ్ పాయింట్ల వద్ద వెయ్యి మంది ఉండేలా చూస్తున్నాం. డ్రమ్స్, మైక్‌లు ఉంటాయి. వచ్చిన వారికి మజ్జిగ ఇస్తున్నాం. పూలు చల్లడం, టపాకాయలు కాల్చడం, అక్కడే మహిళలు వచ్చి హారతులు ఇవ్వడం, గుమ్మడికాయలు కొట్టడం.. ఇవన్నీ ప్రతి జంక్షన్‌లో చేస్తున్నాం అన్నా. తమిళనాడు నుంచి జెండాలు కట్టేందుకు 5 వేల పైపులు తీసుకొచ్చాం. 14 కి.మీ జెండాలు కడతాం అన్నా.
- **అచ్చెన్నాయుడు:** ఓకే ఓకే.. థ్యాంక్యూ థ్యాంక్యూ. ఏదైనా ఉంటే నాకు చెప్పు. మండల, యూనిట్ ఇన్‌చార్జిలు బాధ్యత తీసుకోవాలి. జనం మొబిలైజేషన్ లేకపోతే మాకు తెలుస్తుంది. వెంటనే సీరియస్ యాక్షన్ తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటివరకు జరిగిన నాలుగు నియోజకవర్గాల్లో మాదిరిగా కాకుండా విజయవంతం చేయాలి. అందరూ పార్టిసిపేట్ చేయాలి. మీ అందరికీ నమస్కారం.


లోకేశ్ పాదయాత్ర పరిస్థితి ఇదీ..

గాడిన పడ్డ ఆదాయం

- గ్రాస్ జీఎస్టీ వసూళ్లలో దేశ సగటు కంటే ఏపీ వృద్ధి రేటు అధికం
- ధనిక రాష్ట్రాల కంటే మెరుగ్గా ఏపీ వృద్ధి రేటు
- ఆదాయార్జన శాఖలపై సీఎం జగన్ ఉన్నత సమీక్ష



సాక్షి, అమరావతి: కోవిడ్ ప్రతికూల పరిస్థితులను అధిగమించి ఏపీ సొంత ఆదాయం గాడిన పడుతోందని, నిర్దేశించిన ఆదాయ లక్ష్యాలను చేరుకుంటున్నట్లు ఉన్నతాధికారులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నివేదించారు. దేశ సగటుతో పాటు పలు ధనిక రాష్ట్రాల కంటే అధికంగా జీఎస్టీ స్థూల (గ్రాస్) వసూళ్ల వృద్ధి నమోదవుతున్నట్లు వివరించారు. గురువారం క్యాంపు కార్యాలయంలో ఆదాయార్జన శాఖలపై సీఎం జగన్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. జీఎస్టీ స్థూల వసూళ్లలో దేశ సగటు వృద్ధి రేటు 24.8 శాతం కాగా ఆంధ్రప్రదేశ్ 26.2 శాతం వృద్ధిని నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ వృద్ధి రేటు పలు ధనిక రాష్ట్రాల కంటే అధికమని, తెలంగాణ (17.3 శాతం), తమిళనాడు (24.9 శాతం), గుజరాత్ (20.2 శాతం) కంటే మెరుగైన వసూళ్లు నమోదవుతున్నాయని తెలిపారు. ఇది రాష్ట్రంలో వాణిజ్య కార్యకలాపాలు అధికంగా జరుగుతున్నాయనేందుకు నిదర్శనమన్నారు. గతేడాది జనవరి నాటికి రాష్ట్ర జీఎస్టీ ఆదాయం రూ.26,360.28 కోట్లు కాగా ఈ ఏడాది జనవరి నాటికి రూ.28,181.86 కోట్లకు పెరిగిందని అధికారులు తెలిపారు. రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జనవరి నాటికి జీఎస్టీ, వ్యాట్, ప్రొఫెషనల్ ట్యాక్స్‌లతో కలిపి రూ.46,231 కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా నిర్దేశించుకోగా 94 శాతం అంటే రూ.43,206.03 కోట్లకు చేరుకున్నట్లు వెల్లడించారు.

నగర వార్తలు

ప్రకృతి చికిత్సాలయానికి నటుడు సోనూసూద్


సోనూసూద్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఎర్రోళ్ల శ్రీనివాస్

అమీర్‌పేట: బాలీవుడ్ నటుడు సోనూసూద్ అమీర్‌పేటలోని ప్రకృతి చికిత్సాలయాన్ని గురువారం సందర్శించారు. టీఎస్ఎంఎస్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌తో కలిసి ఆస్పత్రికి వచ్చిన ఆయన కళాశాల, మెస్, యోగశాల ప్రాంగణాన్ని పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, వైద్య విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. సోనూసూద్ సంపంగి మొక్క నాటారు. విద్యార్థులు అతడితో సెల్ఫీలు తీసుకునేందుకు పోటీపడ్డారు. సీఎం కేసీఆర్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు ఆరోగ్య తెలంగాణ దిశగా రాష్ట్రాన్ని నడిపిస్తున్నారని ఆయన కొనియాడారు. ఎర్రోళ్ల శ్రీనివాస్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, ఆసుపత్రి అధికారులు ఉన్నారు.

వైద్యం వికటించి గర్భిణి మృతి


మృతురాలు చందన(ఫైల్)

హస్తినాపురం: వైద్యం వికటించి రెండు నెలల గర్భిణి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి పోలీసులు, బాధిత కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా డిండి మండలం చెరుకుపల్లి గ్రామానికి చెందిన నక్క చందన(20) నల్లగొండ జిల్లా పీఏపల్లి మండలం అజ్మాపురం గ్రామానికి చెందిన బూడిద హరీష్‌తో 8 నెలల క్రితం వివాహం జరిగింది. కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న హరీష్ భార్యతో కలిసి టీచర్స్‌కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. చందన రెండు నెలల గర్భిణి కావడంతో వైద్యపరీక్షల కోసం ఆసుపత్రిలో చూపించగా చికిత్స కోసం సోమవారం బీఎన్‌రెడ్డినగర్‌లోని సాయి స్వరూప ఆస్పత్రిలో చేర్పించారు. ఆమెకు తీవ్ర రక్తస్రావం కావడంతో వైద్యులు రక్తం ఎక్కించారు. బుధవారం ఉదయం ఆరోగ్యం విషమించడంతో మెరుగైన వైద్యం కోసం అవేర్ గ్లోబల్ ఆస్పత్రికి తీసుకువెళ్లాలని ఆస్పత్రి వర్గాలు సూచించడంతో అంబులెన్స్‌లో తీసుకెళ్లగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో మృతురాలి బంధువులు పెద్ద ఎత్తున సాయిస్వరూప ఆస్పత్రికి వచ్చి ధర్నాకు దిగారు. వైదుల నిర్లక్ష్యంతోనే చందన మృతి చెందిందని, ఆస్పత్రి యాజమాన్యంపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆరోపించారు. సమాచారం అందుకున్న వనస్థలిపురం సీఐ సత్యనారాయణ, హయత్‌నగర్ సీఐ బి.వెంకటేశ్వర్లు, 10 మంది ఎస్ఐలు పోలీస్ సిబ్బంది ఆస్పత్రి ఎదుట బందోబస్తు ఏర్పాటు చేశారు.


బీఎన్‌రెడ్డినగర్‌లోని సాయిస్వరూప ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న మృతురాలి బంధువులు

కోర్టు మానిటరింగ్ యాప్ ఆవిష్కరణ

రాయదుర్గం: కోర్టు మానిటరింగ్ యాప్ దేశంలోనే మొదటి స్థానంలో ఉందని సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర పేర్కొన్నారు. కోర్టు మానిటరింగ్ యాప్‌ను గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో గురువారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీసులు, అధికారులు, ప్రాసిక్యూటింగ్ అధికారులను ఈ యాప్ ఒకే ప్లాట్‌ఫారమ్ కిందకు తీసుకువస్తుందని, పర్యవేక్షించడంలో సహాయం చేస్తుందన్నారు. పోలీసులు మానిటర్, అదేవిధానంలో బృందంగా పనిచేయాలన్నారు. ఈ యాప్ అన్ని స్థాయిల అధికారులు ఉపయోగించాలన్నారు. ప్రతి కేసు దశ, పురోగతి ఆధారంగా అధికారులు ఉంటారని, వారి తదుపరి చర్యను ప్లాన్ చేసుకుంటారన్నారు. కార్యక్రమంలో సైబరాబాద్ జాయింట్ సీపీ అవినాష్ మహంతి, జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ప్రాసిక్యూషన్స్ జి.కస్తూరిబాయ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రంగారెడ్డి జిల్లా జయింట్ డైరెక్టర్ సి.రాము, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సంగారెడ్డి జిల్లా జాయింట్ డైరెక్టర్ జే.శ్రీనివాస్‌రెడ్డి, ప్రాసిక్యూటింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల్ని వేధిస్తే కఠిన చర్యలు

రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

నాగోలు: ఆడపిల్లల్ని, మహిళలను వేధించే ఆకతాయిల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ అన్నారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో మహిళలు, కాలేజీ విద్యార్థినుల పట్ల ఈవ్‌టీజింగ్‌కు పాల్పడి షీటీమ్స్‌కు పట్టుబడిన వారికి భూమిక స్వచ్ఛంద సంస్థ, రాచకొండ పోలీసులు ఎల్‌బీనగర్‌లోని సీపీ క్యాంపు ఆఫీస్‌లో ఉన్న టీటీఐలో గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లల్ని, మహిళలను వేధించే ఆకతాయిల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని, అటువంటి వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో రోడ్ సేఫ్టీ డీసీపీ శ్రీబాల, ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్, ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ, ఎల్‌బీనగర్ ఏసీపీ శ్రీధర్‌రెడ్డి, షీటీమ్స్ ఇన్‌చార్జి వెంకట్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి పాల్గొన్నారు.


కౌన్సెలింగ్ హాజరైన షీ టీమ్స్ కు పట్టుబడిన వారు

ఆకట్టుకుంటున్న అంగడి



బంజారాహిల్స్: మరుగున పడిపోతున్న సంప్రదాయ హస్తకళలను వెలుగులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని క్రాఫ్ట్స్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ(సీసీటీ) భవనంలో అంగడి–2023 పేరుతో హస్తకళా ప్రదర్శన గురువారం ప్రారంభమైంది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంటీరియర్ డిజైనర్స్ హైదరాబాద్ రీజినల్ చాప్టర్ చైర్మన్ మనోజ్ వాహి, సీసీటీ చైర్మన్ అనురాధ బిష్ణోయి, కార్యదర్శి హేమలత కెమిక, జాయింట్ సెక్రటరీ నిర్మలా సిద్ధార్థ, ట్రెజరర్ భువనేశ్వరి, విజయలక్ష్మి తదితరులతో కలిసి ప్రారంభించారు. దేశ నలుమూలల నుంచి 25 మంది హస్తకళాకారులు తమ ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శించారు. ఆయా ప్రాంతాల్లో సంప్రదాయ కళలకు ఎంతో పేరు తీసుకొచ్చిన ఈ కళాకారులను ప్రోత్సహించడం, నగరవాసులకు పరిచయం చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సీసీటీ చైర్మన్ అనురాధ తెలిపారు. ఇందులో రీసైక్లింగ్ బ్యాగులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు అంగడి క్రాఫ్ట్స్ బజార్ కొనసాగుతుందని వెల్లడించారు. బాంబూ క్రాఫ్ట్, లాంబాని ఎంబ్రాయిడరీ, ఆక్సిడైజ్ జ్యువెలరీ, గ్లాస్ బ్యాంగిల్స్, ఉర్ముల్ వీవింగ్, తోడా ఎంబ్రాయిడరీ, సిమెంట్ ప్లాంటర్స్, కవాడ్ ఆర్ట్, టెర్రకోట వేర్‌ను ఆయా ప్రాంతాలకు చెందిన సంప్రదాయ హస్త కళాకారులు ప్రదర్శించారు.

సీబీఐ, ఈడీకి అప్పగించాల్సి రావొచ్చు

నిజాం భూముల వివాదంపై హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: సివిల్ సూట్ 13, సివిల్ సూట్ 14 బ్యాచ్ కేసులన్నింటినీ ముఖ్యంగా నిజాం భూముల వివాదాలను సీబీఐ, ఈడీకి అప్పగించాల్సి వస్తోందేమో అని హైకోర్టు వ్యాఖ్యలు చేసింది. దీర్ఘకాలికంగా ఈ కేసులను విచారణ జరపాల్సి వస్తోందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం స్పష్టం చేసింది. రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండలం కుంట్లూరు గ్రామంలోని 93 ఎకరాల భూ వివాదంపై దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ అభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ కేసులోని పలు అంశాలపై విచారణ జరపాలని రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. చట్టపరమైన వారసులకు భూమిని పంచాలని, అప్పటివరకు మూడో పార్టీకి భూమి చెందకుండా స్టే విధించాలని వారు (పిటిషనర్లు) కోరుతున్నారు. 2021, జూన్‌లో హయత్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ ఈ భూమికి సంబంధించి ఎలాంటి రిజిస్ట్రేషన్ జరపకుండా నిషేధం విధించారు. దీనిపై కొందరు హైకోర్టును ఆశ్రయించగా, సింగిల్ జడ్జి.. నిషేధాన్ని ఎత్తివేసేందుకు నిరాకరించారు. సింగిల్ జడ్జి ఆదేశాలపై అప్పీల్ చేసినా డిస్మిస్ అయ్యాయి. కొద్దికాలానికి సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్లకు అనుమతి ఇచ్చారు. దీనిపై కూడా కొందరు హైకోర్టును ఆశ్రయించడం షాకింగ్ విషయం. ఈ నేపథ్యంలో మొత్తం అంశంపై సీజే ధర్మాసనం స్టే విధించింది. ఆ 93 ఎకరాల పరిధిలో ఎలాంటి రిజిస్ట్రేషన్లు చేపట్టవద్దని ఆదేశించింది. విచారణను మార్చి 2కు వాయిదా వేసింది.

రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చంద్రశేఖర్‌కు జీవనసాఫల్య అవార్డు

సాక్షి, సిటీబ్యూరో: హైసియా(హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్) తన ప్రతిష్ఠాత్మకమైన జీవన సాఫల్య అవార్డును రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆర్.చంద్రశేఖర్‌కు ప్రదానం చేసింది. గురువారం జరిగిన హైసియా వార్షిక సమ్మిట్ అండ్ అవార్డ్స్–2023 కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ ఆయనకు అవార్డు బహుకరించారు. సెంటర్ ఫర్ ది డిజిటల్ ఫ్యూచర్ చైర్మన్, నాస్కామ్ మాజీ అధ్యక్షుడు, టెలికాం కమిషన్ మాజీ చైర్మన్, భారత టెలికమ్యూనికేషన్ విభాగం కార్యదర్శి, కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ శాఖ మాజీ కార్యదర్శిగా విధులు నిర్వర్తించి భారత ఐటీ పరిశ్రమ, ముఖ్యంగా హైదరాబాద్ పరిశ్రమకు చంద్రశేఖర్ చేసిన సేవలకు ఈ అవార్డు అందించారు.



ప్రతిభ ఉంటేనే బాలీవుడ్‌కు రావాలి

బాలీవుడ్ దర్శకురాలు ఫరాఖాన్



బంజారాహిల్స్: తిరస్కరణను అంగీకరించడంతో పాటు నిజమైన ప్రతిభ, నమ్మకం ఉన్న వారే బాలీవుడ్‌ను ఎంచుకోవాలని బాలీవుడ్ దర్శకురాలు ఫరాఖాన్ అన్నారు. జూబ్లీహిల్స్‌లో ఫిక్కి ఎఫ్ఎల్ఓ ఆధ్వర్యంలో ది ఫోర్స్ ఆఫ్ ఫిమేల్ ఫార్టిట్యూడ్ పేరుతో నిర్వహించిన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలీవుడ్‌ను కేరీర్‌గా ఎంచుకోవాలని లక్షలాది మంది కోరుకుంటారన్నారు. అయితే తాను వద్దని చెప్పడానికి చాలా కారణాలున్నాయని, నిజంగా ఈ రంగంలోకి రావాలని ఆశించే వారు చాలా ఓపికతో ఉండాలన్నారు. ప్రతిభ ఉండి, మీపైన మీకు నమ్మకం ఉండి, మీరు నటించకపోతే చనిపోతారని భావిస్తే మాత్రమే ఈ రంగంలో రాణించే అవకాశాలు ఉన్నాయన్నారు. హైదరాబాద్ తనకు ఎంతో ప్రత్యేకమని, తాను తరచూ ఇక్కడికి ప్రయాణం చేస్తూ ఉంటారన్నారు. దర్శకుల విషయంలో లింగ భేదం, పక్షపాతం ఉండదని, బాలీవుడ్‌లో అత్యంత విజయవంతమైన మహిళా దర్శకురాలిగా తాను చేసిన ప్రయాణాన్ని వివరించారు. తాను కూడా చాలామంది మాదిరిగానే చిన్నతనంలో బాధలు, కష్టాలు, ఇబ్బందులు చూశానన్నారు. శుక్రవారాలు పరిశ్రమలోని చాలామంది కళాకారుల భవిష్యత్‌ను నిర్ణయిస్తాయని, తన తండ్రి సినిమా విడుదలవుతున్న శుక్రవారాల్లో ముందు చాలా మంది మెచ్చుకుని, చిత్రం విడుదలైన రెండు రోజుల తర్వాత ఆదివారం ప్రజలు అతడిని చూడటం, ఇంటికి రావడం మానేశారన్నారు. తమ జీవితాలు ఇలాగే ఉంటాయని వివరించారు. బాలీవుడ్‌లో తమ కేరీర్‌ను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు టెక్నిక్, నైపుణ్యం, అర్హత లేదా ప్రతిభ వీటిలో ఏది ముఖ్యమని ఫిక్కీ సభ్యులు అడిగినప్పుడు ఫరాఖాన్‌తో పాటు సినీ నటులు పూజా హెగ్డే, ఆడవి శేషు ఈ మూడు అవసరమని సమాధానం చెప్పారు. సహజమైన ప్రతిభ కలిగి ఉండటం మంచిదని, నైపుణ్యాలనూ ప్రదర్శించాలని ఫరాఖాన్ అన్నారు. దర్శకత్వం తనకు ఎంతో సంతృప్తి ఇచ్చిందన్నారు. సినీ ప్రముఖులు అడవి శేషు, పూజా హెగ్డే, ఫిక్కీ ఎఫ్ ఏఓ హైదరాబాద్ చైర్‌పర్సన్ ఖుభా మహేశ్వరి, పింకీరెడ్డి, దాదాపు 300 మంది ఫిక్కీ సభ్యులు పాల్గొన్నారు.

వ్యాపారాలను విస్తరించుకోవాలి

- బీఎస్ఐ నెట్‌వర్కింగ్ సీఈఓ గ్రాహమ్ వీ మిల్లర్



మణికొండ: మనం తయారు చేసే నాణ్యమైన ఉత్పత్తులను ప్రపంచవ్యాప్తంగా మార్కెటింగ్ చేసి వ్యాపారాలను విస్తరించుకోవడంతో పాటు లాభాలను గడించాలని బిజినెస్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్(బీఎస్ఐ) సీఈఓ గ్రాహమ్ వీ మిల్లర్ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని ఓంకన్వెన్షన్‌లో బుధవారం రాత్రి బీఎస్ఐ నెట్‌వర్కింగ్ కాన్క్లేవ్ పేరుతో బిజినెస్ నెట్‌వర్కింగ్ సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ అనేక మంది పారిశ్రామిక వేత్తలు, ఉత్పత్తిదారులతో వ్యాపారస్తులను భాగస్వామ్యం చేసి వీరి వస్తువులను వారు చూసేందుకు అవకాశం కల్పించడం, రాబోయే రోజుల్లో వాటి అమ్మకాలను పెంచేందుకు కృషి చేయటమే ఈ సంస్థ ప్రధాన లక్ష్యమన్నారు. సంస్థ 77 దేశాల్లో విస్తరించి ప్రజలకు అవసరమైన వస్తువులను అందించేందుకు కృషి చేస్తుందన్నారు. రెఫరల్ భాగస్వాములు ఉత్పత్తులను తెలుసుకునేలా చేయటంతో పాటు వినియోగదారుడు ఆశించిన విధంగా ఎలాంటి లోపాలు లేకుండా వాటిని అందించి విశ్వసనీయతను పొందాలన్నారు. హైదరాబాద్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజనా షా మాట్లాడుతూ ఒకే రోజు వెయ్యిమంది తమ సంస్థలో చేరడంతో రికార్డు సృష్టించిందన్నారు. కార్యక్రమంలో గ్లోబల్ మార్కెట్స్ అధ్యక్షుడు మ్యాక్ శ్రీనివాసన్, జాతీయ డైరెక్టర్ హేము సువర్ణ, టీహబ్ సీఈఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాషన్



ఏ కాలాన్నైనా బ్రైట్‌గా మార్చేసే గుణం పువ్వుల సొంతం.
ఆ సౌందర్యాన్ని ధరించే దుస్తుల మీదకు తీసుకురావడం తరుణుల అభిమతం
అందుకే జాతీయ అంతర్జాతీయ వేదికల మీద కూడా పువ్వుల ప్రింట్లు, డిజైన్లు అమితంగా ఆకట్టుకుంటుంటాయి.
పెళ్లి, పుట్టిన రోజు వంటి వేడుకల్లోనే కాదు క్యాజువల్‌వేర్‌గానూ కట్టిపడేసే పూల డ్రెస్సులు ధరించడమంటే మేనిపైన పూల సంతకం చేసినట్టే.

పూల సంతకం

ఎంబ్రాయిడరీ పూలు

చేతితో చేసిన ఎంబ్రాయిడరీ వర్క్‌లోనూ పువ్వులు, లతల అందం మన మదిని దోచేస్తూనే ఉంటుంది. ఎన్ని హంగులు దిద్దినా వాటినుంచి కొత్త స్ఫూర్తిని పొందుతూనే ఉంటాం. అందుకే కొత్త డిజైన్లను సృష్టిస్తూనే ఉంటారు డిజైనర్లు.

పువ్వుల ప్రింట్లు

ఏ హంగులూ చేయలేం అనుకున్న వారు పువ్వుల ప్రింట్లు ఉన్న సిల్క్ లేదా బ్రొకేడ్, కాటన్ ఫ్యాబ్రిక్‌లో ఏదైనా ఎంచుకోవచ్చు. కాలానుగుణంగా ఫ్యాబ్రిక్ ఎంపికలో మార్పులు ఉండవచ్చు గానీ, పువ్వుల సొగసులో మార్పులు ఉండవని నిరూపిస్తుంటారు అతివలు. అందుకే కాబోలు పువ్వుల ప్రింట్లు ఉన్న ఫ్యాబ్రిక్ ఎన్నో రకాల స్టైల్స్‌లో డ్రెస్ డిజైనర్ల చేతిలో మారిపోతుంటుంది.

అప్లిక్ పూలు

కావల్సిన పరిమాణంలో పువ్వులను ముందుగానే డిజైన్ చేసుకొని, ఎంపిక చేసుకున్న ఫ్యాబ్రిక్ మీద ప్యాచ్ వర్క్ చేస్తారు. ఈ పూల గుత్తులు డ్రెస్ అందాన్ని వెయ్యింతలుగా పెంచుతుంది.

స్త్రీ శక్తి

సత్తా చాటారు ఐపీఎస్ అయ్యారు

లక్ష్య సిద్ధి ఉంటే విజయం ఖాయమని నిరూపించారు...లక్షల్లో జీతాలు ఇవ్వని తృప్తిని వెతుక్కుంటూ ప్రజాసేవలో అడుగుపెట్టబోతున్నారు. వెన్నుతట్టి ప్రోత్సహిస్తే ఏ రంగంలోనైనా విజేతలమేననడానికి మరోమారు ఉదాహరణగా నిలిచారు యువ ఐపీఎస్ ప్రొబేషనరీ అధికారిణులు. కూతుళ్లను ఉన్నతంగా చూడాలన్న ఆ తండ్రుల ఆశయాలను..మహోన్నతంగా తమ విజయంతో చాటారు ఈ యువ ఐపీఎస్ అధికారిణులు. తగిన ప్రోత్సాహం అందిస్తే.. తామేంటో చూపిస్తామని నిరూపించారు.సమాజంలో అత్యున్నతమైన ఇండియన్ పోలీస్ సర్వీస్‌కు ఎంపిక కావడమే కాదు..ట్రైనింగ్‌లోనూ తాము సివంగులమని పురుషులతో కలబడి నిలబడ్డారు. బెస్ట్ ఔట్‌డోర్ ట్రోఫీని దక్కించుకున్నారు. రేపు శనివారం దీక్షాంత్ పరేడ్‌తో ప్రజాసేవలోకి తొలి అడుగు పెట్టబోతున్న మహిళా ఐపీఎస్ అధికారులు 'ఫ్యామిలీ'తో తమ శిక్షణ అనుభవాలు..భవిష్యత్ లక్ష్యాలను ఇలా పంచుకున్నారు...

– నాగోజు సత్యనారాయణ, సాక్షి, హైదరాబాద్

నాన్నే నాకు స్ఫూర్తి



నా పేరు దీక్ష.. రాజస్థాన్‌లోని జుంజున్ జిల్లా ఖేత్రీ పట్టణం. నాన్న అక్కడే హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్‌లో ఏజీఎంగా పనిచేస్తారు. మా అమ్మ గవర్నమెంట్ టీచర్. ఐఐటీ ఢిల్లీ నుంచి నేను బీటెక్ పూర్తి చేశాను. ఆ తర్వాత యూపీఎస్సీ ప్రిపరేషన్ ప్రారంభించాను. మా నాన్నకు నన్ను ఐపీఎస్‌గా చూడడం ఎంతో ఇష్టం. ఆయన ప్రోత్సాహంతోనే నేను సివిల్స్‌వైపు దృష్టి పెట్టాను. ఆయన ప్రతి విషయంలో నాకు ఎంతో సపోర్ట్‌గా ఉంటారు. అలాగే మా సీనియర్స్ కూడా సివిల్స్ గురించి గొప్పగా చెప్పడం కూడా ఒక కారణం. సివిల్స్ రెండో ప్రయత్నంలో ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీస్‌కు ఎంపికయ్యాను. ఆ తర్వాత మళ్లీ మా నాన్న ప్రోత్సాహంతో మూడోసారి సివిల్స్ రాశాను. అలా నాకు మూడో ప్రయత్నంలో ఐపీఎస్ వచ్చింది. ఈ శిక్షణకు వచ్చినప్పుడు చాలా ఆందోళనగా అనిపించింది. కానీ క్రమంగా అన్నీ నేర్చుకున్నాను..గుర్రపు స్వారీ, గన్ షూటింగ్, క్రైమ్ ఇన్వెస్టిగేషన్ ఇలా ప్రతి పని నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచాయి. మహిళలు ఏదైనా సాధించగలరు..మన శక్తి ఏంటో మనం గుర్తించాలి. అప్పుడు మనం చేసే పనిలో ఆత్మవిశ్వాసంతో చేయగల్గుతాం. అందుకు నేను ఉదాహరణ. నాకు బెస్ట్ ఔట్‌డోర్ ప్రొబేషనర్ అవార్డు వచ్చింది. ఆ విషయం తెలియగానే మొట్టమొదట మా నాన్నకే ఫోన్ చేసి చెప్పా..ఆయన ఆనందం అంతా ఇంతా కాదు. నాన్న డ్రీమ్ పూర్తి చేశానన్న తృప్తి నాకు ఎంతో అనిపించింది. సివిల్స్ లేదా ఇంకా ఏ పోటీ పరీక్షకు ప్రిపేర్ అయ్యే వారికి నేను చెప్పేది ఒక్కటే... మన లక్ష్యం ఏంటి...? ఎలా సాధించాలన్నదానిపై స్పష్టత ఉండాలి. అందుకు తగ్గట్టుగా ప్రణాళిక పెట్టుకుని చదవాలి. శ్రద్ధగా, నిష్ఠగా ఉండాలి..అలా అని మిగిలిన విషయాలు వదిలేయద్దు. మనకు నచ్చినట్టు రిలాక్స్ అవ్వాలి. ఎంత ఏకాగ్రతతో చదువుతామన్న దాన్ని బట్టి రోజుకు ఎన్ని గంటలు చదవాలన్నది ఉంటుంది. నేను రోజుకు ఆరు నుంచి ఏడు గంటలు మాత్రమే చదివాను. పరీక్ష దగ్గరపడే కొద్ది కొద్దిగా పెంచుతూ వెళ్లా..రోజుకు 10 గంటలకు పెంచాను. నాకు విజయం వచ్చింది.

– దీక్ష, బెస్ట్ ఔట్‌డోర్ ప్రొబేషనరీ ఐపీఎస్, జీహార్ కేడర్

నేనే ఫస్ట్ పోలీస్



మా కుటుంబంలో చాలా మంది బిజినెస్‌లోనే ఉన్నారు. కానీ, నాకు మాత్రం ప్రజలకు దగ్గరగా ఉండే వృత్తిలో ఉండాలని కోరిక .. అందుకే నేను డిగ్రీ చేస్తున్నప్పటి నుంచి సివిల్స్ వైపు వెళ్లాలని నిర్ణయించుకున్నా. అలా నాల్గో ప్రయత్నంలో ఐపీఎస్ వచ్చింది. మా కుటుంబం నుంచి నేను మొదటి పోలీస్ అధికారి కావడంతో మా కుటుంబ సభ్యులు ఎంతో సంతోషంగా ఉన్నారు. మా సొంత ప్రాంతం మహారాష్ట్ర. కానీ, మా కుటుంబం హైదరాబాద్‌లో స్థిరపడింది. నాన్న బిజినెస్‌లో ఉన్నారు. నేను పుట్టి పెరిగింది హైదరాబాద్‌లోనే. సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజీ నుంచి బీఎస్సీ బయో కెమిస్ట్రీ పూర్తి చేశాను. ఆ తర్వాత సివిల్స్ ప్రిపరేషన్ ప్రారంభించాను. లక్ష్యంపై స్థిరంగా ఉన్నాను..అందుకే మూడుసార్లు విజయం రాకపోయినా ఆత్మవిశ్వాసం కోల్పోలేదు. నాల్గో ప్రయత్నంలో సివిల్స్ సాధించాను. నేను ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు ఎంపికయ్యాను. అక్కడి ప్రభుత్వం మహిళా భద్రతకు తీసుకుంటున్న చర్యల గురించి విన్నాను. ప్రాక్టికల్ ట్రైనింగ్‌లో జిల్లాల్లో మరిన్ని విషయాలు తెలుసుకునే అవకాశం వస్తుందని భావిస్తున్నా. ఒక ఐపీఎస్ అధికారిగా నా లక్ష్యం ఒక్కటే ...నేను ఎక్కడ పనిచేసినా అక్కడ ప్రజలు భద్రంగా ఉన్నామన్న భావన కల్పించడం.. ప్రత్యేకించి మహిళలు, చిన్నారులకు పోలీస్‌పై నమ్మకం పెంచేలా పనిచేయడం.

– అంకిత సురాన, ఆంధ్రప్రదేశ్ కేడర్ ఐపీఎస్

ప్రణాళిక ఉంటే విజయం తప్పక వస్తుంది



నా పేరు శేషాద్రిని రెడ్డి... మా నాన్న సుధాకర్‌రెడ్డి సివిల్ కాంట్రాక్టర్. చిన్నప్పటి నుంచి మా నాన్న ఎంతో ప్రోత్సహించేవారు. సివిల్ సర్వీసెస్ ఆఫీసర్‌గా ప్రజలకు ఎంత సేవ చేసే అవకాశం ఉంటుంది..వాళ్లకు సమాజంలో ఎంత గౌరవం ఉంటుందన్నది బాగా చెప్పేవారు. అది నాలో ఎంతో ప్రేరణ నింపింది. అలా చిన్ననాటి నుంచే నేను ఐపీఎస్ కావాలని నిశ్చయించుకున్నా. ముందు నుంచి నేను ప్రణాళిక ప్రకారం చదువుకుంటూ వచ్చాను. ఇంజినీరింగ్ పూర్తి చేసిన తర్వాత ప్రిపరేషన్‌పై మరింత ఫోకస్ పెట్టాను. అమ్మా నాన్నల సహకారం నా కష్టంతో చివరకు విజయం సాధించడం సంతోషంగా ఉంది. హైదరాబాద్‌లో పుట్టిపెరిగిన నాకు మళ్లీ తెలంగాణ కేడర్‌లో సొంత రాష్ట్రంలోనే సేవ చేసే అవకాశం రావడం ఇంకా సంతోషంగా ఉంది. తెలంగాణలో పోలీస్ టెక్నాలజీ పరంగా, ఇతర అంశాల్లోనూ ఎంతో బాగున్నాయి. ఇప్పటికే మా సీనియర్ అధికారులు అమలు చేస్తున్న విధానాలను తెలుసుకుంటూనే ప్రజలకు పోలీసింగ్ మరింత చేరువ చేసేందుకు కృషి చేస్తాను. భవిష్యత్తులో మరింతగా పెరగనున్న సైబర్ నేరాలను ఎలా కట్టడి చేయాలన్న దానిపైన మాకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. అది మరింత ఉపయోగపడుతుందని నేను భావిస్తున్నాను.

– శేషాద్రిని రెడ్డి, ఐపీఎస్, తెలంగాణ కేడర్

ఆరేళ్ల బాబును వదిలి ట్రైనింగ్‌కు వచ్చా



ఐపీఎస్ కావాలన్న లక్ష్యం కోసం ఆరేళ్ల బాబును వదిలి ట్రైనింగ్‌కు వచ్చాను..చివరకు మా బ్యాచ్‌లో లేడీ ప్రొబేషనరీ ఔట్‌డోర్ టాపర్‌గా నేను నిలవడం సంతోషంగా ఉంది. నాది తమిళనాడు రాష్ట్రంలోని సేలం జిల్లా. మా నాన్నగారు రైతు, మా అమ్మ టీచర్. నాకు ఒక చెల్లి. వీఐటీ యూనివర్సిటీ వెల్లూరులో నేను బీటెక్‌లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చదివాను. తర్వాత వివాహం అయ్యింది. సాఫ్ట్‌వేర్‌లో మంచి ఉద్యోగం అయినా ఏదో వెలితి ఉండేది. దాన్ని వదిలేశాను. ఆడిట్ అండ్ అకౌంట్ సర్వీస్‌లో పని చేశాను.అదీ మంచి ఉద్యోగమే అయినా తృప్తి లేదు. ప్రజలతో మమేకమై వారికి ఉపయోగపడే వృత్తిలో ఉండాలని నిర్ణయించుకున్నాను. అప్పటికే నాకు కొడుకు పుట్టాడు. ఈ టైంలో మంచి ఉద్యోగం వదిలి సివిల్స్ ఎందుకు అని మా కుటుంబం, ముఖ్యంగా నా భర్త నిరుత్సాహపర్చలేదు.. నీ లక్ష్యం కోసం వెళ్లు.. కుటుంబాన్ని నేను చూసుకుంటా అన్నాడు. దాంతో బాబు పుట్టిన తర్వాత నేను యూపీఎస్సీకి ప్రిపరేషన్ ప్రారంభించాను. అలా ఐపీఎస్‌కి సెలెక్ట్ అయ్యాను. నేను ఔట్‌డోర్ ట్రైనింగ్‌లో ట్రోఫీ పొందానంటే ఈ ట్రైనింగ్ నాలో పెంచిన ఆత్మవిశ్వాసమే కారణం. ఐపీఎస్ శిక్షణ అనేది అంత చిన్న విషయమేమీ కాదు. ఫిజికల్‌గా, మెంటల్‌గా కూడా ఎంతో శ్రమించాలి. శిక్షణ ప్రారంభంలో చాలా కష్టంగా అనిపించినా..క్రమంగా మనలోని శక్తిని మనం గుర్తిస్తాం. మా కుటుంబం నుంచి నేను మొదటి పోలీస్‌ను. ఎంతోమంది మహిళా పోలీసు అధికారులు నేను చూసిన వాళ్లు.. వాళ్లంతా నాకు ప్రేరణే. ఒక మహిళా పోలీస్ అధికారిగా నా వృత్తి జీవితంలో మహిళలు, చిన్నారుల సంరక్షణకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని నేను భావిస్తున్నాను. నా శిక్షణలో నా కుటుంబం సపోర్ట్ ఎంతో ఉంది.

– నిత్యా రాధాకృష్ణన్, ప్రొబేషనరీ ఐపీఎస్, ఏజీఎంటీయూటీ కేడర్

ఫొటోలు: పోచంపల్లి మోహనాచారి

వంటిల్లు

రుచికి తోడుగా ఆరోగ్యం

ఇంటికి బంధువులు వస్తున్నారు.
డైనింగ్ టేబుల్ కళకళలాడుతోంది.
తోటకూర ఉంది... పక్కనే వేటకూరా ఉంది.
కూరగాయల ఆధరువులూ కొలువుదీరాయి.
బంధువులు వచ్చారు... భోజనాలు పూర్తయ్యాయి.
వేటకూర పాత్రలో గరిటె మాత్రమే మిగిలింది.
తోటకూర పాత్ర అదే కళతో నిండుగా ఉంది.
కూరగాయల వంటలు దిగులుగా చూస్తున్నాయి.
అతిథులు రుచిగా భోజనం చేశారు... సంతోషం.
మరి... రుచికి ఆరోగ్యం
జతగా చేరి ఉంటే మరీ సంతోషం.
అందుకే... ఈ వారానికి
ఇలా వండి టేస్ట్ చేద్దాం.

పాలక్ చికెన్



కావలసినవి: పాలకూర– 100 గ్రాములు (శుభ్రం చేసినది) ; బోన్ లెస్ చికెన్ – పావు కేజీ.

మారినేట్ చేయడానికి: పెరుగు – 2 టేబుల్ స్పూన్లు ; మిరప్పొడి – అర టీ స్పూన్ ; ధనియాల పొడి– టీ స్పూన్ ; కసూరి మేథీ (మెంతి ఆకుల పొడి) – టీ స్పూన్ (పొడి లేకపోతే గుప్పెడు తాజా ఆకులు వాడవచ్చు) ; గరం మసాలా పొడి– అర టీ స్పూన్ ; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి ; నిమ్మరసం– టేబుల్ స్పూన్ ; నెయ్యి– టేబుల్ స్పూన్ .

గ్రేవీ కోసం: నూనె – 2 టేబుల్ స్పూన్లు ; యాలకులు – 3 ; బిర్యానీ ఆకులు – 2 ; జీలకర్ర – అర టీ స్పూన్ ; ఉల్లిపాయలు – 3 (గ్రైండ్ చేయాలి) ; వెల్లుల్లి పేస్ట్ – టేబుల్ స్పూన్ ; అల్లం పేస్ట్ – టేబుల్ స్పూన్ ; పచ్చిమిర్చి– 2 (నిలువుగా చీరాలి) ; టొమాటోలు – 3 (తొక్క, గింజలు తీసి గ్రైండ్ చేయాలి) ; మిరప్పొడి– అర టీ స్పూన్ ; గరం మసాలా పొడి– టీ స్పూన్ ; ధనియాల పొడి– టీ స్పూన్ ; కసూరి మేథీ– టేబుల్ స్పూన్ ; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి ; మీగడ– టేబుల్ స్పూన్.

గార్నిష్ చేయడానికి: వెన్న – టేబుల్ స్పూన్

తయారీ: ● చికెన్‌ను శుభ్రం చేసి పెద్ద పాత్రలో వేయాలి. మరొక పాత్రలో మారినేట్ చేయడానికి తీసుకున్న దినుసులను వేసి బాగా కలిపి ఈ మిశ్రమాన్ని చికెన్ ముక్కల్లో వేసి అన్నింటికీ సమంగా పట్టించి మూతపెట్టి ఆ పాత్రను మూడు గంటల సేపు ఫ్రిజ్‌లో పెట్టాలి. ● ఈ లోపు ఒక పాత్రలో నీటిని మరిగించి పాలకూర ఆకులను వేసి రెండు నిమిషాలపాటు మరిగిన తర్వాత ఆకులను చిల్లుల గరిటెతో బయటకు తీసి చన్నీటిలో వేయాలి. వేడి తగ్గిన తర్వాత వడపోసి పక్కన ఉంచాలి. చల్లారిన తరవాత మెత్తగా గ్రైండ్ చేయాలి. ● మందపాటి పాత్రలో నెయ్యి వేడి చేసి మారినేట్ చేసిన చికెన్ వేసి (మీడియం మంట మీద) ముక్కలను గరిటెతో కలుపుతూ మగ్గనివ్వాలి. ముక్కలు మెత్తబడిన తరవాత దించేసి పక్కన పెట్టాలి. ● వెడల్పుగా ఉన్న పాన్‌లో నూనె వేడి చేసి జీలకర్ర వేసి చిటపటలాడనివ్వాలి. యాలకులు, బిర్యానీ ఆకులు, పచ్చిమిర్చి, ఉల్లిపాయ, వెల్లుల్లి, అల్లం పేస్టు వేసి మూడు నిమిషాల పాటు వేయించాలి. నూనె వేరు పడిన తర్వాత టొమాటో పేస్ట్ వేసి కలిపి అందులో ధనియాల పొడి, మిరప్పొడి, కసూరీ మేథీ, గరం మసాలా పొడి, ఉప్పు వేసి వేగనివ్వాలి. ఇవన్నీ వేగిన తరవాత పాలకూర పేస్ట్, ఉడికించిన చికెన్ వేసి కలిపి నాలుగు నిమిషాల సేపు ఉడికించాలి. చివరగా మీగడ వేసి కలిపి దించేయాలి. వడ్డించేముందు కర్రీ మీద వెన్న వేయాలి.

గోంగూర మటన్



కావలసినవి: మటన్ – అర కేజీ ; గోంగూర – పావు కేజీ (ఆకులు); పసుపు – టీ స్పూన్ ; అల్లంవెల్లుల్లి పేస్ట్ – టేబుల్ స్పూన్ ; ఉల్లిపాయ ముక్కలు – కప్పు ; మిరప్పొడి– టీ స్పూన్ ; ధనియాల పొడి– టీ స్పూన్ ; జీలకర్ర పొడి– అర టీ స్పూన్ ; పచ్చి మిర్చి – 5 (నిలువుగా చీరాలి) ; కొత్తిమీర – చిన్న కట్ట ; గరం మసాలా పొడి– టీ స్పూన్ ; షాజీర– టీ స్పూన్ ; యాలకులు – 2 ; దాల్చిన చెక్క – అంగుళం ముక్క ; లవంగాలు – 2 ; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి ; నూనె – 2 టేబుల్ స్పూన్‌లు.

తయారీ: ● ప్రెషర్ కుక్కర్‌లో మటన్, జీలకర్ర పొడి, ధనియాలపొడి, మిరప్పొడి, అరకప్పు నీరు, ఉప్పు వేసి కలిపి మూత పెట్టి ఉడికించాలి. ● పెనంలో నూనె వేడి చేసి గరం మసాలా దినుసులన్నీ వేసి వేగిన తర్వాత ఉల్లిపాయ ముక్కలు, ఉప్పు వేయాలి. ఉల్లిపాయ ముక్కలు రంగు మారిన తరవాత అల్లంవెల్లుల్లి పేస్ట్ వేసి పచ్చివాసన పోయేవరకు వేగనివ్వాలి. ఇప్పుడు పసుపు, పచ్చిమిర్చి, గోంగూర ఆకులు వేసి బాగా కలిపి సన్న మంట మీద ఉడికించాలి. గోంగూర మెత్తబడిన తర్వాత మటన్ (ఉడికించిన నీటితోపాటు) వేసి కలిపి ఐదు నిమిషాల సేపు ఉడికించాలి. ● చివరగా అవసరాన్ని బట్టి మరికొంత నీటిని వేసి కలిపి గరం మసాలా పొడి, కొత్తిమీర ఆకులు వేసి కలిపి దించేయాలి.

చికెన్ వెజిటబుల్ స్ట్యూ



కావలసినవి: చికెన్ – అర కేజీ ; నూనె – 2 టేబుల్ స్పూన్‌లు ; జీలకర్ర – అర టీ స్పూన్ ; మెంతులు – అర టీ స్పూన్ ; అల్లం వెల్లుల్లి పేస్ట్ – టీ స్పూన్ ; కరివేపాకు – 2 రెమ్మలు ; ఉల్లిపాయ – 1 (తరగాలి) ; పచ్చిమిర్చి– 1 (తరగాలి) ; టొమాటో – 1 (తరగాలి) ; బంగాళదుంప ముక్కలు – కప్పు ; క్యారట్ ముక్కలు – కప్పు ; బీన్స్ ముక్కలు – అర కప్పు ; పసుపు – టీ స్పూన్ ; కశ్మీర్ మిరప్పొడి – టీ స్పూన్ ; ధనియాల పొడి– టీ స్పూన్ ; గరం మసాలా పొడి– అర టీ స్పూన్ ; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి ; నిమ్మరసం – టీ స్పూన్ ; మిరియాల పొడి – పావు టీ స్పూన్ నీరు – 3 కప్పులు.

తయారీ: ● చికెన్ ముక్కలను శుభ్రం చేసి పక్కన పెట్టుకోవాలి. ● పెద్ద పెనంలో నూనె వేడి చేసి జీలకర్ర, మెంతులు వేయించాలి. అందులో కరివేపాకు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి అవి వేగిన తరవాత ఉల్లిపాయ, పచ్చిమిర్చి ముక్కలు వేసి వేయించాలి. ఇప్పుడు మసాలా పొడి, పసుపు, కశ్మీర్ మిరప్పొడి, ధనియాల పొడి వేసి అర నిమిషం పాటు సన్న మంట మీద అన్నింటినీ కలుపుతూ వేయించి, టొమాటో ముక్కలు వేసి మగ్గనివ్వాలి. ● ఇందులో చికెన్ ముక్కలు వేసి మసాలా మిశ్రమం బాగా పట్టేటట్లు కలిపి మూత పెట్టి సన్న మంట మీద ఐదు నిమిషాల పాటు ఉడికించాలి. ● ఇప్పుడు బంగాళదుంప ముక్కలు, నీరు పోసి కలిపి మూత పెట్టి పది నిమిషాల సేపు ఉడికించాలి. ఆ తర్వాత క్యారట్, బీన్స్ వేసి కలిపి మళ్లీ మూత పెట్టి మరో ఐదారు నిమిషాల పాటు ఉడకనివ్వాలి. ఇప్పుడు నిమ్మరసం, మిరియాల పొడి వేసి కలిపి దించేయాలి. వేడి వేడి చికెన్ వెజిటబుల్ స్ట్యూ రెడీ.

బీరకాయ రొయ్యలు



కావలసినవి: రొయ్యలు – అరకేజీ (పొట్టు వలిచినవి) ; బీరకాయ – అరకేజీ ; పసుపు – అర టీ స్పూన్ ; పచ్చిమిర్చి– 2 ; ఉల్లిపాయలు – 4 ; అల్లంవెల్లుల్లి పేస్ట్ – టీ స్పూన్ ; ఆవాలు – టీ స్పూన్ ; జీలకర్ర – టీ స్పూన్ ; కరివేపాకు – 4 రెమ్మలు ; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి ; నూనె – 4 టేబుల్ స్పూన్‌లు.

తయారీ: ● రొయ్యలను ఉప్పు, పసుపు వేసి శుభ్రంగా కడిగి మందంగా ఉన్న పాత్రలో వేయాలి. అందులో అల్లం వెల్లుల్లి పేస్ట్, ఉప్పు, మిరప్పొడి, కొద్దిగా నూనె వేసి కలిపి పదినిమిషాల సేపు పక్కన ఉంచాలి. ● బీరకాయ చెక్కు తీసి ముక్కలుగా తరగాలి. ● పెనంలో నూనె వేడి చేసి ఆవాలు, జీలకర్ర, ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు వేసి వేగిన తర్వాత కరివేపాకు వేయాలి. ఇప్పుడు బీరకాయ ముక్కలు వేసి కలిపి మూత పెట్టి సన్నమంట మీద ఉడకనివ్వాలి. ● రొయ్యలు, మసాలా మిశ్రమం ఉన్న పాత్రను మరొక స్టవ్ మీద పెట్టి సన్న మంట మీద ఉడికించాలి (ఇందులో నీరు పోయనక్కరలేదు). రొయ్యలు ఉడికిన తర్వాత ఈ మిశ్రమాన్ని బీరకాయ ఉడుకుతున్న పాత్రలో వేయాలి. ఇందులో ఉప్పు, మిరప్పొడి కూడా వేసి బాగా కలిపి రుచి కలిసే వరకు రెండు నిమిషాల సేపు ఉడికించాలి.

హెయిర్ కేర్

చుండ్రు నివారణకు

తలలో చుండ్రు సమస్య ఈ కాలం అధికంగా విసిగిస్తుంటుంది. దీనికి కారణం మాడు పై భాగం పొడిబారడం వల్ల తెల్లటి పొట్టులాంటి మృతకణాలు బయటకు కనిపిస్తుంటాయి. దీనివల్ల దురద కూడా ఉంటుంది. ఈ సమస్య నివారణకు..



● ఆపిల్ సైడర్ వెనిగర్‌లో అరటిపండు గుజ్జును బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని మాడుకు పట్టించి పది నిమిషాల తర్వాత వెచ్చని నీళ్లతో శుభ్రపరుచుకోవాలి. ● కలబంద గుజ్జును మాడుకు పట్టించి 15 నిమిషాల తర్వాత తలస్నానం చేయాలి. కలబంద చుండ్రును నివారించడమే కాకుండా మాడుపైన దురద వంటి చర్మ సమస్యలనూ నివారిస్తుంది. వెంట్రుకలకు మృదుత్వాన్ని ఇస్తుంది. ● చిన్న అల్లం ముక్కను సన్నగా తరగాలి. ఈ ముక్కలను నువ్వుల నూనెలో వేసి మరిగించాలి. చల్లారిన తర్వాత కుదుళ్లకు నూనె పట్టేలా మర్దనా చేయాలి. గంట సేపు అలాగే ఉంచి, ఆ తర్వాత తలస్నానం చేయాలి. వారంలో రెండు సార్లు ఈ విధంగా చేస్తే చుండ్రు తగ్గుతుంది. ● కప్పు నీళ్లలో 2–3 టేబుల్ స్పూన్ల ఉప్పు కలపాలి. ఈ మిశ్రమాన్ని తలకు పట్టించాలి. 10 నిమిషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి. ● వేప నూనె, ఆలివ్ ఆయిల్ సమపాళ్లలో కలిపి వేడి చేయాలి. గోరువెచ్చని ఈ నూనెను తలకు పట్టించి వేళ్లతో మృదువుగా మర్దనా చేయాలి. 15 నిమిషాల తర్వాత రసాయనాల గాఢత తక్కువ ఉండే షాంపూతో తలస్నానం చేయాలి. ● బేబీ ఆయిల్‌ను తలకు పట్టించి, మర్దనా చేసి వెచ్చని నీళ్లలో ముంచి తీసిన టర్కీ టవల్‌ని చుట్టుకోవాలి. 15 నిమిషాల తర్వాత చుండ్రు నివారణకు ఉపయోగించే షాంపూతో తలస్నానం చేయాలి.

● ఆర్ట్ అండ్ కల్చర్



ఆప్తి మిల్లర్

అపురూప కల్పన

ముంబైకి చెందిన ఆప్తి మిల్లర్‌ను 'ఆర్కిటెక్ట్' అంటే మాత్రమే సరిపోదు. అలా అని 'ఆర్ట్'కు మాత్రమే పరిమితం చేయలేము. ఇలస్ట్రేషన్, గ్రాఫిక్ డిజైన్‌లతో తన ప్రొఫెషనల్ కెరీర్‌కు కొత్త మెరుపు తీసుకువచ్చింది. అదే తన ప్రత్యేకశైలిగా మారింది...

ఆర్కిటెక్చర్ + ఆర్ట్

ముంబైలోని ఆప్తి మిల్లర్ ఇల్లు క్రియేటివిటీకి సంబంధించిన విషయాలకు కేంద్రంగా ఉండేది. తల్లి ఫైన్ ఆర్టిస్ట్. తండ్రి ఆర్కిటెక్ట్. ఇంటినిండా ఆర్ట్‌కు సంబంధించిన ముచ్చట్లే! చిన్నప్పటి నుంచి తల్లిదండ్రులతో పాటు రకరకాల మ్యూజియమ్‌లు, ఆర్ట్‌గ్యాలరీలకు వెళుతుండేది మిల్లర్.

అవి ఊరకే ఉండనిస్తాయా! తనలో సృజనాత్మకమైన ఆలోచనలను పెంపొందించాయి.

సక్సెస్‌ఫుల్ ఆర్కిటెక్ట్‌గా తండ్రికి మంచి పేరు ఉంది. అయితే అది రాత్రికి రాత్రి వచ్చేందేమీ కాదు. ఎంతో కష్టపడ్డాడు. తండ్రి కష్టం తనకు ఆదర్శం అయింది. తండ్రి బాటలోనే ఆర్కిటెక్చర్ కోర్సు చదువుకుంది. 'మిల్లర్ ఇంక్ స్టూడియో' మొదలు పెట్టింది. ఈ స్టూడియో ద్వారా ప్రొఫెషనల్ కెరీర్ 'ఆర్కిటెక్ట్'ను తన క్రియేటివిటీకి సంబంధించిన ఇలస్ట్రేషన్ అండ్ గ్రాఫిక్ డిజైన్‌లతో మిళితం చేసి యూనిక్ స్టైల్‌తో తిరుగులేని విజయం సాధించింది మిల్లర్.

జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో ప్రసిద్ధ బ్రాండ్‌లతో కలిసి పనిచేస్తోంది. మారథాన్‌లకు సంబంధించిన మెడల్స్‌ను యూనిక్ స్టైల్‌లో డిజైన్ చేయడంలో తనదైన ప్రత్యేకత సాధించుకుంది.

ఒక ఫిన్‌టెక్ కంపెనీ బ్రాండ్‌కు సంబంధించి మనీఆర్ట్ సిరీస్ కోసం మిల్లర్ సృష్టించిన 14 లేయర్‌లతో కూడిన ఆర్ట్ వర్క్‌కు మంచి పేరు వచ్చింది. ప్రతి లేయర్‌లో వివిధ దేశాలకు చెంది కరెన్సీ, వివిధ భౌగోళిక ప్రాంతాలకు సంబంధించిన ఎలిమెంట్స్ ప్రతిఫలిస్తాయి.

మిల్లర్ ఆర్ట్‌వర్క్స్ దేశవిదేశాల్లోని ప్రసిద్ధ గ్యాలరీలలో ప్రదర్శించబడ్డాయి.

'మిల్లర్ ఆర్ట్‌వర్క్‌లో తాజాదనం కనిపిస్తుంది. సూటిగా మనసును తాకే ఆకర్షణీయత ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో నగరాలలో ఎన్నో కట్టడాలు ఉన్నాయి. వాటి వైవిధ్యాన్ని తన కళలోకి తీసుకురావడానికి ఎంతో అవకాశం ఉంది' అంటుంది క్యూరేటర్ అమ్‌బ్రోగి.

'మిల్లర్‌లోని ప్రత్యేకత ఏమిటంటే ఒకే సమయంలో భిన్నమైన విషయాల గురించి ఆలోచించడం. వాటిని సృజనాత్మకంగా సమన్వయం చేసుకోవడం. ఆమె ఆర్ట్‌వర్క్స్‌లో ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్, శిల్పం, చిత్రం మిళితమై కనిపిస్తాయి' అంటున్నాడు ఆర్కిటెక్చరల్ సంస్థ పికార్ట్‌కు చెందిన ఆంథోనీ మార్కెస్.

ఆంథోనితో కలిసి అర్బన్ మాస్టర్ ప్లాన్స్ నుంచి పర్సనల్ స్పేసెస్ వరకు ఎన్నో ప్రాజెక్ట్‌లలో పనిచేసింది ఆప్తి మిల్లర్.

'మోర్ ఈజ్ బెటర్' అనే ఫిలాసఫీని నమ్ముతున్న ఆప్తి మిల్లర్ తాజాగా ఫోర్బ్స్ ఇండియా '30 అండర్ 30'లో చోటు సంపాదించింది.

> నేను చేసే వర్క్స్‌లో వీలైనన్ని వివరాలు ఉండేలా జాగ్రత్త పడతాను. దీంతో వీక్షకులు అందులో కొత్తదనాన్ని చూస్తారు. నా ఆలోచన విధానం ఏమిటో తెలిసిపోతుంది. నా మది ఎప్పుడూ రకరకాల ఐడియాలతో నిండిపోయి ఉంటుంది. వాటిలో నుంచి కొన్ని ఐడియాలను తీసుకొని పనిచేస్తాను.
> – మిల్లర్

● టెక్.. టాక్

పోకో ఎక్స్5 ప్రో

డిస్‌ప్లే: 6.67 అంగుళాలు ; రిఫ్రెష్ రేట్: 120 హెచ్‌జడ్
మెమోరీ: 128జీబి 6జీబి ర్యామ్ 6 జీబి 8జీబి ర్యామ్
రిజల్యూషన్: 1080×2400 పిక్సెల్స్
బ్యాటరీ: 5000 ఎంఏహెచ్ ; కలర్స్: బ్లాక్, బ్లూ, ఎల్లో



మైక్రోసాఫ్ట్ 'ఎడ్జ్'లో కొత్త ఫీచర్స్

మైక్రోసాఫ్ట్ తమ వెబ్‌బ్రౌజర్ 'ఎడ్జ్' ను కొత్త ఏఐ ఆధారిత ఫీచర్స్‌తో అప్‌డేట్ చేసింది. బ్రాండ్–న్యూ లుక్‌తో కనిపించనున్న 'ఎడ్జ్' బ్రౌజర్‌లోని రెండు ఏఐ ఆధారిత ఫీచర్లు చాట్, కంపోజ్. 'చాట్'తో వెబ్‌పేజ్ కంటెంట్, డాక్యుమెంట్‌కు సంబంధించి సమ్మరీని పొందడానికి, ప్రశ్నలు అడగడానికి వీలవుతుంది. 'కంపోజ్' ఫీచర్ అనేది రైటింగ్ అసిస్టెంట్. ఇది ప్రాంప్ట్స్ ఆధారంగా టెక్స్ట్, ఇ–మెయిల్స్‌ను జనరేట్ చేస్తుంది.



ఇన్‌స్టాగ్రామ్‌లో ఇలా...

ఇన్‌స్టాగ్రామ్‌లో (ఐఫోన్) ఒరిజినల్ ఫొటోలు 'ఫొటో లైబ్రరీ'లో సేవ్ కావడానికి...

1. ఇన్‌స్టా ఒపెన్ చేసి 'ప్రొఫైల్'లోకి వెళ్లాలి.
2. అప్పర్‌రైట్ కార్నర్‌లో మూడు లైన్స్ టాప్ చేయాలి.
3. సెట్టింగ్స్–సెలెక్ట్
4. ఎకౌంట్‌లోకి వెళ్లాలి.
5. ఒరిజినల్ ఫొటోస్–టాప్
6. 'సేవ్ ఒరిజినల్ ఫొటోస్' బటన్ నొక్కాలి.



● సక్సెస్ స్టోరీ

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్‌సీ) నిర్వహించే ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ (ఐఇఎస్-2022)లో హైదరాబాద్‌కు చెందిన పవన్ స్వరూప్ రెడ్డి 5వ ర్యాంక్ సాధించాడు.



కర్మయోగి స్ఫూర్తితో...

సూరత్ 'నిట్'లో సివిల్ ఇంజనీరింగ్ చేసిన పవన్ స్వరూప్‌రెడ్డి ఐఐటీ, కాన్పూర్‌లో స్ట్రక్చరల్ ఇంజనీరింగ్‌లో ఎంటెక్ చేశాడు. 'మెట్రో మ్యాన్ ఆఫ్ ఇండియా'గా పేరుగాంచిన డా.శ్రీధరన్ ఆటోబయోగ్రఫీ 'కర్మ యోగి' చదివాడు పవన్ స్వరూప్. ఈ పుస్తకం తనలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. బలమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవడానికి కారణం అయింది. శ్రీధరన్ చేసిన ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్ట్‌లతో స్ఫూర్తి పొందిన పవన్ స్వరూప్ ఇంజనీరింగ్ సర్వీస్‌లలోకి రావాలనుకున్నాడు. తనను ఐ.ఇ.ఎస్ ఆఫీసర్‌గా చూడాలనేది తల్లి కల. తండ్రి ఆంజనేయులురెడ్డి ఇదే పరీక్షల్లో ఒకప్పుడు 13వ ర్యాంక్ సాధించాడు. ప్రస్తుతం ఆయన సౌత్ సెంట్రల్ రైల్వే, సికింద్రాబాద్‌లో చీఫ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు.

బెంగళూరులోని అమెరికాకు చెందిన ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీలో స్ట్రక్చరల్ ఇంజనీర్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే మరోవైపు రోజుకు 5–6 గంటలు, సెలవు రోజు 8–10 గంటల పాటు 'ఐఇఎస్' పరీక్షల కోసం ప్రిపేరయ్యేవాడు. 'ఒకవైపు ఉద్యోగబాధ్యతలకు వందశాతం న్యాయం చేయాలి. మరోవైపు ఆఫీస్ నుంచి వచ్చిన తరువాత పరీక్షలకు గట్టిగా ప్రిపేర్ కావాలి' అనుకొని రంగంలోకి దిగాడు. స్మార్ట్‌ఫోన్‌ను పక్కన పెట్టాడు. స్టడీ మెటీరియల్ మాత్రమే తన కళ్ల ముందు కనిపించేది. స్వరూప్ కష్టం వృథా పోలేదు. ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్‌లో 5వ ర్యాంకుతో విజయకేతనం ఎగరేశాడు.

'ఒక్కసారి మీ ప్రయత్నంలో విఫలం అయితే ఎంత మాత్రం నిరాశ పడనక్కర్లేదు. మనం చేసిన తప్పుల నుంచి కూడా ఎన్నో పాఠాలు నేర్చుకోవచ్చు. ఏంచేయకూడదో తెలుసుకోవచ్చు. మనం నిర్దేశించుకున్న లక్ష్యంపై గట్టి సంకల్పబలం ఉంటే విజయం దక్కడం కష్టమేమీ కాదు' అంటున్న పవన్ స్వరూప్‌రెడ్డి తన వృత్తిజీవితంలో విజయాలు సాధించాలని ఆశిద్దాం.

● గేమింగ్

మోస్ట్ వాంటెడ్ గేమ్

ఓపెన్–వరల్డ్, యాక్షన్ రోల్–ప్లేయింగ్ గేమ్ 'హాగ్‌వార్ట్స్ లెగసీ' నేడు విడుదల అవుతుంది. హ్యారీపోటర్ నవలల ఆధారంగా అల్లుకున్న కథ ఇది. ఈ గేమ్‌లో ప్లేయర్స్ హాగ్‌వార్ట్స్ స్కూల్ ఆఫ్ విచ్‌క్రాఫ్ట్ క్లాస్‌లకు హాజరు కావాల్సి ఉంటుంది. ప్లేయర్ క్యారెక్టర్ యుద్ధతంత్రాలలో నైపుణ్యం సాధించాల్సి ఉంటుంది. లియర్‌జర్‌ఫిగ్‌లాంటి కొత్త క్యారెక్టర్లను ఈ ఆటలో ప్రవేశ పెట్టారు. మూడు మంత్రదండాలలో ప్రతిదానికి తనదైన ప్రత్యేక శక్తి ఉంటుంది. హ్యారీపాటర్ అభిమానులకు 'మోస్ట్ వాంటెడ్ గేమ్' గా గుర్తింపు పొందింది.

జానర్స్: ఒపెన్ వరల్డ్ ఎంటర్‌టైన్‌మెంట్ నెరేటివ్
మోడ్: సింగిల్–ప్లేయర్ వీడియో గేమ్
ప్లాట్‌ఫామ్స్: పీసి, పీఎస్5, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్



సినిమా

మలయాళం 'దృశ్యం' పోస్టర్లు





ఒక 'దృశ్యం'... మలయాళంలో బంపర్ హిట్. అదే 'దృశ్యం'... తెలుగు, తమిళ్, కన్నడ, హిందీలోనూ సూపర్ హిట్. అందుకే ఈ 'దృశ్యం' దేశం దాటింది. అటు చైనా.. ఇండోనేషియాలోనూ 'దృశ్యం' బాక్సాఫీస్ రికార్డులు సాధించింది. ఇలా మలయాళంలో వచ్చిన 'దృశ్యం' ఏ భాషలో రీమేక్ అయితే ఆ భాషలో హిట్. ఇప్పుడు ఇంగ్లీష్ 'దృశ్యం' రానుంది. ఇంకా పలు విదేశీ భాషల్లో రీమేక్ కానుంది. ప్రపంచ వ్యాప్తంగా చూసే సినిమాలను 'పాన్ ఇండియా' అంటున్నాం. 'పాన్ ఇండియా మూవీ' అంటే కథ కూడా 'పాన్ ఇండియా'ది అయ్యుండాలి. 'దృశ్యం' అలాంటి కథే. ఇది కదా... పాన్ ఇండియా కథ! ఇక ఈ 'దృశ్యం' గురించి తెలుసుకుందాం.

ఇది కదా... పాన్ ఇండియా కథ!

కథ ఏంటంటే...

సినిమాల పట్ల విపరీతమైన ఆసక్తి ఉన్న ఓ మధ్యతరగతి కుటుంబానికి చెందిన తండ్రి తన కుటుంబాన్ని, ముఖ్యంగా తన పెద్ద కుమార్తెను ఊహించని ఆపాయం నుంచి ఎలా రక్షించుకోగలిగాడు? ఈ ప్రయత్నంలో ఓ పోలీసాఫీసర్ కుమారుడి హత్య కేసును చేధించాలనుకునే పోలీస్ డిపార్ట్‌మెంట్ వ్యూహాలకు ఎటువంటి ప్రతివ్యూహాలు రచించి, ఆ తండ్రి సక్సెస్ అయ్యాడు అన్నదే ఈ చిత్ర కథ.

తొమ్మిదేళ్ల క్రితం హీరో మోహన్‌లాల్, దర్శకుడు జీతూ జోసెఫ్ కాంబినేషన్‌లో మలయాళంలో 'దృశ్యం' చిత్రం రూపొందింది. ఈ చిత్రంలో మీనా, అన్సిబా హాసన్, ఎస్తర్ అనిల్, ఆశా శరత్, సిద్దిక్ కీలక పాత్రలు పోషించారు. ఐదు కోట్ల రూపాయల బడ్జెట్‌తో ఈ సినిమాను ఆంటోనీ పెరుంబవూర్ నిర్మించారు. 2013 డిసెంబరు 19న విడుదలై, ఈ చిత్రం సంచలన విజయం సాధించింది. ఫ్యామిలీ ఎమోషన్స్‌కు థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ జోడించి జీతూ జోసెఫ్ తీసిన ఈ సినిమా ప్రేక్షకులకు నచ్చింది. ఎంతగా నచ్చిందంటే.. కేరళ బాక్సాఫీస్ చరిత్రలో యాభై కోట్ల రూపాయల వసూళ్లను సాధించిన తొలి చిత్రంగా 'దృశ్యం' చరిత్ర సృష్టించింది. మొత్తంగా 75 కోట్ల రూపాయల వసూళ్లను రాబట్టింది. ఈ సినిమా షూటింగ్‌ని కేవలం 44 రోజుల్లోనే పూర్తి చేశారు. ఇక 'దృశ్యం' సూపర్ డూపర్ హిట్ సాధించడంతో 2020 సెప్టెంబర్‌లో 'దృశ్యం 2' షూటింగ్‌కు శ్రీకారం చుట్టారు మోహన్‌లాల్, జీతూ జోసెఫ్ అండ్ ఆంటోనీ పెరుంబవూర్. తొలి భాగంలానే పర్ఫెక్ట్ ప్లానింగ్‌తో 46 రోజుల్లో షూటింగ్‌ను పూర్తి చేసి 2021 ఫిబ్రవరి 19న ప్రేక్షకుల ముందుకు తెచ్చారు. 'దృశ్యం 2' కూడా సూపర్ డూపర్ హిట్. అయితే ఓ వెలితి. అదేంటంటే.. 'దృశ్యం 2' థియేటర్స్‌లో కాకుండా ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో విడుదలైంది. దీనికి కారణం కరోనా. ఒకవేళ థియేటర్స్‌లో విడుదలై ఉంటే కొత్త బాక్సాఫీస్ రికార్డ్స్ నమోదై ఉండేవేమో! 2016లో విడుదలై దాదాపు రూ. 150 కోట్ల వసూళ్లను సాధించిన 'పులిమురుగన్'(ఇందులో మోహన్‌లాల్ హీరో) రికార్డును 'దృశ్యం 2' బ్రేక్ చేసి ఉండేదని ట్రేడ్ వర్గాలు అభిప్రాయపడ్డాయి.

తొలి ఇండియన్ మూవీ!

'దృశ్యం' సినిమా సూపర్ డూపర్ హిట్ కావడంతో పాటు పలు ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ప్రదర్శితమై వీక్షకుల, విమర్శకుల ప్రసంశలను పొందింది. దీంతో ఈ సినిమా రీమేక్ రైట్స్ హాట్ కేకుల్లా అమ్ముడు పోయాయి. మలయాళ 'దృశ్యం' సినిమాను 2014లో తెలుగులో 'దృశ్యం'గా (ఇందులో వెంకటేశ్ హీరోగా నటించారు), కన్నడంలో 'దృశ్య' (ఇందులో రవిచంద్రన్)గా రీమేక్ చేశారు. ఆ తర్వాత 2015లో తమిళంలో 'పాపనాశం'గా (కమల్‌హాసన్ హీరో), హిందీలో 'దృశ్యం' (అజయ్ దేవగన్)గా రీమేక్ చేశారు. అంతేకాదు.. ఆ తర్వాత శ్రీలంక భాషలో 'ధర్మయుద్దాయ' (2017)గా, చైనాలో 'షీప్ వితవుట్ షెపర్డ్' (2019)గా ఆ తర్వాత ఇండోనేషియాలో 'దృశ్యం'గా రీమేక్ అయ్యింది. ఇలా చైనా, ఇండోనేషియా భాషల్లో రీమేక్ అయిన తొలి ఇండియన్ మూవీ కూడా 'దృశ్యం'నే కావడం విశేషం. రీమేక్ కావడమే కాదు.. అక్కడ బాక్సాఫీస్ పరంగా హిట్ సాధించింది. కాగా, 'దృశ్యం' సినిమాకు సీక్వెల్‌గా 2021లో విడుదలైన మలయాళ 'దృశ్యం 2'కి కూడా డిజిటల్ వీక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. దీంతో 'దృశ్యం 2'ను తెలుగు, హిందీ భాషల్లో రీమేక్ చేశారు. 'దృశ్యం' రీమేక్‌లో నటించిన వెంకటేశ్‌నే 'దృశ్యం 2'లోనూ నటించారు. కోవిడ్ వల్ల ఈ చిత్రం 2021 నవంబరు 25న ఓటీటీలో స్ట్రీమింగ్ అయ్యింది. కాగా 'దృశ్యం 2' హిందీ రీమేక్ గత ఏడాది నవంబరు 18న థియేటర్స్‌లో విడుదలై రూ. 300 కోట్లకు పైగా వసూళ్లు సాధించి, 2022లో అత్యధిక వసూళ్లను సాధించిన టాప్ టెన్ హిందీ మూవీస్‌లో ఒకటిగా నిలిచింది. హిందీ 'దృశ్యం'లో నటించిన అజయ్ దేవగన్‌నే 'దృశ్యం 2'లోనూ నటించారు. అలాగే హిందీ చిత్రం 'దేవదాస్' (1955) తర్వాత ఇతర భాషల్లో ఎక్కువగా రీమేక్ అవుతున్న చిత్రం 'దృశ్యం' అని టాక్.

మాలీవుడ్ నుంచి హాలీవుడ్‌కి...

'దృశ్యం', 'దృశ్యం 2' చిత్రాలకు సంబంధించిన ఇంగ్లిష్, నాన్ ఇండియన్ లాంగ్వేజెస్ రీమేక్ హక్కులను పనోరమ స్టూడియోస్ ఇంటర్‌నేషనల్ సంస్థ దక్కించుకుంది (ఫిలిప్పినో, ఇండోనేషియా, సింహళ భాషల హక్కులు మాత్రం కాదు.. ఎందుకంటే ఈ భాషల్లో ఆల్రెడీ 'దృశ్యం' రీమేక్ అయ్యింది). ''దృశ్యం', 'దృశ్యం 2'ల ఫారిన్ లాంగ్వేజెస్ హక్కులను దక్కించుకున్నాం. జపాన్, కొరియా, హాలీవుడ్‌లో 'దృశ్యం'ను రీమేక్ చేసేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టాం. 'దృశ్యం 2'కు చెందిన చైనీస్ రీమేక్ హక్కులు కూడా మా వద్దే ఉన్నాయి'' అని పనోరమ స్టూడియోస్ సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు.

మోహన్ లాల్, జీతూ జోసెఫ్, ఆంటోనీల కాంబినేషన్‌లో 'దృశ్యం 3' కూడా రానుంది. గత ఏడాది ఆగస్టులో జరిగిన ఓ అవార్డు ఫంక్షన్‌లో 'దృశ్యం 3' ఉంటుందన్నారు ఆంటోనీ.

స్పెయిన్‌లో సెలబ్రేషన్


● మహేశ్‌బాబు

ఫారిన్ టూర్‌కు వెళ్లారు మహేశ్‌బాబు. 'అతడు', 'ఖలేజా' చిత్రాల తర్వాత హీరో మహేశ్‌బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా తాజా షెడ్యూల్ ముగిసింది. ముఖ్యంగా హాస్పిటల్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే సన్నివేశాలను చిత్రీకరించారు. తర్వాతి షెడ్యూల్ త్వరలో ఆరంభం కానుంది. ఈ గ్యాప్‌లో ఫ్యామిలీతో కలిసి మహేశ్ స్పెయిన్ వెళ్లారని సమాచారం. ఫిబ్రవరి 10 (శుక్రవారం) మహేశ్, నమ్రతల పెళ్లి రోజు. మ్యారేజ్ డే సెలబ్రేషన్స్ కోసమే స్పెయిన్‌కు వెళ్లి ఉంటారని ఊహించవచ్చు.

ఇదీ దాసరి చరిత్రకు శ్రీకారం - నట్టి కుమార్



''సినీ పరిశ్రమ నిలబడటానికి దాసరి నారాయణరావు లాంటి పెద్దలు ఎంతో కృషి చేశారు. అందుకే ఆయన సినీ ప్రయాణంతో 'ఇదీ దాసరి చరిత్ర' పేరుతో సినిమా తీస్తా. మే 4న దాసరిగారి జయంతిన ఈ చిత్రాన్ని ప్రారంభిస్తాం'' అన్నారు నిర్మాత నట్టి కుమార్. హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ– ''దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డిగారు ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకొచ్చి ప్రజల హృదయాల్లో నిలిచిపోయారు. దాసరిగారు కూడా నిర్మాతల మండలిలోని సభ్యులకు మెడిక్లెయిమ్ పాలసీని వర్తింపజేశారు. అయితే కొందరు సినీ పెద్దలు వాటికి తిలోదకాలు ఇచ్చే స్థితికి వచ్చారు. రాజ్యసభ సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా, సినీ రంగానికి దాసరిగారు చేసిన సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ ప్రాంగణంలో ఆయన విగ్రహం పెట్టాలి.. అలాగే ఫిలింనగర్‌లో, ఆయన పుట్టిన పాలకొల్లులో దాసరిగారి పేరుతో పార్కులు నిర్మించేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు కృషిచేయాలి. ఏపీలో కూడా షూటింగ్‌లు జరగాల్సిన అవసరం ఉంది. ఏపీ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోసాని కృష్ణమురళి, ఎలక్ట్రానిక్ మీడియా అడ్వైజర్ అలీ ఇండస్ట్రీలోని అందర్నీ కలుపుకుని ముందుకువెళ్లాలి. గిల్డ్‌లోని కొందరు పెద్ద నిర్మాతలు చిన్న నిర్మాతల గురించి ఆలోచించరు. అందుకే త్వరలో జరిగే తెలుగు ఫిలిం ఛాంబర్, తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి ఎన్నికల్లో వారిని ఎన్నుకోకుండా జాగ్రత్తపడాలి'' అన్నారు.

నిర్మాతగా మారడానికి ఇదే సరైన కథ! - అవికా గోర్



''నిర్మాతని కావాలని నా 21వ ఏటనే అనుకున్నాను.. నిర్మాతగా మారడానికి 'పాప్‌కార్న్' సరైన కథ. అందుకే ఈ చిత్రంతో తొలి అడుగు వేశాను'' అని అవికా గోర్ అన్నారు. సాయి రోనక్ హీరోగా మురళి గంధం దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పాప్‌కార్న్'. ఈ చిత్రంలో అవికా గోర్ హీరోయిన్‌గా నటించడంతో పాటు నిర్మాతగా (సహ నిర్మాత) మారారు. ఎంఎస్ చలపతి రాజు సమర్పణలో భోగేంద్ర గుప్తా నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా అవికా గోర్ చెప్పిన విశేషాలు.

● డైరెక్టర్ మురళి చెప్పిన 'పాప్‌కార్న్' కథ ఆసక్తిగా అనిపించింది. 90 శాతం లిఫ్ట్‌లో జరిగే కథ ఇది. ఇప్పుడు ఆడియన్స్‌కి మంచి కంటెంట్ లేదా మాస్ మసాలా కావాలి. ఆ రెంటినీ బ్యాలెన్స్ చేస్తూ 'పాప్‌కార్న్' తీశారు మురళి. ● చిత్రపరిశ్రమలో నాకు గాడ్‌ఫాదర్స్ లేరు. అందుకే నేను నిర్మాతగా చేస్తానని చెప్పగానే ముందు సందేహం వ్యక్తం చేశారు మా పేరెంట్స్. కానీ, ఇది నా కల అని చెప్పగానే వాళ్లు ఒప్పుకున్నారు. నిర్మాతగా సినిమా ఎలా వస్తోంది? ఎలా ప్రమోట్ చేయాలి? అని ఆలోచించడం కొత్తగా అనిపించింది. నా ప్రొడక్షన్ హౌస్‌లో మరో సినిమా షూటింగ్ చేశాం. అలాగే ఇంకో మూవీ ప్రీ ప్రొడక్షన్ జరుగుతోంది. ● ప్రస్తుతం తెలుగులో కొన్ని సినిమాలు చేస్తున్నాను. '1920' అనే చిత్రంతో బాలీవుడ్‌లో అడుగుపెడుతున్నాను.

టీజర్ ఆకట్టుకుంది - మంత్రి కేటీఆర్


● కేటీఆర్‌తో చిత్ర యూనిట్


''భీమదేవరపల్లి బ్రాంచి' సినిమా టీజర్ ఆకట్టుకుంది. మంచి కథాంశంతో పాటు చక్కని సందేశం ఉన్న చిత్రం అని అర్థమవుతోంది. ఈ సినిమాను తప్పకుండా చూస్తాను'' అని తెలంగాణ రాష్ట ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. ప్రొఫెసర్ నాగేశ్వర్, సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, అద్దంకి దయాకర్, అంజి వల్లుమాన్, రాజవ్వ, సుధాకర్ రెడ్డి, కీర్తిలత గౌడ్ నటించిన చిత్రం 'భీమదేవరపల్లి బ్రాంచి'. రమేష్ చెప్పాల దర్శకత్వంలో డా.బత్తిని కీర్తిలతా గౌడ్, రాజా నరేందర్ చెట్లపెల్లి నిర్మించారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రం టీజర్‌ను కేటీఆర్ విడుదల చేశారు. ''ఓ మంచి విషయాన్ని రమేష్ చెప్పాల వినోదాత్మకంగా చెప్పారు'' అన్నారు కీర్తిలతా గౌడ్.

ఊ అంటావా మావా!


● ప్రసన్న కుమార్, రేలంగి నరసింహారావు, యశ్వంత్

యశ్వంత్, రాకింగ్ రాకేష్, అనన్య, హిందోలా చక్రవర్తి, పూజ, సిమ్రాన్ కీలక పాత్రల్లో రేలంగి నరసింహారావు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఊ అంటావా మావా ఊఊ అంటావా మావ'. తుమ్మల ప్రసన్న కుమార్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 18న విడుదల కానుంది. ఈ సందర్భంగా రేలంగి నరసింహారావు మాట్లాడుతూ– ''తెలుగులో ఇప్పటి వరకూ రాని కామెడీ, హారర్ థ్రిల్లర్ చిత్రమిది. మంచి సినిమా అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు. ''రేలంగి నరసింహారావుగారి 76వ చిత్రం ఇది. అవుట్‌పుట్ అద్భుతంగా వచ్చింది. పాటలు చక్కగా కుదిరాయి'' అన్నారు ప్రసన్నకుమార్.

మార్చిలో దళారి


● 'షకలక' శంకర్

'షకలక' శంకర్ హీరోగా, అక్సఖాన్, రూపిక హీరోయిన్లుగా రాజీవ్ కనకాల ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'దళారి'. కాచిడి గోపాల్ రెడ్డి దర్శకత్వంలో ఎడవెల్లి వెంకట రెడ్డి నిర్మించిన ఈ సినిమా మార్చిలో రిలీజ్ కానుంది. కాగా తెలంగాణలోని వేములవాడలో 'ఇండస్ట్రీ ఆఫ్ తెలంగాణ ఫోక్ సింగర్స్'(ఐటీఎఫ్) నిర్వహించిన గూగులమ్మతల్లి బోనాలు కార్యక్రమంలో 'దళారి' సినిమా టీజర్ రిలీజ్ చేశారు. ''ఈ కరీంనగర్ జిల్లా బిడ్డగా అందర్నీ మెప్పించే కథతో 'దళారి' సినిమా తీశాను'' అన్నారు కాచిడి గోపాల్ రెడ్డి. ''ఈ సినిమా కథ, పాటలు, డ్యాన్సులు, ఎమోషన్స్ ప్రేక్షకులు ఎంజాయ్ చేసేలా ఉంటాయి'' అన్నారు వెంకట్ రెడ్డి.

సాక్షి బిజినెస్

శుక్రవారం
10-2-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	142	60,806
నిఫ్టీ ▲	22	17,893

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	11,873	▽	37
డోజోన్స్	33,865	▽	84
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,911	▲	26
డాక్స్	15,523	▲	111
షాంఘై	3,270	▲	38
నికాయ్	27,584	▽	22

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో ముంబై		
బంగారం (24 క్యారట్)		
57,597	▲	59
బంగారం (22 క్యారట్)		
57,366	▲	58
వెండి (కేజీ)		
67,516	▽	33

ఫారెక్స్ రేట్లు రూ.లలో		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	81.83	83.50
£	బ్రిటన్ పౌండ్	87.18	92.29
€	యూరో	98.18	101.56
¥	జపాన్ ఎన్ (100)	61.92	63.95
AUS	ఆస్ట్రేలియా డాలర్	56.37	58.80
S$	సింగపూర్ డాలర్	61.33	63.37
SAR	సౌదీ రియాల్	21.01	22.68
UAE D	యూఏఈ దిర్హామ్	21.57	23.36
¥	చైనా యువాన్	11.05	13.13

బిజినెస్ రీల్

హైదరాబాద్‌లో టీసీఎస్ మరో సెంటర్: రాజన్న



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) హైదరాబాద్‌లో మరో సెంటర్‌ను ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే హైదరాబాద్‌లో తమకు ఏడు ఉండగా ఇది ఎనిమిదోది కానున్నట్లు సంస్థ సీనియర్ వైస్–ప్రెసిడెంట్ వి. రాజన్న తెలిపారు. సుమారు ఏడు వందల మంది సిబ్బంది సామర్థ్యంతో ఉండే ఈ చిన్న స్థాయి కేంద్రం వచ్చే ఆరేడు నెలల్లో పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తుందని వివరించారు. ప్రస్తుతం దాదాపు 90,000 మంది ఉద్యోగులు ఇక్కడ ఉండగా వీరిలో 37.4 శాతం మంది మహిళలు ఉన్నట్లు తెలిపారు.

భారత్‌లో ట్విటర్ బ్లూటిక్ @ రూ. 900




న్యూఢిల్లీ: మైక్రోబ్లాగింగ్ సైట్ ట్విటర్ భారత్‌లోని యూజర్ల కోసం బ్లూటిక్ చార్జీలను ప్రకటించింది. దీని ప్రకారం మొబైల్ యాప్‌కు సంబంధించి నెలకు రూ. 900, వెబ్ కోసం రూ. 650 చెల్లించాల్సి ఉంటుందని సంస్థ తెలిపింది. అలాగే, వెబ్ యూజర్ల కోసం రూ. 6,800 వార్షిక ప్లాన్‌ను కూడా ట్విటర్ ఆవిష్కరించింది. ట్విటర్‌ను టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ కొనుగోలు చేసిన తర్వాత పలు కొత్త మార్పులు చేస్తున్న సంగతి తెలిసిందే.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

10-2-2023	
విశాఖ	460-00
చిత్తూరు	448-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	415-00
విజయవాడ	415-00
రిటైల్ ధర (డజను)	66.00
9-2-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	390-00
వరంగల్	392-00
రిటైల్ ధర	4.85

అరబిందో మధ్యంతర డివిడెండ్ రూ.3



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ రంగ సంస్థ అరబిందో ఫార్మా డిసెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంతక్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే రూ.604 కోట్ల నుంచి రూ.491 కోట్లకు వచ్చి చేరింది. ఎబిటా రూ.954 కోట్లు, ఎబిటా మార్జిన్ 14.9 శాతంగా ఉంది. ఈపీఎస్ ఒక్కో షేరుకు రూ.8.38 నమోదైంది. టర్నోవర్ 6.7 శాతం అధికమై రూ.6,407 కోట్లకు ఎగసింది. యూఎస్ ఫార్ములేషన్స్ ఆదాయం 9.3 శాతం దూసుకెళ్లి రూ.3,001 కోట్లు, యూరప్ ఫార్ములేషన్స్ స్వల్పంగా పెరిగి రూ.1,701 కోట్లుగా ఉంది. వృద్ధి మార్కెట్ల నుంచి ఆదాయం 25.7 శాతం అధికమై రూ.499 కోట్లకు చేరింది. పరిశోధన, అభివృద్ధికి చేసిన వ్యయం 4.8 శాతం నుంచి 6.5 శాతానికి ఎగసి రూ.415 కోట్లకు చేరింది. డిసెంబర్ త్రైమాసికంలో యూఎస్‌ఎఫ్‌డీఏ నుంచి నాలుగు ఇంజెక్టేబుల్స్‌తోసహా 15 ఏఎన్‌డీఏలకు తుది ఆమోదం లభించింది. 2022–23 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.1 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.3 మధ్యంతర డివిడెండ్ చెల్లించాలన్న ప్రతిపాదనకు బోర్డు ఆమోదం తెలిపింది.

క్రితం ముగింపుతో పోలిస్తే అరబిందో ఫార్మా షేరు ధర బీఎస్‌ఈలో గురువారం 0.99 శాతం క్షీణించి రూ.440.70 వద్ద స్థిరపడింది.

హిందాల్కో లాభం డౌన్

క్యూ3లో రూ. 1,362 కోట్లు



న్యూఢిల్లీ: అల్యూమినియం తయారీ దిగ్గజం హిందాల్కో ఇండస్ట్రీస్ మూడో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 63 శాతం క్షీణించి రూ. 1,362 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2021–22) ఇదే కాలంలో రూ. 3,675 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 50,272 కోట్ల నుంచి రూ. 53,151 కోట్లకు ఎగసింది.

ఫలితాల నేపథ్యంలో షేరు ఎన్‌ఎస్‌ఈలో 2.2% లాభపడి రూ. 446 వద్ద ముగిసింది.

ఎల్‌ఐసీ లాభం హైజంప్

న్యూఢిల్లీ: లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్‌ఐసీ) మూడో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. నికర లాభం అత్యంత భారీగా దూసుకెళ్లి రూ. 8,334 కోట్లను అధిగమించింది. గతేడాది(2021–22) ఇదే కాలంలో కేవలం రూ. 235 కోట్లు ఆర్జించింది. నికర ప్రీమియం ఆదాయం రూ. 97,620 కోట్ల నుంచి రూ. 1,11,788 కోట్లకు జంప్ చేసింది. అయితే గత కాలంలో కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టికానందున ఫలితాలు పోల్చి చూడటం తగదని ఎల్‌ఐసీ పేర్కొంది. కాగా.. పెట్టుబడుల ఆదాయం రూ. 76,574 కోట్ల నుంచి రూ. 84,889 కోట్లకు ఎగసింది.

అదానీ గ్రూప్‌పై..



క్యూ3లో వాటాదారుల నిధికి రూ. 2,000 కోట్లను ప్రొవిజన్ల కింద బదిలీ చేయడంతో నికర లాభం రూ. 6,334 కోట్లుగా నమోదైనట్లు ఎల్‌ఐసీ చైర్మన్ ఎంఆర్ కుమార్ వెల్లడించారు. అదానీ గ్రూప్ యాజమాన్యంతో సమావేశం కానున్నట్లు వెల్లడించారు. కొద్ది రోజులుగా అదానీ గ్రూప్ కంపెనీలలో తలెత్తిన సంక్షోభంపై ఇన్వెస్టర్ బృందం ద్వారా వివరణను కోరనున్నట్లు తెలియజేశారు.

ఫలితాల నేపథ్యంలో ఎల్‌ఐసీ షేరు ఎన్‌ఎస్‌ఈలో 0.5% పుంజుకుని రూ. 614 వద్ద ముగిసింది.

ఈక్విటీల్లోకి మళ్లీ పెట్టుబడుల వరద

జనవరిలో రూ.12,546 కోట్లు రాక • డిసెంబర్‌తో పోలిస్తే 72% అధికం



ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ పథకాలకు జనవరిలో తిరిగి డిమాండ్ ఏర్పడింది. రూ.12,546 కోట్లు నికరంగా ఈక్విటీ పథకాల్లోకి వచ్చాయి. గత నాలుగు నెలల్లో ఈక్విటీ ఫండ్స్‌లోకి ఒకనెలలో వచ్చిన గరిష్ట పెట్టుబడులు ఇవి. 2022 డిసెంబర్‌లో ఈక్విటీల్లోకి రూ.7,303 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అదే ఏడాది నవంబర్‌లో రూ.2,258 కోట్లు, అక్టోబర్‌లో రూ.9,390 కోట్ల చొప్పున వచ్చాయి. ఇక 2022 సెప్టెంబర్‌లో వచ్చిన రూ.14,100 కోట్లు నెలవారీ గరిష్ట స్థాయిగా ఉంది. ఈక్విటీ పథకాల్లోకి వరుసగా 23వ నెలలోనూ నికరంగా పెట్టుబడులు రావడాన్ని గమనించొచ్చు. 2023 జనవరి గణాంకాలను ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి) విడుదల చేసింది.

విభాగాల వారీగా..

అత్యధికంగా స్మాల్‌క్యాప్ పథకాల్లోకి రూ.2,256 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఆ తర్వాత లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ పథకాల్లోకి రూ.1,902 కోట్లు, మల్టీక్యాప్ పథకాల్లోకి రూ.1,773 కోట్లు, మిడ్‌క్యాప్ పథకాల్లోకి రూ.1,628 కోట్లు, ఈఎల్‌ఎస్‌ఎస్ పథకాల్లోకి రూ.14,14 కోట్లు, ఫ్లెక్సీక్యాప్ పథకాల్లోకి రూ.1,006 కోట్లు, సెక్టోరల్, థీమ్యాటిక్ పథకాల్లోకి రూ.903 కోట్లు, కాంట్రా ఫండ్స్‌లోకి రూ.763 కోట్లు, లార్జ్‌క్యాప్ పథకాల్లోకి రూ.716 కోట్లు, ఫోకస్డ్ ఫండ్స్‌లోకి రూ.183 కోట్ల చొప్పున నికరంగా పెట్టుబడులు వచ్చాయి.

ఫిక్స్‌డ్ ఇన్‌కమ్

స్థిరాదాయ పథకాల (డెట్) నుంచి జనవరిలో నికరంగా రూ.10,316 కోట్లు బయటకు వెళ్లాయి. అత్యధికంగా లిక్విడ్ ఫండ్స్‌లో రూ.5,042 కోట్లు, షార్ట్ డ్యురేషన్ ఫండ్స్‌లో రూ.3,859 కోట్లు, ఓవర్‌నైట్ ఫండ్స్‌లో రూ.3,688 కోట్ల చొప్పున ఇన్వెస్టర్లు విక్రయించారు. మనీ మార్కెట్ పథకాలు రూ.6,460 కోట్లు ఆకర్షించాయి. ఇక హైబ్రిడ్ పథకాలు సైతం రూ.4,492 కోట్లు ఆకర్షించగా, మల్టీ అసెట్ పథకాల్లోకి రూ.2,182 కోట్లు, ఆర్బిట్రేజ్ ఫండ్స్‌లోకి రూ.2,055 వచ్చాయి. ఇండెక్స్ ఫండ్స్‌లోకి రూ.5,813 కోట్లు వచ్చాయి.

ఇన్వెస్టర్లలో నమ్మకం

''స్టాక్ మార్కెట్లలో అస్థిరతలు నెలకొన్నప్పటికీ ఇన్వెస్టర్లు ఈక్విటీ పథకాలపై నమ్మకాన్ని ఉంచారు. దీనికి నిదర్శనమే రూ.12,546 కోట్లు రావడం. నెలవారీగా చూస్తే ఇది 72 శాతం అధికం''అని ఫయర్స్ రీసెర్చ్ హెడ్ గోపాల్ కావలిరెడ్డి తెలిపారు. మార్కెట్లలో ఆటుపోట్లు ఉన్నా ఇన్వెస్టర్లు సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో పెట్టుబడులకు ఆసక్తి చూపించినట్టు మోతీలాల్ ఓస్వాల్ అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ అఖిల్ చతుర్వేది పేర్కొన్నారు.

సిప్ బలం

సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో రూ.13,856 కోట్లు వచ్చాయి. డిసెంబర్‌లో వచ్చిన రూ.13,573 కోట్లతో పోలిస్తే స్వల్పంగా పెరిగాయి. సిప్ పెట్టుబడులు రూ.13వేల కోట్లకు పైగా రావడం వరుసగా నాలుగో నెలలోనూ నమోదైంది. సిప్ ఖాతాల సంఖ్య 6.21 కోట్లుగా ఉంది. నికరంగా 9.20 లక్షల కొత్త సిప్ ఖాతాలు రిజిస్టర్ అయ్యాయి. ఒకవైపు ఎఫ్‌పీఐలు విక్రయాలు చేస్తున్నప్పటికీ మార్కెట్లు స్థిరంగా ఉండడానికి సిప్ పెట్టుబడులు మద్దతుగా నిలిచినట్టు యాంఫి సీఈవో ఎన్ఎస్ వెంకటేశ్ పేర్కొన్నారు.

ఐటీ, ఫైనాన్స్ షేర్లలో కొనుగోళ్లు

- పరిమిత శ్రేణిలో ఒడిదుడుకుల ట్రేడింగ్
- సూచీలకు రెండోరోజూ లాభాలే

ముంబై: ఐటీ, ఫైనాన్స్, మౌలిక రంగాల షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు రెండోరోజూ లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందాయి. ఉదయం ఫ్లాటుగా ప్రారంభమైన సూచీలు రోజంతా తీవ్ర ఊగిసలాటకు లోనయ్యాయి.



ట్రేడింగ్‌లో 391 పాయింట్ల పరిధిలో కదలాడిన సెన్సెక్స్ చివరికి 142 పాయింట్లు పెరిగి 60,806 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 22 పాయింట్లు బలపడి 17,893 వద్ద నిలిచింది. ఇంట్రాడేలో 17,780 వద్ద కనిష్టాన్ని, 17,917 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. మెటల్, ఆటో, ఇంధనం, టెలికం, రియల్టీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.205 కోట్ల షేర్లను, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.205 కోట్లను విక్రయించారు. డాలర్ మారకంలో రూపాయి విలువ మూడు పైసలు బలపడి 82.51 స్థాయి వద్ద స్థిరపడింది. బుధవారం లాభాల తర్వాత మళ్లీ అదానీ గ్రూప్‌లో గురువారం అమ్మకాలు జరిగాయి.

తనిష్క్ 'గిఫ్ట్ ఆఫ్ చాయిస్' సేల్



హైదరాబాద్: ప్రేమికుల దినోత్సవం సందర్భంగా తనిష్క్ ''గిఫ్ట్ ఆఫ్ చాయిస్'' పేరిట ప్రత్యేక విక్రయాల కార్యక్రమాన్ని చేపట్టింది. హృదయాకారపు డైమండ్ డిజైన్స్, ఎంగేజ్‌మెంట్ రింగులు, బ్రాస్‌లెట్స్, పెండెంట్లు, చెవిరింగుల కొనుగోళ్లపై 20% వరకూ ఆఫర్‌ను అందిస్తుంది. ''ప్రేమ, ఏకత్వంకు 'గిఫ్ట్ ఆఫ్ చాయిస్' ప్రతీకగా నిలుస్తుంది. పరిమితకాలం పాటు ఉండే ఈ ఆఫర్‌ను కస్టమర్లంతా సద్వినియోగం చేసుకోవాలి'' అని కంపెనీ కోరింది.

ఓలా కొత్త స్కూటర్లు

రూ.84,999 నుంచి ప్రారంభం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఓలా ఎలక్ట్రిక్ కొత్త స్కూటర్లను ఆవిష్కరించింది. ఎస్1 శ్రేణిలో రూ. 99,999 ధరలో నూతన వేరియంట్‌ను అందుబాటులోకి తెచ్చింది. 2 కిలోవాట్ అవర్ బ్యాటరీ పొందుపరిచారు. ఒకసారి చార్జింగ్‌తో 91 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. గరిష్ట వేగం గంటకు 90 కిలోమీటర్లు. డెలివరీలు ప్రారంభం అయ్యాయి. ఎస్1 ఎయిర్ పేరుతో మూడు వేరియంట్లను సైతం ఓలా పరిచయం చేసింది. రూ.84,999 ధర గల 2 కిలోవాట్ అవర్ బ్యాటరీ వేరియంట్ ఒకసారి చార్జింగ్‌తో 85 కిలోమీటర్లు పరుగెడుతుంది. టాప్ స్పీడ్ గంటకు 85 కిలోమీటర్లు. 3 కిలోవాట్ అవర్ వేరియంట్ 125 కిలోమీటర్లు, 4 కిలోవాట్ అవర్ రకం 165 కిలోమీటర్లు ప్రయాణిస్తాయి. ధరలు వరుసగా రూ.99,999, రూ.1,09,999 ఉన్నాయి. ఎస్1 ఎయిర్ వేరియంట్ల బుకింగ్స్ ప్రారంభం అయ్యాయి.

సాక్షి స్పోర్ట్స్



ధనాధన్ ఆటకు అమ్మాయిలు సిద్ధం

- నేటినుంచి మహిళల టి20 ప్రపంచకప్
- దక్షిణాఫ్రికా, లంక మధ్య తొలిపోరు
- 12న భారత్, పాక్ ఢీ

కేప్‌టౌన్: నేటి నుంచి ఐసీసీ టి20 ప్రపంచకప్ రూపంలో మరో 'షో'కు రంగం సిద్ధమైంది. ఇప్పటి వరకు జరిగిన ఏడు మెగా ఈవెంట్లలో ఐదు సార్లు విజేతగా నిలిచిన ఆస్ట్రేలియా అమ్మాయిల జట్టు హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. 2020లో ఈ జగజ్జేత చేతిలో మెల్‌బోర్న్ వేదికపై జరిగిన ఫైనల్లో ఓడిన భారత్ కూడా పొట్టి ప్రపంచకప్‌పై గట్టి ఆశలే పెట్టుకుంది. ఈ మెగా ఈవెంట్‌లో పాల్గొనే పది జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. ఒక్కో గ్రూపులో ఐదు జట్లు రౌండ్ రాబిన్ పద్ధతిలో తలపడతాయి. అనంతరం తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు నాకౌట్ (సెమీస్)కు అర్హత సాధిస్తాయి. తొలి సెమీస్ 23న, రెండో సెమీస్ 24న జరుగుతాయి. 26న జరిగే తుదిపోరుతో టోర్నీ ముగుస్తుంది. ముందుగా శుక్రవారం టోర్నీ ఆరంభ మ్యాచ్‌లో ఆతిథ్య దక్షిణాఫ్రికాతో శ్రీలంక తలపడుతుంది. భారత్ 12న జరిగే తొలి మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌ను ఎదుర్కొంటుంది. భారత్ ఆడే నాలుగు లీగ్ మ్యాచ్‌లు కూడా 6.30కే మొదలవుతాయి. 'స్టార్‌స్పోర్ట్స్'లో మ్యాచ్‌లు ప్రసారమవుతాయి.

గ్రూప్ 'ఎ': ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, శ్రీలంక, బంగ్లాదేశ్.

గ్రూప్ 'బి': భారత్, ఇంగ్లండ్, ఐర్లాండ్, పాకిస్తాన్, వెస్టిండీస్.

మన మహిళల షెడ్యూల్ ఇదే

ఫిబ్రవరి 12	భారత్ X పాకిస్తాన్
ఫిబ్రవరి 15	భారత్ X వెస్టిండీస్
ఫిబ్రవరి 18	భారత్ X ఇంగ్లండ్
ఫిబ్రవరి 20	భారత్ X ఐర్లాండ్

నేడు ఫ్రీ ప్రాక్టీస్

ఫార్ములా–ఇ హైదరాబాద్



ఫార్ములా-ఇ కారుతో మహీంద్ర డ్రైవర్లు గ్రాసీ, దారువాలా, రోలండ్


సాక్షి, హైదరాబాద్: ప్రతిష్టాత్మక ఫార్ములా–ఇ రేసింగ్‌కు భాగ్యనగరం సిద్ధమైంది. రెండు రోజుల ఈ ఈవెంట్‌లో భాగంగా నేడు సాయంత్రం తొలి ఫ్రీ ప్రాక్టీస్ జరుగుతుంది. పోటీల్లో పాల్గొంటున్న 11 జట్ల రేసర్లు ట్రాక్‌తో పాటు తమ కార్లను, వాటి పనితీరును పరీక్షించుకొని పూర్తి స్థాయిలో సన్నద్ధమయ్యేందుకు ఈ ప్రాక్టీస్‌ను వాడుకుంటారు. శనివారం కూడా రెండో ఫ్రీ ప్రాక్టీస్‌తో పాటు ఉ.10.40నుంచి క్వాలిఫయింగ్ పోరు జరుగుతుంది. అనంతరం మ.గం. 3 గంటలకు అసలైన రేస్ ప్రారంభమవుతుంది. దాదాపు గంటన్నర పాటు సాగే ఈ రేస్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. హుస్సేన్ సాగర్ తీరంలో నెక్లెస్‌రోడ్‌పై ఏర్పాటు చేసిన హైదరాబాద్ స్ట్రీట్ సర్క్యూట్ 2.83 కిలోమీటర్లు పొడవు ఉంది. ఇందులో మొత్తం 18 మలుపులు ఉన్నాయి. భారత్‌కు చెందిన రేసర్లు ఎవరూ లేకపోయినా మహీంద్ర టీమ్‌తో పాటు టాటా స్పాన్సర్‌గా ఉన్న జాగ్వార్ టీమ్‌పై రేసింగ్ అభిమానుల్లో ఆసక్తి నెలకొని ఉంది. మహీంద్రా టీమ్‌లో రిజర్వ్ డ్రైవర్‌గా జెహాన్ దారువాలా ఉన్నాడు. గరిష్టంగా 322 కిలోమీటర్ల వేగంతో పరుగెత్తే ఎలక్ట్రిక్ కార్ల మధ్య పోటీని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో ఫ్యాన్స్ ఆసక్తి చూపిస్తున్నారు. 'బుక్ మై షో'లో ఈ రేసు కోసం టికెట్లు అందుబాటులో ఉన్నాయి.

స్పిన్‌తో దుమ్ము రేపారు..!



లబుషేన్‌ను స్టంపౌట్ చేసిన ఆనందంలో కేఎస్ భరత్

రోహిత్



జడేజా

ఆశ్చర్యమేమీ లేదు... భారత గడ్డపై టెస్టు మ్యాచ్‌లో విదేశీ బ్యాటర్ల పరిస్థితి ఏమిటో కొత్తగా చెప్పాల్సింది లేదు... అందుకు ఆస్ట్రేలియా కూడా మినహాయింపు కాదని మరోసారి రుజువైంది... అంచనాలకు అనుగుణంగానే భారత బౌలర్లు చెలరేగిపోగా, పిచ్‌ను సందేహిస్తూనే బరిలోకి దిగిన కంగారూ బ్యాటింగ్ లైనప్ కుప్పకూలింది. దాదాపు ఏడు నెలల తర్వాత టెస్టు ఆడిన జడేజా తన స్పిన్‌తో ప్రత్యర్థి పతనాన్ని శాసించగా, అశ్విన్ సహకరించాడు. అయితే తొలి 13 బంతుల్లోనే పేసర్లకు 2 వికెట్లు చేజార్చుకొని స్పిన్ రాక ముందే ఆసీస్ దాసోహమంది. అనంతరం దూకుడైన బ్యాటింగ్‌తో రోహిత్ ఆధిపత్యం ప్రదర్శించడంతో బోర్డర్-గావస్కర్ ట్రోఫీ తొలి రోజును టీమిండియా తమదిగా మార్చుకుంది. రెండో రోజు పిచ్ ఆసీస్ స్పిన్నర్లకు ఎలా సహకరిస్తుందో, భారత బ్యాటర్లు ఎంత భారీ స్కోరు చేస్తారనేది ఆసక్తికరం.

- తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 177 ఆలౌట్
- రవీంద్ర జడేజాకు 5 వికెట్లు
- భారత్ 77/1

నాగ్‌పూర్: ఆస్ట్రేలియాతో ప్రారంభమైన తొలి టెస్టులో మొదటి రోజు భారత్ పక్షాన నిలిచింది. ముందు బౌలింగ్‌లో, ఆపై నిలకడైన బ్యాటింగ్‌తో టీమిండియా ఆటను ముగించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 63.5 ఓవర్లలో 177 పరుగులకే ఆలౌటైంది. మార్నస్ లబుషేన్ (123 బంతుల్లో 49; 8 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా (5/47) ఐదు వికెట్లతో చెలరేగగా, అశ్విన్‌కు 3 వికెట్లు దక్కాయి. అనంతరం భారత్ ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోయి 77 పరుగులు చేసింది. కెప్టెన్ రోహిత్ శర్మ (69 బంతుల్లో 56 బ్యాటింగ్; 9 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ సాధించాడు. ప్రస్తుతం భారత్ మరో 100 పరుగులు మాత్రమే వెనుకబడి ఉంది.

కీలక భాగస్వామ్యం...

టాస్ గెలిచిన ప్రయోజనాన్ని ఆస్ట్రేలియా పొందలేకపోయింది. సిరాజ్ తన తొలి బంతికే ఖాజా (1)ను ఎల్బీగా అవుట్ చేశాడు. అంపైర్ నాటౌట్‌గా ప్రకటించినా...రివ్యూలో భారత్ ఫలితం సాధించింది. ఆ తర్వాత షమీ వేసిన చక్కటి బంతి వార్నర్ (1) స్టంప్స్‌ను ఎగరగొట్టింది. ఇన్నింగ్స్ ఏడో ఓవర్లోనే జడేజాను భారత్ బౌలింగ్‌కు దించింది. ఇలాంటి స్థితిలో లబుషేన్, స్టీవ్ స్మిత్ (107 బంతుల్లో 37; 7 ఫోర్లు) కలిసి జట్టును ఆదుకున్నారు. భారత బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ కొన్ని చక్కటి షాట్లతో వీరిద్దరు స్కోరు బోర్డును నడిపించారు. లంచ్ సమయానికి 76/2 స్కోరుతో ఆసీస్ కోలుకున్నట్లుగా అనిపించింది.

టపటపా...

విరామం తర్వాత జడేజా వరుస బంతుల్లో రెండు వికెట్లు తీసి కంగారూల పని పట్టాడు. భరత్ చక్కటి స్టంపింగ్‌కు లబుషేన్ వెనుదిరగ్గా, రెన్‌షా (0) తొలి బంతికే వికెట్ల ముందు దొరికిపోయాడు. లబుషేన్, స్మిత్ మూడో వికెట్‌కు 82 పరుగులు జోడించారు. అక్షర్ ఓవర్లో 3 ఫోర్లు కొట్టి జోరు పెంచే ప్రయత్నం చేసిన స్మిత్‌ను కూడా జడేజా బౌల్డ్ చేయడంతో ఆసీస్ పరిస్థితి మరింత దిగజారింది. దాంతో అలెక్స్ క్యారీ (33 బంతుల్లో 36; 7 ఫోర్లు), పీటర్ హ్యాండ్స్‌కోంబ్ (84 బంతుల్లో 31; 4 ఫోర్లు) కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. ఎదురుదాడికి దిగిన క్యారీ వరుసగా స్వీప్, రివర్స్ స్వీప్‌షాట్లతో బౌండరీలు రాబట్టాడు. అయితే అశ్విన్ బౌలింగ్‌లో అదే రివర్స్‌స్వీప్‌కు ప్రయత్నించి బౌల్డ్ కావడంతో ఆరో వికెట్ భాగస్వామ్యం ముగిసింది. హ్యాండ్స్‌కోంబ్, క్యారీ 11.2 ఓవర్లలో 53 పరుగులు జోడించడం విశేషం. 'టీ' తర్వాత హ్యాండ్స్‌కోంబ్‌ను జడేజా అవుట్ చేయడంతో 200 పరుగుల స్కోరుకు ఆసీస్ చాలా దూరంలో ఆగిపోయింది. ఆ జట్టు 15 పరుగుల వ్యవధిలోనే చివరి 5 వికెట్లు చేజార్చుకుంది.

రోహిత్ జోరు...

తొలి రోజు సాధ్యమైనన్ని ఎక్కువ పరుగులు సాధించాలనే ఉద్దేశంతో బరిలోకి దిగిన రోహిత్ దానిని తన బ్యాటింగ్‌లో ప్రదర్శించాడు. కమిన్స్ వేసిన మొదటి ఓవర్లోనే 3 ఫోర్లు కొట్టిన అతను, ఆ తర్వాత కమిన్స్ ఓవర్లోనే మరో 2 ఫోర్లు బాదాడు. ఆట ముగిసే వరకు భారత కెప్టెన్ అదే ధాటిని కొనసాగించగా, మరో ఎండ్‌లో కేఎల్ రాహుల్ (71 బంతుల్లో 20; 1 ఫోర్) చాలా జాగ్రత్తగా ఆడాడు. తన 55వ బంతికి గానీ రాహుల్ ఫోర్ కొట్టలేకపోయాడు. లయన్ బౌలింగ్‌లో బౌండరీతో 66 బంతుల్లోనే రోహిత్ అర్ధ సెంచరీ పూర్తయింది. అయితే చివర్లో రాహుల్‌ను వెనక్కి పంపి మర్ఫీ కెరీర్‌లో తొలి వికెట్ తీయగా, ఆసీస్‌కు కాస్త ఊరట లభించింది.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: వార్నర్ (బి) షమీ 1; ఖాజా (ఎల్బీ) (బి) సిరాజ్ 1; లబుషేన్ (స్టంప్డ్) భరత్ (బి) జడేజా 49; స్మిత్ (బి) జడేజా 37; రెన్‌షా (ఎల్బీ) (బి) జడేజా 0; హ్యాండ్స్‌కోంబ్ (ఎల్బీ) (బి) జడేజా 31; క్యారీ (బి) అశ్విన్ 36; కమిన్స్ (సి) కోహ్లి (బి) అశ్విన్ 6; మర్ఫీ (ఎల్బీ) (బి) జడేజా 0; లయన్ (నాటౌట్) 0; బోలండ్ (బి) అశ్విన్ 1; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (63.5 ఓవర్లలో ఆలౌట్) 177. వికెట్ల పతనం:** 1-2, 2-2, 3-84, 4-84, 5-109, 6-162, 7-172, 8-173, 9-176, 10-177. **బౌలింగ్:** షమీ 9-4-18-1, సిరాజ్ 7-3-30-1, జడేజా 22-8-47-5, అక్షర్ 10-3-28-0, అశ్విన్ 15.5-2-42-3.

భారత్ తొలి ఇన్నింగ్స్: రోహిత్ (బ్యాటింగ్) 56; రాహుల్ (సి) అండ్ (బి) మర్ఫీ 20; అశ్విన్ (బ్యాటింగ్) 0; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (24 ఓవర్లలో వికెట్ నష్టానికి) 77. వికెట్ల పతనం:** 1-76. **బౌలింగ్:** కమిన్స్ 4-1-27-0, బోలండ్ 3-1-4-0, లయన్ 10-3-33-0, మర్ఫీ 7-0-13-1.

టెస్టులకు 'శ్రీకారం'

దాదాపు 15 నెలల క్రితం... కాన్పూర్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన టెస్టులో కోన శ్రీకర్ భరత్ సబ్‌స్టిట్యూట్ వికెట్ కీపర్‌గా వ్యవహరించాడు. రెండు క్యాచ్‌లు, ఒక స్టంపింగ్‌తో పాటు బంతి అనూహ్యంగా మలుపులు తిరుగుతున్న పిచ్‌పై అతని అద్భుత కీపింగ్ అందరినీ ఆకట్టుకుంది. దురదృష్టవశాత్తూ క్రికెట్ గణాంకాల్లో సబ్‌స్టిట్యూట్ ప్రదర్శనకు చోటుండదు. ఎట్టకేలకు గురువారం భరత్ టెస్టు క్రికెట్ ఆడిన 305వ భారత క్రికెటర్‌గా మైదానంలోకి అడుగు పెట్టాడు. సరిగ్గా పదేళ్ల క్రితం తొలి ఫస్ట్‌క్లాస్ మ్యాచ్ ఆడిన అతను ఇప్పుడు టీమిండియా సభ్యుడయ్యాడు. రంజీ ట్రోఫీలో, భారత 'ఎ' జట్టు రెగ్యులర్‌గా అనేక సిరీస్‌లు ఆడిన తర్వాత టెస్టు బరిలోకి దిగిన భరత్ తొలి రోజు ఆటలోనే తనదైన ముద్ర వేశాడు. చురుకైన కదలికలతో అతను లబుషేన్‌ను మెరుపు వేగంతో స్టంపౌట్ చేసిన క్షణమే ఆటను మలుపు తిప్పింది. ఆంధ్ర క్రికెట్‌లో వివిధ వయో విభాగాల్లో ప్రదర్శన ద్వారా పైకి ఎదిగిన భరత్‌కు దేశవాళీ క్రికెట్‌లో గుర్తింపు తెచ్చుకునేందుకు కొంత సమయం పట్టింది. 86 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లలో ట్రిపుల్ సెంచరీ సహా 4707 పరుగులు చేసిన భరత్ 2021 ఐపీఎల్‌లో ఒక ఇన్నింగ్స్‌తో అందరి దృష్టిలో పడ్డాడు. ఢిల్లీపై మ్యాచ్‌లో చివరి బంతికి సిక్స్ కొట్టి ఆర్‌సీబీని గెలిపించడం అతని దూకుడైన ఆటను పరిచయం చేసింది. అప్పటినుంచి టీమిండియాలో రెగ్యులర్‌గా మారే అవకాశం ఉన్న కీపర్‌గా అతని పేరుపై పలు మార్లు సెలక్షన్ సమావేశాల్లో చర్చ జరిగింది. సాహా రిటైరైతే అతనికి ప్రత్యామ్నాయంగా భరత్ ఖాయమని అర్థమైంది. గతంలోనూ సీనియర్ టీమ్‌కు ఎంపికైనా, భరత్‌కు మ్యాచ్ ఆడే అవకాశం రాలేదు. వికెట్ కీపర్ ఎమ్మెస్కే ప్రసాద్ (6 టెస్టులు) తర్వాత భారత టెస్టు జట్టుకు ఎంపికైన ఆంధ్ర ఆటగాడిగా భరత్ నిలిచాడు. 2018లో భారత జట్టులోకి ఎంపికయ్యే సమయానికి హనుమ విహారి ఆంధ్ర తరఫున ఆడుతున్నా...అంతకు ముందే 6 సీజన్లు అతను హైదరాబాద్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. వన్డే, టి20 జట్లలో ఇప్పటికే సభ్యుడైన సూర్యకుమార్ యాదవ్ కూడా నాగ్‌పూర్‌లో టెస్టులో అరంగేట్రం చేశాడు. ముమ్ముందు కోన భరత్ మరింత మెరుగైన ప్రదర్శనతో సత్తా చాటి జట్టులో స్థానం సుస్థిరం చేసుకోవాలని ఆశిద్దాం. 'ఆస్ట్రేలియాతో టెస్టులో అరంగేట్రం చేస్తున్న మన కోన భరత్‌కు నా హార్దికాభినందనలు. తెలుగు జెండా మరింత ఎత్తున రెపరెపలాడుతోంది' అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈ సందర్భంగా ట్వీట్ చేశారు.




ఆల్ ది బెస్ట్ కన్నా... తల్లితో భరత్

ఉద్యోగం ఎందుకు చేస్తున్నారు?

- పనికీ, జీవితానికీ మధ్య సమతుల్యత ఉండాలన్న యువత
- పనివేళలు ఫ్లెక్సిబుల్‌గా ఉండాలన్న 83% మంది
- పని చేసే కంపెనీతో అనుబంధం కోరుకుంటున్న మెజారిటీ మంది
- చాలా దేశాల్లో పదవీ విరమణ చేసిన వృద్ధులూ మళ్లీ ఉద్యోగ వేటలో..

రాండ్‌స్టాడ్స్ అధ్యయనంలో వెల్లడి

కంచర్ల యాదగిరిరెడ్డి



మీరు ఉద్యోగం ఎందుకు చేస్తున్నారని ఎవరినైనా అడిగామనుకోండి! జీతం కోసం పని చేస్తున్నామని కొందరు, మెరుగైన జీవితం కోసమని మరికొందరు సమాధానం చెబుతారు. ఇలా పది మందిని అడిగితే ఎవరికి తోచిన సమాధానం వారు చెబుతారు. మరి... ఆర్థిక మాంద్యం, ఉద్యోగ భయం వెన్నాడుతున్న ప్రస్తుత తరుణంలో ఉద్యోగుల మనోభావాలేంటి? బడాబడా కంపెనీలే వేలకు వేల మందికి క్షణాల్లో ఉద్వాసన పలుకుతున్న సందర్భంలో ఉద్యోగులు ఏమనుకుంటున్నారు? ఉన్న ఉద్యోగం ఊడకుండా ఉంటే చాలు భగవంతుడా అని అంటున్నారా? ఏమైనా ఫరవాలేదని ధీమాగా ఉన్నారా? రాండ్‌స్టాడ్స్ అనే కంపెనీ 15 దేశాల్లో సుమారు 35 వేల మందిని ప్రశ్నించి మరీ కనుక్కున్న ఆ విషయాలేంటో చూద్దాం.



అత్యధికుల్లో కనిపించని బెంగ

ఆర్థిక మాంద్యం వచ్చేస్తోందన్న భయం ఉద్యోగుల కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. దీంతో ఉద్యోగం పోతుందన్న బెంగ ఉందని 37 శాతం మంది చెప్పగా, అత్యధికులు మాత్రం తాము ఉద్యోగం పోతుందని భయపడటం లేదని సర్వేలో చెప్పడం గమనార్హం. ఈ అధ్యయనం జరగడానికి ఆరు నెలల ముందుతో పోలిస్తే తమ పరిస్థితి ఇప్పటికీ మెరుగ్గానే ఉందని 25 శాతం మంది చెప్పారు. ఇదే సమయంలో పెరిగిపోతున్న ఖర్చులను తట్టుకోవాలంటే రోజూ మరికొన్ని అదనపు గంటలు పనిచేయాలని అనుకుంటున్నట్లు 23 శాతం మంది తెలిపారు. లాటిన్ అమెరికాలో 60 శాతం మంది ఉద్యోగ భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తే, యూరప్ వాయవ్య ప్రాంతంలో కేవలం 24 శాతం మంది మాత్రమే ఆందోళనగా ఉన్నట్లు ఈ అధ్యయనం వెల్లడించింది.

అందరిదీ ఒకే కోరిక



ఆర్థిక మాంద్యం పరిస్థితులు ఎలా ఉన్నా ఈ అధ్యయనంలో ఒక విషయమైతే స్పష్టమైంది. పనికీ, జీవితానికీ మధ్య సమతుల్యత ఉండాలని ఎక్కువ మంది చెప్పారు. ఈ సమతుల్యత లేకపోతే ఉద్యోగం వదులుకోవడానికీ వెనుకాడబోమని 61 శాతం మంది చెప్పడం, వీరందరూ 18– 34 మధ్య వయస్కులు కావడం విశేషం. పనిచేసే వాతావరణం బాగా లేదనిపిస్తే రాజీనామా చేసేస్తామని 34 శాతం మంది అభిప్రాయపడ్డారు. జీవితాన్ని అనుభవించలేని పరిస్థితులు తలెత్తితే ఉద్యోగం అవసరం లేదని 48 శాతం మంది చెప్పారు.



ఫీలింగ్ ఉండాలబ్బా..

మూడేళ్లలో సంభవించిన పరిణామాల ఫలితమో లేక ఇంకో కారణమో గానీ.. చాలా మంది ఉద్యోగులు తాము పనిచేసే కంపెనీతో ఒకరకమైన అనుబంధం ఏర్పడాలని ఆశిస్తున్నట్లు ఈ అధ్యయనం ద్వారా స్పష్టమైంది. అందుకే చాలామంది తాము చేసే ఉద్యోగం విలువ, అవసరాలను మదింపు చేసుకుంటున్నారని ఈ సర్వే వెల్లడించింది. కంపెనీ మనదన్న ఫీలింగ్ లేకపోతే అక్కడ పని మానేసేందుకైనా సిద్ధమని 54 శాతం మంది చెప్పారు. అలాగే పనిచేసే కంపెనీ కూడా కొన్ని విలువలు పాటించాలని లేదంటే 'బై బై' చెప్పేస్తామని 42 శాతం మంది స్పష్టం చేశారు. ఏంటా విలువలని ప్రశ్నిస్తే 77 శాతం మంది వైవిధ్యం, పారదర్శకత, సస్టెయినబిలిటీలను ప్రస్తావించారు.



మళ్లీ పనుల బాటలో..

మనదేశం మాటెలా ఉన్నా... ఈ అధ్యయనం నిర్వహించిన చాలా దేశాల్లో పదవీ విరమణ చేసిన వృద్ధులు మళ్లీ ఉద్యోగాలు వెతుక్కునే పనిలో ఉన్నారట. ఆర్థిక పరిస్థితులే ఇందుకు ప్రధాన కారణం. భారత్‌లో ఉద్యోగాలకు వయో పరిమితి ఉంది కానీ, పాశ్చాత్య దేశాల్లో చాలా తక్కువ. కాలూ చేయి ఆడినంత కాలం పని చేస్తూంటారు. నచ్చినప్పుడు రిటైరవడమన్నది అక్కడ సాధారణం. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో 65 ఏళ్లకు రిటైరవుదామని అనుకున్న వారు కూడా మరి కొంతకాలం పనిచేయాలని యోచిస్తున్నారు. గత ఏడాది 61 శాతం మంది పదవీ విరమణ ఆలోచన చేస్తే, ఈ ఏడాది ఆ సంఖ్య 51 శాతానికి పడిపోవడం గమనార్హం. యునైటెడ్ కింగ్‌డమ్‌లో గణాంకాలను పరిశీలిస్తే ఇటీవలి కాలంలో 65 ఏళ్లు పైబడ్డ వారు మళ్లీ ఉద్యోగాల వేటలో ఉన్న విషయం స్పష్టమవుతుంది. అధ్యయనంలో పాల్గొన్న వారిలో 32 శాతం మంది తమకు ఉద్యోగాలు అవసరమని చెప్పారు. కేవలం వేతనాల కోసమే కాదు, ఇతరులతో సంబంధాలు కలిగి ఉండేందుకు, వచ్చే జీతం తమదీ అన్న ఒక భావన పొందేందుకూ ఏదో ఒక ఉద్యోగం అవసరమన్నది వారి అభిప్రాయంగా ఉంది.

యజమానులు ఆదుకోవాలి

ఖర్చులు పెరిగిపోతుండటంతో చాలామంది ఉద్యోగులు.. యజమానులు తమను ఏదోవిధంగా ఆదుకోవాలని ఆశిస్తున్నట్లు 39 శాతం మంది అభిప్రాయపడ్డారు. జీతాలైనా పెంచాలని, లేదంటే ఆర్థిక సాయం అందించాలని వీరు కోరుతున్నారు. ఏడాదికి ఒకసారి ఇచ్చే పెంపునకు అదనంగా ఈ సాయం చేయాలన్నది వారి భావన. పెట్రోల్, గ్యాస్ ఖర్చుల విషయంలో ఆదుకున్నా ఫర్వాలేదని, లేదంటే ఆఫీసుకు వచ్చిపోయేందుకు అవసరమైన రవాణా, తదితర ఖర్చులను కంపెనీలు భరించినా ఓకేనని దాదాపు 30 శాతం మంది తెలిపారు. ఆసక్తికరమైన విషయమేంటంటే.. 50 శాతం మంది తాము ఇప్పటికే ఈ రకమైన సాయం అందుకుంటున్నట్లు చెప్పడం. ఆర్థిక అంశాలను పక్కన పెడితే ఉద్యోగులను బాగా కలవరపెడుతున్న అంశం వర్క్ ఫ్లెక్సిబిలిటీ. సుమారు 45 శాతం మంది తమకు అనుకూలంగా ఉన్న సమయంలో పనిచేసేందుకు ఇష్టం చూపితే 40 శాతం మంది ఆఫీసులకు వెళ్లేందుకు బదులు రిమోట్ లేదా హైబ్రిడ్ పద్ధతుల్లో పనిచేసేందుకు ఆసక్తికనబరిచారు. తమకు అనుకూలంగా లేదన్న కారణంతో 27 శాతం మంది ఉద్యోగాలు వదులుకున్నట్లు తెలిపారు. పనివేళలు ఫ్లెక్సిబుల్‌గా ఉండాలని 83 శాతం మంది అభిప్రాయపడగా, పనిచేసే ఊరు, ప్రాంతం విషయంలోనూ ఈ వెసులుబాటు ఉండాలని 71 శాతం మంది చెప్పారు. ఇలా చెప్పిన వారిలో పురుషుల కంటే మహిళలే ఎక్కువగా ఉన్నారు.

సర్వే జరిగిందిలా..



కోవిడ్ తదనంతరం ప్రపంచం మొత్తమ్మీద ఆర్థిక మాంద్యం భయం కనిపిస్తున్న తరుణంలో ఉద్యోగులు ఏమనుకుంటున్నారో తెలుసుకునేందుకు రాండ్‌స్టాడ్స్ ఈ సర్వే నిర్వహించింది. 'వర్క్ మానిటర్' పేరుతో నిర్వహించిన ఈ సర్వేలో 15 దేశాలకు చెందిన 35 వేల మంది పాల్గొన్నారు. వారానికి 24 గంటలపాటైనా పనిచేసే వారు లేదా వ్యాపారాలు చేసుకునేవారు, ఉద్యోగం కోసం వెతుక్కుంటున్న వారిని ఆన్‌లైన్‌లో ప్రశ్నించారు. ఒక్కో దేశంలో కనీసం 500 మందితో ఈ సర్వే నడిచింది. గత అక్టోబరు 18–30 మధ్య భారత్, అర్జెంటీనా, ఆస్ట్రేలియా, ఆస్ట్రియా, బెల్జియం, బ్రెజిల్, కెనడా, చిలీ, చైనా, చెక్ రిపబ్లిక్, డెన్మార్క్, ఫ్రాన్స్, జర్మనీ, గ్రీస్, హాంకాంగ్, దక్షిణాఫ్రికా, హంగేరీ, ఇటలీ, జపాన్, లగ్జెంబర్గ్, మలేసియా, మెక్సికో, నెదర్లాండ్స్, న్యూజిలాండ్, నార్వే, పోలండ్, పోర్చుగల్, రుమేనియా, సింగపూర్, స్పెయిన్, స్వీడన్, స్విట్జర్లాండ్, టర్కీ, యునైటెడ్ కింగ్‌డమ్, అమెరికాల్లో ఈ సర్వే నిర్వహించారు.

మార్చి 13న ఎమ్మెల్సీ ఎన్నికలు

- తెలంగాణ, ఏపీల్లో మొత్తం 16 స్థానాల్లో ఎన్నిక
- షెడ్యూల్ విడుదల చేసిన కేంద్ర ఎన్నికల సంఘం



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని 16 ఎమ్మెల్సీ స్థానాల్లో ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం గురువారం షెడ్యూల్ విడుదల చేసింది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ మార్చి 13న ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనుండగా, మార్చి 16న ఫలితాలు వెల్లడించనున్నారు. తెలంగాణలో ఒక టీచర్ ఎమ్మెల్సీ, ఒక స్థానిక సంస్థల స్థానానికి, ఆంధ్రప్రదేశ్‌లో 3 పట్టభద్రులు, 2 టీచర్ ఎమ్మెల్సీ, 9 స్థానిక సంస్థల స్థానాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు.

తెలంగాణలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక జరిగే స్థానం:

1) హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్

తెలంగాణలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక జరిగే స్థానం:

1) హైదరాబాద్

ఏపీలో టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగే స్థానాలు

1) ప్రకాశం – నెల్లూరు – చిత్తూరు
2) కడప – అనంతపురం – కర్నూలు

ఏపీలో పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ స్థానాలు :

1) ప్రకాశం– నెల్లూరు –చిత్తూరు
2) కడప– అనంతపురం– కర్నూలు
3) శ్రీకాకుళం– విజయనగరం– విశాఖపట్నం

ఏపీలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాలు:

అనంతపురం, కడప, నెల్లూరు, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి(2), శ్రీకాకుళం, చిత్తూరు, కర్నూలు.

షెడ్యూల్	
నోటిఫికేషన్	ఫిబ్రవరి 16
నామినేషన్లకు చివరి తేదీ	ఫిబ్రవరి 23
నామినేషన్ల పరిశీలన	ఫిబ్రవరి 24
నామినేషన్ ఉపసంహరణ	ఫిబ్రవరి 27
ఎన్నిక	మార్చి 13
ఫలితాలు	మార్చి 16

టీచర్ 'ఎమ్మెల్సీ' ఓటర్లు 29,501

సాక్షి, హైదరాబాద్: మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి ఎన్నికల నగారా మోగింది. మార్చి 13న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. ప్రస్తుత ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి పదవీకాలం మార్చి 29న ముగియనున్న నేపథ్యంలో ఈ ఎన్నిక నిర్వహిస్తున్నారు.

రంగారెడ్డి జిల్లాలోనే అధికం..

తొమ్మిది జిల్లాలు, 19 రెవెన్యూ డివిజన్ల పరిధిలో ఉన్న ఈ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో మొత్తం 29,501 మంది ఓటర్లున్నారు. వీరిలో అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో 8,687 మంది ఉండగా, అత్యల్పంగా నారాయణ్‌పేట జిల్లాలో 688 మంది ఉన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 3,567 మంది, నాగర్‌కర్నూల్‌లో 1,804, వనపర్తిలో 1,399, జోగులాంబ గద్వాల్‌లో 873, వికారాబాద్‌లో 1,937, మేడ్చల్ మల్కాజిగిరిలో 6,771, హైదరాబాద్ జిల్లాలో 3,775 మంది ఉన్నారు. ఓటర్లలో పురుషులు 15,425 మంది, మహిళలు 14,074 మంది ఉన్నారు. ఇద్దరు థర్డ్ జెండర్లున్నారు.



యాదాద్రీశుడి సేవలో హైకోర్టు జడ్జి

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ పి.నవీన్ కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం జరిగిన స్వామి, అమ్మవార్ల నిజాభిషేక పూజల్లో జడ్జి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. స్వయంభూ ప్రతిష్ఠ అలంకారమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.

తూకం ఓకేనా!



ఖమ్మం మయూరి సెంటర్: ఖమ్మం వీడీవోస్ కాలనీలో నిర్మించిన సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ కాంప్లెక్స్‌ను రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా చేపలు అమ్ముతున్న ఓ మహిళను పలకరించి... చేపలు తూకం వేశారు.



కంటి వెలుగు శిబిరంలో సీఎస్

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా కంటి పరీక్షలు చేయించుకొని వైద్యులు సూచించిన కళ్లద్దాలను తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

'తెలంగాణ హైకోర్టులో 2,53,358 కేసులు పెండింగ్'

సాక్షి, న్యూఢిల్లీ: ప్రస్తుతం తెలంగాణ హైకోర్టులో 2,53,358, ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో 2,41,465 కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరెణ్ రిజిజు తెలిపారు. అంతేగాక ఎంపీలు, ఎమ్మెల్యేలపై ఉన్న క్రిమినల్ కేసులను విచారించేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా మొత్తం 9 రాష్ట్రాల్లో ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఉన్నాయని వెల్లడించారు. సుప్రీంకోర్టు గణాంకాల ప్రకారం ఈ నెల 1వ తేదీ నాటికి సుప్రీంకోర్టులో 69,511 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, అదే సమయంలో దేశంలోని అన్ని హైకోర్టుల్లో కలిపి మొత్తం 59,87,477 కేసులు పెండింగ్ ఉన్నాయని టీడీపీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ అడిగిన ప్రశ్నలకు కేంద్రమంత్రి బదులిచ్చారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.